వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 7 హైదరాబాద్ 108 జూలై 2010 పేజీలు : 60 రు. 10

- ఫోకస్ : పర్యావరణ సంక్షోభం
- భోపాల్ బయటపెడుతున్న అసలు సంగతి
- తాగబోసి తప్పకుంటున్న ప్రభుత్వం
- అరుంధతీ రాయ్ పై అబద్ధాల దాడి
- భారత్ అవినీతిపై యూరప్ పత్రికలు
- ఛత్తీస్‌ఘడ్ జైళ్లలో అక్రమాలు
- ప్రైవేటీకరణ దిశగా ప్రసారభారతి

వీక్షణం విస్తరించడానికి సహకరించండి!
మీ మిత్రులందరికీ పరిచయం చేయండి!!
మీ వంతుగా చందాలు చేర్పించండి!!

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికకు ఎనిమిది సంవత్సరాలుగా మీరు అందిస్తున్న ఆదరాభిమానాలకు కృతజ్ఞతలు. మీ నిత్యజీవితంలో, కుటుంబ సభ్యులతో, పని స్థలంలో, స్నేహితులతో, భిన్నాభిప్రాయాలున్న వారితో మాట్లాడుతున్న ప్రతి సంధర్భంలోనూ వీక్షణంలోని వ్యాసాలు, అభిప్రాయాలు మీకు ఉపయోగపడతూనే ఉన్నాయి. ఈ పత్రిక నిలదొక్కుకుని పది కాలాలపాటు నిలబడాలని మీరు కోరుకుంటున్నారని మాకు తెలుసు. తెలుగు సమాజానికి అవసరమయిన విభిన్న ఆలోచనలను అందించే పత్రికగా వీక్షణం ఇంకా విస్తరించాలని కూడా మీరు కోరుకుంటూ ఉంటారు. కాని, వీక్షణం ఆర్థిక పరిస్థితి సుస్థిరంగా లేదు. వీక్షణంను నిలబెట్టడానికి మీరు తక్షణమే పూనుకుని చేయవలసిన పనులు కొన్ని ఉన్నాయి.

- ❖ మీ బంధుమిత్రుల దగ్గర, మీ పనిస్థలంలో, మీరు మాట్లాడే ప్రతిచోటా, సామాజిక రాజకీయ విషయాల చర్చ వచ్చిన ప్రతిచోట ఆ విషయాల మీద వీక్షణం అవగాహన కలిగిస్తుందని ప్రస్తావించండి. వీక్షణం చదవడం ఎంత అవసరమో చెప్పండి.
- ❖ మీ చందా చెల్లించడంతోపాటు, మీ మిత్రుల కొరకు కానుకగా చందా చెల్లించండి. వారిని చందా చెల్లించమని కోరండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న గ్రంథాలయానికి వీక్షణం వస్తుందో లేదో కనుక్కుని తెప్పించడానికి ప్రయత్నాలు చేయండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న విద్యాలయాలలో, కళాశాలలో, ముఖ్యమైన ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాలయాలలో, స్వచ్ఛంద సంస్థల, యువజన సంస్థల కార్యాలయాలలో వీక్షణం వస్తుందో లేదో కనుక్కుని వారిచేత చందాలు కట్టించండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న వీక్షణం శ్రేయోభిలాషులు, విద్యా సంస్థల నిర్వాహకులు, వ్యాపారవేత్తల దగ్గర వీక్షణంకు ప్రకటనలు సేకరించండి.
- ❖ మీ గ్రామంలో, పట్టణంలో ఉన్న పత్రికల ఏజెంటు వీక్షణం తెప్పిస్తున్నారో లేదో కనుక్కుని తెప్పించేలా చూడండి.

చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
మూడు సంవత్సరాల చందా	రు.	350
ఐదు సంవత్సరాల చందా	రు.	550
పది సంవత్సరాల చందా	రు.	1000

వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175**, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3 హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
ఇమెయిల్ : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com
సర్క్యులేషన్ మేనేజర్ : 9949391028

108

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

జూలై 2010
సంపుటి : 8
సంచిక : 7

గౌరవ సంపాదకులు :
వి. హనుమంతరావు

సంపాదకులు :
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు :
డి.వి.రామకృష్ణారావు

కరస్పాండెంట్ /
సర్క్యులేషన్ మేనేజర్ :
వై. రామచంద్రం
9949391028

కరస్పాండెంట్/సబ్ఎడిటర్ :
సి. రాజశేఖర్

ఆఫీస్ అసిస్టెంట్ :
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు.	120
3 సంవత్సరాల చందా	రు.	350
5 సంవత్సరాల చందా	రు.	550
10 సంవత్సరాల చందా	రు.	1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు,
డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం అకౌంట్ నెంబర్ –
013911011002175
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్,
హైదరాబాద్

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
92468 26191

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

ఏడాదిలో ఏమున్నది గర్వకారణం?

రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్నికలు జరిగి, కొత్త ప్రభుత్వాలు వచ్చి ఏడాది పాలన పూర్తయింది. కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం వామపక్షాల మద్దతు ఉండిన మొదటి దశ గడిచి, ఆ మద్దతులేని రెండో దశలో ప్రవేశించింది. రాష్ట్రంలో అంతకు ముందరి ఎన్నికలలోని తెలంగాణ రాష్ట్ర సమితితో పొత్తు భగ్నమైపోయి, ఒంటరిగా పోటీ చేసిన కాంగ్రెస్ ప్రత్యర్థుల వోట్ల చీలిక వల్లనే అధికారానికి వచ్చింది. రెండు చోట్లా ప్రభుత్వాలు సంవత్సరం నిండిన సంబరాలు కూడ చేసుకున్నాయి. కాని అక్కడయినా, ఇక్కడయినా పాలనలో ప్రజానుకూలమైన విధానంగాని, నిర్ణయంగాని ఒక్కటి కూడ లేదు. గద్దెమీద ఉన్నవారు సంబరం చేసుకున్నారు గాని ప్రజా జీవితంలో మాత్రం సంబరం చేసుకునే సందర్భం ఒక్కటి కూడ రాలేదు. రాష్ట్రం విషయానికే వస్తే, ఈ ఏడాదిలో అమలు జరిగిన ప్రజావ్యతిరేక నిర్ణయాలకు లెక్కలేదు. నిజానికి ఈ ఏడాదిలో ప్రభుత్వానికి అనేక ప్రతికూల పరిస్థితులు వచ్చాయి. ఒక్క సంవత్సరంలోనే ఇద్దరు ముఖ్యమంత్రులు వచ్చారు. ముఠాతగాదాలతో మంత్రివర్గంలోనూ, అధికారపార్టీలోనూ ఎక్కువకాలం పాటు అనిశ్చితి కొనసాగింది, కొనసాగుతోంది. ముఖ్యమంత్రికి సొంత పార్టీ మీద గాని, అధికార యంత్రాంగం మీద గాని అదుపులేదని బహిరంగ ప్రకటనలు వెలువడుతున్నాయి. తెలంగాణ ప్రాంతంలో ప్రజా ఉద్యమం వల్ల ఆరునెలలకు పైగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయలేని స్థితి నెలకొంది. మామూలుగా సమీపంలో ఎన్నికలు లేనప్పుడు ప్రజల గురించి పట్టించుకోని ప్రతిపక్షాలు ప్రజల గురించి మాట్లాడడం, ప్రభుత్వం మీద విరుచుకుపడడం మొదలుపెట్టాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నా ప్రభుత్వ పనితీరు మీద ఇవేవీ ఎటువంటి ప్రభావాన్నీ వేయలేదు. ఈ ప్రతికూలతల నుంచి గట్టెక్కడానికయినా ప్రజల మద్దతు కూడగట్టవలసి ఉండిన ప్రభుత్వం ప్రజలను ఇంకా దూరం చేసుకునే కార్యక్రమాలే సాగించింది. తన ప్రజావ్యతిరేక కార్యక్రమాలలో యథావిధిగా, సజావుగా ముందుకే సాగింది. ప్రభుత్వాలకూ ప్రజలకూ మధ్య అసలు సంబంధమే లేని స్థితి, విపరీతంగా దూరం పెరుగుతున్న స్థితి ఉన్నదని చూపడానికి గడిచిన సంవత్సరాన్ని చూపిస్తే చాలు. ఒక్క ఏడాదిలో ఎంత కర్కోటక ప్రభుత్వమయినా ఇన్ని ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడగలదా, పాల్పడి కూడ అధికారంలో కొనసాగగలదా అని ఆశ్చర్యపోయేంత ఘన చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం మూటగట్టుకున్నది. ఎన్నికల ప్రణాళికలోనే ప్రకటించిన దుర్మార్గమయిన, ప్రజావ్యతిరేకమయిన సహకార వ్యవసాయ విధానం సంపూర్ణంగా కాకపోయినా, ప్రయోగాత్మకంగా కొనసాగుతోంది. ఎన్నికల ముందు అడిగినవారికీ, అడగనివారికీ తామే ఇచ్చిన రేషన్ కార్డులలో కొన్నిటిని బోగస్ కార్డులనే పేరుతో ఏరివేసే కార్యక్రమం మొదలయింది. ఆడంబరపు ప్రకటనలతో ప్రారంభించిన వృద్ధాప్య పెన్షన్ పథకంలో కోతలు మొదలయ్యాయి. ఇందిరమ్మ గృహాలలో అక్రమాలు జరిగాయనే పేరుతో, కొత్త ఇళ్ల నిర్మాణాలను ఆపివేశారు. వెనుకబడిన కులాల విద్యార్థుల ఫీజుల రియింబర్స్‌మెంట్‌లో అవకతవకలు జరిగాయనే సాకుతో కోత విధించారు. నిజంగా ఈ కార్యక్రమాలలో అవకతవకలు జరిగి ఉండినా అవన్నీ పూర్తిగా పాలకుల ఎన్నికల అవసరాల కోసమే జరిగాయి గాని అందులో లబ్ధిదారుల తప్పు లేదు. కాని ఇప్పుడు కోతలతో లబ్ధిదారులు నష్టపోవలసి వస్తోంది. ఈ ప్రధానమైన సంక్షేమ పథకాల కోత మాత్రమే కాక, మొత్తంగానే ప్రజాసంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయింపులను పెంచవలసినంతగా పెంచలేదు, కొన్నిసందర్భాలలో తగ్గించారు. మరోవైపు సంక్షేమ పథకాల అమలు కోసం నిధులు కావాలనే పేరుతో మద్యం అమ్మకాలను ఇబ్బడి ముబ్బడిగా ప్రోత్సహిస్తున్నారు. అటవీ ప్రాంతాలలో ఆదివాసులు విషజ్వరాలతో పిట్టల్లా రాలిపోతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు. రాష్ట్ర ప్రజానీకమంతా అధిక ధరలతో అల్లకల్లోలమయిపోతుంటే, ధరలను నియంత్రించవలసిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో, పాలనా వ్యవస్థలో లంచగొండితనం విశ్వరూపం కనబడుతుంటే, అత్యున్నత అధికార పీఠాల గురించి కూడ అవినీతి కథనాలు వస్తుంటే, కనీసమైన పారదర్శకతను కనబరచాలని ప్రభుత్వం అనుకోవడం లేదు. మరొకవైపు కొందరు అవినీతి అధికారులపై మాత్రం ఉత్తుత్తి దాడులు చేయించి, ఆ దాడులకు విపరీత ప్రచారం ఇస్తూ, అవినీతి వ్యతిరేక చర్యలు చేపడుతున్నట్టు నటిస్తోంది. అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో అటు శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా, ఇటు హైదరాబాదు చుట్టుపట్ల ఆశ్రితులకు భూములు, అడవులు, గనులు కట్టబెట్టడం ఇష్టారాజ్యంగా సాగిపోతోంది. ఆదివాసులను, అడవిని ముంచి, బహుళజాతి సంస్థల పారిశ్రామిక కారిడార్‌కు, కృష్ణా డెల్టాకు మరొక పంటకు నీరు అందించబోయే పోలవరం ప్రాజెక్టును కేవలం ముడుపుల కోసం కొనసాగిస్తున్నారు. ప్రజల పట్ల, ప్రజల సమస్యల పట్ల ఇంత ఔదాసీన్యం వహిస్తున్న ప్రభుత్వం, ఆ ప్రజలు తమ సమస్యల మీద పోరాటాలకు దిగితే మాత్రం ఉక్కుపాదం మోపుతున్నది. న్యాయమైన, ప్రజాస్వామికమైన ఆకాంక్షపై సాగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం పైన ప్రభుత్వం నిర్బంధ విధానాన్ని ప్రయోగించింది. బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసులు సాగిస్తున్న ఉద్యమాన్ని అణచివేయడానికి భల్లుగూడ అత్యాచారంతో సహా అన్ని కుయుక్తులు పన్నుతోంది. విప్లవోద్యమాన్ని అణచడానికి సాగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లు, బెదిరింపులు, వాక్సభా స్వాతంత్ర్యాలపై ఆంక్షలు వంటి చర్యల సంగతి చెప్పనే అక్కరలేదు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని చెప్పడానికి ఈ ఒక్క సంవత్సరం పాలన చాలు. వీ

'వామపక్ష' ప్రభుత్వాల భవిష్యత్తు

పశ్చిమ బెంగాల్ లో కలకత్తా మహానగరపాలికతో సహా 81 పురపాలక సంఘాలకు జూన్ మొదటివారంలో జరిగిన ఎన్నికలలో అక్కడి పాలకపక్ష కూటమి లెఫ్ట్ ఫ్రంట్ గణనీయమైన ఓటమిని చవిచూసింది. కూటమికి నాయకత్వం వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వైఖరే ఈ ఓటమికి కారణమని లెఫ్ట్ ఫ్రంట్‌లో భాగస్వాములుగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్ కూడ విమర్శించాయి. ముప్పైనాలుగు సంవత్సరాలుగా పశ్చిమ బెంగాల్‌లో అధికారం నెరపుతున్న వామపక్ష కూటమికి ఈ ఓటమి పెద్ద వెనుకంజే. వచ్చే సంవత్సరం జరగనున్న శాసనసభ ఎన్నికల మీద కూడ ఈ ఓటమి ప్రభావం ఉంటుంది. ప్రత్యర్థులు, సహచరులు చేసిన విమర్శలను తిప్పికొడుతూ సిపిఐ (ఎం) మాత్రం అసలు అది ఓటమే కాదనీ, రాష్ట్ర జనాభాలో కేవలం 17 శాతం కూడ లేని పట్టణ జనాభాలో వచ్చిన మార్పు అనీ, ఆ పరిణామానికి కూడ తృణమూల్ కాంగ్రెస్ నుంచి మావోయిస్టుల దాకా ఎందరెందరో కారణమనీ అంటున్నది. మన దేశంలో ఎన్నికలు ప్రజాభిప్రాయానికి పూర్తి సూచికలు కావన్నమాట నిజమే గాని, ఎన్నికల ద్వారా అర్థం చేసుకోవలసిన వాస్తవం ఒకటుంది. ఎన్నికలలో ప్రజలకు ఏమి కావాలో చెప్పే అవకాశం లేదు కాని ఏమి వద్దో చెప్పే అవకాశం ఉంది. నిలబడిన అభ్యర్థులలో ఏ ఒక్కరూ కావలసిన వారు లేనప్పుడు, అందరికంటే ఎవరిని ఎక్కువ తిరస్కరిస్తున్నామో ప్రజలు చెపుతున్నారు. మూడు దశాబ్దాల తర్వాత 'వామపక్ష' పాలన వద్దని ప్రజలు అంత గట్టిగా ఎందుకు చెప్పారో సిపిఎం ఆలోచించుకోవాలి. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు లేకపోయినా, కనీసం ఒక రాష్ట్ర జాబితా ఉంది. ఆ జాబితాలోని అంశాలనైనా ఒక 'కమ్యూనిస్టు పార్టీ' ప్రభుత్వం లాగ ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించుకుని ఉంటే, రాష్ట్రాన్ని ఒక నమూనాగా చూపి, మిగిలిన రాష్ట్రాల కన్న భిన్నమైన పాలనను అందించగలమని రుజువు చేసుకుని ఉంటే ప్రజలకు ఆ పార్టీని, 'వామపక్ష' పాలనను తిరస్కరించవలసిన అవసరమే వచ్చేది కాదు. ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం, పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, భూసంస్కరణలు, పారిశుధ్యం, ప్రజలను శత్రువులుగా చూడని పోలీసు యంత్రాంగం వంటి కనీస ప్రజాస్వామిక డిమాండ్లనైనా మూడు దశాబ్దాల పాలనలో 'వామపక్ష' ఫ్రంట్ అందించలేకపోయింది. పైగా ఇతర పాలకవర్గ పార్టీలన్నిటి లాగనే అవినీతి, పెత్తందారీతనం, ఆశ్రిత పక్షపాతం, అధికారపార్టీ దాష్టీకం, ప్రజలపై పోలీసు అత్యాచారాలు, అన్నిటికన్న మిన్నగా, ఏ ప్రపంచీకరణకు వ్యతిరేకమని గొంతెత్తి అరుస్తున్నారో, ఆ ప్రపంచీకరణను నిస్సిగ్గుగా అమలుచేయడం జరిగాయి. ఒకే రకమైన పనులు చేస్తున్న రెండు పార్టీల మధ్య ఎంచుకోవలసి వచ్చినప్పుడు, కమ్యూనిస్టు అని పేరు పెట్టుకున్న పార్టీ కన్న, అటువంటి పేరేమీ లేకుండా ఉన్న పార్టీని ఎన్నుకుంటే పోలేదా అని ప్రజలు అనుకున్నారు. తనకన్న ఒక దోపిడీ పార్టీ మేలని, ప్రత్యామ్నాయమని ప్రజలు భావించే పరిస్థితి ఎందుకు వచ్చిందో లెఫ్ట్ ఫ్రంట్ ఆలోచించుకోవాలి.

నెత్తురోడుతున్న కిర్గిజిస్తాన్

యాభైమూడు లక్షల జనాభా గల చిన్నారి మధ్య ఆసియా దేశం కిర్గిజిస్తాన్ రక్తమోడుతున్నది. ఆరు దశాబ్దాలకు పైగా పాత సోవియట్ యూనియన్ లో స్వతంత్ర ప్రతిపత్తిగల జాతీయ రిపబ్లిక్ గా సగౌరవంగా అభివృద్ధి పథాన నడిచిన కిర్గిజిస్తాన్ సామ్రాజ్యవాద కుట్రలవల్ల ఇవాళ జాతుల హననకాండకు, అర్థం లేని జాతివిద్వేషానికి నిలయంగా మారింది. ఒక్క జూన్ లోనే దక్షిణాది పట్టణాలయిన ఓష్, జలాలాబాద్ లలో కనీసం రెండువేలమంది ఊచకోతకు గురయ్యారు. కనీసం మూడు లక్షల మంది తమ ఆవాసాలు వదిలి శరణార్థులుగా పొరుగుదేశమైన ఉజ్బెకిస్తాన్ కు తరలి వెళ్లబోయారు. తొలి విడత శరణార్థులకు ఆశ్రయమిచ్చిన ఉజ్బెకిస్తాన్ ఆతర్వాత సరిహద్దులు మూసివేసి, వారిని నిస్సహాయంగా ఊచకోతకు బలి అయ్యేలా చేసింది. కిర్గిజ్, ఉజ్బెక్ జాతులమధ్య విద్వేషంగా ప్రచారమవుతున్న ఈ దాడులలో జాతి భావన కొంత ఉన్నమాట నిజమే గాని, అంతకన్న ఎక్కువగా ఇవి సామ్రాజ్యవాద కుట్ర ఫలితాలు. ముఖ్యంగా అమెరికా అనుకూల కుర్మన్ బకియెవ్ ప్రభుత్వాన్ని ప్రజల తిరుగుబాటు ఏప్రిల్ లో కూల్చివేసిన తర్వాత, బకియెవ్ విదేశాలకు పారిపోయి తలదాచుకోవలసి వచ్చిన తర్వాత, దేశంలో అల్లర్లను రెచ్చగొట్టడానికి కుటిలయత్నాలు ముమ్మరమయ్యాయి. ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్, కజక్స్తాన్, చైనాలు సరిహద్దులుగా ఉన్న రెండులక్షల చ.కి.మీ. కిర్గిజిస్తాన్‌లో 70 శాతం కిర్గిజ్‌లు, 15 శాతం ఉజ్బెక్‌లు, మిగతా జనాభాలో తజిక్‌లు, రష్యన్లు వందల సంవత్సరాలుగా శాంతియుతంగా జీవిస్తున్నారు. పందొమ్మిదో శతాబ్దంలో జార్ చక్రవర్తుల దురాక్రమణకు గురయిన కిర్గిజిస్తాన్ ప్రజలు 1916లో సోవియట్ విప్లవానికి కొద్ది ముందు జార్ చక్రవర్తి మీద తిరుగుబాటు సాగించారు. సగం జనాభాను చంపివేసి, జార్ చక్రవర్తి ఆ తిరుగుబాటును అణచివేశాడు. ఆ తర్వాత 1919లో కిర్గిజిస్తాన్ సోవియట్ యూనియన్‌లో భాగమయింది, 1936 లో రిపబ్లిక్ అయింది. 1919 నుంచి 1990ల వరకూ కిర్గిజిస్తాన్‌లో హింసాత్మక సంఘటనలేవీ జరగలేదు. ఈ దేశం కీలక ప్రాంతంలో ఉన్నది గనుక 1990ల తర్వాత అమెరికా కన్ను పడింది. పొరుగున ఉన్న అఫ్ఘనిస్తాన్ కు సైనికులను, ఆయుధాలను సరఫరా చేసేందుకు రాజధాని బిష్కెక్ సమీపంలోని మానస్ వైమానిక స్థావరం తన చేతుల్లో ఉండాలని, కిర్గిజిస్తాన్ ప్రభుత్వం తన చెప్పుచేతల్లో ఉండాలని అమెరికా కుట్రలు మొదలుపెట్టింది. ఆ వైమానిక స్థావరం నుంచి ప్రతినెలా 50 వేల మంది సైనికులు అఫ్ఘనిస్తాన్ వస్తూపోతూ ఉంటారంటే ఆ స్థావరం అమెరికాకుఎంత అవసరమో తెలుస్తుంది. తన బంటు బకియెవ్ కూలిపోయి ఒక మధ్యంతర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆ ప్రభుత్వం దేశ పాలన గురించి ప్రజాభిప్రాయసేకరణ జరపబోతున్న సమయంలో దేశాన్ని అల్లకల్లోలం చేయడానికి అమెరికా జరుపుతున్న కుట్ర ఫలితమే అక్కడి రక్తపాతం, కాందిశీకుల వరద. సామ్రాజ్యవాదం ఎంత అమానుషమైనదో, కుట్రపూరితమైనదో మరొక సారి రుజువుచేస్తోంది కిర్గిజిస్తాన్. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : పర్యావరణ సంక్షోభం

ప్రస్తుత పర్యావరణ సంక్షోభానికి ప్రధానంగా బాధ్యత వహించ వలసింది ఉత్తరార్ధ గోళానికి చెందిన సంపన్న దేశాలలో అమలవుతున్న ఆర్థికాభివృద్ధి వ్యూహమేననే అవగాహన విస్తృతంగానే పెరుగుతోంది. ఇటీవలి దశాబ్దాలలో విపరీతంగా పెరిగిపోయిన వస్తు వినియోగ సంస్కృతి ఈ సంక్షోభాన్ని మరింత పెంచింది. పారిశ్రామిక పూర్వయుగం నుండి ఇప్పటికి వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయనీ, మన భూగోళం సంక్షోభం దిశగా పోతోందనీ శాస్త్రవేత్తలు ఎప్పటి నుండో హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతల్లో విపరీత మార్పులు, గతి తప్పుతున్న రుతువులు, పెరిగిపోతున్న కరువులు, వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఇప్పుడు ఆందోళన పెడుతున్నాయి. రెండు డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువ వేడెక్కితే ప్రకృతి సహజ క్రియలు విచ్ఛిన్నమవుతాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు.

✦	పర్యావరణ సంక్షోభానికి కారకులెవరు?	పి. వరలక్ష్మి	29
✦	ఎవరి అభివృద్ధి కోసం కోస్తా విధ్వంసం?	జె.వి. రత్నం	31
✦	గల్ఫ్ ఆఫ్ మెక్సికో దోషులెవరు?	పి.వి. రమణ	34
✦	మన కాలపు పర్యావరణ సంక్షోభం	రణధీర్ సింగ్	37
✦	అంతరించిపోతున్న అడవి	బి. వేణుగోపాల్	42

❖ కొత్త పుస్తకాలు / సి.డి.లు			6
❖ పాఠకుల వీక్షణం			7
❖ ప్రాంతీయం			8
❖ రాజ్య హింస రూపాలు	భోపాల్ బయటపెడుతున్న అసలు సంగతి	ఎన్. వేణుగోపాల్	9
❖ వర్తమానం	ఆపరేషన్ గ్రీన్‌హంట్ పట్నపు అవతారం	అరుంధతీ రాయ్	15
❖ వర్తమానం	ఈ జాతి అచేతనంగా ఉందా?	మోహన్ మూర్తి	17
❖ విధానవిమర్శ	జనం తాగితేనే ప్రభువులకు భద్రత	ఎడ్ల పోచయ్య	13
❖ విధానవిమర్శ	పర్యాటక రంగం సవ్యంగానే ఉందా?	ఎస్. సరళా వందనం	21
❖ విధానవిమర్శ	ప్రసారభారతీ, మమ్మల్ని క్షమించు!	వి. గోపీచంద్	19
❖ నేరం - శిక్ష	ఛత్తీస్‌ఘడ్ జైళ్లలో అక్రమాలు	వొగ్గె చంద్రమౌళి	25
❖ న్యాయపోరాటం	పోలీసులా? కీచకులా?	డా. జి. లచ్చయ్య	44
❖ ప్రపంచతంత్రం	సహజ సంపదే శాపమైన ఈస్ట్ టిమోర్	కె. నరేంద్రమోహన్	48
❖ పరిశీలన	నూతన పారిశ్రామిక విధానం - ఆజంజాహి మిల్లు	డా. ఎం. విద్యాసాగర్ రెడ్డి, డా. మహ్మద్ మస్లియుద్దిన్	50
❖ పరిశీలన	ఆర్థిక సామర్థ్యాన్ని పెంచే పాడి పరిశ్రమ	లింగబత్తిని మల్లయ్య, వంగ రజిత	52
❖ శాస్త్రవిజ్ఞానం	ఆదిమ సమాజాల్లో వర్గ విభజన	డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్	54
❖ దేశీయం			56
❖ అంతర్దేశీయం			57
❖ అసహజ మరణాల సూచి		- రాంకి, వై. రామచంద్రం	58

'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– సంపాదకులు


చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.





– సర్క్యులేషన్ మేనేజర్
9949391028







- **భూముల కోసం...** (కళ్యాణలోవ కథలు) – పి.ఎస్. అజయ్ కుమార్ – 90 పేజీలు, 1/8 డెమీ, సంస్థలకు రు.65, వ్యక్తులకు రు. 40, ప్రతులకు : పి.ఎస్. అజయ్ కుమార్, అచ్చియ్యపేట గ్రామం, వేట జంగాల పాలెం (బి.పి.ఒ.), కశింకోట (ఎస్.ఒ.) విశాఖపట్నం – 531031
- **గాయాలే... గేయాలై!** – తెలంగాణ కవయిత్రుల కవితా సంకలనం – సంపాదకులు : రాజీవ, జ్వలిత, అమృతలత – రజనీ పబ్లికేషన్స్, 164 పేజీలు, 1/8 డెమీ, రు.80, ప్రతులకు : కీర్తి బుక్ స్టాల్, నిజామాబాద్ – 503003; విశాలాంధ్ర బుక్ హౌస్, నవోదయ బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్
- **సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి** – సావిత్రీబాయి పూలే జీవితం – ఉద్యమం – సంకలనం : బ్రజ్ రంజన్ మణి, ప్యామెల సర్దార్, – హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 72 పేజీలు, 1/8 డెమీ, రు.40, ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 067. ఫోన్ : 23521849, www.hyderabadbooktrust.blogspot.com
- **పెట్టుబడిదారీ విధానమూ దాని పతనం** – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు, 36 పేజీలు, 1/8 డెమీ, రు. 12, ప్రతులకు : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి. రాధాకృష్ణమూర్తి, ఇ.నెం. 5–85–4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు – 522002, సెల్ : 9985377760; విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, మైత్రి, దిశ, సహచర, నవయుగ, మణి బుక్‌స్టాల్
- **జుదాయి జంగ్** – తెలంగాణ దీర్ఘకవిత – కట్టా భగవంత రెడ్డి – నల్లగొండ సాహితి వేదిక – 33 పేజీలు, 1/8 డెమీ, రు. 12, ప్రతులకు : చారు గౌతం, 6–3–558, రామగిరి, నల్లగొండ – 508001; తెలంగాణలోని ప్రముఖ పుస్తకాల దుకాణాల్లో
- **అక్షరశిల్పులు** – ముస్లిం కవులు–రచయితల సంక్షిప్త పరిచయం – కూర్పు: సయ్యద్ నశీర్ అహమద్ – ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, 180 పేజీలు, 1/8 డెమీ, రు.150, ప్రతులకు : ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, శివప్రసాద్ వీధి, కొత్తపేట, వినుకొండ, గుంటూరు – 522647; సెల్ : 9440241727, 9396429722; తెలుగు బుక్ హౌస్, 3–3–862, కాచిగూడా ఎక్స్‌రోడ్స్, హైదరాబాద్ – 500027; ఫోన్ : 040 65347374, సెల్ : 9247446497
- **భూమి కోసం** – కథలు – సంగ్రామ్ – విప్లవ రచయితల సంఘం – 36 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : సంగ్రామ్, 5సి – ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్స్, 5వ లైను, బృందావన్ గార్డెన్స్, గుంటూరు – 522 006 ; ఫోన్ : 0863–2357103
- **పునర్మూల్యాంకనం** – సాహిత్య వ్యాసాలు – దార్ల వెంకటేశ్వరరావు – సొసైటీ & ఎడ్యుకేషన్ ట్రస్ట్ ప్రచురణ, 141 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు : దార్ల వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు డిపార్ట్‌మెంట్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, (సెంట్రల్ యూనివర్సిటీ), గచ్చిబౌలి, హైదరాబాద్ – 500046, ప్రముఖ పుస్తక షాపులు
- **దేశదేశాల హైకు** – పెన్నా శివరామకృష్ణ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ, 98 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036; ఇమెయిల్ : palapittabooks@gmail.com
- **తెలుగు సాంగ్స్ ఫర్ అభినయ** (ఇంగ్లిష్) – ప్రొ. సాల్వ కృష్ణమూర్తి – ద్రవిడియన్ యూనివర్సిటీ ప్రచురణ, 260 పేజీలు, 1/4 క్రౌన్, రు. 200, ప్రతులకు: రిజిస్ట్రార్, ద్రవిడియన్ యూనివర్సిటీ, శ్రీనివాసవనం, కుప్పం – 517425


వీక్షణానికి చేయూత...

తమ వంతు బాధ్యతగా వీక్షణంకు విస్తృతంగా చందాదారులను చేర్పిస్తూ, పత్రికను పది మందికి పరిచయం చేస్తూ, నిరంతరం పత్రికకు సహకరిస్తున్న మిత్రులు **ఎల్. సుబ్బయ్య,** (కర్నూల్), **రఘు**, టీచర్ (ఖమ్మం) గార్లకు వీక్షణం తరఫున హార్దిక కృతజ్ఞతలు.

వెయ్యి రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించిన మిత్రులు **రావి సుబ్బారావు** (మెహదీపట్నం, హైదరాబాద్) గారికి కృతజ్ఞతలు.

– సం.

భవిష్యత్తులో మైనారిటీల మీద పెద్ద ఎత్తున దాడులు, దమనకాండలు జరగనున్నాయని నాకు అనిపిస్తోంది. వీక్షణం, ప్రజాతంత్ర, వార్త, ఆంధ్రజ్యోతి అదివారం వంటి పత్రికలలో ఈ దాడులను తిప్పికొట్టేలా, మనుషుల మధ్య సంఘీభావం గురించి, సహనం గురించి, ఐక్యత గురించి రచనలు విరివిగా రావలసి ఉంది. రొమిల్లా థాపర్ వంటి రచయితల రచనలను తెలుగులోకి తీసుకువచ్చి ప్రచారం చేయాలి. ప్రస్తుతం ఎంతో స్థలాన్ని వృథా చేస్తున్న దినపత్రికల ఆదివారం అనుబంధాలలో ప్రజలను నిజంగా విద్యావంతులను చేసే, చైతన్యవంతులను చేసే, అధికారం ఇచ్చే రచనలు రావాలి. హెరాల్డ్ లాస్కీ లాంటి రాజనీతిజ్ఞుల రచనలు అనువదించి వేయవచ్చు. బాలగోపాల్ రచనలు కూడా ఉన్నాయి. ఈ దేశం క్రమంగా ఎక్కడికక్కడ నేర, హంతక ముఠాల, మాఫియాల సామ్రాజ్యాలుగా మారిపోతున్నదని నాకు భయం వేస్తోంది. కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని చేపట్టడానికి భారతీయ జనతా పార్టీ అన్ని ప్రయత్నాలు చేస్తుండగా, వామపక్ష, ఉదారవాద శక్తులకు మాత్రం అటువంటి దీర్ఘకాలిక ప్రణాళికలేమీ లేవు. నేనేదో పెద్ద రాజకీయ విశ్లేషకుడిని కాను. కాని నా అభిప్రాయాలు పంచుకుందామనుకున్నాను.

– కె.జి. కన్నబిరాన్
సికిందరాబాద్

'వీక్షణం' జూన్ 2010 సంచికలో వచ్చిన 'చరిత్ర సంవిధానం' వ్యాసం చాలా బాగుంది. బెన్‌ఫైన్, ఆల్‌ఫ్రెడో సాద్ ఫిల్హో రాసిన 'మార్క్స్ కాపిటల్' చాలా గొప్ప పుస్తకం. దానిలోని చివరి అధ్యాయాన్ని కూడా అనువాదం చేసి వీక్షణంలో ప్రచురిస్తే బాగుంటుంది. ముఖ్యంగా సంవిధానం మీద, ఆలోచనా పద్ధతి మీద, విశ్లేషణా పరికరాల మీద తెలుగు పాఠకులు తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. వాటిని వీక్షణం ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తే చాలా మేలు చేసినవారవుతారు.

– పి. భరత్
గుంటూరు

జైళ్లలో సుదీర్ఘ కాలం గడిపిన యావజ్జీవ ఖైదీలకు, ఇతర ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించి ఆగస్ట్ 15, జనవరి 26, గాంధీ జయంతి తదితర సందర్భాలలో విడుదల చేయడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఆనవాయితీని గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం సక్రమంగా పాటించలేదు. ఆ సమయంలో ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసి ఈ ఆనవాయితీని మళ్లీ ప్రారంభించేలా చేసిన ప్రగతిశీల ప్రజాస్వామిక వాదులందరికీ కృతజ్ఞతలు. ఆ కృషిలో 'వీక్షణం' పాత్ర కూడా ఉందని గుర్తు చేస్తున్నాం. గత ఆగస్ట్ 15న కొంతమంది ఖైదీలు ఈరకంగా విడుదల అయ్యారు కానీ, ఇంకా విడుదల కావలిసినవారు ఎంతోమంది ఉన్నారు. గత జనవరి 26 సందర్భంగా రాష్ట్రం అల్లకల్లోలంగా ఉన్నందువల్ల ఈ పని ముందుకు సాగలేదు. ఇప్పుడు ఆగస్ట్ 15 మరొక రెండు నెలల్లో రానున్న సందర్భంగా ఇప్పటి నుంచే ఈ కృషి మొదలుపెట్టవలసి ఉంది. ఎన్నో సంవత్సరాలుగా జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీల తరఫున వీక్షణం పత్రికకు, వీక్షణం ద్వారా ప్రగతిశీల పాఠకులకు ఈ కృషిని కొనసాగించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వానికీ, సంబంధిత శాఖల మంత్రులకూ, ముఖ్యమంత్రికీ, ప్రచార సాధనాలకూ మీ విజ్ఞప్తులు పంపించండి. ఆశోపహతులైన ఖైదీల జీవితాలలో చిరువెలుగు ప్రసరించడానికి సహకరించండి.

– ఎన్. రవి
హైదరాబాద్

రాయలసీమ విద్యావంతుల వేదిక రాసిన అవగాహనా పత్రం 'రాయలసీమ వెనుకబాటు వెనుక...' (వీక్షణం జూన్ 2010) చాలా తెలియని విషయాలను తెలియజేసింది. తెలంగాణ ఉద్యమకారులమైన మేము సాధారణంగా ఇతర ప్రాంతాల డిమాండ్‌లను అనుమానంతో చూస్తాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, పల్నాడు వెనుకబాటుతనం గురించి మాట్లాడినా, గిరిజనుల కొరకు ప్రత్యేకంగా మన్యసీమ కావాలని ఎవరైనా అడిగినా మాకు చాలా కోపం వస్తుంది. అవన్నీ తెలంగాణను అడ్డుకోవడానికే లేవనెత్తుతున్నారని అనిపిస్తుంది. కాని, ఈ అవగాహనా పత్రం చదివిన తరువాత మా డిమాండ్‌కు, వారి డిమాండ్‌కు పోటీ ఏమీ లేదని అర్థమవుతోంది. మమ్మల్ని దోపిడీ చేసిన వర్గాలే వారిని కూడా దోపిడీ చేస్తున్నాయని అర్థమవుతోంది. మా పోరాటం, వారి పోరాటం ఒకే ఉమ్మడి ప్రత్యర్థి మీద కాబట్టి ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో కలిసి కూడా పోరాటం చేయవచ్చునని అనిపిస్తోంది. ఇటువంటి వ్యాసాలు ఇంకా ఎక్కువ ప్రచురించండి.

– వి. రాజమల్లు
కరీంనగర్

జూన్ 2010 సంచికలో ఫోకస్‌గా వేసిన వ్యాసాలు బాగున్నాయి. ఆలోచించగా అసలు మన దేశంలోగానీ, రాష్ట్రంలోగానీ రాజ్యాంగం గురించి ఎంతమందికి తెలుసు అని ప్రశ్నలు వచ్చాయి. రాజ్యాంగాన్ని అమలుచేయవలసిన పాలకులు దానిలో ఏమి ఉన్నదో, దాన్ని తాము ఎలా అమలు చేస్తున్నారో ఎప్పటికప్పుడు చెప్పవలసి ఉంటుంది. కాని, చూడగా అసలు దేశ ప్రజలకు రాజ్యాంగం గురించి సమాచారం తెలిసే అవకాశాలే లేనట్టు కనబడుతోంది. కేవలం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సాంఘిక శాస్త్రం పుస్తకాలలో ఏవో కొన్ని పాఠాలు రాజ్యాంగం గురించి చెపుతాయి. మన విద్యా విధానం నడుస్తున్న తీరును బట్టి ఆ పాఠాలు కూడా పిల్లల బుర్రలకు ఎక్కవు. ఎక్కేలా చెప్పగలిగిన టీచర్లు లేరు. ఇక పదో తరగతి దాటిన తరువాత మన ఎంసెట్ వేలం వెర్రి మోజులో సమాజం గురించి, పాలన గురించి, రాజ్యాంగం గురించి తెలిసే అవకాశమే లేదు. ఇక మంచి పౌరులు ఎలా తయారవుతారు? మంచి పాలకులూ లేక, మంచి పౌరులూ లేక మన సమాజం ఈ రకంగా కాక మరొకరంగా ఎలా ఉంటుంది? రాజ్యాంగం గురించి ఈ సంచికలో రాసిన రచయితల చేత గానీ, ఇతర రచయితల చేత గానీ విరివిగా వ్యాసాలు రాయించండి. ముఖ్యంగా మల్లెపల్లి లక్ష్మయ్య రాసిన విషయం ఇంకా వివరంగా ఎన్నో వ్యాసాలలో రాయవలసి ఉంది. వీక్షణం నుంచి అటువంటి వ్యాసాల కోసం ఎదురుచూస్తున్నాం.

– కె. సంజీవ
మహబూబ్‌నగర్

వీక్షణంకు చందాలు, వీక్షణం పబ్లికేషన్ పుస్తకాల కోసం మీరు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు కట్టడానికి వీలుగా
వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101002175**, ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఓదార్పు యాత్ర

వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో కలత చెంది మరణించిన వారి కుటుంబ సభ్యులను ఓదార్చడానికి కడప ఎంపి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి ఓదార్పు యాత్రను తలపెట్టారు. అందులో భాగంగా మొదటి దశలో పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాలు అయిపోయి, రెండవ దశలో వరంగల్ జిల్లా నుంచి మొదలు పెట్టాలని భావించారు. మే 28న మానుకోటలో (మహబూబాబాద్) ప్రారంభం కానున్న ఈ యాత్రకు వ్యతిరేకంగా తెలంగాణవాదులు మానుకోట రైల్వేస్టేషన్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థి యువజనులపై జగన్ మద్దతుదారులు దాడికి దిగడంతో ఘర్షణ ఉధృతమయింది. ఎం.ఎల్.ఎ.లు కవితానాయక్, కొండా సురేఖ, ఇతర కాంగ్రెస్ కార్యకర్తలు ప్లాట్‌ఫారం మీద రెస్ట్ రూంలో ఉండగా, రెస్ట్ రూంలో నుంచి బయట విద్యార్థుల మీదికి కాల్పులు జరిగాయి. ఇరవైకి పైగా విద్యార్థి యువజనులు, అందులో ఎక్కువ మంది బంజారాలు తీవ్రంగా గాయపడ్డారు. జగన్‌మోహన్ రెడ్డిని మార్గ మధ్యంలో నల్లగొండ జిల్లా వంగపల్లి రైల్వే స్టేషన్‌లో అరెస్ట్‌చేశారు.

వేటూరి సుందరరామమూర్తి మృతి

తెలుగు చిత్రసీమలో పదివేలకు పైగా పాటలు రాసిన వేటూరి సుందరరామమూర్తి (74) మే 22న హైదరాబాద్‌లో మరణించారు. ఆయన కొద్దికాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. 29 జనవరి 1936లో కృష్ణా జిల్లాలోని పెదకళ్లేపల్లిలో జన్మించారు. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ పత్రికల్లో పాత్రికేయుడిగా కూడా పనిచేశారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలోని 'ఓ సీత కథ'తో ఆయన సినీ రంగ ప్రవేశం చేశారు. ఆయనకు ఒక జాతీయ అవార్డుతో సహా ఎనిమిది నంది అవార్డులు వచ్చాయి.

శాంభవి ఉండాల్సింది బడిలో...

శాంభవిని వారంలోగా పాఠశాలలో చేర్పించాలని కర్నూలు జిల్లా కలెక్టర్‌ను మానవ హక్కుల కమిషన్ జూన్ 14న ఆదేశించింది. శాంభవి వయసు 14 ఏళ్లు కాబట్టి విద్యాహక్కు చట్టం ప్రకారం ఇంట్లో ఉంచి చదివించడానికి వీలులేదని, తప్పని సరిగా బడికి పంపాల్సిందేనని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సుభాషణ్ రెడ్డి చెప్పారు. బడి ఈడు పిల్లలు పనిలోగానీ, గుడిలోగానీ ఉండడం కూడా సరికాదన్నారు. ఆమెను దేవతగా చేయవద్దని, అతీత శక్తులున్నాయని ప్రచారం చేయకూడదని చెప్పారు. తాము నమ్మిన విషయాన్ని ఇతరులతో నమ్మించవద్దని తెలిపారు. శాంభవిని పాఠశాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు నిరోధించడం చట్టవిరుద్ధమని అన్నారు.

ఔషధ పరీక్షలు

భద్రాచలం ఏజెన్సీలోని అమాయకులపై గత ఆర్నెల్లుగా కొన్ని ఔషధ సంస్థలు పరీక్షలు జరుపుతున్నట్టు భద్రాచలం ఆర్‌డిఓ తన విచారణ నివేదికలో పేర్కొన్నారు. చర్ల పరిసర ప్రాంతాల్లో పేదలకు డబ్బు ఎర చూపి వారిపై ఔషధ పరీక్షలు జరుపుతున్నట్టు నివేదికలో తెలిపారు. కలెక్టర్ నాగేశ్వరరావు జిల్లా ఆరోగ్య శాఖ అధికారిని విచారణ చేసి, బాధితుల ఆరోగ్య పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కేవలం పేదరికం వల్లే పరీక్షలకు ఒప్పుకుంటు న్నారని, వీటికి ఎలాంటి అనుమతులు లేవని కలెక్టర్ చెప్పారు.

తెలుగుదేశం మహానాడు

హైదరాబాద్‌లో గండిపేటలోని తెలుగు విజయం ప్రాంగణంలో తెలుగుదేశం మహానాడు సభలు మే 27-29 వరకు మూడు రోజుల పాటు జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ పార్టీకి అవిశ్రాంతంగా కృషి చేస్తానని వాగ్దానం చేశారు. ఈ సందర్భంలో జరిగిన పార్టీ అధ్యక్ష పదివికి చంద్రబాబు ఎనిమిదవ సారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన 1995 సెప్టెంబర్ 1న తొలిసారిగా పార్టీ అధ్యక్ష పదవి చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పార్టీ అధినేతగా కొనసాగుతున్నారు.

ఉప ఎన్నికలు

తెలంగాణలోని పది శాసనసభ స్థానాలకు జూలై 27న ఉప ఎన్నికలు జరుగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం జూన్ 21న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం తెరాసకు చెందిన 10 మంది, తెలుగుదేశం, బిజెపిలకు చెందిన ఇద్దరు మొత్తం 12 మంది రాజీనామ చేశారు. ఎన్నికల సంఘం పది స్థానాలకు షెడ్యూల్‌ను ప్రకటించింది. 2009లో జరిగిన సిరిసిల్లా, వేములవాడ ఎన్నికల ఫలితాలపై కోర్టుకేసులున్న కారణంగా ఆ స్థానాల్లో ఎన్నికలు ఇప్పుడు నిర్వహించడంలేదు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రకటన జూలై 2, నామినేషన్ల గడువు జూలై9, పరిశీలన జూలై 10, ఉపసంహరణ గడువు జూలై 12, ఎన్నికలు జూలై 27, ఫలితాలు జూలై 30న వెలువడుతాయి.

ఆదివాసులకు అందని వైద్య సహాయం

విజయనగరం జిల్లాలోని 34 ఏజెన్సీ గ్రామాల్లో వైద్య సదుపాయాల అందుబాటుపై రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన గిరిజన సంస్కృతి, పరిశోధనా, శిక్షణా సంస్థ అధ్యయనం చేసింది. ఆసుపత్రులకు వెళ్తున్న రోగులకు డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదనీ, వారికి ఎఎన్‌ఎమ్‌లు, ఆరోగ్య కార్యకర్తలే నామ మాత్రపు చికిత్సచేసి పంపుతున్నారనీ అధ్యయనంలో తేలింది. దగ్గు, జలుబు, కడుపునొప్పి, డయేరియా వంటి వ్యాధులకు చికిత్స అందిన వారి సంఖ్య చాలా తక్కువని తెలిపింది. జిల్లా మొత్తంలో 58 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సి) ఉన్నాయి. వీటిలో 17 ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ 17 పిహెచ్‌సిలలో 7 చోట్ల డాక్టర్లు లేరు. నాలుగు సంచార వైద్యశాలలున్నా అందులో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలాంటి అస్పత్రుల్లో ఎఎన్‌ఎమ్‌లు, ఆరోగ్య కార్యకర్తలే వైద్య సేవలందిస్తున్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

జాతీయ ఉపాధి హామి పథకం అమలులో ఒక్కో జిల్లాలో 50 నుండి 100 కోట్ల రూపాయల వరకు అవినీతి బయటపడుతోంది. ఇటీవల జరిపిన ఒక సామాజిక తనిఖీలో ప్రభుత్వ నిధులతో అమలవుతున్న ఈ పథకాన్ని రాజకీయ నేతలు తమ సొంత పనుల కోసం వాడుకొంటున్నారు. చేసిన పనుల్లో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. చేసిన పనికి అదనంగా కలిపి చూపడం, చేయని పనిని చేసినట్లు రికార్డులు సృష్టిస్తున్నారు. ఈ-మస్టర్‌ల విధానం అమల్లోకి రావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా అనేకచోట్ల యంత్రాలను ఉపయోగిస్తున్నారు. కొన్ని జిల్లాలలో అవినీతి చూస్తే విజయనగరంలో రు.50 కోట్లు, ప్రకాశంలో రు. 100 కోట్లు, నెల్లూరులో రు. 140 కోట్లు, అనంతపురంలో 100 కోట్లు, కర్నూలులో రు. 116 కోట్ల మేరకు అవినీతి జరిగినట్లు తెలుస్తోంది.

రాజ్యసభ అభ్యర్థులు

రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికలకు రాష్ట్రంలో కాంగ్రెస్ నుండి నలుగురు సిట్టింగ్ ఎం.పి.లు జైరాం రమేష్, జె.డి. శీలం, వి. హనుమంతరావు, నేదురుమల్లి జనార్దనరెడ్డిలు తిరిగి ఎన్నికయ్యారు. తెలుగుదేశం నుండి ఇద్దరు కొత్త అభ్యర్థులు గుండు సుధారాణి, వై. సత్యానారాయణ చౌదరి ఎన్నికయ్యారు.

మద్యం టెండర్లు

రాష్ట్రంలోని 6596 మద్యం దుకాణాల లైసెన్స్‌లకు టెండర్ల ఆహ్వానం మేరకు 2010-12 ఎక్సైజ్ సంవత్సరానికిగాను జరిగిన వేలంలో ఎక్సైజ్ శాఖకు దాదాపు రు.6,500 కోట్లు వచ్చాయి. 2008-10 సంవత్సరంలో వచ్చిన దానికంటే ఇది రెండింతలు. ఒక్కో దుకాణానికి భారీగా టెండర్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రు. 5.21 కోట్లకు టెండర్ వేసి గుంటూరు జిల్లా పల్నాడులోని నడికుడిలో ఒక మద్యం షాప్‌కు లైసెన్స్ పొందారు. వీ

***భోపాల్ దుర్ఘటనపై తీర్పు నేపథ్యంలో ప్రజల సంక్షేమం పట్టని దళారీ పాలకులు, లాభం తప్ప మరే విలువ లేని సామ్రాజ్యవాదులు ప్రజలపై కొనసాగిస్తున్న దుర్మార్గాల చరిత్రను విశ్లేషిస్తున్నారు* ఎన్. వేణుగోపాల్**

భోపాల్ బయటపెడుతున్న అసలు సంగతి

ఈ దేశంలో కొనసాగుతున్న పాలనావ్యవస్థలన్నీ ప్రజావ్యతిరేకమైనవేనని భోపాల్ దురంతరం మరొకసారి బహిర్గతం చేస్తున్నది. ఇక్కడ నడుస్తున్నది 'ప్రజలవల్ల, ప్రజలకొరకు, ప్రజలచేత' ఎన్నికయిన ప్రజాస్వామిక ప్రభుత్వమేనని ఇంకా ఎవరికైనా నమ్మకం ఉంటే ఆ నమ్మకాన్ని వదులుకోక తప్పదని భోపాల్ మరొకసారి ముక్కుమీద గుద్ది మరీ చెపుతున్నది.

భోపాల్ దురంతం వేలాది మందిని బలిగొన్నది. లక్షలాది మంది ఆరోగ్యాలను, పర్యావరణాన్ని ధ్వంసం చేసింది. భవిష్యత్తును సందేహమయం చేసింది. భారత ప్రజల సర్వసత్తాక అధికారాన్ని అపహాస్యం చేసింది. అయినా, దాని పట్ల ప్రభుత్వాలు, అధికార వ్యవస్థలు, రాజకీయ పక్షాలు, న్యాయవ్యవస్థ స్పందించిన తీరు, ఇరవై ఆరు సంవత్సరాల తర్వాత దానిమీద వెలువడిన న్యాయస్థానపు తీర్పు క్రూరంగా, దుర్మార్గంగా ఉన్నాయి. ఈ పరిణామాలన్నీ బయటపెడుతున్న విషయం ఒక్కటే - ఈ దేశాన్ని పాలిస్తున్నది ఇంకా పరాయిదేశాల సంపన్నుల, బహుళజాతి సంస్థల, వారి గులాముల, దళారుల కూటమి మాత్రమే గాని స్వతంత్ర ప్రజా ప్రభుత్వం కాదు. ప్రజాస్వామిక, సర్వసత్తాక పాలన పేరిట ఈ దేశంలో సాగుతున్నది ఆధిపత్య వర్గాల దోపిడీ పీడనలు మాత్రమేనని భోపాల్ దురంతం స్పష్టంగా ప్రకటిస్తున్నది. పేద ప్రజల ప్రాణాల పట్ల, ప్రయోజనాల పట్ల, దేశ వనరుల పట్ల ఎంతమాత్రం శ్రద్ధలేని బహుళజాతి సంస్థల, వాళ్ల దళారీల పాలనే ఇక్కడ సాగుతున్నదని భోపాల్ ఐదులక్షల నోళ్లతో వివరిస్తున్నది.

భోపాల్ దురంతం గురించి మొదటి నుంచీ చివరి దాకా తెలుసుకుంటే ఈ దేశంలో 1947 తర్వాత కూడ ఎంత దుర్మార్గమైన, ప్రజావ్యతిరేకమైన పాలన సాగుతున్నదో కళ్లకు కట్టినట్టు అర్థమవుతుంది.

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ లో 1968 నుంచి 1984 దాకా యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) అనే యాజమాన్యం కింద ఒక పురుగుల మందుల కర్మాగారం ఉండేది. ఈ యుసిఐఎల్ యూనియన్ కార్బైడ్ అనే అమెరికాకు చెందిన బహుళజాతిసంస్థకు అనుబంధ సంస్థ. దాని పెట్టుబడిలో మాతృసంస్థకు 50.9 శాతం వాటా, అంటే నిర్ణయాధికారానికి తగినంత వాటా, ఉండేది. భోపాల్ దురంతం తర్వాత భోపాల్ లోని కర్మాగారం మూతబడినప్పటికీ, ఇతర వ్యాపారాలు సాగుతూనే ఉండేవి. 2001 లో అమెరికాకు చెందిన మాతృసంస్థను ది డౌ కెమికల్స్ కంపెనీ (టిడిసిసి) అనే మరొక భారీ బహుళజాతిసంస్థ కొనేసి తనలో కలిపేసుకుంది. అంటే ప్రస్తుతం యుసిఐఎల్ అనే భారతదేశంలో నమోదయిన సంస్థగాని, యూనియన్ కార్బైడ్ అనే అమెరికన్ సంస్థగాని ఉనికిలో లేవు. అయినా ఆ సంస్థలకు వేలాది మందిని చంపిన, లక్షలాది మందిని అనారోగ్యం పాలు చేసిన, పర్యావరణాన్ని కలుషితం చేసిన నేర చరిత్ర ఉందని తెలిసి కూడ వాటిని, వాటి ఆస్తులను కొన్న డౌ కెమికల్స్ ఆ నేర బాధ్యతను వహించవలసిందే. కాని ఈ కొనుగోలు జరుగుతున్నప్పుడు, ఈ నేరం బాధ్యత గాని, నష్టపరిహారం ఇవ్వవలసిన బాధ్యత గాని తమకేమైనా ఉంటుందా అని డౌ కెమికల్స్ సంస్థ ఈ దేశంలోని ప్రముఖ న్యాయవాదులిద్దరిని అడిగింది. వారిద్దరూ అటువంటి బాధ్యతేమీ ఉండదని లిఖితపూర్వక సమాధానాలు ఇచ్చారు. ఆ ఇద్దరిలో ఒకరు భారత జాతీయ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా రోజూ కనబడే డా. అభిషేక్ మను సింఘ్వి. మరొకరు, మాజీమంత్రి, భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి అరుణ్ జైట్లీ. అంతే కాదు, డౌ కెమికల్స్ కు ఈ నేరంతో గాని, నష్టపరిహార బాధ్యతతో గాని ఎటువంటి సంబంధమూ ఉండదని కేంద్ర మంత్రులు పి చిదంబరం, కమల్ నాథ్ కూడ 2006-07 లో ప్రకటించారు.

కంపెనీ యాజమాన్యానికి, నేర బాధ్యతకు సంబంధించిన ఆ వివాదాన్ని అలా ఉంచి, ఆ కంపెనీ తొలిరోజుల గురించి తెలుసుకోవలసిన విషయాలు ఉన్నాయి. అసలు భోపాల్ కర్మాగారం ఏర్పాటే అక్రమాలతో మొదలయింది. అక్రమాలతో సాగింది. (వివరాల కోసం డామినిక్ లాపియర్, జేవియర్ మోరో లు రాసిన 'ఇట్ వాజ్ ఫైవ్ పాస్ట్ మిడ్ నైట్ ఇన్ భోపాల్' చదవవచ్చు. ఆ పుస్తకం 'ఆ రోజు రాత్రి ఏం జరిగిందంటే' పేరుతో తెలుగులో కూడ వచ్చింది).

దేశంలో 1960లలో హరిత విప్లవం అనే పేరుతో ప్రసిద్ధమై సాగిన ప్రక్రియ వ్యవసాయరంగాన్ని వాణిజ్య పంటలకూ, మార్కెట్ పంటలకూ బలిచేసింది. ఆ ప్రక్రియ వ్యవసాయంలో అధికోత్పత్తి సాధించడానికనే కుంటి సాకుతో రసాయనిక ఎరువుల, పురుగుల మందుల వాడకాన్ని, వ్యాపారాన్ని విరివిగా ప్రోత్సహించింది. స్థానిక విత్తనాల వాడకం మీద కోతలు విధించింది. వ్యవసాయరంగంలో అవసరం లేనిచోట్ల కూడ యంత్ర వినియోగాన్ని ప్రవేశపెట్టింది. ఆ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాలు, యంత్ర పరికరాలు ఎక్కువగా బహుళజాతిసంస్థలు తయారుచేసేవే. అంటే హరిత విప్లవం భారత వ్యవసాయోత్పత్తిని పెంచడానికనే పేరుతో బహుళజాతి సంస్థలకు విశాలమైన మార్కెట్ ను సమకూర్చిపెట్టింది. అలా హరిత విప్లవం భారత రైతాంగ జీవనాన్ని బహుళజాతిసంస్థలకు తాకట్టుపెట్టింది. ఆ వినాశకర విధానం మొదలయిన తర్వాత దేశంలో రసాయనిక ఎరువుల,

పురుగుల మందుల అవసరాలు విపరీతంగా పెరిగిపోయాయి. హరిత విప్లవ వ్యూహాన్ని అమ్మిన బహుళజాతిసంస్థలు, ఈ విష రసాయనాల వ్యాపారంలోని బహుళజాతిసంస్థలు ఒకే తానులోని ముక్కలు కావడం ఆశ్చర్యమేమీ కాదు. హరిత విప్లవం మొదలయిన ఐదు సంవత్సరాలలో రసాయనిక ఎరువుల వాడకం మూడు రెట్లు పెరిగింది. 1960-61లో 2,92,000 టన్నుల ఎరువులు వాడగా, అది 1970-71 నాటికి పదిరెట్లు పెరిగి 21,80,000 టన్నులు అయింది. అలాగే క్రిమిసంహారకాల వాడకం ఇదే కాలంలో 8,620 టన్నుల నుంచి మూడు రెట్లు పెరిగి 24,320 టన్నులకు చేరింది. (జి ఎస్ భల్లా రాసిన ఇండియన్ అగ్రికల్చర్ సిన్స్ ఇండిపెండెన్స్, నేషనల్ బుక్ ట్రస్ట్, 2008, పే. 68). అంటే ఈ ఎరువులు, పురుగుల మందులు అమ్మే బహుళజాతిసంస్థల లాభాలు మూడురెట్ల నుంచి పదిరెట్లు పెరిగి ఉంటాయి. నిజానికి ఈ పెరుగుదలను వ్యవసాయోత్పత్తిలో పెరుగుదలతో పోల్చి చూస్తే, హరిత విప్లవం ఎవరికి మేలు చేసిందో తేటతెల్లమవుతుంది. ఎరువుల వాడకం వెయ్యి శాతం, పురుగుల మందుల వాడకం మూడు వందల శాతం పెరగగా, వ్యవసాయోత్పత్తిలో పెరుగుదల అతి ఎక్కువగా గోధుమలో 53 శాతం మాత్రమే. ఈ పెరుగుదల వరిలో 10 శాతం, నూనెగింజలలో 14 శాతం మాత్రమే.

హరిత విప్లవపు వ్యవసాయ ప్రక్రియలవల్ల దిగుబడి పెరగక పోయినా, వందలాది కొత్త క్రిములు, చీడలు, తెగుళ్లు, పురుగులు వ్యవసాయ రంగాన్ని ముంచెత్తాయి. అప్పటికి దేశంలో ఉన్న క్రిమిసంహారకాల ఉత్పత్తి చాలదనే కారణంతో భారత ప్రభుత్వం 1966లో విదేశీ క్రిమిసంహారకాల కంపెనీలను దేశంలోకి ఆహ్వానించాలని నిర్ణయించింది. అలా భారతదేశంలో తన క్రిమిసంహార కాలను 1966 నుంచే అమ్మడం ప్రారంభించిన తొలి కంపెనీలలో యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ ఒకటి. ఆ దశాబ్దం చివరికే అది భోపాల్ లో సెవిన్, టెమిక్ అనే క్రిమిసంహారకాలు తయారుచేసే కర్మాగారాన్ని ప్రారంభించింది. అంతకంతకూ ఎక్కువ లాభాలను సంపాదించాలనే వేటలో ఎప్పటికప్పుడు ఖర్చు తగ్గించుకోవడానికి, ఆదాయాన్ని పెంచుకోవడానికి ఈ కంపెనీ మార్గాలు వెతుకుతూ వచ్చింది. ఈ ప్రయోగాలలో భాగంగా మిథైల్ ఐసో సైనేట్ (ఎంఐసి) అనే రసాయనంతో సెవిన్ ను, టెమిక్ ను తయారు చేసే ప్రక్రియను ఆ కంపెనీ కనిపెట్టింది. నిజానికి ఎంఐసి విషపూరితమైనదని, అత్యంత ప్రమాదకరమైనదని, దానితో కాకుండా తక్కువ ప్రమాదకరమైన, ఎక్కువ ఖరీదయిన మరొక రసాయనంతో ఈ క్రిమిసంహారకాన్ని తయారు చేయవచ్చునని యూనియన్ కార్బైడ్ కు తెలుసు. కాని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాల కొరకు చూసే బహుళజాతిసంస్థగా అది ఎంఐసి నే వరించింది.

ఎంఐసి ని వాడినప్పుడు కూడ తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. దాన్ని ఎక్కువ పరిమాణంలో కాకుండా తక్కువగా నిలువ చేయవచ్చు. ఒకేచోట పెద్ద టాంకులో కాకుండా చిన్న చిన్న డ్రమ్ములలో నిలువ చేయవచ్చు. దాన్ని తీసుకుపోయే పైప్ లైన్లను తుప్పుపట్టని లోహంతో తయారు చేయవచ్చు. ఎల్లప్పుడూ దాన్ని అతిశీతల ప్రాంతంలో ఉంచి అది వ్యాపించకుండా, దానిలో నీరు కలవకుండా, అది విస్ఫోటనమై గాలిలో కలవకుండా జాగ్రత్త పడవచ్చు. ఒకవేళ అది అలా గాలిలో ప్రవేశించినా, అది పీల్చినవారికి వెంటనే సోడియం థయోసల్ఫేట్ అనే మరొక రసాయనం ఇవ్వాలనే ముందుజాగ్రత్త చర్యలను పరిసర ప్రాంతాలలో ప్రచారం చేయవచ్చు. ఇవన్నీ తెలిసి కూడ, ఇతర దేశాలలో అమలు చేస్తూ కూడ, భోపాల్ లో మాత్రం యూనియన్ కార్బైడ్ ఈ పనులేవీ చేయలేదు.

ఇదంతా ఏదో ఎవరికీ తెలియకుండా రహస్యంగా జరిగిన పని కాదు, అలసత్వమో నిర్లక్ష్యమో కాదు. ఉద్దేశపూర్వకమైన, హంతక స్వభావం గల, ప్రజల ప్రాణాల పట్ల తిరస్కార భావనగల పెట్టుబడి లక్షణం అది. లాభమా సురక్షితత్వమా, లాభమా మానవ ప్రాణమా అనే పోటీ వస్తే పెట్టుబడి లాభాన్నే కోరుకుంటుంది.

అయితే పెట్టుబడికి, అందులోనూ సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల పెట్టుబడికి ఉన్న ఆ హంతక లాభార్జనా లక్షణాన్ని అదుపు చేయవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉండింది. తనను తాను సంక్షేమ రాజ్యమని చెప్పుకున్న రాజ్యం, పెట్టుబడి దుర్లక్షణాలను నియంత్రించడం కోసమే అనేక చట్టాలను, సంక్షేమ నిబంధనలను తయారుచేసింది. ఆ నిబంధనల ప్రకారం కనీసం రెండు డజన్ల ప్రభుత్వ శాఖలు ఇటువంటి కర్మాగారాల పనితీరును పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ, అక్రమాలను అరికడుతూ ఉండవలసి ఉంటుంది. మరి ఆ తనిఖీ అధికారమంతా అధికార యంత్రాంగానికి నెలవారీ లంచాలు వసూలు చేసుకునే అవకాశంగా మారిపోయింది. ప్రజల, కార్మికుల సంక్షేమం కోసమే తామున్నామనే ఆలోచన లేకుండా పోయింది.

భోపాల్ కర్మాగారంలో చట్టపరమైన నిబంధనలన్నిటినీ యాజమాన్యం ఎట్లా తుంగలో తొక్కిందో తెలుసుకోవాలంటే ఒక్క ఉదాహరణ చూస్తే చాలు: అక్కడ తయారయే సెవిన్, టెమిక్ లకు సాలీనా 3-4 టన్నుల ఎంఐసి మాత్రమే అవసరం ఉండగా, ప్రమాదం జరిగిన సమయానికి 42 టన్నుల విషవాయువు అక్కడ ఉంది. కావలసినదానికన్న పదిరెట్ల విష రసాయనాన్ని నిలువ చేసి ఉంచితే ఏ ఒక్క యంత్రాంగమూ ప్రశ్నించలేదు. అవసరమైన చర్యలు తీసుకోలేదు.

అలా భోపాల్ దుర్మార్గానికి బహుళజాతి సంస్థది మొదటి బాధ్యత కాగా అందులో తమ విధానాల వల్ల, ముడుపుల ఆశ వల్ల పాలకులు, తమ అలసత్వం వల్ల, లంచగొండితనం వల్ల అధికారులు భాగం పంచుకున్నారు. ఈ రకంగా భారత ప్రభుత్వాన్ని, మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పాలనా వ్యవస్థలను తమ దళారులుగా, బానిసలుగా చేసుకున్న బహుళజాతిసంస్థ కనీసం తాను ఇతరదేశాలలో, మాతృసంస్థ ఉన్న అమెరికాలో అనుసరించిన జాగ్రత్తలు కూడ లేకుండా ఇక్కడ ఉత్పత్తి చేయడం మొదలుపెట్టింది.

భోపాల్ కర్మాగారంలో సరయిన ముందుజాగ్రత్త చర్యలు లేవనీ, కార్మిక, ప్రజా సంక్షేమ చర్యలు తీసుకోవడంలేదనీ, అందువల్ల మనుషుల ప్రాణాలకూ, ఆరోగ్యానికీ ప్రమాదం ఉందనీ 1976 నుంచి ప్రమాదం జరగడానికి రెండు నెలల ముందు వరకూ కనీసం డజను హెచ్చరికలు వచ్చాయి. కర్మాగారం లోపల కార్మికులు చనిపోయారు. కర్మాగారం బయట ప్రజలు విషవాయువులు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ఎన్నో అవకతవకలు అంతర్గత తనిఖీ నివేదికలలో బయటపడ్డాయి. చివరికి 1982 నుంచి స్థానిక వార్తాపత్రికలలో ఈ పొంచి ఉన్న ప్రమాదం గురించి వార్తలూ వ్యాసాలూ రావడం మొదలయింది. కాని అటు కంపెనీ యాజమాన్యం, ఇటు సంబంధిత ప్రభుత్వ శాఖలు ఈ ప్రమాద సూచనలను ఎంతమాత్రం పట్టించుకోలేదు. ఒక పెద్ద కంపెనీని

రాష్ట్రానికి తెచ్చామనే ప్రగల్భాలతో ప్రజలను మాయచేసే అవకాశం ఒకపక్కనా, ఆ కంపెనీ ఇచ్చే ముడుపులు మరొకపక్కనా రాజకీయ నాయకత్వానికి అందివచ్చాయి.

ఇలా ఒక బహుళజాతిసంస్థ దురాశ, స్వదేశీ పాలకుల భాగస్వామ్యం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కలగలిసి 1984 డిసెంబర్ 2–3 రాత్రి అత్యంత విషాదకరమైన ప్రమాదం జరిగింది. ఎంఐసి విషవాయువు నిలువ ఉంచిన టాంక్ నుంచి ఆ వాయువు బయటపడి అప్పటికప్పుడు పదిహేనువేల మందిని చంపివేసింది. (ప్రభుత్వం లెక్క ప్రకారం మృతుల సంఖ్య మూడువేలు మాత్రమే). కనీసం ఐదు లక్షల మంది శ్వాసకోశాల్లో ప్రవేశించిన ఆ వాయువు వల్ల వాళ్లందరూ ఇప్పటికీ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆ వాయువు పీల్చినందువల్ల ఏర్పడిన అనారోగ్యం వల్లనే కనీసం ఏడాదికి వెయ్యి మంది చొప్పున చనిపోతున్నారు. అప్పటినుంచీ అక్కడ పుడుతున్న శిశువులు జన్యుసంబంధమైన వ్యాధులతో పుడుతున్నారు. ఆ రాత్రీ, ఆ తర్వాత మూడు నాలుగు రోజులూ అక్కడ చనిపోయిన జంతు జాతులకు లెక్కలేదు. ఆ వాయువు అక్కడి వాతావరణంలో చేరినందువల్ల ఎన్ని సంవత్సరాల పాటు దుష్ప్రభావాలు ఉంటాయో సరయిన పరిశోధనలు జరగనే లేదు. జరిగిన పరిశోధనా పత్రాలను ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకుని మాయం చేశారు. ఆ కర్మాగార ప్రాంగణంలో నిలువ ఉండిన విష రసాయనాలను ఇప్పటికి కూడ పరిశుభ్రం చేయలేదు. ఈ ఇరవై ఆరు సంవత్సరాలుగా ఆ రసాయనాలు అక్కడి నేలలో ఇంకి చుట్టూ విస్తరించి ఎటువంటి ప్రమాదాలను కలగజేస్తున్నాయో, కలగజేస్తాయో తెలియదు.

ఒక్కసారిగా అంతమందిని చంపిన దురంతం పట్ల భారత ప్రభుత్వం, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు అతి నీచమైనది. సరిగ్గా అంతకు కొన్ని వారాల కిందనే ఇందిరా గాంధీ హత్యానంతరం రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రిగా అధికారం చేపట్టాడు. అప్పటిదాకా నడుస్తున్న దిగుమతి ప్రత్యామ్నాయ విధానాన్ని మార్చి దిగుమతి సరళీకరణ విధానాన్ని ప్రవేశపెడతానని ప్రకటించాడు. ఆ నేపథ్యంలో ఒక బహుళజాతి సంస్థమీద కఠినమైన చర్యలు తీసుకుంటే విదేశీ పెట్టుబడి దేశంలోకి రావడానికి భయపడుతుందని, అందువల్ల యూనియన్ కార్బైడ్ మీద ఎటువంటి చర్యలు ఉండగూడదని దుర్మార్గమైన పాలకనీతి అమలు కావడం మొదలయింది. అందుకే యూనియన్ కార్బైడ్ అధిపతి వారెన్ ఆండర్సన్ భోపాల్‌కు వస్తే ఆయనను ఈ నేరానికి అరెస్టు చేసి విచారించడం కాకుండా అతి వినయంగా, రాచమర్యాదలన్నీ చేసి, గెస్ట్ హౌజులలో ఉంచి, ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో ఢిల్లీ పంపించి, అక్కడినుంచి అమెరికా వెళ్లిపోనిచ్చారు. ఆ తర్వాత ఆయన మీద పేరుకు కేసు నడిపినప్పటికీ న్యాయస్థానానికి రప్పించడానికి అవసరమైన ప్రయత్నాలేవీ చేయలేదు. 'పరారీలో ఉన్న నిందితుడు'గా అభివర్ణిస్తూ వచ్చారు.

ఒక్క ఆండర్సన్ విషయం మాత్రమే కాదు, అసలు ఈ నేరాన్ని సరిగా విచారించి నేరస్తులకు తగిన శిక్షలు విధించాలని, బాధితులకు తగిన నష్టపరిహారం ఇప్పించాలనీ, పునరావాసం కల్పించాలనీ, ప్రమాదస్థలాన్ని శుభ్రం చేయాలనీ, కనీసం బాధితుల ఆరోగ్య సమాచారం సేకరించి సరయిన పరిశోధనలు చేయించాలనీ కూడ ప్రభుత్వం అనుకోలేదు. భోపాల్ బాధితులు స్వయంగానో, స్వచ్ఛంద సంస్థల ద్వారానో, ప్రజాసంఘాల ద్వారానో విడివిడిగా నష్టపరిహారం కోసం దావాలు వేసి బహుళజాతిసంస్థను చికాకు పెడతారనే భయంతో, ఆ బహుళజాతిసంస్థను రక్షించడం కోసం భారత ప్రభుత్వం 1985లో ఒక చట్టం తీసుకువచ్చింది. ఆ చట్టంలో నష్టపరిహారం అడిగే బాధ్యత, గతంలోగాని, వర్తమానంలోగాని, భవిష్యత్తులోగాని ఆ బహుళజాతి సంస్థతో వ్యవహరించే పూర్తి అధికారం భారత ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని, బాధితులకు ఉండదని నిబంధన విధించింది. ఆ చట్టాన్ని ఉపయోగించుకుని 1989లో న్యాయస్థానానికి బయట అత్యంత హీనమైన నష్టపరిహారానికి ఒప్పందం చేసుకుంది. 47 కోట్ల డాలర్లు నష్ట పరిహారం ఇస్తే చాలునని ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందాన్నే సుప్రీంకోర్టు అంగీకరించి అప్పటిదాకా నడుస్తున్న దావాలన్నిటినీ పక్కనపెట్టింది.

నష్ట పరిహారం సంగతి అలా ఉండగా, ఈ నేరంలో బాధ్యులకు శిక్షల విషయంలో కూడ, నేరపరిశోధన జరిపిన కేంద్ర నేరపరిశోధనా సంస్థ (సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ – సిబిఐ) 1987లో ఒక అభియోగ పత్రాన్ని దాఖలు చేయగా దానిలో నిందితులమీద సెక్షన్ 304 (శిక్షార్హమైన, హత్యతో సమానం కాని, చంపడం) మోపగా, 1996లో సుప్రీంకోర్టు దాన్ని సెక్షన్ 304–ఎ (ప్రమాదవశాత్తూ జరిగిన మరణం) గా మార్చింది. కనీసం మొదటి సెక్షన్ ప్రకారం పది సంవత్సరాల నుంచి యావజ్జీవ ఖైదు విధించే అవకాశం ఉండగా, రెండవదాని ప్రకారం అత్యధిక శిక్ష రెండు సంవత్సరాలు మాత్రమే. ఆ కేసు ఆ తర్వాత కూడ పన్నెండు సంవత్సరాలు నడిచింది. చివరికి 2010 జూన్ 7న వెలువడిన తీర్పులో భారతీయ యాజమాన్యానికి మాత్రం అతి స్వల్పమైన శిక్షలూ, జరిమానాలు విధించి, ఆ జైలు శిక్షలు కూడ అమలు కానక్కరలేని బెయిల్ ఇచ్చారు.

భోపాల్ అనంత విషాదగాథ ఇరవై ఆరు సంవత్సరాల కిందటిది. లక్షలాది మందిది. దాని గురించి ఎంత చెప్పినా ఇంకా మిగిలిపోయేది ఉండనే ఉంటుంది. కాని ఈ తీర్పు తర్వాత ప్రత్యేకంగా గుర్తించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. అవి ఇప్పుడయినా గుర్తించకపోతే ఈ సమాజంలో ఆలోచనాపరులుగా మన ఉనికే ప్రశ్నార్థకమవుతుంది.

తీర్పు వెలువడిన తర్వాత చాలమంది వ్యాఖ్యాతలు, రాజకీయ నాయకులు తీర్పు మీద, మొత్తం పరిణామాల మీద ఎన్నో వ్యాఖ్యలు చేస్తున్నారు. రాజకీయ పార్టీలు, రాజకీయ పార్టీలలోని ముఠాలు ఒకరి మీద ఒకరు దుమ్మెత్తి పోసుకోవడానికి, నిందలను, ఆరోపణలను, ప్రత్యారోపణలను గుప్పించుకోవడానికి ఇది సందర్భంగా వాడుతున్నారు. పెట్టుబడి స్వభావం, ప్రభుత్వ స్వభావం, యాజమాన్య నిర్లక్ష్యం, అధికార యంత్రాంగపు అలసత్వం, రాజకీయ నాయకత్వపు దగుల్బాజీతనం, పరిశోధనా సంస్థల బానిస మనస్తత్వం, న్యాయవ్యవస్థ గుడ్డితనం, వెరసి మొత్తంగా భారత ప్రజలకు జరిగిన అన్యాయం, అవమానం చర్చలోకి రావలసి ఉండగా ఎవరికి వారు తోచిన ఒకటో రెండో అంశాలమీద మాట్లాడుతున్నారు. ప్రధానంగా చర్చను నష్టపరిహారం మీదికి మళ్లించి, రాజకీయార్థిక కారణాలవైపు, పరిష్కారాల వైపు, నేరస్తులకు శిక్షలవైపు చర్చ వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు.

భోపాల్ దురంతంలో బాధ్యతను, నేరాన్ని ఒక ఆండర్సన్ మీదికో, మెజిస్ట్రేటు మీదికో, ప్రధానమంత్రి మీదికో, ముఖ్యమంత్రి మీదికో, భారత యాజమాన్యం మీదికో నెట్టినందువల్ల సమస్య అర్థం కాదు. భోపాల్

దురంతం మొత్తంగా మన వ్యవస్థ స్వభావానికి చిహ్నం. అందులో వీళ్లందరికీ భాగస్వామ్యం ఉన్నది. వారి వారి భాగస్వామ్యాన్ని గుర్తించి అందుకు తగిన శిక్షలు విధించవలసిందే. కాని అంతకన్న ముఖ్యంగా, ప్రజానుకూలంగా ప్రవర్తించని పాలక స్వభావం, మనిషి కన్న లాభానిదే పైచేయి అయిన పెట్టుబడి స్వభావం అర్థం చేసుకుంటేగాని భోపాల్ దురంతాన్ని సమగ్రంగా అర్థం చేసుకున్నట్టుకాదు.

ఆ నాటికి మధ్యప్రదేశ్‌లోనూ, కేంద్రం లోనూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాజకీయ నాయకులు ఈ రకంగా కాక మరొక రకంగా ప్రవర్తించి ఉండే అవకాశమే లేదు. పైగా దేశాన్ని ఇరవయ్యొకటో శతాబ్దంలోకి తీసుకుపోతానని ప్రగల్భాలు పలికి, అందుకు మార్గం సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల రథ చక్రాలకు భారత సమాజాన్ని కట్టివేయడమే అనుకున్న రాజీవ్ గాంధీ నాయకత్వం భోపాల్ దురంతానికి పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుంది. అప్పటికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండిన అర్జున్ సింగ్ ప్రమాదం జరిగిన మూడవరోజే, వేలాది మంది శవాల మీద నిలబడి 'ఎవరినీ విచారించం, ఎవరినీ వేధించం' అని నిస్సిగ్గుగా, బహిరంగంగా ప్రకటించాడంటే భోపాల్ నేరంలో కాంగ్రెస్ పాత్ర ఎంతటిదో అర్థమవుతుంది.

ఒక్క కాంగ్రెస్ మాత్రమే కాదు, కాంగ్రెస్ ను ఇవాళ విమర్శిస్తున్న ప్రతిపక్ష రాజకీయ పార్టీలన్నిటికి కూడ భోపాల్ దురంతంలో భాగం ఉంది. ఈ ఇరవై ఆరు సంవత్సరాలలో భారతీయ జనతాపార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ అధికారంలో పది సంవత్సరాలు ఉంది. భాజపా నాయకత్వాన ఐక్య సంఘటన ప్రభుత్వాలు కేంద్రంలో ఆరు సంవత్సరాలు పాలించాయి. ఆ సమయంలో ప్రభుత్వం తరఫున భోపాల్ విషయంలో చేయవలసిన చిన్నమెత్తు పనిని కూడ భాజపా చేయలేదు. అలాగే ఈ ఇరవై ఆరు సంవత్సరాలలో భారత కమ్యూనిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తో సహా ఇతర ప్రతిపక్షాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి బైటి నుంచో, లోపలి నుంచో మద్దతు ప్రకటిస్తూనే వచ్చాయి. వాటిలో ఏ ఒక్క పార్టీ కూడ ఒక్క సారయినా భోపాల్ విషయంలో నోరెత్తిన దాఖలా లేదు.

ఇది కేవలం రాజకీయ పార్టీలకు మాత్రమే చెందిన విషయం కూడ కాదు. అరకొరగా అభియోగపత్రం దాఖలు చేసిన సిబిఐ, విపరీతమైన ఆలస్యం చేసిన అన్ని న్యాయస్థానాలు, అభియోగపత్రం నుంచి కఠినమైన శిక్షల సెక్షన్ మార్చిన సుప్రీంకోర్టు, ఆ సుప్రీంకోర్టు ఆదేశాన్ని వెంటనే మార్పించలేకపోయిన ప్రభుత్వాలు, చివరికి తీర్పు ఇచ్చిన భోపాల్ చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ – అందరికందరూ ఈ నేరంలో భాగస్వాములే.

ఐతే వీరంతా చేసినది అసలు నేరానికి సహకారం మాత్రమే. అసలు నేరం పెట్టుబడిది, సామ్రాజ్యవాదానిది, బహుళజాతిసంస్థలది. వాటి హంతక స్వభావానిది. ఇదంతా తెలిసిన తర్వాత కూడ ప్రపంచీకరణ పేరుతో ఎర్రతివాచీ పరచి ఆ హంతకులను దేశంలోకి ఆహ్వానించడం జరుగుతోంది.

1992లో ప్రారంభమయిన నూతన ఆర్థిక విధానాలు, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు, నూతన వాణిజ్య, ఎగుమతి-దిగుమతి విధానాలు భోపాల్ దురంతానికి కొనసాగింపులే. ఆ తర్వాత గుత్తాధిపత్యాన్ని, అక్రమ వ్యాపార పద్ధతులను అరికట్టే ఎం ఆర్ టి పి చట్టాన్ని రద్దుచేయడం, విదేశీ మారక ద్రవ్యం పై ఆంక్షలు విధించిన ఫెరాను రద్దుచేసి, విదేశీ మారక ద్రవ్యంలో అక్రమవ్యాపారాన్ని ప్రోత్సహించే ఫెమా ప్రవేశపెట్టడం, ఇండియన్ పేటెంట్స్ చట్టాన్ని సమూలంగా మార్చే సవరణలు చేయడం, బ్యాంకింగ్, బీమా రంగాల సంస్కరణలు, డంకెల్ డ్రాఫ్ట్‌ను అంగీకరించి, అవమానకరమైన షరతులపై ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరడం, విద్యా రంగంలోకి విదేశీ పెట్టుబడిని ఆమోదించడం, అన్ని రంగాలలోకీ బహుళజాతిసంస్థలను, విదేశీ పెట్టుబడిని అనుమతించడం, ప్రత్యేక ఆర్థిక మండలాల పేరుతో లక్షలాది ఎకరాల భూమిని బహుళజాతిసంస్థలకు, వారి దళారీలకు అప్పగించడం... చెపుతూ పోతే భారత ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని ఈ ఇరవై సంవత్సరాలలో వేలాది భోపాల్ లకు మార్గం సుగమం చేశాయి, చేస్తున్నాయి. విదేశీ పెట్టుబడి సంపాదించడమే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్నాయి.

ప్రజల ఉపాధికి, జీవనానికి, భద్రతకు, భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమైన ఈ విధానాలను ప్రవేశపెట్టడంలో, అమలు చేయడంలో మన రాజకీయ పార్టీల మధ్య సిద్ధాంత విభేదాలేమీ లేవు. కాంగ్రెస్ నాయకత్వాన ఉన్న ఆంధ్ర ప్రదేశ్ లోనయినా, బిజూ జనతాదళ్ కింద ఉన్న ఒడిషా లోనయినా, భాజపా కింద ఉన్న చత్తీస్ గఢ్, గుజరాత్‌ల లోనయినా, జార్ఖండ్ ముక్తి మోర్చా కింద ఉన్న జార్ఖండ్ లోనయినా, సిపిఐ (ఎం) నాయకత్వం లోని వామపక్ష ప్రభుత్వం ఉన్న పశ్చిమ బెంగాల్, కేరళల లోనయినా, బహుజన సమాజ్ పార్టీ కింద ఉన్న ఉత్తర ప్రదేశ్ లోనయినా, జనతాదళ్ కింద ఉన్న బీహార్ లోనయినా, డి.ఎం.కె. కింద ఉన్న తమిళనాడులోనయినా అమలవుతున్నది బహుళజాతి సంస్థలకు ఎర్రతివాచీ పరిచే విధానాలే. బహుళజాతిసంస్థల కోసం ప్రజలను బలిపెట్టే విధానాలే.

భోపాల్ దురంతంతో వందల రెట్లు ప్రమాదకరమైన పథకానికి ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇదివరకే కుదిరిన పౌర అణువిద్యుదుత్పత్తి ఒప్పందానికి కొనసాగింపుగా ఇప్పుడు తయారవుతున్న అణు విద్యుత్ కేంద్ర ప్రమాదాల బాధ్యతా బిల్లు నూటికి నూరు పాళ్లు వేల భోపాల్‌లను సృష్టించేది మాత్రమే కాదు, అణుప్రమాదం జరిగి ఎన్నివేలమంది చనిపోయినా కంపెనీలకు బాధ్యత ఉండదని రాసి ఇస్తున్న హామీపత్రం.

నిజానికి భారత పాలకులు బహుళజాతిసంస్థల ముందర ఇంతగా సాగిల పడనక్కరలేదు. 'జీ హుజూర్ జో హుకుం' అననక్కరలేదు. భారత దేశంలో ఉన్న అపారమైన సహజ వనరులతో సంపూర్ణంగా స్వావలంబన విధానాన్ని అమలు చేయవచ్చు. బహుళజాతిసంస్థల ప్రవేశమే లేకుండా, ప్రవేశించినా భారత ప్రజల అవసరం కోసం, భారత ప్రజల ఆంక్షలకు లోబడి ప్రవేశించాలని షరతులు విధించవచ్చు. నిజానికి బహుళజాతిసంస్థలకు భారతదేశపు సహజవనరులు, విశాల మార్కెట్లు కావాలి గాని, భారత ప్రజలకు వాళ్ల అవసరమేమీ లేదు. కాని ఇవాళ్టి పాలకులకు ఆ మాట చెప్పే ధైర్యంగాని, కోరిక గాని లేవు. ఎందుకంటే ఈ పాలకుల దృష్టిలో ప్రజలు లేరు, ప్రజా ప్రయోజనాలు లేవు. వాళ్లు కేవలం దళారీలు.

స్వావలంబన, ప్రజల వనరులు ప్రజలకొరకే, నిజమైన ప్రజాస్వామిక పాలన అనే నినాదాలను మరింత బలంగా ఎత్తిపట్టవలసి ఉందనీ, భారత దేశంలో నిజమైన ప్రజాప్రభుత్వాన్ని ఏర్పరచవలసిన అవసరం మరింతగా పెరుగుతున్నదనీ భోపాల్ మరొకసారి కర్తవ్యబోధ చేస్తున్నది.

(రచయిత వీక్షణం సంపాదకులు)

ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్నందుకు ప్రజాస్వామిక మేధావుల మీద ఎన్నెన్ని రూపాలలో, ఎటువంటి దాడులు జరుగుతున్నాయో స్వానుభవం నుంచి వివరిస్తున్నారు **అరుంధతీ రాయ్**

ఆపరేషన్ గ్రీన్‌హంట్ పట్నపు అవతారం

అడవి ప్రాంతాలలో తిరుగుబాటును అణచివేయడానికి సైన్యాన్నీ, వైమానిక దళాన్నీ మోహరించడం గురించి భారత ప్రభుత్వం ఆలోచిస్తుండగా, పట్నాల్లో మాత్రం మరింత చిత్రమైన సంగతులు జరుగుతున్నాయి.

జూన్ 2న ముంబైలో కమిటీ ఫర్ ద ప్రొటెక్షన్ ఆఫ్ డెమొక్రటిక్ రైట్స్ (సిపిడిఆర్) ఒక బహిరంగ సభను ఏర్పాటు చేసింది. అక్కడ ప్రధాన వక్తలు ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదక సలహాదారు గౌతమ్ నవ్లాఖా, నేనూ. ప్రచార మాధ్యమాల విలేకరులు కుప్పలు తెప్పలుగా వచ్చారు. ఆ సభ మూడు గంటల పైనే జరిగింది. అచ్చు పత్రికలలోనూ, టెలివిజన్ మీదా ఆ సభకు చాలా ప్రచారం దొరికింది. జూన్ 3న ఎన్నో వార్తాపత్రికలు, టెలివిజన్ చానళ్లు, రీడిఫ్.కామ్ లాంటి ఆన్‌లైన్ వార్తా పోర్టళ్లు ఆ సభను కచ్చితంగానే నివేదించాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా ముంబై ఎడిషన్‌లో 'వామపక్షానికీ చెందని, పాలకపక్షానికీ చెందని అభిప్రాయం కావాలి' అనే శీర్షికతోనూ, హిందూలో 'బాక్సైట్‌ను తవ్వకుండా కొండల్లోనే ఉంచగలమా?' అనే శీర్షికతోనూ వార్తా రచనలు వచ్చాయి. మొత్తం సభ రికార్డింగ్ యూట్యూబ్ మీద ఉంది.

సభ అయిపోయిన మర్నాడు వార్తా సంస్థ ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పిటిఐ) నేను మాట్లాడిన విషయాల మీద పూర్తిగా కట్టుకథ అల్లి పత్రికలకు పంపించింది.

పిటిఐ వార్తను మొట్టమొదట ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆన్‌లైన్ జూన్ 3న మధ్యాహ్నం 1.35 పెట్టింది. దాని శీర్షిక 'మావోయిస్టులకు అరుంధతి సమర్థన, కావాలంటే అరెస్ట్ చేయండి అని అధికారులకు సవాల్'. ఆ వార్త నుంచి కొన్ని వాక్యాలు చూడండి.

"మావోయిస్టులు సాగిస్తున్న సాయుధ ప్రతిఘటనను రచయిత్రి అరుంధతీ రాయ్ సమర్థించారు. వారి పోరాటానికి మద్దతు ఇస్తున్నందుకు తనను అరెస్ట్ చేయవచ్చునని అధికారులకు సవాల్ విసిరారు."

"నక్సల్ ఉద్యమం సాయుధ పోరాటం కాక తప్పదు. నేనేమీ హింసను సమర్థించడం లేదు. కాని, అత్యాచారాల మీద ఆధారపడి సాగుతున్న వెటకారపు రాజకీయ విశ్లేషణను నేను ఖండిస్తున్నాను."(?)

"అది సాయుధ ఉద్యమం కాక తప్పదు. గాంధేయ పద్ధతిలో ప్రతిఘటన చూపాలంటే, దానికి ప్రేక్షకులు ఉండాలి. ఇక్కడ లేరు. ఇటువంటి పోరాట రూపాన్ని ఎంచుకునే ముందు ప్రజలు చాలా కాలం చర్చ చేశారు' అంటూ రాయ్, భద్రతా బలగాల మీద మావోయిస్టులు ఎక్కుపెట్టిన భయానకమైన దాడిలో 76 మంది సిఆర్‌పిఎఫ్, పోలీస్ బలగాలు హతమయిపోయిన నేపథ్యంలో 'దంతెవాడ ప్రజలకు అభినందనలు తెలిపారు. 'నేను రేఖకు ఈవైపున ఉన్నాను. నాకేమీ భయం లేదు... నన్ను అరెస్ట్ చేయండి. జైల్లో పెట్టండి' అని ఆమె నొక్కి చెప్పారు."

ఈ నివేదిక చివరి భాగం నుంచి నేను మొదలు పెడతాను. 76 మంది కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలను మావోయిస్టులు చంపిన నేపథ్యంలో దంతెవాడ ప్రజలకు నేను అభినందనలు తెలిపాననే సూచన అత్యంత హంతక స్వభావంతో కూడిన నింద. అంతకు ముందే సిఎన్ఎన్ – ఐబిఎన్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నేను చాలా స్పష్టంగా సిఆర్‌పిఎఫ్ జవానుల మృతి విషాదకరమైనదని చెప్పి ఉన్నాను. ఈ దేశంలో పేదల మీద ధనికులు సాగిస్తున్న యుద్ధంలో ఆ జవానులు బలి పశువులు అయిపోయారని నా అభిప్రాయమని చెప్పాను. మళ్లీ ముంబై సభలో నేనన్నది ఏమంటే ప్రచార మాధ్యమాలలో సృష్టి అయిన ఖండన పరిశ్రమ దివాళాకోరుతనం పట్ల నాకు అసహ్యం వేస్తున్నదని. యుద్ధం జరుగుతూ ఉంటే, హింసా పరంపర సాగిపోతూ ఉంటే ఇరుపక్షాల నుంచీ అత్యాచారాలు జరుగుతున్నాయనీ, వాటి నుంచి ఎటువంటి నైతికతను వెలికి తీయడానికి వీలు లేకుండా పోతున్నదనీ, కనుక ఆ అత్యాచారాల మీద ఆధారపడి సాగే విశ్లేషణ అర్థరహితమైన కసరత్తు అనీ నేను అన్నాను. సాధారణ ప్రజలను ఎవరు చంపినా, మావోయిస్టులు చంపినా, ప్రభుత్వం చంపినా సమర్థించబోనని నేనన్నాను. అలాగే, ఆదివాసీ గ్రామాలలోకి వెళ్తున్నప్పుడు సిఆర్‌పిఎఫ్ జవానులు 27 ఎకె–47లు, 38 ఇన్సాస్ రైఫిళ్లు, 7 ఎస్.ఎల్.ఆర్.లు, 6 లైట్ మెషిన్ గన్‌లు, ఒక స్టెన్ గన్, ఒక రెండు అంగుళాల శతఘ్ని తీసుకుపోవలసిన అవసరం ఏమొచ్చిందని అడగడం ముఖ్యం అని నేనన్నాను. ఒకవేళ వాళ్లు యుద్ధానికి వెళ్లి ఉన్నట్టయితే సిఆర్‌పిఎఫ్ బలగాలను మావోయిస్టులు చంపడాన్ని ఖండించే వైపుగా మిమ్మల్ని ఎవరైనా నెడితే అది ప్రభుత్వం పక్షాన ఉండమని నెట్టినట్టే అని నేను అన్నాను. అసలు అటువంటి యుద్ధాన్నే అంగీకరించని వాళ్లం కొందరం ఉన్నామని అన్నాను.

ఇక మిగిలిన పిటిఐ వార్త అబద్ధాలతో, అర్థం లేని కలగలపుడుతో, అసలు సభలో ఏం జరిగిందో చెప్పకుండా చేసింది. మావోయిస్టుల గురించి నా అభిప్రాయాలు సుస్పష్టమే. నేను వాళ్ల గురించి ఎంతో రాశాను. ఆ సభలో నేనన్నది ఏమంటే ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ సంస్థలు సాగిస్తున్న భూ ఆక్రమణల పట్ల ప్రజల ప్రతిఘటన ఒక విశాల ఉద్యమాల క్షేత్రంలో సాగుతున్నదని, అందులో విభిన్న భావజాలాలు ఉన్నాయని, ఆ క్షేత్రపు ఒక క్రియాశీల కొసన మావోయిస్టులు ఉన్నారని మాత్రమే. కాని, ప్రభుత్వం ప్రతి ప్రతిఘటన ఉద్యమాన్ని, ప్రతి కార్యకర్తను

మావోయిస్టు అని ముద్ర వేస్తున్నది. కేవలం ఆ ప్రతిఘటనకారులను అణచివేయడానికి సైనిక పద్ధతిలో వ్యవహరించడానికి మాత్రమే. ఆ రకంగా మావోయిస్టు అనే మాటకు అర్థాన్ని ప్రభుత్వం చాలా విశాలం చేసిందని, తన మాటకు అంగీకరించని ప్రతివారిని, న్యాయం మాట్లాడడానికి సాహసించిన ప్రతివారిని ఆ పేరుతోనే పిలుస్తుందని నేనన్నాను. పూర్తిగా శాంతియుత నిరసనలు తెలుపుతున్న కళింగనగర్, జగత్సింగ్‌పూర్ ప్రజల ఉదాహరణలు నేను సభికుల దృష్టికి తెచ్చాను. వారు ఇవాళ ఒకరకమైన చక్రబంధంలో వందలాది సాయుధ పోలీసు బలగాల మధ్య లాఠీచార్జీలను ఎదుర్కొంటూ, తుపాకి కాల్పులను ఎదుర్కొంటూ శాంతియుత ఉద్యమం నడుపుతున్నారు. ఎక్కడైనా స్థానిక ప్రజలే ఎటువంటి ప్రతిఘటనా వ్యూహాన్ని అనుసరించాలని నిర్ణయించుకునే ముందు సుదీర్ఘ కాలం కష్టతరమైన ఆలోచన సాగిస్తారని నేనన్నాను. మారుమూల అడవి గ్రామాలలో నివసించే ప్రజలు గాంధేయ నిరసన రూపాలకు దిగడం ఎందుకు కష్టమవుతుందో కూడా నేను మాట్లాడాను. ఎందుకంటే, శాంతియుత సత్యాగ్రహం అనేది ఒకరకమైన రాజకీయ ప్రదర్శనా రూపం. అది విజయం సాధించాలంటే దాన్ని సానుభూతితో చూసే మూడో వ్యక్తులు ఉండాలి. అటవీ గ్రామాలలో అందుకు అవకాశం లేదు. అలాగే అప్పటికే కడుపు మాడిపోతున్న తిండిలేని ఆదివాసులు ఇంకా నిరహార దీక్షలు ఎలా చేయగలరని నేనడిగాను. 'అది సాయుధ ఉద్యమం కాక తప్పదు' అనే మాట కచ్చితంగా నేను అనలేదు. (అసలు ఆ మాటకు అర్థమేమిటో నాకు తెలియడం లేదు).

ఇంకాస్త ముందుకు వెళ్లి నేనన్నది ఏమంటే ఇవాళ దేశంలోని విభిన్న ప్రతిఘటన ఉద్యమాలు వాటి మధ్య ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ తామందరూ ఒకే ఉమ్మడి శత్రువు మీద పోరాడుతున్నామనే విషయాన్ని అర్థం చేసుకున్నాయి. అందువల్ల వాళ్లందరు రేఖకు ఒకవైపున ఉన్నారు. నేను ఆ వేపునే వాళ్లతోనే ఉన్నానని అన్నాను. అంతేకాదు, రేఖకు ఈవైపున ఉండి కూడా కేవలం ప్రభుత్వాన్ని మాత్రమే ప్రశ్నలు అడగకుండా మనను కూడా మనం కొన్ని ప్రశ్నలు అడుక్కోవలసి ఉందని నేనన్నాను. సరిగ్గా నేనన్నది ఏమంటే :

'మనందరమూ ఏ ప్రతిఘటనా శిబిరానికి చెందిన వాళ్లమో ఆ ప్రతిఘటనా శిబిరాన్ని కూడా కొన్ని ప్రశ్నలు వేయడం ఆసక్తికరంగా ఉంటుందని నాకనిపిస్తుంది. నేను ఆ శిబిరంలోనే ఉన్నాను. నాకు అందులో సందేహమే లేదు. నాకేమీ భయం లేదు. నన్ను అరెస్ట్ చేయండి. జైల్లో పెట్టండి. నేను రేఖకు ఈవైపునే ఉన్నాను. కాని, రేఖకు ఈవైపునే ఉండి, ఒకసారి వెనక్కి తిరిగి మన కామ్రేడ్స్‌నే అడగవలసిన ప్రశ్నలు ఉన్నాయి.'

ఆ తర్వాత నేనన్నది ఏమంటే గాంధేయ ప్రతిఘటనా పద్ధతులు విజయం సాధించడం లేదని రుజువవుతూనే ఉన్నప్పటికీ నర్మదా బచావ్ ఆందోళన లాంటి గాంధేయ ఉద్యమాలకు ఒక మౌలికమైన, విప్లవాత్మకమైన 'అభివృద్ధి' అవగాహన ఉంది. మరి మావోయిస్టు ప్రతిఘటనా పద్ధతులు విజయం సాధిస్తున్నప్పటికీ వాళ్లు ఎటువంటి 'అభివృద్ధి'ని కోరుకుంటున్నారో వాళ్లేమైనా ఆలోచించారా అని నేను ప్రశ్నించాను. ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేషన్‌లకు అమ్ముడుపోయిందని వాళ్లు చూపే వ్యతిరేకత సరైనదే. కాని, మావోయిస్టులకు గనుల పట్ల ఉన్న విధానం ప్రభుత్వ విధానం కన్న భిన్నమైనదేనా? వాళ్లు అధికారానికి వస్తే వాళ్ల శ్రేణులలో అత్యధిక ప్రజానీకం కోరుతున్నట్టుగా బాక్సైట్‌ను కొండలలోనే ఉండనిస్తారా, లేక వాళ్లు కూడా బాక్సైట్ గనులు తవ్విస్తారా? ఆ తర్వాత నేను పాబ్లో నెరూడా కవిత 'స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ' చదివి వినిపించాను. ఈ అభిప్రాయాల ఘర్షణ ఎంత పాతదో ఆ కవిత చెబుతుంది.

ఆ వార్త రాసిన పిటిఐ విలేకరి నా ఉపన్యాసం రికార్డ్ చేయడానికి అవసరం లేకపోయినా నిర్వాహకుల అనుమతి కోరారు. అందువల్ల తాను రాసిన వార్తా కథనం తన 'వ్యాఖ్యానం' అని తప్పించుకోవడానికి వీలు లేదు. అది ఉద్దేశ్యపూర్వకమైన, సంపూర్ణమైన అబద్ధం. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే, ఒకరోజు ఆలస్యంగా వచ్చిన పిటిఐ వార్తను ఎన్నో భాషలలోని ఎన్నో వార్తాపత్రికలు జూన్ 4న ప్రచురించాయి. టివి ఛానళ్లు ప్రసారం చేసాయి. ఆ పత్రికల, ఆ ఛానళ్ల సొంత విలేకరులు ఆ సభను అంతకు ముందురోజే ఉన్నది ఉన్నట్టుగానే రిపోర్ట్ చేశారు. కనుక ఈ వార్త కచ్చితంగా తప్పుడు వార్తని వాళ్లందరికీ తెలుసు. అయినా ఎకనమిక్ టైమ్స్ అంటుంది : "ప్రచార కండూతి గల అరుంధతి రాయ్ ఆంగ్‌సాన్ సూకీ కాదలుచుకుందా" అని. నాకు నిజంగా తెలుసుకోవాలని ఉంది. వార్తా పత్రికలు, టివి ఛానళ్లు ఒకే వార్తను రెండు సార్లు, ఒకసారి నిజంగా, ఒకసారి అబద్ధంగా ఎందుకు ప్రచారం చేస్తాయి?

అదే సాయంత్రం (జూన్ 4) దాదాపు ఏడు గంటల సమయంలో ఒక మోటర్ సైకిల్ మీద ఇద్దరు పురుషులు ఢిల్లీలో నా ఇంటి ముందుకు వచ్చారు. నా ఇంటి కిటికీ మీద గురి చూసి రాళ్లు విసిరారు. ఒకరాయి వీధిలో ఆడుకుంటున్న ఒక చిన్న పిల్లవాడికి తగిలింది. అది చూసిన చుట్టూ జనం గుమిగూడే సరికి ఆగంతకులు పారిపోయారు. కొన్ని నిమిషాల్లోనే అక్కడికి ఒక టాటా ఇండికా కారు వచ్చింది. అందులో ఉన్న మనిషి తనను తాను జీ-టివి రిపోర్టర్‌నని చెప్పుకున్నాడు. అరుంధతీరాయ్ ఇల్లు ఇదేనా, ఇక్కడ ఇప్పుడు ఏదో గొడవ అయిందటగా అని అడిగాడు. ఇదంతా ఒక నాటకం. గద్దలలాగా వాలే మన టివి ఛానళ్లకు 'ప్రజాగ్రహం' అనబడే నాటకాన్ని చిత్రీకరించే అవకాశం. నా అదృష్టం కొద్దీ ఆ సాయంత్రం వారి నాటకం అంతా అభాసు పాలయింది. అయితే అక్కడితో అయిపోలేదు. జూన్ 5న రాయ్‌పూర్‌లోని దైనిక్ భాస్కర్ పత్రిక ఒక వార్తను ప్రచురించింది. 'హిమ్మత్ హోతో ఎసి కమరా ఛోఢ్‌కర్ జంగల్ ఆయే అరుంధతి' (ధైర్యం ఉంటే అరుంధతి తన ఎయిర్ కండిషన్డ్ గది వదిలి అడవిలోకి రావాలి) అని శీర్షిక ఉన్న ఆ వార్తలో ఛత్తీస్‌ఘఢ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ విశ్వరంజన్ నాకు ఒక సవాలు విసిరాడు. అడవిలోని మావోయిస్టులతో చేరిపోయి నేను పోలీసులను ఎదుర్కోవాలట. ఒక్కసారి ఊహించండి. పోలీసు డిజిపి, నేను బాహాబాహీ కుస్తీ పట్టాలన్నమాట. ఇది సరిపోదన్నట్టు ఛత్తీస్‌ఘఢ్‌కు చెందిన ఒక భారతీయ జనతా పార్టీ నాయకురాలు పూనమ్ చతుర్వేది నన్ను, నా వంటి ఇతర దేశ ద్రోహులను ఒక చౌరస్తాలో బహిరంగంగా కాల్చి చంపాలనీ, మరణశిక్ష వేయాలనీ పత్రికలలో ప్రకటించింది. (ఇటువంటి ప్రత్యక్ష హింసాత్మక ప్రోద్బలం భారతీయ శిక్షా స్మృతి కింద నేరం అని ఆమెకు ఎవరైనా చెబితే బాగుండును!)

అసంఖ్యాకమైన అత్యాచారాలకూ, హత్యలకూ పాల్పడిన సల్వాజుడుం అనే హంతక 'ప్రజా' సైన్యం అధిపతి మహేంద్ర కర్మ నా మీద చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాకు వ్యతిరేకంగా ఛత్తీస్‌ఘఢ్‌లోని భాటాపాడా, తేలీబంధ అనే రెండు వేర్వేరు పోలీసు స్టేషన్‌లలో ఫిర్యాదులు దాఖలయ్యాయని జూన్ 8న హిందీ

భారత పాలకుల, వ్యాపారవేత్తల అవినీతి గురించి యూరప్‌లోని ప్రచార సాధనాలు చేస్తున్న వ్యాఖ్యలతో అవమాన పడి పాఠకులతో పంచుకుంటున్నారు **మోహన్ మూర్తి**

ఈ జాతి అచేతనంగా ఉందా?

కొద్ది రోజుల కింద జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో వాణిజ్య సంస్థల విలీనాలూ, స్వాధీనాల గురించిన ఒక చర్చా వేదికలో పాల్గొన్నాను. ఆ చర్చను యూరో ఫోరం, యూరప్‌లోని జర్మన్ భాషా పత్రికలలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హాండెల్స్ బ్లాట్ సంయుక్తంగా నిర్వహించాయి.

ఆ చర్చలో నాతోపాటు పాల్గొన్న వాళ్లు రెండు బడా కార్ల తయారీ కంపెనీలకు, రెండు పెద్ద ఇన్సూరెన్స్ కంపెనీలకు చెందిన సీనియర్ అధికారులు. ఆ కంపెనీలన్నీ భారతదేశంలో పనిచేస్తున్న జర్మన్ బహుళజాతి సంస్థలే.

ఆ చర్చను ఒక సుప్రసిద్ధ యూరపియన్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ నిర్వహించారు. ఆ సమావేశం జరిగిన గది నిండా వందకు పైన ప్రముఖ యూరపియన్ కంపెనీల సిఇఒలు ఉన్నారు. నేనొక్కడినే భారతీయుడిని.

చర్చ అయిపోయిన తర్వాత సభికుల ప్రశ్నలకు సమయం వచ్చింది. అప్పటిదాకా అది నాకు బ్రహ్మాండమైన అవకాశం దొరికిన సమయం అని అనుకుంటున్న వాడినల్లా ఆ ప్రశ్నలతో అది నన్ను సిగ్గుతో, అవమానంతో తలవంచుకునేలా చేసిన సమయం అనుకున్నాను. సభికులు నా మీదికి విస్తృతంగా ప్రశ్నలు సంధించారు. భారతదేశంలోని అవినీతి గురించి, లంచగొండితనం గురించి తమ అనుభవాలను ఏకరువు పెట్టారు.

మోమెంట్ ఆఫ్ ట్రూత్ (సత్యక్షణం) అనే ప్రసిద్ధమైన ఆంగ్లో అమెరికన్ ఆట ఒకటి ఉంటుంది. అక్కడ కూచున్న వాళ్లు ఏది ఏమైనా సత్యమే పలకవలసి ఉంటుంది. ఆ ప్రశ్నలు వింటున్నంతసేపు నేను అవమానంతో, గందరగోళంతో మోమెంట్ ఆఫ్ ట్రూత్‌నే తలచుకున్నాను. నేను ఒక్కొక్క ప్రశ్నకు సత్య ప్రమాణకంగా జవాబు చెపుతూ పోయిన కొద్దీ ఇంకా గట్టి ప్రశ్నలు వచ్చాయి. అంటే, ఇంకా అవమానపడే ప్రశ్నలు వచ్చాయి.

మీ దేశం అచేతనావస్థలో ఉందా? అనే ప్రశ్న దగ్గర నుంచి న్యాయవ్యవస్థలో లంచగొండితనం, ఒక న్యాయమూర్తిని వెనక్కి పిలిపించ గల అవకాశం, టెలికాం రంగంలో 2జి కుంభకోణం, ప్రపంచ వ్యాప్తంగా పన్నులు లేని అక్రమ నిల్వల కేంద్రాలలో పోగుపడిన భారతీయ ధనం దాకా అనేక ప్రశ్నలు వచ్చాయి.

లంచగొండితనం అనేది భారతదేశంలో అనేక దశాబ్దాలుగా ఉన్నప్పటికీ ఇటీవలి సంవత్సరాలలో మరింత విస్తృతంగా, సిగ్గు పడే విధంగా తయారయిందనేది ఒక వాస్తవం. ఈ అవినీతి పట్ల యూరపియన్‌ల అసంతృప్తికి సూచనగా ఆ ప్రశ్నలు, చర్చ జరిగాయి. ఆ ప్రశ్న – జవాబులు అయిపోయిన తర్వాత నాకనిపించింది ఏమంటే యూరపియన్‌ల దృష్టిలో భారతదేశం అనేది ఇప్పుడో, మరుక్షణమో కుప్పకూలిపోయే కొండ అంచున ఉన్నట్టు అనిపిస్తుందని.

దినపత్రిక నయీ దునియాలో వార్త వచ్చింది. 'మావోయిస్టులకు బహిరంగ మద్దతు ప్రకటించినందుకు ప్రైవేట్ వ్యక్తులు ఆ ఫిర్యాదు చేశారు.'

సైనిక పరిభాషలో మానసిక యుద్ధం అనే మాట ఉంది. ఇది అదేనా? లేదా ఇది ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు పట్నపు అవతారమా? ఈ పద్ధతిలో ఒక ప్రభుత్వ వార్తా సంస్థ తాము మూసేయదలచుకున్న వ్యక్తుల మీద ఒక వార్త రాసి, హోంమంత్రిత్వ శాఖకు దస్త్రం తయారు చేయడానికి సహాయ పడుతుందా? సాక్ష్యాలు దొరకక ఇబ్బంది పడుతున్న హోం మంత్రిత్వ శాఖకు వార్తా సంస్థ సాక్ష్యాధారాలు సంపాదించి పెడుతుందా? లేక మాలో ప్రముఖులైన కొందరిని ప్రజలు వీధుల్లో పట్టుకొని కొట్టి చంపడానికి పిటిఐ ఆధారాలు తయారు చేస్తుందా? తద్వారా ప్రభుత్వానికి మమ్మల్ని అరెస్ట్ చేసే, హతం చేసే పని తప్పించదలచుకుందా? లేక, ఇది కేవలం ఒక మొరటు పద్ధతి వర్గీకరణా? మాతో లేకపోతే వాళ్లతో ఉన్నట్టే, మావోయిస్టులతో ఉన్నట్టే అని హాస్యాస్పదమైన నిర్ధారణలు తీయడమా? ఉట్టి మావోయిస్టులుగా పిలవడం కూడా కాదు ఇది. మూర్ఖులైన, అహంకారులైన, ప్రచారం కోరుకునే మావోయిస్టులుగా ముద్ర కొట్టడం. ఇది ఏమైనా ఇది ప్రమాదకరమైన పని. సిగ్గుమాలిన పని. అయితే, కొత్తదేమీ కాదు. కాశ్మీరీలను ఎవరినైనా అడగండి. నిరాధారమైన పత్రికా వార్తలు తప్ప మరే ఆధారం లేకపోయినా 'టెర్రరిస్ట్' అనే ముద్ర పడిన ముస్లిం యువకులను ఎవరినైనా అడగండి. ఏ ఆధారం లేకపోయినా, 'సమాజపు సామూహిక భావనలను సంతృప్తి పరచడానికి' మరణశిక్ష విధించబడిన మహ్మద్ అఫ్జల్‌ను అడగండి.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ నా వంటి వ్యక్తుల తలుపు కూడా తట్టడం ఆరంభించింది గనుక, ఇప్పుడు నా అంత ప్రముఖులు కాని కార్యకర్తలకూ, రాజకీయ వాదులకూ ఏం జరుగుతున్నదో ఊహించండి. జైళ్లలో కుక్కబడిన, చిత్ర హింసలకు గురైన, చంపివేయబడిన వందలాది మందికి ఏం జరిగిందో ఊహించండి. ఈ జూన్ 26కు ఈ దేశంలో అత్యవసర పరిస్థితి విధించబడి 35 సంవత్సరాలు. బహుశా ఈ దేశం ఇంకా అత్యవసర పరిస్థితిలోనే ఉన్నదని భారత ప్రజానీకం ప్రకటించ వలసి ఉంది. అటువంటి ప్రకటన ప్రభుత్వం ఎట్లాగూ చేయదు. అయినా మళ్లీ ఆలోచిస్తే, అసలు భారత దేశంలో ఎమర్జెన్సీ ఎత్తివేయబడిందా? అప్పుడు ఎమర్జెన్సీలో సెన్సార్‌షిప్ ఒక సమస్య. ఇప్పుడు అది ఒక్కటే సమస్య కాదు. అంతకన్నా ముఖ్యమైన సమస్య వార్తల తయారీ.

(రచయిత సామాజిక కార్యకర్త)

నాకు ఏర్పడిన ఈ అభిప్రాయాన్ని ఇటీవలి కాలంలో యూరపియన్ ప్రచార మాధ్యమాలలో వచ్చిన కొన్ని అభిప్రాయాలతో కలిపి చూపుతాను.

జర్మనీలో ఎక్కువ మంది చూసే సమయంలో సాగిన ఒక టెలివిజన్ చర్చలో పాల్గొంటున్న వ్యాఖ్యాత, జర్మన్ పార్లమెంట్ సభ్యుడు ఒక మాట అన్నాడు. అది కూడా ఒక బ్లాగ్‌ను ఉటంకిస్తూ : 'గత అయిదు సంవత్సరాలలో భారతదేశంలో జరిగిన కుంభకోణాల మొత్తాన్నంతా కూడితే అది బ్రిటిష్ వలసవాదులు భారతదేశంలో 200 సంవత్సరాలకు పైగా దోచుకుపోయిన దానితో పోటీ పడుతుంది. ఎక్కువే అవుతుంది. బ్రిటిష్ వాళ్లు దోచుకుపోయింది లక్ష కోట్ల డాలర్లు (యాభై లక్షల కోట్ల రూపాయలు).'

ఇక భారతదేశం గురించి సంపాదకీయం రాసిన ఒక జర్మన్ వాణిజ్య పత్రిక ఏమన్నదో వినండి : 'భారతదేశం ఆర్థిక సూపర్ పవర్ కావడం మాట ఏమో కానీ, విదేశీయులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించ గలిగిన బనానా రిపబ్లిక్ అవుతోంది. బడ్జెట్ కోత తీర్మానాన్ని తప్పించడానికి రాజకీయ పక్షాలకు హామీలివ్వడం జరిగింది. ప్రత్యేక హోదా కల్పిస్తామని హామీలివ్వడం జరిగింది. ఇదంతా ప్రజల సొమ్మును కొల్లగొట్టే వ్యవహారం. భారతదేశంలో కెల్లా అతి ఎక్కువ జనసాంద్రత కలిగిన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన మాయావతి బడ్జెట్ కోత తీర్మానం సమయంలో మౌనంగా ఉండిపోయేందుకు ఆమె మీద జరగవలసిన ఒక నిఘా సంస్థ విచారణను రద్దు చేయడం జరిగింది. మరొక మాజీ ముఖ్యమంత్రి మీద ఉన్న కోట్లాది రూపాయల పశువుల దాణా కుంభకోణాన్ని పక్కన పెట్టడం జరిగింది. ఇటువంటి అసాధారణమైన, పోలికేలేని లూటీకి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అగ్రాసనాధిపత్యం వహిస్తున్నారు.'

ఒక ఫ్రెంచ్ వార్తా పత్రికలో వచ్చిన ఒక వ్యాసం శీర్షిక 'ఆట ఆడడం ఎలా, భారతీయ పద్ధతి'. 'భారత క్రికెట్ జట్టు మునిగి ఉన్న అక్రమ ఆర్థిక లావాదేవీల గురించి విచారణలు జరగగా, స్విట్జర్లాండ్, వర్జిన్ ఐలాండ్స్, మారిషస్, సైప్రస్ వంటి పన్నులేని స్వర్గాలలో లెక్కలేనన్ని లావాదేవీలు జరిగాయని బయటపడింది' అని ఆ వ్యాసం రాసింది. అదే వ్యాసంలో పూనాకు చెందిన హసన్ అలీ అనే ఒక వ్యక్తి పేరు ప్రస్తావించి ఆయనా, ఆయన భార్యా కలిసి ఒక అక్రమ స్విస్ ఖాతాలో 'భారత పాలకుల అనుమతితోనే' వంద కోట్ల డాలర్ల సొమ్ము ఉంచుకున్నారని రాసింది.

ఆ వ్యాసంలోనే ఇంకో కథ కూడా ప్రస్తావించారు. అది జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా గురించి. ఆయనకు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో అక్రమ నిధుల కేంద్రాలలో డబ్బులున్నాయనీ, వాటితో ఆయన లైబీరియాలో గనులు కొన్నాడనీ వ్యాసంలో రాశారు. 'దురదృష్టవశాత్తు ఆయన మీద విచారణ జరుగుతుందో లేదో, ఏ స్థాయిలో ఉందో భారత ప్రజానీకానికి తెలియదు' అని ఆ వ్యాసం ముగించింది.

ఒక ఆస్ట్రియన్ వార్తాపత్రికలో 'భారత చరిత్రలోకెల్లా అతి నీచమైన వ్యాపార కుంభకోణం సత్యం కంప్యూటర్స్. దానిలో ఆ కుంభకోణానికి సంబంధించిన రాజకీయ అంశాలను ప్రభుత్వమే బయట పడకుండా తొక్కిపట్టింది. అవన్నీ ప్రధానంగా రియల్ ఎస్టేట్‌కు సంబంధించినవి' అని రాసింది. 'ఈ కుంభకోణాల గురించి గనక భారత ప్రధానమంత్రికి ఏమీ తెలియదని అనుకుంటే తన దేశంలో వాస్తవంగా ఏం జరుగుతున్నదో ఆయనకు తెలియదన్నమాట. అంటే, ఆయన ప్రధానమంత్రిగా ఉండడానికి అనర్హుడన్నమాట. ఒకవేళ ఆయనకు తెలిసే ఇవన్నీ జరుగుతూ ఉంటే, ఈ నేరంలో ఆయన కూడా భాగస్తుడే అనుకోవాలా?' అని కూడా ఆ పత్రిక రాసింది.

2జి కుంభకోణం గురించి రాస్తూ బ్రిటన్ కు చెందిన టెలిగ్రాఫ్ 'సహజంగానే భారత దేశంలోని అనంతమైన న్యాయవ్యవస్థా చిక్కుముడులలో పడి నేరస్తులు ఎవరో కనిపెట్టడం చాలా ఆలస్యం అయిపోతుంది' అని రాసింది.

ఇదంతా నిజమే. మామూలుగానే యూరపియన్‌ల మనసులో ఒక సగటు భారతీయుడు అంటే ఒక వ్యంగ్య చిత్రం ఉంటుంది. వక్రీకరించడం, అబద్ధాలు చెప్పడం, మోసం చేయడం, నిజాయితీ లేకుండా ఉండడం, లంచగొండి కావడం, అహంకారంతో ఉండడం, గొప్పలు చెప్పుకోవడం, బహిరంగ ప్రదేశాలలో, ప్రయాణాలలో బిగ్గరగా మాట్లాడుతూ ఇతరులను వేధించడం, ఏమాత్రం చిన్న అవకాశం వచ్చినా డబ్బులు నొక్కేయడానికి ప్రయత్నించడం, ఇతరుల గురించి వదంతులు ప్రచారం చేయడం – ఇవన్నీ భారతీయ అలవాట్లని యూరపియన్‌లు అనుకుంటారు. నిజానికి ఈ జాబితాకు అంతం లేదు.

మా నాన్న 81 సంవత్సరాల వృద్ధుడు. ఇవన్నీ చూసి నిరాశ పడి, దిగ్భ్రాంతి చెంది అసంతృప్తితో ఇటీవల ఒక మాట అన్నాడు. మన దేశం తన జాతీయ చిహ్నంలో నుంచి సత్యమేవ జయతే మాట తీసేసి అసత్యమేవ జయతే పెట్టుకుంటే బాగుంటుందని!

భారతీయ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు ఇటీవల సంపాదించిన ఈ నడమంత్రపు సిరితో, అక్రమ సంపదతో మోసపూరితంగా, ఆనందంగా జీవిస్తూ, వాస్తవం నుంచి దూరం అయిపోయారని యూరపియన్‌లు అనుకుంటున్నారు. ఈ స్థితిలో ఈ ధనవంతులు ఏదో ఒకరోజు వస్తుందనీ, అది త్వరగా కాకపోతే ఆలస్యంగానైనా వస్తుందనీ, ఆ రోజున ఈ దేశపు పేదలు వీధుల్లోకి వస్తారనీ గుర్తించలేకుండా ఉన్నారు.

ఒక రకంగా చెప్పాలంటే ఆ పని మొదలైనట్టే కూడా ఉన్నది. మావోయిస్టులు సాగిస్తున్న రాక్షసమైన, భయంకరమైన పనులలో అదే కనబడుతోంది. అది నిజంగా జరిగిన నాడు, వీధులలో ప్రజల చేత తరిమికొట్టబడి చర్మం వొలిపించుకోకుండా ఒక్క రాజకీయ వాది కూడా తప్పించుకోలేడు.

అటువంటి తిరుగుబాట్లకు దప్పుల చప్పుళ్లు రోజురోజుకు మరింత బిగ్గరగా వినబడుతున్నాయి. ప్రజల గొంతులను వినడానికి మన రాజకీయ నాయకులు నిరాకరించినంత కాలం ఈ యుద్ధారావాలు మరింత పెరుగుతాయి. అంతిమంగా అదంతా ఒక విప్లవంగా మారి యావత్ భారతదేశాన్ని చుట్టుముడుతుందని నాకు భయంగా ఉంది.

బహుశా ఈ మన దురదృష్టానికి నిర్మాతలం మనమేనేమో. సబ్ చల్తా హై అనే మన వైఖరే మన రాజకీయ నాయకులూ, వ్యాపారవేత్తలూ శిక్షలు పడకుండా ఇన్ని ఘోరాలు చేయడానికి వీలు కల్పించిందేమో. ప్రాచీన ఏసోపు కథల్లో చెప్పినట్టు 'మనం చిల్లర దొంగలనేమో ఉరి తీస్తాం. బందిపోట్లనేమో అధికార స్థానాలలో కూచోబెడతాం.'

(రచయిత ఈ దేశంలోని బడా పారిశ్రామిక, వాణిజ్య వేత్తల సంస్థ కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ)కి యూరప్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం జర్మనీలోని కొలోన్‌లో నివసిస్తున్నారు.) వీ

మద్యపానాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వ విధానాన్ని మంచి చెడుల దృష్టితో మాత్రమే కాక, రాజకీయ, ఆర్థిక పర్యవసానాల దృష్టితో పరిశీలించాలంటున్నారు ఎడ్ల పోచయ్య

జనం తాగితేనే ప్రభువులకు భద్రత

రాష్ట్రంలో రానున్న రెండు సంవత్సరాలలో మద్యం దుకాణాలు ఎవరు నడపాలో తేల్చడానికి ఈ జూన్ రెండోవారంలో వేలం పాటలు జరిగాయి. అనుమతి పొందిన 6,894 మద్యం దుకాణాలలో, 800 బార్లలో మద్యం అమ్మకాలు సాగించే హక్కు ఎవరిదో నిర్ణయించడానికి రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ వేలం పాటలు నిర్వహిస్తుంది. ప్రతిసారీ వేలం పాటలు జరిగేటప్పుడు ప్రభుత్వమే గత వేలం పాట కన్న 15 శాతం పెంచి లైసెన్స్ ఫీజు నిర్ణయిస్తుంది. అంటే పాటలో నెగ్గాలంటే అంతకన్న ఎక్కువ చెల్లించడానికి సిద్ధపడాలన్న మాట. మరోమాటల్లో చెప్పాలంటే గత సంవత్సరం కన్న ఈ సంవత్సరం కనీసం 15 శాతం ఎక్కువ మందిచేత, లేదా పాతవారితోనే 15 శాతం ఎక్కువ మద్యాన్ని తాగిస్తామని దుకాణదారులు ప్రభుత్వానికి హామీ ఇవ్వాలన్నమాట.

ఇక్కడ ఇంకొక కిటుకు కూడ ఉంది. రాష్ట్రంలోని మద్యం దుకాణాల సంఖ్య, బార్ల సంఖ్య పేరుకే ఇంత గాని, ప్రతి లైసెన్స్ దుకాణదారు తన చుట్టుపట్ల గ్రామాలలో, బస్తీలలో అనుమతి లేని దుకాణాలు కూడ నడుపుతారు. వాటిని ముద్దుగా బెల్ట్ షాపులు అని పిలుస్తారు. రాష్ట్రం మొత్తం మీద ఒక లక్ష పైనే బెల్టు షాపులు ఉండవచ్చునని అనధికారిక అంచనా. ప్రభుత్వం దృష్టిలో మాత్రం బెల్ట్ షాపు అనేదే లేదు. అందువల్ల రాష్ట్రంలో 27 వేల పైచిలుకు గ్రామాలు ఉండగా అందులో ఐదో వంతు మాత్రమే లైసెన్స్ దుకాణాలు ఉన్నాయి. ఇక పెద్ద గ్రామాలలో, పట్టణాలలో బార్లు గాని, బార్ల లాంటివి గాని వేలాదిగా ఉండగా ప్రభుత్వ లెక్కలో అవి 800 మాత్రమే ఉన్నాయి.

ఈ జూన్ రెండో వారంలో జరిగిన ఆ వేలం ప్రక్రియలో అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు తమ కుటుంబ సభ్యుల పేరుతోనో, బేనామీగానో పాల్గొన్నారు. దాదాపు అన్నిచోట్ల దౌర్జన్యాలు, అక్రమాలు జరిగాయి. మొత్తం మీద లైసెన్స్ ఫీజు ద్వారా ప్రభుత్వానికి రు. 6,917 కోట్లు ఆదాయం వచ్చింది. ఇంతకు ముందరి 2008-10 కాలానికి ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రు. 3,183 కోట్లతో పోలిస్తే ఇది రెట్టింపు కన్న ఎక్కువ. ఈ లైసెన్స్ ఫీజు కాక ప్రభుత్వానికి ఎక్సైజ్ సుంకం, అమ్మకపు పన్ను, వ్యాట్, ఇతర పన్నుల రూపంలో మరికొంత ఆదాయం కూడ ఉంటుంది. ఇదంతా మద్యం అమ్మకం, తాగడం జరిగిన తర్వాత సంగతి. కాని ప్రభుత్వం ఈ వేలం పాటలు జరగడానికి మూడు నెలలు ముందుగానే, 2010-11 బడ్జెట్లోనే ఎక్సైజ్ ఆదాయం రు. 7,512 కోట్లు (అంతకు ముందరి సంవత్సరం కన్న రు. 1,300 కోట్లు ఎక్కువ) వస్తుందని అంచనా వేసేసింది! అప్పటికింకా లైసెన్స్ ఫీజు ఇంత ఎక్కువగా వస్తుందని కూడ తెలియదు. అంటే మన ఆర్థిక మంత్రిత్వ శాఖ చాల దూరదృష్టితో, రానున్న రోజులలో మన ప్రజలు ఎంత మద్యం తాగుతారో (లేదా తాగాలని తాను ఆశిస్తున్నదో) జ్యోతిష్యం చెప్పిందన్నమాట!

ఇప్పుడు వేలంలో వచ్చిన లైసెన్స్ ఫీజు రెండు సంవత్సరాలకి రు. 6,917 కోట్లు అంటే సంవత్సరానికి రు. 3,458 కోట్లు. బడ్జెట్ అంచనా నిజం కావాలంటే మరొక రు. 4,000 కోట్ల రూపాయలు మద్యం అమ్మకాల మీద పన్ను రూపంలో, ఎక్సైజ్ సుంకం రూపంలో వస్తే సరిపోతుంది. ప్రభుత్వానికే ఇంత రావాలంటే, ఉత్పత్తి వ్యయం, రవాణా ఖర్చులు, మూడు నాలుగు దశలలో వ్యాపార లాభాలు అన్నీ కలిపితే ఇంతకు నాలుగైదు రెట్ల మద్యం అమ్మకాలు జరగవలసి ఉంటుంది. ఇదంతా కలిపితే ఈ సంవత్సరం మద్యం అమ్మకాలు కనీసం రు. 15,000 కోట్ల పైనే జరుగుతాయని అంచనా వేస్తున్నారు.

ఇదంతా మనకెందుకు, 'తాగినోడు కడతాడు తాళ్లపన్ను' అని సామెత ఉందిగా అనుకోవచ్చు. ఆ సామెత పుట్టినప్పుడు ఏ అర్థంలో పుట్టిందో గాని, ఇప్పుడు మాత్రం దాని అర్థం మార్చుకోవలసి ఉంది. జనాన్ని తాగించి మన ప్రభుత్వాలు, అధికారులు వసూలు చేస్తున్న పన్నుల గురించీ, తాగడం మీద పెడుతున్న శ్రద్ధ గురించీ, ఆ పన్నుల ఆదాయాన్ని ఖర్చు పెడుతున్న తీరు గురించీ ఆలోచిస్తే అసలు మనం ఒక ఆధునిక నాగరిక రాజ్యంలోనే ఉన్నామా అని అనుమానం వస్తుంది. పైగా ఈ మద్యం ఆదాయాలు లేకపోతే ప్రజా సంక్షేమ చర్యలు తీసుకోవడం తమకు సాధ్యం కాదనీ, మద్యం అమ్మకాల ఆదాయం మీదనే ప్రభుత్వం నడుస్తున్నదనీ రాజకీయ నాయకులు, అధికారులు తరచు అంటుంటారు.

'తాగినోడు కడతాడు తాళ్ల పన్ను' అన్నప్పుడు తాగడం అనేది వదులుకోవలసిన వ్యసనమనీ, ఆ వ్యసనం ఉన్నవాళ్లు సొంత బాధ్యత మీదనే అందులోకి దిగుతారనీ, అందుకు శిక్షగా తాళ్ల పన్ను కడతారనీ అర్థం ఉంది. కాని ఇప్పుడు తాగినోడు ప్రత్యేకంగా లేడు. ప్రతివాడూ తాగాలని ప్రభుత్వమే కోరుకుంటున్నది. తాగే అలవాటు లేకపోతే ఎట్లాగైనా ఆ అలవాటు చేయించాలని, అందుకోసం అధికార వ్యవస్థలను తయారుచేశారు. ఏడాదికేడాదికీ తాగేవారి సంఖ్య, తాగే మద్యం పరిణామం పెరగాలని ప్రభుత్వమే లక్ష్యాలు నిర్ణయిస్తున్నది. తాగే అలవాటును వ్యసనంగా మార్చి, ఎంత ఎక్కువ తాగితే అంత మంచిది అనే విలువను ప్రభుత్వమే ప్రచారం చేస్తున్నది. అలా తాగితే వచ్చే ఆదాయమే సంక్షేమ చర్యలకు ఆధారమని, మద్యపానానికి సమర్థనలు పలుకుతున్నది.

ఇక పన్ను కట్టడం విషయానికొస్తే, నేరుగా పన్ను కట్టేది తాగినోడు మాత్రమే కావచ్చు గాని, పరోక్షంగా ఆ కుటుంబాల ఆదాయమంతా ఈ అడుగులేని ముంతలోకి జారిపోతున్నది. ఆ కుటుంబాల ఆహార, విద్యా, ఆరోగ్య అవసరాలు కూడ పణంగా పెట్టి తాగుడు పన్ను కట్టవలసి వస్తున్నది. సంపాదించినది సరిపోక అప్పులు చేసి భవిష్యత్తును కూడ తాకట్టు పెట్ట వలసి వస్తున్నది. అంటే తాగినవాడు మాత్రమే కాదు, తాగినవాడి భార్యా బిడ్డలు, తర్వాతి తరాలు, సమాజం కూడ ఆ తాళ్ల పన్ను కట్టవలసి వస్తున్నది.

ఇంతకూ తాళ్ల పన్ను కట్టినా కొంత మేలే. తాళ్లు పెరిగితే అడవి అయినా పెరుగుతుంది. తాటిచెట్టు అనేక విధాల ఉపయోగపడుతుంది. కాని ఇప్పుడు తాటిచెట్లు కూడ లేవు. చెరకును చక్కెరగా, బెల్లంగా మార్చిన తర్వాత మిగిలిపోయే మురుగువాసన పిప్పి మొలాసిస్‌లో మత్తు పదార్థాలు కలిపి వండిన సారాను ఇవాళ వ్యసనంగా మప్పుతున్నారు. లేదా వరి, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారుచేసిన ఆల్కహాల్‌ను అమ్ముతున్నారు. మనిషిని తన చేతిలో తాను లేకుండా చేయడం, మద్యానికి బానిసను చేయడం, ఆ మత్తులో సమాజం గురించి ఆలోచించకుండా చేయడం, ఇతర అసాంఘిక పనులు చేయడానికి పురికొల్పడం వంటి వ్యక్తిగత బలహీనతలను పెంచడం ఒక ఎత్తయితే, ఈ వ్యసనం ఆధారంగా వేల కోట్ల రూపాయలు సంపాదించడం, ఒక తరం మొత్తాన్ని బలహీనపరచి, మత్తులో ముంచి, తమకు ఎదురు లేకుండా చేసుకోవాలనుకునే పాలకుల కుట్ర మరొక ఎత్తు.

మద్యపానం వ్యసనమా, చెడు అలవాటా, దానివల్ల మనిషి దిగజారుతాడా, కుటుంబ జీవితం భగ్నమవుతున్నదా, కుటుంబ సభ్యుల ఆరోగ్య, విద్యా అవసరాలు దెబ్బ తింటున్నాయా అనే ప్రశ్నలు ముఖ్యమైనవే గాని వాటికన్న ముఖ్యమైన ప్రశ్నలు మరికొన్ని ఉన్నాయి. అవి పాలకులను, ప్రభుత్వాన్ని, ఈ అక్రమ వ్యాపారంలో కోట్ల రూపాయలు గడిస్తున్నవారిని, మొత్తంగా ఈ వ్యసనం వల్ల యథాతథంగా కొనసాగగలుగుతున్న వ్యవస్థను అడగవలసిన ప్రశ్నలు. అందుకే మద్యం వ్యవహారంలోని రాజకీయ, ఆర్థిక విషయాలను కొంచెం లోతుగా పరిశీలించాలి.

అసలు జనం ఇంకా ఇంకా ఎక్కువ మద్యం తాగాలని ప్రభుత్వాలు ఎందుకు అనుకుంటున్నాయి?

ప్రభుత్వాలు ఎప్పుడైనా ప్రజలు కట్టే పన్నులమీదనే ఆధార పడతాయి. ప్రజలు వాడుకునే వస్తువుల మీద, ఆహార పదార్థాల మీద, వాహనాల మీద, ఆస్తుల మీద, ఆదాయాల మీద ఇలా ఎన్నో పన్నులు విధించడం కనీసం మనకు తెలిసి కౌటిల్యుడి అర్థశాస్త్రం రోజులనుంచీ అమలులో ఉంది. గతంలో జుట్టు పెంచుకుంటే పన్ను, పెంచుకోకపోతే పన్ను ఉండేవని చరిత్రలో చదువుకున్నాం. ఆధునిక యుగానికి వచ్చేసరికి ప్రభుత్వాలకి ఇతర ఆదాయ మార్గాలు కూడ వచ్చాయి. ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి వాటిద్వారా వచ్చే ఆదాయాలు, భూమి మీద, సహజ వనరుల మీద అధికారం ప్రభుత్వానిదే కాబట్టి వాటిని వినియోగించుకునేవారి మీద వేసే సుంకాలు, ఎగుమతి దిగుమతుల మీద సుంకాలు, వ్యాపారాల మీద, ఆర్థిక లావాదేవీల మీద పన్నులు, ఆదాయాల మీద పన్నులు వగైరా అనేక మార్గాలలో ప్రభుత్వ ఆదాయాలు ఉంటాయి. అలాగే ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చి ప్రభుత్వం దగ్గర మిగిలిపోయే డబ్బును కావలసిన వారికి రుణాలు ఇస్తే వచ్చే వడ్డీ ఆదాయం కూడ ఉంటుంది. పన్నుల విధానం ప్రజాస్వామికంగా, హేతుబద్ధంగా, చెల్లింపుదారులకు భారం కాకుండా ఎలా ఉండవచ్చునని చాల అధ్యయనాలు జరిగాయి. ప్రగతిశీల పన్నుల విధానం ఎలా ఉండవచ్చునో కనీసం వంద సంవత్సరాలుగా జరుగుతున్న ప్రయోగాలు ఉన్నాయి.

మన ప్రభుత్వాలకు, అధికార యంత్రాంగానికి అటువంటి ప్రగతిశీల పన్నుల విధానాలు తెలియక కాదు. కాని సంపద పునఃపంపిణీ చేయడానికి సంపన్నులమీద తక్కువ పన్నులు, పేద, మధ్యతరగతి వారికి ఎక్కువ పన్నులు వేయడం ఒక మార్గంగా మన ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

భూమి మీద, సహజవనరుల వినియోగాల మీద పన్ను వేయాలంటే భూస్వాముల మీద, గని యజమానుల మీద, పారిశ్రామిక వేత్తల మీద చాల పన్నులు వేయవలసి ఉంటుంది. కాని ఆ వర్గాల వారో, వారి ప్రతినిధులో శాసనకర్తలుగా ఉన్నారు గనుక, వారు తమ ఆదాయం మీద తాము ఎక్కువ పన్నులు విధించుకోవడంలేదు. అలాగే ఆయా పారిశ్రామిక, వ్యాపార రంగాల యజమానులు ప్రభుత్వాధికారం లో ఉన్నవాళ్లను నయానో భయానో లొంగదీసి తమ మీద ఎక్కువ పన్నులు విధించకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇక ప్రభుత్వం తన పన్ను ఆదాయాన్ని పెంచుకోవడానికి సాధారణ ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేయడం కన్న మరొక మార్గం లేదని నమ్ముతోంది. అందుకే అన్ని సరుకుల మీద పరోక్ష పన్నులు విధిస్తోంది. మధ్యతరగతి ఆదాయ వర్గాల మీద ప్రత్యక్ష ఆదాయ పన్ను వేస్తోంది. ఇక కింది, మధ్యతరగతి ప్రజల బలహీనతలను, వ్యసనాలను రెచ్చగొట్టి ఆ సరుకుల మీద ఎక్కువ ఆదాయం లాగడానికి ప్రయత్నిస్తోంది. అందువల్లనే జనానికి మద్యపాన వ్యసనాన్ని మప్పి ఆ మద్యం మీద పన్నులు విధిస్తే ఎక్కువ దండుకోవచ్చునని అనుకుంటోంది.

జాతీయోద్యమ కాలంలో 'స్వాతంత్ర్యోద్యమాన్నయినా వాయిదా వేస్తాను గాని, మద్యపాన వ్యతిరేక ఉద్యమాన్ని వాయిదా వేయను' అని గాంధీ అన్నాడు. మద్యపాన వ్యతిరేకోద్యమం జాతీయోద్యమ విలువల్లో భాగంగా నడిచింది. అప్పటి ప్రభుత్వాదాయ వనరులలో ప్రధానమైనదిగా ఎక్సైజ్ ఆదాయం ఉండడం వల్ల మద్యపాన వ్యతిరేకత ప్రభుత్వ వ్యతిరేకతకు చిహ్నంగా కూడ ఉండింది. బ్రిటిష్ ఇండియాలో మాత్రమే కాక, హైదరాబాద్ రాజ్యంలో కూడ అదేవిధంగా తాటిచెట్లను నరికే ఉద్యమం, గీసేవాడిదే చెట్టు అనే రూపంలో ప్రభుత్వానికి పన్ను కట్టబోమనే ఉద్యమం నడిచాయి.

అధికార మార్పిడి తర్వాత మద్రాసు రాష్ట్రంలోని నెల్లూరు, గుంటూరు జిల్లాలలో 1948లో మద్యనిషేధం ప్రారంభించి, ఆ తర్వాత దాన్ని రాయలసీమకు కూడ విస్తరించారు. 1952లో దాన్ని మొత్తం ఆంధ్ర ప్రాంతంలో అమలు చేశారు. 1956లో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడినతర్వాత కూడ తెలంగాణలో మాత్రం అటువంటి మద్య నిషేధం అమల్లోకి రాలేదు. 1969లో ఆంధ్ర ప్రాంతంలో కూడ మద్యనిషేధాన్ని ఎత్తివేసి సారా, దేశవాళీ మద్యం అమ్మకాలను అనుమతించడం మొదలుపెట్టారు. 1986లో తెలుగుదేశం ప్రభుత్వం మద్యం అమ్మకాలను నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అనే ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేసి, మద్యం అమ్మకాలు ప్రభుత్వమే నడపడం మొదలుపెట్టింది. మద్య వ్యతిరేక ఉద్యమం పెద్ద ఎత్తున సాగిన తర్వాత అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1993 ఏప్రిల్ లో నెల్లూరు జిల్లాలో, అక్టోబర్ నుంచి మొత్తం రాష్ట్రంలో సారా అమ్మకాలపై మాత్రం నిషేధం విధించింది. దేశవాళీ మద్యం (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ - ఐ ఎం ఎఫ్ ఎల్ అనే పేరుతో ప్రచారంలో ఉన్న ఖరీదయిన మద్యం) అమ్మకాలు సాగనిచ్చారు.

ఆ తర్వాత ఎన్నికలలో మద్యనిషేధ వాగ్దానంతోనే అధికారానికి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం 1995 జనవరి 16 నుంచి మొత్తం రాష్ట్రంలో మద్యనిషేధం విధించింది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత 1997లో ఈ నిషేధాన్ని ఎత్తివేశారు. ఇక అప్పటినుంచీ ఏడాదికేడాదికీ ప్రభుత్వమే మద్యం అమ్మకాల లక్ష్యాలు నిర్ణయించి, ప్రోత్సహిస్తూ వస్తోంది. ఈ మద్యం అమ్మకాల ప్రోత్సాహంలో తెలుగుదేశం పార్టీకీ, కాంగ్రెస్ పార్టీకీ ఏమీ తేడాలేదు.

ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఎక్సైజ్ ఆదాయ 2001-02లో రు. 1,651.90 కోట్లు, 2002-03లో రు. 1,856.46 కోట్లు, 2003-04లో రు. 1,914.98 కోట్లు, 2004-05లో రు. 2,092.67 కోట్లు, 2005-06లో రు. 2,684.57 కోట్లు, 2006-07లో రు. 3,436.63 కోట్లు, 2007-08లో రు. 4,040.69 కోట్లు, 2008-09లో రు. 5,752.61 కోట్లు, 2009-10లో రు. 6,260.00 కోట్లు ఉండగా, 2010-11లో రు. 7,512.00 కోట్లుగా అంచనా వేస్తున్నారు. ఈ పది సంవత్సరాలలో కూడ బడ్జెట్ అంచనాల కన్న సవరించిన అంచనాలు, వాటి కన్న వాస్తవ ఆదాయం కనీసం 10 శాతం కన్న ఎక్కువే ఉంది. (బడ్జెట్ లో ఎప్పుడయినా మూడు

రాష్ట్రంలో దర్శనీయ స్థలాలు ఎన్నో ఉండగా, ప్రజలలో పర్యాటక ఆసక్తి పెరుగుతుండగా, ప్రభుత్వం మాత్రం పర్యాటక రంగంలో తప్పుడు విధానాలను అమలు చేస్తోందంటున్నారు **ఎస్. సరళా వందనం**

పర్యాటక రంగం సవ్యంగానే ఉందా?

ఆది మానవుడు తనకు కావలసిన ఆహారం కోసం ముందుగా నడక మొదలుపెట్టాడు. తరువాత నీళ్లున్న ప్రదేశాలలో, ఆహారం దొరికే చోట్ల ముందుగా నివాసం ఏర్పరచుకున్నాడు. ఆ తరువాత తన నడకను జ్ఞానం సంపాదించడం కోసం మొదలు పెట్టి, చివరికి ఒకే భాష, ఒకే సంస్కృతి ఉన్న వాళ్లు ఒకే చోట కలిసి ఉండడం జరిగింది. ఇదే నేపథ్యంలో ఆదిమ మానవుడు ముందుగా ప్రకృతి బీభత్సానికి భయపడి తనకు కనపడని శక్తిని దైవంగా ఎలా నమ్ముకున్నాడో, ఇప్పటికి కూడా తను కొనసాగించే జీవితంపై ఒక నమ్మకాన్ని దైవం వలన పొంది, ఆ నమ్మకం దెబ్బ తినకుండా తరచుగా తనకు విశ్వాసం ఉన్న దైవం దగ్గరకు వెళ్లి పూజలు చెయ్యడం, తిరిగి నూతన ఉత్తేజం పొందడం కొన్ని వేల సంవత్సరాల నుండి ఇప్పటికీ కూడా జరుగుతోంది.

దేశం మొత్తం మీద ప్రజలు తమ మత విశ్వాసాలకనుగుణంగా దేవాలయాలను, దర్గాలను, క్రైస్తవ ప్రార్థనా మందిరాలను, జైన ఆలయాలను, గురుద్వారాలను, బౌద్ధ క్షేత్రాలను తరచుగా సందర్శిస్తుంటారు. సామాన్య ప్రజలు ఎక్కువ సంఖ్యలో పుణ్యక్షేత్రాలకు – ఆయా సమయాలలో జరిగే జాతరలు, పుష్కరాలు, మత సంబంధమైన ఉత్సవాలు, కుంభమేళాలు, పండుగలకు లక్షల సంఖ్యలో హాజరవు తుంటారు. మన రాష్ట్ర పర్యాటనకు వచ్చే వారు కూడా ఇందుకు వ్యతిరేకం కాదు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 12.9 కోట్ల దేశీయ పర్యాటకులు పోయిన సంవత్సరం వస్తే, వీరిలో 90 శాతం కేవలం భక్తికి సంబంధించిన పర్యాటక స్థలాలు, వాటి చుట్టు పక్కల ప్రదేశాలను మాత్రమే దర్శిస్తున్నారని తేలింది. వీరిలో కూడ 80 శాతం మంది తిరుపతిని దర్శించారని, మిగిలిన పర్యాటకులు హైదరాబాద్, విశాఖ, విజయవాడ వాటి చుట్టు పక్కల ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, సముద్ర తీరాలు చూస్తున్నారని తేలింది. ఇలా సామాన్య, మధ్యతరగతి ప్రజలలో ఇప్పటికీ మత విశ్వాసాలకనుగుణంగా పర్యాటకం బలంగా కొనసాగుతూనే ఉంది.

అంకెలు ఉంటాయి. మొదట రానున్న సంవత్సరానికి 'అంచనాలు' వేస్తారు. అప్పటికి గడిచిన సంవత్సరపు లెక్కలు పూర్తిగా వచ్చి ఉండవు గనుక 'సవరించిన అంచనాలు' ఉంటాయి. రెండు సంవత్సరాల కిందటివి మాత్రం లెక్కలు పూర్తయి 'వాస్తవ గణాంకాలు' ఉంటాయి. ఈ మూడు అంకెలలో చాల తేడా కూడ ఉంటుంది.)

ఇలా మద్యం వంటి సరుకుల మీద ఆదాయం సంపాదించడం ప్రజాసంక్షేమ కార్యక్రమాల కోసమే అని రాజకీయ నాయకులు, ప్రభుత్వాధికారులు సాధారణంగా అబద్ధ ప్రచారానికి లంకించుకుంటారు. కాని లక్షకోట్ల రూపాయల పైన ఉన్నదని గప్పాలు కొట్టుకునే బడ్జెట్‌లో ఏడువేల కోట్ల రూపాయల ఆదాయమే నిర్ణయాత్మకం కాదు. ఆమాత్రం నిధులను మరే ఇతర మార్గాల ద్వారానైనా సంపాదించవచ్చు. లేదా మిగిలిన ఖర్చులలో పొదుపు పాటిస్తే ఆ మాత్రం సంపాదించడం కష్టం కాదు. అసలు గవర్నర్, ముఖ్యమంత్రి దగ్గరినుంచి శాసనసభ్యుల దాకా, ఒక్కొక్కసారి ఎంపిటిసి సభ్యుల దాకా 'ప్రజా ప్రతినిధులు' అనబడేవారిని ప్రజలనుంచి రక్షించడానికి భద్రతా సిబ్బంది మీద పెడుతున్న ఖర్చు తగ్గించుకుంటే మద్యం అమ్మకాలపై వచ్చినంత ఆదాయం మిగులుతుంది.

అసలు ప్రభుత్వం తలచుకుంటే తన ఆదాయ వ్యయాలను సక్రమంగా సమీక్షించుకుంటే తగ్గించుకోగలిగిన ఖర్చులు, పెంచుకో గలిగిన ఆదాయాలు ఎన్నో ఉన్నాయి. భద్రతా వ్యయం, రుణాల అసలు, వడ్డీల చెల్లింపులు, ప్రైవేటు విద్యా, ఆరోగ్య, రవాణా సంస్థలకు చెల్లింపులు, ప్రభుత్వ పనులు చేయడానికి అనవసరంగా కాంట్రాక్టర్లను నియమించుకుని వారికి చేస్తున్న చెల్లింపులు చాల వరకు తగ్గించవచ్చు, కొన్నయితే పూర్తిగా మానెయ్యవచ్చు. అలాగే, ప్రభుత్వాదాయం పెంచుకోవడానికి కూడ ఎన్నో మార్గాలున్నాయి. రాష్ట్రంలోని ఖనిజ వనరులను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అప్పగించి, వారు దోచుకుపోతుంటే చూస్తూ కూచున్న ప్రభుత్వం, ఆ గనులను ప్రభుత్వ ఖనిజాభివృద్ధి సంస్థచేతనే తవ్వించి సొంతంగా ఖనిజాలను అమ్మినా, కనీసం ఆ ప్రైవేటు ఖనిజ సంస్థలు సంపాదిస్తున్న లాభాలలో ఎక్కువభాగాన్ని పన్నుగా వసూలుచేసినా, రాష్ట్రాదాయం పెరుగుతుంది.

కాని అటువంటి చర్యలకు ఈ పాలకవర్గాలు, ఈ ప్రభుత్వం పూనుకోవనేది స్పష్టమే. నిజానికి ఇటువంటి మద్యం వ్యాపారం ద్వారా లాభపడుతున్న వర్గాలు, పరిపాలన సాగిస్తున్న వర్గాలు ఒకటే. కనుక ఈ ప్రభుత్వం తన వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయడం అసాధ్యం. అంతే కాకుండా, ప్రజలు ఇటువంటి వ్యసనాలకు, మత్తుపదార్థాలకు, తప్పుడు మార్గాలకు బానిసలయితేనే వారు పొందవలసిన చైతన్యం పొందకుండా ఉంటారు. అంటే పాలకవర్గాలు సాగిస్తున్న అక్రమాలను ప్రజలు ప్రశ్నించకుండా, ఎదిరించకుండా ఉండాలంటే, తప్పనిసరిగా ప్రజలను ఇటువంటి అపసవ్య మార్గాలలోకి మళ్లించవలసి ఉంటుంది. ఆ రకంగా మద్య వ్యాపారంతో పాలకులకు ఇటు ఆర్థిక ప్రయోజనాలూ ఉన్నాయి, అటు రాజకీయ, సాంస్కృతిక ప్రయోజనాలూ ఉన్నాయి. అందువల్ల మద్యపానానికి వ్యతిరేక పోరాటం వ్యసనపరుల మీద సాగించే నైతిక పోరాటం కాదు. వ్యవస్థమీద, పాలకుల మీద సాగించవలసిన రాజకీయ, ఆర్థిక పోరాటం. ఆ గుర్తింపుతో మద్యపాన వ్యతిరేక పోరాటాన్ని విస్తృత ప్రజాపోరాటంగా మార్చవలసి ఉంది.

(రచయిత పాత్రికేయులు) వీ

ఇక విదేశీ పర్యాటకుల విషయానికొస్తే, రాష్ట్రానికి వచ్చిన 6.5 లక్షల మందిలో 75 శాతం తమ వ్యాపార సంబంధమైన మీటింగ్‌లకు, చర్చలకు వచ్చిన వారని, మిగిలిన 25 శాతం మంది మాత్రం చారిత్రక ప్రదేశాలను, సముద్రతీర ప్రాంతాలను దర్శిస్తున్నారని ప్రభుత్వ లెక్కలలో తేలింది. మెజారిటీ సామాన్య ప్రజలు దర్శించే పర్యాటక స్థలాలకు కావలసిన రవాణా సౌకర్యాల కల్పన, ప్రజలకు విశ్రాంతి తీసుకోవడానికి అందుబాటు ధరలో వసతి సౌకర్యాలు, సామాన్లకు భద్రత, తాగడానికి శుభ్రమైన నీరు, స్నానాల గదులు, పురుషులకు స్త్రీలకు వేరు వేరుగా విసర్జన శాలల సదుపాయాలు కల్పించడం వంటివి రాష్ట్ర పర్యాటక శాఖ, ఇతర ప్రభుత్వ అనుబంధ శాఖల కర్తవ్యం.

కాని రాష్ట్ర పర్యాటక శాఖ మెజారిటీ పర్యాటకుల సదుపాయాల కల్పనకు, ఇవ్వాల్సిన ప్రాధాన్యతను పక్కకు పెట్టి 'హై ఎండ్' (డబ్బు బాగా ఖర్చు పెట్టగలిగే యాత్రికులు) పర్యాటకులకు, వారికి సౌకర్యాలు సమకూర్చే, కార్పొరేట్ రంగానికి ప్రాముఖ్యత ఇచ్చే దిశగా తన నిర్ణయాలను మార్చ్ 28న విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇలా జరగడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. పారిశ్రామిక విప్లవం తరువాత యాంత్రీకరణ ద్వారా జరిగిన ఉత్పత్తులకు మార్కెట్లు కరువు కావడం అనేది కార్పొరేట్ రంగానికి ఒక సవాలుగా మారింది. సంపాదనే సర్వస్వంలా బతికే కులీన సమాజానికి సదుపాయాలు కల్పించడం ద్వారా, వారికుండే ప్రత్యేక అవసరాను తీర్చే దళారీ వ్యవస్థను కార్పొరేట్ రంగం తన మార్కెట్ కోసం సృష్టించింది. ఈ దళారీ వ్యవస్థకు ప్రపంచీకరణ ద్వారా అత్యంత తక్కువ వ్యవధిలో కోటీశ్వరులైపోతున్న మధ్యతరగతి వారూ, వారిననుసరించే దిగువ మధ్యతరగతి వారు లక్ష్యంగా మారారు. అదే విధంగా పర్యాటక, సేవా రంగాలలో తమ పెట్టుబడుల ద్వారా లాభం పొందుదామనుకొనే వారికి కూడా వీరే టార్గెట్ అయ్యారు. అందుకే తాము సృష్టించిన ఉత్పత్తికి మార్కెట్లను అభివృద్ధి చేసుకోవడం కోసం, కార్పొరేట్ వ్యవస్థ, శ్రమశక్తిని వేరే రంగాలకు మళ్లించాలనే ఉద్దేశంతో సేవారంగం, పర్యాటక రంగాలను ముడిసరుకుగా మార్చి అమ్మడం మొదలుపెట్టింది.

ముందుగా చెప్పినట్లుగా రాష్ట్ర పర్యాటక శాఖ తను త్వరలో విడుదల చేయబోయే కొత్త పాలసీ గురించి, అమలు చేయబోయే కార్యక్రమాల గురించి విడుదల చేసిన ప్రకటన ఈ విధంగా ఉంది : 1) 'హై ఎండ్' పర్యాటకులకు కావలసిన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వడం; 2) రాష్ట్రంలో హెలీ టూరిజం ప్రవేశపెట్టడం; 3) రాష్ట్రాన్ని మెడికల్ టూరిజం హబ్‌గా, కేరళ రాష్ట్రంలా వెల్‌నెస్ టూరిజం క్షేత్రంగా అభివృద్ధిపరచడం; 4) గోల్ఫ్ క్రీడకు మైదానాలు తయారు చేయడం; 5) నాలుగు, అయిదు నక్షత్రాల హోటళ్లు, రాష్ట్ర సముద్ర సరిహద్దు పొడవునా 20 బీచ్ రిసార్ట్‌లను నిర్మించడం; 6) రాష్ట్రంలో ఉన్న 565 చారిత్రక కట్టడాలను రక్షించగలిగే స్థితి ప్రభుత్వానికి లేనందున ప్రైవేట్ సంస్థలతో వాటికి మరమ్మత్తులు చేయించి, నడిపే బాధ్యతలు ఆ సంస్థలకే అప్పగించడం; 7) అనంతగిరి కొండల్లో సాహస టూరిజంను అభివృద్ధి పర్చడం; 8) కొత్త పర్యాటక పాలసీలో పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి లీజు ద్వారా ప్రభుత్వ భూములను అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రైవేట్ భూములు కావలసిన వారికి భూ సేకరణ చేస్తామని, పర్యాటక రంగ పెట్టుబడులకు సబ్సిడీలు ఇవ్వాలని నిర్ణయించామని, అంతేకాక ఈ భూములలో హోటళ్లు, పార్కులు, వినోద కేంద్రాలు, కన్వెన్షన్ సెంటర్లు ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి.) ద్వారా నెలకొల్పడానికి వచ్చిన వారికి సంబంధిత ఇతర ప్రభుత్వ శాఖల నుండి త్వరగా పర్మిషన్‌లు తెప్పించే బాధ్యత తీసుకోవడం; 9) పిపిపి ప్రాజెక్ట్‌ల ద్వారా రు. 1500 కోట్లు సమీకరించి, పర్యాటక రంగం ఒక ప్రాధాన్యతా రంగంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడడమే కాక, పర్యాటక రంగంలో పెట్టే ప్రతి రు. 10 లక్షల పెట్టుబడికి 78 మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపింది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర పర్యాటక రంగ ప్రాధాన్యత వలన ఎవరు లాభం పొందుతారో ఒకసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మెడికల్ టూరిజం, వెల్‌నెస్ టూరిజం

వైద్యాన్ని ఒక వ్యాపార రంగంగా మార్చడం వలన చాలా ఎక్కువ ఆదాయం వస్తుందని గుర్తించిన తరువాత పెట్టుబడిదారులు కార్పొరేట్ ఆసుపత్రులను నిర్వహించడం మొదలుపెట్టారు. కార్పొరేట్ ఆసుపత్రులకు వచ్చే దేశీయ రోగుల కన్నా తమకు కావలసిన 'ప్రత్యేక చికిత్సల' కొరకు ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టగలిగే విదేశీయులను పర్యాటకంలో మిళితం చేసి రప్పిస్తే, ఆసుపత్రుల యాజమాన్యాలతో పాటు విమానయాన సంస్థలు, నాలుగు అయిదు నక్షత్రాల హోటళ్ల వ్యాపారం, సేవారంగ కన్సల్టెన్సీలు, ఇన్స్యూరెన్స్ కంపెనీలు కూడా లాభం పొందవచ్చని గుర్తించారు. ఇదే విషయాన్ని ప్రధానమంత్రికి వ్యాపార, పరిశ్రమల సలహా మండలి సభ్యులైన ముకేష్ అంబాని, కుమారమంగళం బిర్లాలు మెడికల్ టూరిజం విదేశీమారక నిల్వలు ఆర్జించే రంగం కాబట్టి, ఎగుమతిదారులకు ఇచ్చే అన్ని రాయితీలను ఈ రంగానికి కూడ వర్తింప చేయాలని సూచించింది. అందుకే కేంద్ర ప్రభుత్వం మెడికల్ టూరిజంపై వచ్చే వారికి దేశంలోనే ఒక సంవత్సరం పాటు ఉండే విధంగా 'ఎం' వీసాలు జారీ చేయాలని ఉత్తర్వులివ్వడమే కాకుండా, రాష్ట్రాల పర్యాటక శాఖలు, కార్పొరేట్ ఆసుపత్రులు కలిసి మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించాలని సూచించింది. ఇదే రంగంలో ఉన్న కన్సల్టెన్సీలు విదేశీ పర్యాటకులకు కావలసిన ప్రత్యేక శస్త్ర చికిత్సలకు ఆసుపత్రులను ఎంపిక చేయడం దగ్గరనుంచి, ట్రెడిషనల్ థెరపీలు, బ్యూటిఫికేషన్ థెరపీలకు అనుగుణంగా వసతి కల్పిస్తారు. వారు చూడాలనుకుంటున్న పర్యాటక స్థలాల దగ్గర వసతి సౌకర్యాలు చూడడం, పాస్‌పోర్టు వీసాలు సమకూర్చడం, తిరిగి వాళ్లు విమానం ఎక్కేవరకు అన్ని అవసరాలు తీర్చడం లక్ష్యంగా ఉంటుంది.

పోయిన సంవత్సరం 'ఎం' వీసాల ద్వారా ఒక లక్షా యాభై వేల మంది విదేశీ పర్యాటకులు వస్తే, వారిలో తొంభై వేల మందికి అపోలో ఆసుపత్రి వైద్య సేవలందించింది. రాష్ట్రంలోని గ్లోబల్, కేర్, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి విదేశీ పర్యాటకులకు సేవలందించడంలో ముందున్నాయి. ఈ విధంగా బాగా డబ్బు ఖర్చు పెట్టగలిగే 'హై ఎండ్' పర్యాటకుల ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాల తరఫున రాష్ట్ర పర్యాటక శాఖ వాళ్ల వ్యాపారం ఇంకా బాగా జరిగే విధంగా చూడడానికి మెడికల్ టూరిజాన్ని అభివృద్ధి పరచాలనే నిర్ణయాన్ని ప్రకటించింది.

ఈ మెడికల్ టూరిజానికి అనుబంధంగా ఉండి బాగా డబ్బున్న వాళ్లు తమ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, శరీరానికి కావలసిన రకరకాల మర్దనలు, విశ్రాంతి తీసుకొన్న తరువాత, తిరిగి తమ దైనందిన జీవితంలోకి రెట్టింపు ఉత్సాహంతో పునరంకితమవడానికి ఉద్దేశించినదిగా ప్రచారం కాబడుతున్నదే ఈ 'వెల్‌నెస్ టూరిజం.' ఈ టూరిజంలో మసాజ్ పార్లర్లు, స్పాలు, యోగా సెంటర్లు, ఆయుర్వేద చికిత్సతో కూడిన విశ్రాంతి ప్రదేశాలు, రిసార్ట్‌లలో వీరికి చికిత్స, విశ్రాంతి పేరుతో కావల్సిన సౌకర్యాలు ఎక్కువ శ్రద్ధతో చేస్తారు. కొన్నింటికి గంటకు చార్జి వసూలు చేస్తే, కొన్నింటికి రోజుకు పదివేల రూపాయల చొప్పున వసూలు చేసి సౌకర్యాలు కల్పిస్తారు. ఈ మసాజ్ పార్లర్ల ముసుగులో వ్యభిచారం జరుగుతుండగా పట్టుకున్న సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి.

ఇక రాష్ట్ర పర్యాటక శాఖ ప్రకటించకపోయినా మెడికల్ టూరిజం ముసుగులో విదేశీయులు కాంట్రాక్ట్ పద్ధతిలో ఇక్కడ చౌకగా దొరికే స్త్రీల ద్వారా తమ కోసం పిల్లలను కని, వారిని తమ దేశాలకు తీసుకొని వెళ్తున్నారు. ఇందుకోసం ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా 'అసిస్టెడ్ రిప్రోడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) బిల్, రూల్ 2008'ని కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ రూపంలో తయారు చేసి 'అమ్మకానికి అమ్మతనం' అనే దానిని చట్టబద్ధం చేసింది. డబ్బులేని సామాన్య కుటుంబాలు అవసరాలకు డబ్బులు కావలసిన స్త్రీలను ఈ విధంగా ఫెర్టిలిటీ సెంటర్లు, కార్పొరేట్ ఆసుపత్రులు, ఏజెంట్లు విదేశీయుల కోసం ఉపయోగించుకొని, మెడికల్ టూరిజం ద్వారా స్త్రీలను ముడిసరుకుగా ఉపయోగించుకొంటున్నారనే దానికి ఇదొక ఉదాహరణ. ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించే పర్యాటక స్థలాల దగ్గర వైద్య ఆరోగ్యశాఖ సహాయంతో కనీసం అత్యవసర చికిత్స కోసం మందులు సరఫరా చేయడానికి ఒక హెల్త్‌వర్కర్‌ను పెట్టడానికి రాష్ట్ర పర్యాటకశాఖ ప్రాధాన్యతలలో కనపడదు కాని, మెడికల్ టూరిజం ముసుగులో పేదస్త్రీలు ఒక వస్తువుగా వాడబడుతుంటే ఆ విషయం గురించి చర్చించకుండా, కేవలం మెడికల్ టూరిజంను అభివృద్ధి చేయడం మాత్రమే తన ప్రాధాన్యతగా పెట్టుకుంది.

వసతి సౌకర్యాల కల్పన

సందర్శకులకు పర్యాటక ప్రాంతాలలో ముఖ్యంగా కావలసినది వసతి సౌకర్యాలు అందుబాటు ధరల్లో ఉండడం. ఈ విషయంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు తమ పర్యాటక శాఖ వసతి గృహాలలో గదులను యాత్రికులకు చాలా తక్కువ అద్దెతో అందుబాటులో ఉంచడమే కాకుండా, ప్రైవేట్ హోటళ్లతో కూడా ఒప్పందం చేసుకొని అతి చౌకగా గదులు లభ్యమయ్యేలా చూస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నం, నాగూరులలో అయితే వేల మందికి ఒకేసారి వంద రూపాయల నుండి మూడు వందల రూపాయలకు చౌకలో వసతి సౌకర్యాలు కల్పించి, కమ్యూనిటీ వంటశాలలు నిర్మించి, గంటల చొప్పున పర్యాటకులకు అతి తక్కువ అద్దెకు ఇవ్వడం వల్ల, అక్కడ పర్యాటకులు ఎక్కువ రోజులు ఉండడానికి ఇష్టపడుతున్నారు. కాని, మన రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏ.పి.టి.డి.సి.)కు చెందిన రిసార్టులు, హోటళ్లలో అద్దెలు సామాన్య ప్రజలకే కాదు కదా కనీసం మధ్యతరగతి వారికి కూడా అందుబాటులో ఉండవనేది మూడు రాష్ట్రాల పర్యాటక సంస్థల వసతి గృహాల అద్దెలను పోల్చి చూస్తే తెలుస్తుంది. ఈ విధంగా హై ఎండ్ పర్యాటకులకు మాత్రమే ఏ.పి.టి.డి.సి. సౌకర్యాలు కల్పిస్తుంది.

ఇక బీచ్ రిసార్ట్‌లు పి.పి.పి. పెట్టుబడుల ద్వారా నిర్మించాలనే నిర్ణయాలను చూస్తే ఇప్పటికే పరిశ్రమల వల్ల భూగర్భ జలవనరులు అధికంగా వాడడం వల్ల, మైనింగ్ పరిశ్రమల కోసం అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం వల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించి, ఎప్పుడూ తుపానులు పైగా సముద్రంలో వచ్చే భూకంపాల వల్ల సునామీలు వచ్చి సీజన్‌లతో సంబంధం లేకుండానే సముద్ర మట్టం ప్రమాదకర రీతులలో పెరగడమే కాకుండా, ప్రకృతి వైపరీత్యాలకు నిలయంగా మారింది.

ఈ నేపథ్యంలో ప్రైవేట్ పెట్టుబడిదారులకు వందల ఎకరాలు రిసార్ట్‌లకు, వినోద పార్కులకు ఇవ్వడం వలన పెట్టుబడిదారుల వ్యాపారం కోసం స్థానిక మత్స్యకారులు ఉపాధి కోల్పోవడమే కాకుండా, నిర్వాసితుల వడానికి కూడా ఆస్కారం ఉంది. ఈ విషయంలో పూర్వానుభవాలను దృష్టిలో ఉంచుకొని అక్కడి స్థానిక ప్రజలకు నష్టం కలుగకుండా నిర్ణయాలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర పర్యాటక శాఖ మీద ఉంది.

గోల్ఫ్ మైదానాలు నిర్మించడం, హెలీ టూరిజం

విశ్రాంత ప్రేమికుల క్రీడగా విదేశాలలో పేరు పొందిన గోల్ఫ్ ఆట కోసం తయారు చేయబడే గడ్డి మైదానాలకు వందల ఎకరాలలో భూమి అవసరం అవుతుంది. పైగా ఈ భూమిని ప్రజల వద్ద నుండి సేకరించడం వారికి తగిన సౌకర్యాలు కల్పించకుండా భూమి తీసుకోవడం అనేది ప్రజలను నిర్వాసితులను చేసి వారు జీవించే హక్కును కాలరాయడం ప్రభుత్వమే చేసినట్లవుతుంది. పైగా ఇందులో పచ్చిక ఎప్పుడు ఎండకుండా ఉండడానికి చాల ఎక్కువ నీరు అవసరం ఉంటుంది. జలవనరులు తగ్గిపోతూ తాగడానికే నీరు సరిగ్గా లభించని ప్రస్తుత స్థితిలో గోల్ఫ్ మైదానాల కోసం ప్రైవేట్ పెట్టుబడిదారులకు వందల ఎకరాల భూములు అప్పగించడం ఎంతవరకు సబబో ఆలోచించాలి. నిర్వాసితులకు సరైన రిహాబిలిటేషన్, రిసెటిల్‌మెంట్ త్వరగా పూర్తయ్యే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

ఇప్పుడు కొత్తగా హై ఎండ్ పర్యాటకుల కొరకు హెలికాప్టర్‌ను హైదరాబాద్ - నాగార్జునసాగర్, హైదరాబాద్ - పుట్టపర్తి - బెంగళూరు మధ్య ముందుగా మొదలుపెట్టాలని నిర్ణయించారు. ఆ హెలికాప్టర్లు కనీసం విమానాల్లో ప్రయాణించే 'కాటిల్ క్లాస్'కు కూడా అందుబాటులో లేకుండా కేవలం 'బిజినెస్ క్లాస్'కు మాత్రమే అందుబాటులో ఉంటాయనేది వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

ప్రభుత్వ స్థలాలు, ప్రజల భూములు సేకరించడం

ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వం నుండి భూములు తీసుకొని, ప్రభుత్వంతో చేసుకొన్న ఒప్పందం ప్రకారం ఉద్యోగాల కల్పన చేయకుండా ఉండడం, తమ ఆధీనంలోని భూములను దుర్వినియోగం చేయడం, నిర్దిష్ట సమయంలో ఉపయోగించక పోవడం అనేది ప్రత్యేక ఆర్థిక మండలాల (సెజ్)ల కోసం, ఇతర వ్యాపార అవసరాల కోసం తీసుకొన్న భూముల విషయంలో రుజువయింది. ఇప్పటికి ప్రభుత్వానికి కలిగిన అనుభవంతో ఒప్పందం ప్రకారం నడుచుకోని సంస్థలపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుందనే దాని మీద, పెనాల్టీ ఏ విధంగా ఉండాలనే దాని మీద కొత్త పర్యాటక రంగ పాలసీలో పొందుపరచాల్సిన అవసరం ఉంది. నిర్వాసితులకు రిహాబిలిటేషన్, రిసెటిల్‌మెంట్ పకడ్బందీగా అమలు జరిగే విధంగా ప్రణాళిక ఉండాల్సిన అవసరం కూడ ఉంది.

ఈ ప్రకటన విడుదలకు ముందు రాష్ట్ర పర్యాటక శాఖ తన కొత్త పర్యాటక రంగ పాలసీలోని విధి విధానాలు నిర్ణయించడానికి గత కొంత కాలంగా కొన్ని కార్యక్రమాలు సదస్సులు నిర్వహించింది. ఇందులో మెడికల్ టూరిజంపై పసిఫిక్ ఏషియా ట్రావెల్ సదస్సు. పర్యాటక పరిశ్రమ అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (ఫ్యాప్సీ) తో కలిసి నిర్వహించిన సమావేశం. ట్రావెల్, హాస్పిటాలిటీ, టూరిజంపై 'టై' (టి.ఐ.ఇ.) సంస్థతో కలిసి నిర్వహించిన సదస్సు, పర్యాటక మంత్రిత్వ శాఖ బెంగుళూరులో పాల్గొన్న దక్షిణ భారత పర్యాటక మంత్రుల సదస్సులు ముఖ్యమైనవి. ఈ సదస్సులకు, మీటింగ్‌లకు ఆహ్వానితులుగా పెట్టుబడిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విమానయాన సంస్థల టూర్ ఆపరేటర్లు, 4–5 నక్షత్రాల హోటళ్ల యజమానులు, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వీరి సంబంధిత కన్సల్టెన్సీలు ఉన్నాయి. కానీ, వీటికి పర్యావరణ రంగ నిపుణులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ నిపుణులు, సామాజికరంగ నిపుణులను ఆహ్వానించలేదు.

కేవలం లాభాపేక్షతో పెట్టే ప్రైవేట్ సంస్థల పెట్టుబడుల వల్ల పర్యాటక ప్రదేశాల చుట్టు పక్కల నివసించే ప్రజల జీవన విధానంలో జరిగే అనూహ్య మార్పుల గురించి కానీ, వాటి వల్ల వచ్చే దుష్పరిణామా లను ముందుగానే

చర్చించి స్థానిక ప్రజలకు ఎలాంటి హాని కలుగకుండా, వారి జీవనోపాధి మెరుగయ్యే విధంగా ఉండే ప్రణాళికలపై ఎలాంటి చర్చలు జరుగలేదు. కార్పొరేటీకరణ వల్ల చారిత్రక కట్టడాల నేపథ్యానికి, జాతీయ సంస్కృతికి భిన్నంగా చుట్టుపక్కల అసాంఘిక వ్యాపారాలు చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలు ప్రపంచానికి చాలా గొప్ప సంస్కృతి అని చాటే మన దేశ ఔన్నత్యానికే దెబ్బ తగిలే విధంగా ఉంటుందనే కోణంలో కాని, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కాని చర్చలు జరుగలేదు.

ఇవేకాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సంస్థ తన వ్యాపార నిమిత్తం వివిధ పుణ్యక్షేత్రాలకు స్వంత బస్సులను నడుపుతుంటుంది. ఒకటి రెండు జిల్లాలను ఒక సర్క్యూట్‌లా చేసి సామాన్య పర్యాటకులు ఎక్కువగా చూసే దేవాలయాలు, వాటికి దగ్గరగా ఉన్న చారిత్రక కట్టడాలు, నదీ తీర అందాలతో కలిపి కొత్తగా వ్యవసాయ పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చెయ్యొచ్చు అనే దిశలో ఎలాంటి చర్చలు జరుగలేదు. ఉదాహరణకు ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, చారిత్రక కట్టడాలు, పోచంపాడు రిజర్వాయర్‌తోపాటు, ఉట్నూరులో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.) పెంచే నర్సరీలలోని మొక్కలను పర్యాటకులకు చూయిస్తే హైదరబాద్‌లోని 'ఓషన్ పార్కు' కన్నా బాసర చుట్టు పక్కల గోదావరి అందాలని, నిర్మల్ కోటను, బొమ్మలను, అడవులకు దగ్గరగా ఉండే ఆ మొక్కల అందాలకు ఎక్కువగా పర్యాటకులు సంతోష పడతారు. రాష్ట్ర పర్యాటక శాఖలో కనీసం ముగ్గురు ఐ.ఎ.ఎస్. అధికారులుంటారు. అందులో ప్రతి ఒక్క అధికారి కూడా ఒక సక్సెస్‌ఫుల్ ఐ.టి.డి.ఎ. ప్రాజెక్ట్ అధికారిగా పనిచేసిన తరువాతే పర్యాటక శాఖకు వచ్చి ఉంటారు. ఇలాంటి యాత్రల వల్ల పర్యాటకులకు గిరిజనుల జీవన విధానం, వారి స్వయం ప్రతిపత్తి పట్ల అవగాహన కల్పించినట్లవుతుంది. ఇందుకోసం స్థానిక గిరిజన ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు తయారు చేయడం, ఇతర శాఖలతో సమన్వయ పరచడం అనేది ఈ అధికారులకు తెలియనిదేం కాదు.

ఇదే విధంగా తూర్పు గోదావరి జిల్లాలోని పుణ్యక్షేత్రాలతో పాటు కోనసీమ అందాలు, కడియం నర్సరీలు కలిపి ఒక సర్క్యూట్‌లా యాత్ర ఏర్పాటు చేయవచ్చు. విశాఖ జిల్లాలోని బౌద్ధక్షేత్రాలు, బీచ్‌లు, అరకు లోయ అందాలతోపాటు కాఫీ తోటలను, ఔషధ మొక్కలను కూడా కలిపి పర్యాటకులకు చూయిస్తే సంతోషంతో పాటు విజ్ఞానం. చూసే వారికి కూడా పర్యావరణం పట్ల, వ్యవసాయం పట్ల, మొక్కల పెంపకం పట్ల ఒక పాజిటివ్ దృక్పథంతో పాటు స్థానిక ప్రజల సహకారంతోనే వ్యవసాయ పర్యాటక రంగం అభివృద్ధి చేయవచ్చు. స్థానిక ప్రజల జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా పర్యాటకులతో స్నేహంగా ఉండడం వల్ల పర్యాటకులకు కూడా ఆసక్తి, ఎక్కువ సార్లు రావాలనే కోరిక కలుగుతాయి.

ఇంతేకాకుండా, మన రాష్ట్రంలో చాలా గొప్ప బౌద్ధ క్షేత్రాలు ఉన్నాయి. కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 150 కిలోమీటర్ల పరిధిలోనే దాదాపు ఏడు బౌద్ధ క్షేత్రాలు ఉన్నాయి. వీటిలో అమరావతికి తప్ప మిగిలిన వాటికి సరైన సమయానికి రవాణా సౌకర్యాలు కూడా అందుబాటులో లేవు. ముఖ్యంగా గుంటుపల్లిలోని బౌద్ధ గుహలు మహారాష్ట్రలోని అజంతా, ఎల్లోరా గుహల్లా అద్భుతంగా ఉంటాయి. కాని ఈ బౌద్ధ క్షేత్రాల గురించి సరైన ప్రచారం కాని, ప్రజలకు వీటిపై ఆసక్తి, చారిత్రక సంపద పట్ల అవగాహన కలిగించే కార్యక్రమాలు కాని జరగడం లేదు. శంషాబాద్ విమానాశ్రయంలో ప్రచారం చేయించడం కన్న వేములవాడ రాజరాజేశ్వరీ దేవి దేవాలయం దగ్గర, కరీంనగర్ బస్టాండ్ దగ్గర తన ప్రచార స్టాళ్లను పెడితే వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలోని మెజారిటీ పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

పర్యాటక శాఖ ప్రాధాన్యతలలో ఎక్కువగా నగరాలకు సంబంధించిన పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం, అది కూడా ముఖ్యంగా హైదరాబాద్ లాంటి నగరాలలో గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ఉత్పత్తులను ఎగ్జిబిషన్‌లలో పెట్టి అమ్మకాలు చెయ్యడం చేస్తుంటారు. పర్యాటకులు ఎప్పుడూ కూడా పుణ్యక్షేత్రాలకు, చారిత్రక కట్టడాలకు దగ్గరగానున్న చేనేత, హస్తకళలకు నిలయంగా ఉన్న ప్రదేశాలలో తక్కువ ధరకు మన్నికైన వస్తువులు దొరికే మార్కెట్ ప్రదేశాలను సందర్శిస్తారు. పర్యాటక ప్రదేశాలను చూడడంలో భాగంగా గ్రామీణ పర్యాటకాన్ని కూడ కలిపితే, ముఖ్యంగా గద్వాల్, పెదన, నిర్మల్, కరీంనగర్, చేర్యాల లాంటి వాటిని కూడా కలిపి సర్క్యూట్‌తో జిల్లాకు కనీసం ఒకటైనా కలిపితే స్థానిక చేనేత హస్తకళాకారులకు ప్రతిసారి హైదరాబాద్ వచ్చి వాళ్ల పనితనానికి గుర్తింపు పొందాల్సిన అవసరం ఉండదు.

కృష్ణా జిల్లాలోని కూచిపూడి తన నాట్య కళా వైభవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాత నర్తకీమణులను అందించి ప్రసిద్ధి పొందింది. పర్యాటక శాఖ కూచిపూడిలో ప్రఖ్యాత నర్తకులతో నాట్య ప్రదర్శన ఏర్పాటు చేసి స్థానిక ప్రజలకు చుట్టు పక్కల జిల్లాల ప్రజలకు మన సంస్కృతి గురించి తెలిసే అవకాశం కల్పించవచ్చు. పండిట్ రవిశంకర్ సితార్ ప్రోగ్రాంను హైదరాబాద్‌లో ఏ ప్రైవేట్ సంస్థ అయినా ఏర్పాటు చేస్తుంది. కాని గ్రామీణ ప్రాంతాలలో వారికి తమ జాతి ఔన్నత్యాన్ని తెలుసుకొనే అవకాశం లాభాపేక్ష లేని ప్రభుత్వం మాత్రమే చేయగలుగుతుందనేది రాష్ట్ర పర్యాటక శాఖ గుర్తించాలి.

చివరిగా రాష్ట్రానికి వచ్చే పర్యాటకులలో 90 శాతం ఉన్న సామాన్య ప్రజానీకానికి పుణ్యక్షేత్రాల వద్ద, ఇతర దర్శనీయ స్థలాల దగ్గర ఇప్పుడు ఉన్న సౌకర్యాలు, ఇంకా కావలసిన సదుపాయాలు, భవిష్యత్తులో మౌలిక వసతుల కల్పన, వసతి సౌకర్యాలు, ఇతర అవసరాలు తీర్చడానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలు అవలంబిస్తున్నారో ఎప్పుడు కూడా ప్రజలు తెలుసుకోవడం కోసం ప్రకటించలేదు. ముఖ్యంగా పర్యాటకులకు స్థానిక ప్రజల నుంచి కావలసిన సౌకర్యాల కల్పన, మద్దతు, లభించే స్థానిక వనరులు, వాటి వలన స్థానికులకు కలిగే లాభాలు, నష్టాల్ని తగ్గించే ప్రణాళికల గురించి రాష్ట్ర పర్యాటక శాఖ విడుదల చేసిన ప్రకటనలలో లేవు.

ఇదే కాకుండా, పర్యాటకులకు కావలసిన సదుపాయాలు సమకూర్చడానికి ఇతర ప్రభుత్వ అనుబంధ శాఖలైన దేవాదాయ, పంచాయితీ రాజ్, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, అటవీ, వ్యవసాయ, ఉద్యానవనాల శాఖలతో జిల్లా పర్యాటక మేనేజర్లు చర్చించినట్లుగాని, అన్ని శాఖల సమన్వయంతో పర్యాటకులకు కావలసిన సౌకర్యాలు అన్ని సమయాలలో అందుబాటులో ఉంచే ప్రణాళికలు కాని, ఇతర శాఖలు అమలు చేస్తున్న కార్యాచరణ పథకాల గురించి తెలుసుకొని వారి సమన్వయంతో పర్యాటకుల మేలుకొరకు పనిచేసినట్లుగా ఏ జిల్లాలోనూ కనపడలేదు.

కాని ఇదే రాష్ట్ర పర్యాటక శాఖ మాత్రం ఇతర శాఖల సమన్వయంతో పెట్టుబడిదారులకు కావలసిన అన్ని పర్మిషన్‌లను త్వరగా ఇప్పిస్తుంది. ఇతర శాఖలతో కలిసి పనిచేస్తానని తను తీసుకు రాబోయే కొత్త పర్యాటక రంగపాలసీలో నిర్ణయం తీసుకోవాలనుకునేది కేవలం 'హై ఎండ్ పర్యాటకులకు' వారి అవసరాలు తీర్చడానికే. లాభాలు పొందాలనుకొనే వాళ్లకు ఉపయోగకరంగా ఉంటుంది కాని, మెజారిటీ పర్యాటకులకు మాత్రం ఎలాంటి ఉపయోగం ఉండదు. ఇప్పటికైనా రాష్ట్ర పర్యాటకశాఖ సామాన్య పర్యాటకులకు కావలసిన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిచ్చి, మెజారిటీ ప్రజలకు అవసరమైన పర్యాటకాభివృద్ధి జరగడంలో తోడ్పడుతుందని ఆశిద్దాం.

(రచయిత రాష్ట్ర ప్రభుత్వ అధికారి)
sarlareddy007@gmail.com

ప్రజా సంక్షేమ, ప్రజోపయోగ కార్యక్రమాలు అందించే ప్రసారభారతిని లాభనష్టాల పేరుతో ప్రైవేట్‌పరం చేయడానికి చూస్తున్న పాలకుల నుంచి ఆ సంస్థను ప్రజలు, ఉద్యోగులే కాపాడుకోవాలంటున్నారు **వి. గోపీచంద్**

ప్రసారభారతీ, మమ్మల్ని క్షమించు!

స్వయం ప్రతిపత్తి పేరుతో, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ఏర్పాటయిన ప్రసారభారతి పుట్టుకలోనే అసహజముంది. కేవలం పేరు కోసం హడావిడిగా, ఆదరాబాదరాగా పురుడు పోసుకున్న సంస్థ. 1997లో సమాచార శాఖమంత్రి జైపాల్‌రెడ్డిగారి సిజేరియన్ ఆపరేషన్‌తో బైటపడ్డ ఆ పసికందు ఇప్పటికీ అలానే ఉంది. ఏమాత్రం ఎదగలేక పోయింది. కనీసం ఒక సాకారమయిన రూపాన్ని సంతరించుకోలేక పోయింది. ఫలితంగా ఆకాశవాణి, దూరదర్శన్‌ల మనుగడకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడి వీటి ఉనికి ప్రశ్నార్థకమయింది.

నిన్న, మొన్నటి దాకా ఆకాశవాణి, దూరదర్శన్ ప్రసారాల లక్ష్యం సంక్షేమం. ప్రజలకు వినోదం, విజ్ఞానంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర సాంఘిక ప్రయోజనాలు తెలిపే ప్రసారాలు అందించడం. మరోవైపు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, కళలు, భాష ఔన్నత్యం కాపాడడం. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిన భారత లౌకిక తత్వాన్ని ప్రజల మనస్సులలో నాటుకునేలా చేయడం. సమాజంలోని విభిన్న వర్గాల ప్రయోజనాలు – వారి అభివృద్ధే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందించి ప్రసారం చేసేవారు. వ్యవసాయం, కుటుంబ సంక్షేమం, కార్మికులు, స్త్రీలు, యువజనులు, వృద్ధులు, మైనారిటీలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విడివిడిగా కార్యక్రమాలు ప్రసారం అయ్యేవి. ఇక కర్నాటక, హిందూస్థానీ, లలిత, జానపద సంగీత కార్యక్రమాలతో పాటు నాటికలు, నాటకాలు, రంగస్థల పద్యాలు, హరికథలు, బుర్రకథలు, ఒగ్గు కథలు, సంస్కృత, హిందీ పాటలతో పాటు తెలుగు సాహిత్య ప్రసారాలుండేవి. ప్రాంతం బట్టి ఇతర భాషలలో కూడా కార్యక్రమాలు కొనసాగేవి. వీటన్నింటికి తోడు సినిమా పాటలు, వార్తలు అదనం. ఇలా ఒక జీవిత ప్రస్థానంగా ప్రసారాలు జరిగేవి. ఇదంతా ప్రభుత్వం ఒక సామాజిక సేవగా, ప్రజలకు సమాచారం అందించడం తన లక్ష్యంగా, కనీస బాధ్యతగా నిర్వహించింది. తపస్సుగా నిర్వహిస్తూ వచ్చింది.

అయితే కాలగమనంలో వచ్చిన మార్పులు పాలకుల వైఖరిలో మార్పులు తీసుకొచ్చాయి. ప్రభుత్వం సంక్షేమం, శ్రేయోరాజ్యం లక్ష్యాల నుండి వైదొలగి ప్రైవేటీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టింది. లాభనష్టాల బేరీజు వేసుకుంటూ ప్రభుత్వాన్ని లిమిటెడ్ కంపెనీగా నడపాలని భావించింది. అయితే వాటివల్ల వచ్చిన ప్రతికూల ప్రభావం వల్ల, కొంచెం వెనకకు జరిగి, సంస్కరణలకు మానవీయ కోణం ఉండాలని భావించింది. లాభనష్టాల బేరీజుతో ఆకాశదర్శన్‌ల నిర్వహణలో కూడా వాణిజ్య దృక్పథం ఉండాలని పాలకులు భావించారు. ప్రభుత్వ విధానాలలో వచ్చిన మార్పులతో ప్రసార రంగంలో ప్రైవేట్ వెల్లువ వెల్లివిరుస్తూ ఉంది. ఈ నేపథ్యంలో ఆకాశదర్శన్‌ల పట్ల ప్రభుత్వ వైఖరిలో నిర్లిప్తత, నిరాసక్తత అధికమయింది. నానాటికీ వివక్షకు గురవుతూ వస్తున్నాయి.

లాభసాటిగాలేని ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయాలని ప్రభుత్వ భావన. ఆ దిశగా ఎన్నో అడుగులు వేసింది. ఇప్పుడు ఆకాశవాణి, దూరదర్శన్‌ల గురించి ప్రభుత్వం ఆలోచిస్తూ ఉంది. నిర్వహణకయ్యే ఖర్చులో సగం భరిస్తాం. మిగిలిన సగభాగాన్ని వాణిజ్య ప్రకటనల ద్వారా మీరే సమకూర్చుకోవాలని సంస్థలను ఆదేశించింది. నిధుల సమీకరణకు అవసరమనుకుంటే కాపిటల్ మార్కెట్‌కు వెళ్లవచ్చని కూడా ప్రభుత్వం సూచించింది. ఒకరకంగా ప్రసారభారతికి ఇది పిడుగు లాంటి వార్త. నిన్నటిదాకా 'సంక్షేమం', 'అభివృద్ధి', సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, భాష పరిరక్షణ, సామాజిక ప్రగతే ధ్యేయంగా ప్రసారాలు నిర్వహించిన సంస్థలు, హఠాత్తుగా వ్యాపారమే లక్ష్యంగా, లాభాలే ఊపిరిగా కార్యక్రమాలు రూపొందిస్తూ, లాభం కోసమే ఏర్పడిన ప్రైవేట్ సంస్థల ముందు నిలబడగలవా? ప్రస్తుత పరిస్థితులలో అసంభవం. సంస్థల నిర్వహణలో మార్పులు, చేర్పుల వల్ల ప్రయోజనం ఉంటే కొద్దిమేర ఉండవచ్చు. మొత్తంగా ఒక జాతీయ ప్రసార వ్యవస్థ కుదేలయ్యేలా ప్రభుత్వం వ్యవహరించడం ఆక్షేపణీయం.

వాస్తవంగా పరిస్థితులను విశ్లేషించుకుంటే, గతంలోకంటే ఇప్పుడు ఆకాశవాణి, దూరదర్శన్‌ల అవసరం మరింతగా ఉంది. ప్రధానంగా ప్రైవేట్ ఛానళ్ల మధ్య పోటీ, ఎఫ్.ఎం. రేడియోల మధ్య ఏర్పడిన పోటీ జుగుప్సాకరంగా మారింది. ఎవరిగోల వారిదే. ప్రజల గోల ఎక్కడా వినిపించదు. ప్రతి ప్రసారమాధ్యమానికి తన యాజమాన్యం లక్ష్యాలు సాధించడమే ఏకైక గమ్యం. దీనికోసం 'మీడియా' ముసుగులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరుగుతున్న వ్యాపారం అందరికి తెలిసిందే. ఎవరి రాజకీయ, ఆర్థిక, ఆధిపత్య వాద ధోరణులు వారివి. వాటిని ప్రజల మీద రుద్దడమే ప్రసార మాధ్యమాల పని. అంతేగాని, సంక్షేమం, అభివృద్ధి, సంస్కృతి, భాష తదితర మౌలిక అంశాలకు తిలోదకాలిచ్చారు. మరోవైపు అశ్లీల, అనాగరిక, నీచమైన, నేర మనస్తత్వ ఆలోచనలు ప్రేరేపించే దిశగా కార్యక్రమాలతో ప్రసార మాధ్యమాల దాడి ప్రజల మీద సాగుతోంది. దాదాపుగా దేశంలోని ప్రతి రాజకీయ పార్టీకి అధికారికంగానో లేదా అనధికారంగానో పత్రికలు, ఛానళ్లున్నాయి.

ఇటువంటి పరిస్థితులలో ఒక జాతీయ ప్రసార వ్యవస్థ బలంగా పనిచేయాలి. నిర్వహణను ప్రభుత్వం పటిష్టపరచాలి. అయితే మన పాలకులు మాత్రం ఉన్న జాతీయ ప్రసార మాధ్యమాలను అధఃపాతాళం వైపు తోసేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ప్రైవేటీకరణ మోజులో ప్రభుత్వాలు ఎన్నో ప్రజా వ్యవస్థలకు మంగళం పాడుతున్నాయి. విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాలలో సైతం ప్రైవేటీకరణ ఏ విధంగా ముందుకు సాగుతూ ఉందో కనిపిస్తోంది. ఆ దిశలో ప్రభుత్వం చూపు ఆకాశవాణి, దూరదర్శన్‌ల మీద పడడం పెద్ద ఆశ్చర్యం కలిగించదు. 1997లో ప్రసార భారతి ఏర్పాటు చేసిన నాటి నుండి ప్రైవేటీకరణ ఆలోచనలకు పునాది పడింది. కారణాలు ఏమైనప్పటికీ అప్పటి నుండి రిక్రూట్‌మెంట్, ప్రమోషన్‌లు బంద్. ఉద్యోగులలో నిర్లిప్తత, నిరాసక్తతలు పెరిగాయి. మరోవైపు ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల సంఖ్యను మాత్రం విపరీతంగా విస్తరించారు. దీంతో పరిస్థితి మరింతగా దయనీయంగా మారింది.

దేశవ్యాప్తంగా ఉన్న ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలలో కేవలం అతికొద్ది కేంద్రాలలోనే ప్రోగ్రాం స్టాఫ్ పూర్తిగా ఉన్నారు. కావాల్సిన సంఖ్య కంటే చాలా చాలా తక్కువగా ఉన్నారు. 1989లో ప్రోగ్రాం విభాగంలో చేరిన వారికి ఇంత వరకు మొదటి ప్రమోషన్ కూడా లభించలేదు. ఏ ప్రభుత్వ శాఖలోనూ ఇంత అధ్వాన్నంగా ఉండదు. పరిస్థితి ఆ విధంగా ఉంటే ప్రభుత్వం ప్రైవేటీకరణ అంటూ బడ్జెట్ కేటాయింపులలో కోత పెడుతూ ఉంది. భవిష్యత్తులో నిర్వహణ కూడా కష్టమనేలా ప్రవర్తిస్తోంది. నిజంగా వీటి నిర్వహణ ప్రభుత్వానికి మోయలేని భారమా? అంటే కాదనే సమాధానం. సంవత్సరానికి ప్రసార భారతి నిర్వహణకు రెండు వేల కోట్లు అవసరం. ఇందులో దగ్గర దగ్గరగా వెయ్యి కోట్లు వాణిజ్య ప్రకటనల ద్వారా సమకూరుతున్నాయి. కావాలసింది కేవలం వెయ్యి కోట్లు. ప్రభుత్వానికి ఈ మోతాదు ఎంత?

ఆకాశ దర్శన్‌ల యాజమాన్యం కూడా చాలా జాగ్రత్తగా ఉద్యోగుల మధ్య సమన్వయం లేకుండా, రాకుండా చూడగలిగింది. ముందు ప్రోగ్రాం, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్, వార్తా విభాగాలుగా విడగొట్టి, వారి మధ్య సఖ్యత రాకుండా విజయం సాధించింది. ఆ తర్వాత ఒక్కో విభాగంలో క్యాడర్‌ల మధ్య చిచ్చు తేగలిగింది. ఫలితంగా ఐక్యత రాకుండా, లేకుండా నేర్పుగా వ్యవహరించింది. ప్రపంచంలో ఏ ప్రసార మాధ్యమంలో ఉండనన్ని క్యాడర్స్ సృష్టించి, ఒక విధానం లేకుండా ఎవరికి తోచిన తీరున వారు వారి స్థాయిలో దోచుకుంటూ రిక్రూట్‌మెంట్స్ కొనసాగించారు. ఆకాశవాణి, దూరదర్శన్‌ల మధ్య అనారోగ్యమైన పోటీ. దూరదర్శన్ వారు ఆకాశవాణిని ద్వితీయ శ్రేణిగా పరిగణిస్తారు. అయితే వారు అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలియదా అంటూ కుమిలిపోతుంటారు. ఎవరు ఎన్ని విసుర్లు విసురుకున్నా సమస్యలను గుర్తించరు. ఉన్నాయన్నా ఒప్పుకోరు. మనకు ఏమీ కాదనే భరోసా. అందువల్ల అసోసియేషన్స్ పెద్దగా ఎదగలేకపోయాయి. వాటి ప్రభావం అంతంతమాత్రంగానే ఉండేది. ఇప్పటికీ దాదాపు అదే పరిస్థితి. అయితే గత 2, 3 సంవత్సరాలుగా ఆర్. శ్రీనివాసన్, సంజయ్‌కుమార్‌ల నాయకత్వంలో ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్, అనిల్ సారథ్యంలో ఇంజనీరింగ్, భాటియా నేతృత్వంలో టెక్నీషియన్స్ అసోసియేషన్స్ స్ఫూర్తిదాయకంగా పనిచేస్తూ ఉద్యోగుల మధ్య ఐక్యత, సంఘీభావం తీసుకురాగలిగారు. ఫలితంగా కొన్ని విజయాలు సాధించగలిగారు. ప్రసారభారతి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జాతీయ స్థాయిలో సమాఖ్యగా ఏర్పడ్డారు. ప్రైవేటీకరణను తీవ్రంగా ప్రతిఘటిస్తూ న్యూఢిల్లీలో పని చేస్తున్నారు. అయితే ఆ స్ఫూర్తి కేంద్రాల స్థాయికి చేరలేదు. రాబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల నాటికి వస్తుందని భావిస్తున్నారు.

దాదాపు నలభై వేల మంది ఉద్యోగస్తులతో కూడుకున్నది ప్రసార భారతి వ్యవస్థ. వీరిలో కనీసం ఒక శాతం ఉద్యోగస్తులు కూడా ప్రైవేటీకరణ తన ఇంటి దాకా వచ్చిందని అంగీకరించరు. వాస్తవాలు తెలుసుకోరు. ఆ దిశగా ఆలోచించే ప్రయత్నమే లేదు. అయితే అసోసియేషన్స్ పుణ్యాన నిజాలు తెలుస్తున్నా వాటిని నమ్మరు. కనీసం సమావేశాలకు కూడా హాజరుకారు. ఆకాశవాణి, దూరదర్శన్‌లను ప్రభుత్వం ఎందుకు మూసేస్తుందిలే అన్న భరోసా వారి మెదడును తొలుస్తూ ఉంది. సంస్థను మూసివేయడమంటే లాకౌట్ ప్రకటించడంలా చూడాల్సిన అవసరం లేదు. లాభనష్టాలు చూపించడం, ఉద్యోగస్తుల సంఖ్య నానాటికీ కుదిస్తూ రావడం, ప్రమోషన్‌లు లేకుండా మానసికంగా బలహీనం చేయడం వంటి చర్యలు చివరకు సంస్థను జీవచ్ఛవంలా మారుస్తాయి. ప్రస్తుతం ప్రసారభారతిలో జరుగుతోంది అదే.

అయితే ఎటువంటి ప్రతిఘటన లేకుండా న్యాయం జరగాలనే ఆలోచనలో అత్యధిక శాతం ఉద్యోగులున్నారు. వినతిపత్రాలు, విజ్ఞాపనలు ఇవ్వడం కూడా తప్పు అనే దైన్య స్థితి. మనవారికి ఏమీ కాదు అనే ధైర్యం. అందరి గురించి, భవిష్యత్తు గురించి మనకెందుకనే ఆలోచన. ఇటువంటి మానసికస్థితిలో ఉన్న ఉద్యోగుల ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్ దేశంలోని వందలాది పార్లమెంట్ సభ్యులకూ, కేంద్ర మంత్రులకూ, పత్రికల సంపాదకులకూ, రాజకీయ పార్టీల అధ్యక్షులకూ, ప్రముఖ ఆర్థికవేత్తలకూ సమస్యను తెలియజేస్తూ ఉత్తరాలు పంపడం కూడా ఒక అద్భుత పోరాట రూపంగా మారింది. మన గురించి మనం అలా చెప్పుకోవడం భావ్యం కాదనే పెద్దలు కూడా ఉన్నారు.

ఒకవైపు ప్రైవేటీకరణ ప్రకంపనలు తరుముకొస్తున్నాయి. మరోవైపు నిమ్మకు నీరెత్తినట్లు ఉద్యోగులు. దీంతో అసోసియేషన్స్ కూడా వాస్తవాలు తెలిసినా కనీస స్థాయిలో నిరసన తెలియజేయలేని స్థితి. ప్రపంచంలోని ఏ సంస్థలో కూడా ఇటువంటి వింత పరిస్థితి ఉండదు. ప్రసార భారతిని ఉద్యోగులు, ప్రజలు రక్షించుకోవాలి.

(రచయిత ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్స్ ఆఫ్ ఆలిండియా రేడియో అండ్ దూరదర్శన్ రాష్ట్ర కార్యదర్శి)

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడంగాని వీలుకావడం లేదు.

- వై. రామచంద్రం (సర్క్యులేషన్ మేనేజర్) **9949 391028**

Email : yatelliram@gmail.com

ఛత్తీస్‌ఘడ్ జైళ్లలో ఖైదీలపై అమలవుతున్న దుర్మార్గాలను, జైలు అధికారుల అవినీతి అక్రమాలను, ఖైదీల దుర్భర పరిస్థితిని వివరిస్తున్నారు **వొగ్గె చంద్రమౌళి**

ఛత్తీస్‌ఘడ్ జైళ్లలో అక్రమాలు

ఛత్తీస్‌ఘడ్‌లో 2004 నుండి నేటి వరకు బిజెపి ప్రభుత్వం కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. 2005లో సల్వాజుడుం పుట్టి జోరుగా కొనసాగిన రోజులలో సెంట్రల్ జైళ్లు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా బస్తర్ నుండి వచ్చే ఆదివాసులను చూసి జైల్లోని ఖైదీలే కాదు జైలు అధికారులు కూడా విచారం వ్యక్తం చేసేవారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనీ, వారికి తిండి పెట్టారనీ, వారి సంఘాలలో పని చేసారనీ, రకరకాల ఆరోపణలతో పోలీసులు, సల్వాజుడుం కార్యకర్తలు ఆదివాసులను అనేక రకాలుగా హింసించి తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారు. జైలు మొఖం ఎన్నడూ చూడని ఆదివాసులు, న్యాయస్థానాల గురించి అక్షరం తెలవని ఆ అమాయక జనాల కష్టాలు, వారి బాధలు చెప్పరానివి.

బయట పోలీసులు, సల్వాజుడుం కార్యకర్తలతో పడే బాధలకు తోడు జైలు అధికార్ల అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు హద్దు లేదు. వీటితో ఆదివాసీ ప్రజలు జైల్లో బిక్కుబిక్కుమని రోజుకో గండంగా బతుకులు వెల్లదీస్తున్నారు. 2005 దంతెవాడ, జగ్దల్‌పూర్ జైళ్లకు పరిమితమైన ఆదివాసులను 2006 నుండి రాయపూర్, దుర్గ్ జైళ్లకి తీసుకువచ్చి నింపేశారు. దీంతో వారికి మరిన్ని కష్టాలు పెరిగిపోయాయి.

ఛత్తీస్‌ఘడ్ జైళ్లల్లో ఖైదీలు ఎదుర్కొనే ముఖ్యమైన సమస్యలు కడుపు నిండా తిండి, ఉండడానికి సరియైన జాగా, సరియైన వైద్యం, సరిపోయేన్ని నీళ్లు దొరకకపోవడం. ఇక్కడి జైళ్లలో అన్నం, రొట్టె రెండూ ఇస్తారు. కానీ అన్నం తినే వారికి రొట్టె ఇవ్వరు. రొట్టె తినేవారికి అన్నం ఇవ్వరు. అంతే కాకుండా ఉదయం టిఫిన్ కిచిడి ఇవ్వాలి. కానీ, కిచిడి కాకుండా బియ్యాన్ని ఉడకబెట్టి అందులో నీళ్లు పోసి ఇస్తారు. దీన్ని ఛత్తీస్‌ఘడ్ భాషలో బాసి అంటారు. (ఛత్తీస్‌ఘడ్‌లో ప్రజలు రాత్రి తినగా మిగిలిన అన్నంలో నీళ్లు పోసి ఉదయం దాన్ని తిని పనులకు వెళతారు. అలాంటి అన్నాన్ని బాసి అంటారు.) అక్కడి అన్ని జైళ్లల్లో ఖైదీలకు బాసిని ఇచ్చి కిచిడి ఇస్తున్నాం అంటారు. జైళ్లలో అందరు ఖైదీలు ఈ బాసిని తినడానికి ఇష్టపడరు. కిచిడికి తోడు 60 గ్రాముల పప్పు ఇవ్వాలి. అదీ పూర్తిగా ఇవ్వరు.

ఈ కిచిడి తినని వారికి గోధుమ రొట్టె (115 గ్రాముల గోధుమ పిండి) ఇవ్వాలని మాన్యువల్‌లో ఉంది. కానీ ఇవ్వరు. దాదాపుగా అన్ని జైళ్లల్లో రొట్టెను జైలు అధికారులు ఖైదీలకు అమ్ముకుంటారు. రోజు ఉదయం, సాయంత్రం 8 రొట్టెలకు నెల రోజులకు 200 నుండి 400 రూపాయల వరకు వసూలు చేస్తారు. దీంతోపాటుగా వండిన కూరలు ఖైదీలకు అమ్ముకుంటారు. ఒక కటోరీకి ఉదయం, సాయంత్రానికి కలిపి నెలకు 150 నుండి 200 రూపాయల వరకు వసూలు చేస్తారు. (మంచిగా వండి ఇస్తారు). జైళ్లలో ఖైదీలు తినే తిండిని అధికార్లు అమ్ముకొని డబ్బులు వసూలు చేసే పద్ధతి ఇది. ఈ విధానం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర జైళ్లలో బాహాటంగా జరుగుతుంటుంది. ఈ పద్ధతిని జైలు భాషలో డాబా సిస్టమ్ (హోటల్) లేదా టెకా సిస్టమ్ (కాంట్రాక్ట్ పద్ధతి) అంటారు. ఇందులో చక్కర్ ఇన్‌చార్జ్ (ఒక స్థాయి జైలు అధికారి), ఇతనితో పాటుగా వార్డ్ చక్కర్ ఇన్‌చార్జ్ (శిక్షలు పడ్డ ఖైదీల తరఫున వారి సమస్యలను అధికార్ల దృష్టికి తీసుకపోయి చర్చించి పరిష్కరించడానికి ఒక శిక్ష పడ్డ ఖైదీని నియమిస్తారు. ఇతను కొన్ని అధికారాలు కూడా కలిగి ఉంటాడు. ఈ పద్ధతి ఈ రాష్ట్ర జైళ్లలో మాత్రమే ఉంది.) వీరు ఇద్దరు కలిసి టెకా లేదా డాబా సిస్టమ్ ద్వారా డబ్బుల దందా చేస్తారు. వార్డ్ చక్కర్ ఇన్‌చార్జ్ ఖైదీల హక్కులను సంరక్షణ కొరకు నిలబెట్టగా అధికార్లతో అంటకాగి లక్షలు గడిస్తూ ఉంటాడు. ఈ కాలా దాందా కింది నుండి పైఅధికార్ల వరకు (సిపాయి నుండి ఐజి వరకు) బహిరంగ రహస్యం. జైలు అధికారియైన చక్కర్ ఇన్‌చార్జ్‌కి, వార్డ్ చక్కర్ ఇన్‌చార్జ్‌కి మధ్య ప్రతి నెల ఒప్పందం జరుగుతూ ఉంటుంది. అందులో ప్రతి నెల 30 వేల నుండి 50 వేల వరకు రహస్య ఒప్పందాలు చేసుకుంటారు. చేసుకున్న ఒప్పందం ప్రకారంగా వార్డ్ ఇన్‌చార్జ్ అధికారికి చెల్లిస్తాడు. పెద్ద మొత్తం చెల్లించిన వార్డర్ ఖైదీల పైన ఎన్ని రెట్లు అయిన సంపాయించుకోవచ్చు.

వీళ్లు ముందే చేసుకున్న రహస్య ఒప్పందాల ప్రకారంగా రోజూ కొత్తగా వచ్చే ఖైదీలను ఒక ప్లాను ప్రకారంగా ప్రత్యేకంగా ఎంచుకున్న బ్యారక్‌లలోకి పంపుతారు. అక్కడ 15 రోజులు ఉన్న తర్వాత ఖైదీలతోని అనుకున్న విధంగా ఒప్పందాలు అయిపోతాయి. ఆ తర్వాత ఎవరిని ఏయే బ్యారక్‌లలోకి పంపాలో అక్కడికి పంపుతారు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. ప్రత్యేకంగా ఎంచుకున్న బ్యారక్‌లకు వార్డ్ చక్కర్ ఇన్‌చార్జ్ తనకు అనుకూలమైన వారిని ప్రత్యేక బ్యారక్ బాధ్యులుగా నియమించుకుంటాడు. వీరికి వార్డ్ చక్కర్ ఇన్‌చార్జ్ కొన్ని సౌకర్యాలు కూడా కల్పిస్తాడు. దీంతో వారు ఎలా చేయాలంటే అలా చేసి తీరుతారు. ప్రత్యేక బ్యారక్‌లలోకి రాత్రి బ్యారక్ లాకప్ అయిన తర్వాత ఆ బ్యారక్ బాధ్యుడు, మరికొందరు కలిసి కొత్తగా వచ్చిన ఖైదీలందరిని ఒక చోట

కూర్చోబెట్టి (వార్డ్ చక్కర్ ఇన్‌చార్జ్ అనుమతితోనే) మొత్తం వివరాలు తెలుసుకొని ఎవరి వద్ద ఎంత వసూలు చేయాలో ఒక నిర్ణయానికి వస్తారు. ఆ తర్వాత ఎవరికి ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇవ్వాలో నిర్ణయించు కుంటారు. కొందరిని మానసికంగా బాధపెట్టాలనుకుంటే వారికి సరైన తిండి ఇవ్వరు, బిస్తరు ఇవ్వరు. బట్టలూడదీసి నిలబెట్టి, బూతులు తిట్టి, లెట్రిన్ దగ్గర నలుగురు పడుకునే జాగాలో ఎనిమిది మందిని పడుకోబెట్టడం చేస్తారు.

మరికొందరిని (తక్కువ స్థాయి వారిని) అందరి ముందర భయానకంగా చిత్రహింసలు పెడతారు. వీరి రోదనలతో కొత్తగా వచ్చిన ఖైదీలు భయకంపితులవుతారు. ప్రత్యేక బ్యారక్‌లలో రాత్రి జరిగే చిత్రహింసలతో, అరుపులు, ఏడుపులు ఇతర బ్యారక్‌లకు కూడా వినబడతాయి. అయినా ఏమిటి అని తొంగి చూసేవారు ఉండరు. అంతే కాక డ్యూటీలో ఉన్న సిపాయిలు కూడా అక్కడికి పోరు. అందరికి తెలిసిన విషయమే కాబట్టి రెండవ రోజు దెబ్బలు అయిన తర్వాత బ్యారక్ బాధ్యుల్లో ఒకరు ఖైదీల వద్దకు వచ్చి ఎంతో మంచి వ్యక్తి లాగ 'చూసారా, రాత్రి ఎన్ని దెబ్బలు, ఇబ్బందులు. వాళ్లు మంచి వాళ్లు కారు. ఎంతో కొంత డబ్బులు ఇవ్వండి లేదా మళ్లీ రాత్రికి దెబ్బలు తప్పవు. డబ్బులు ఇచ్చారంటే మీకు మంచి జాగా, మంచి తిండి, బిస్తర్ అన్ని తీర్ల సౌకర్యాలు ఇస్తార'ని అర్థం చేయిస్తాడు. బిలాస్‌పూర్ జైల్లో దళితుడు, వికలాంగుడైన టీచర్ జ్ఞానిసింగ్ ఒక కేసులో జైలుకు వచ్చాడు. వచ్చిన రోజే ప్రత్యేక బ్యారక్‌కు పంపబడ్డాడు. అక్కడ డబ్బుల కొరకు చిత్రహింసలు పెట్టగా రెండవ రోజు చనిపోయాడు. ఈ విషయంపై దళిత సంఘాల వాళ్లు లొల్లి చేయగా, బ్యారక్ బాధ్యుడైన సాహుపై కేసు మోపబడింది. ఆ తర్వాత అతనికి శిక్ష కూడా పడింది.

ఇదే బిలాస్‌పూర్ జైల్లో మరో కేసు కూడా జరిగింది. అందులో ముస్లిం యువకుడు చనిపోగా సిటీలో ముస్లింలకు సమాచారం తెలిసి జైలు గేటు ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేయగా, 'మీ యువకుణ్ని మేము చంపలేదు. పోలీసులు కొట్టిన దెబ్బలకు చనిపోయాడ'ని నచ్చచెప్పి పంపారు. గేటు ముందు ఆందోళకారులు 'ఆ యువకుణ్ని చంపిన వార్డర్‌ను ఎన్నటికీ వదలమ'ని హెచ్చరిక చేసి వెళ్లిపోయారు.

కొన్ని జైళ్ల నుండి విడుదలయి ఇంటికి పోయిన తర్వాత చనిపోయిన వారున్నారు. డబ్బుల కొరకు కొట్టే దెబ్బల మూలంగా కొందరు జీవితాంతం ఎలాంటి పని చేయలేని స్థితికి నెట్టబడుతున్నారు. దీంతో ఖైదీలు వారి ఆర్థిక పరిస్థితిని బట్టి ఐదువేల నుండి ఇరవై వేల వరకు ఒప్పందం చేసుకుంటున్నారు. ఒప్పందం చేసుకున్న వారికి అన్ని రకాల సౌకర్యాలు అందుతాయి. అక్కడ వారికి ఐదు నక్షత్రాల హోటళ్లను తలపిస్తాయి. బిస్తర్ వేయడానికి, తీయడానికి, తిన్న పళ్లాలు కడగడానికి, బట్టలుతకడానికి, కాళ్లు, ఒళ్లు ఒత్తడానికి పని మనుషులు ఉంటారు. ఈ పనులకు చిన్న చిన్న చోరీ కేసు లాంటి వాళ్లను చూసి తన్ని ఆ పనులన్నీ చేయిస్తారు. శిక్షలు పడ్డ, ఇతర ఖైదీల తరపున బాధ్యతగా ఉండాల్సిన వార్డ్ చక్కర్ ఇన్‌చార్జులు అధికార్లతో మిలాఖతయి ఈ విధంగా జైలు మాఫియాలుగా తయారయ్యారు. వీరంతా హత్య కేసుల్లో శిక్షలు పడ్డవారే. ఇలాంటి కరుడుగట్టిన నేరస్తులను జైలు అధికారులు అక్రమ పద్ధతులకు ఉపయోగించుకుంటారు. ఈ వార్డ్ చక్కర్ ఇన్‌చార్జ్‌లు కొన్ని అధికారాలు కలిగి ఉంటారు. కాబట్టి వీళ్లు ఒక టెకా సిస్టంకు పరిమితం కారు. వీళ్లు మొత్తం జైలునే నడుపుతుంటారు. జైల్లోని ఖైదీల చిన్న చిన్న తప్పులను చూపి భయానకంగా కొట్టి నిరంతరం భయం నీడలో నడుపుతుంటారు. ఖైదీలకు చెందాల్సిన అనేక సౌకర్యాలను ఇవ్వకుండా అధికార్లతో కలిసి పంచుకు తింటారు. ఈ విధంగా వీళ్లు లక్షల రూపాయలు సంపాయించుకున్న ఉదాహరణలున్నాయి. అంతే కాకుండా జైల్లో వీరు ఎక్కడ లేనంత రాజభోగాలు అనుభవిస్తుంటారు. వీరికి ఎదురు ఉండదు. ఏదంటే అది చేయగలరు. వీళ్లకు జైల్లోకి బయటి నుండి మహిళలు కూడా వస్తారు.

ఈ ముఠాల మధ్య తగాదాలతో ఈ విషయం 2008 ఏప్రిల్‌లో టి.వి. వార్తల్లో ప్రసారం కావడంతో బయటి ప్రపంచానికి జైళ్లలో జరిగే రాసలీలలు తెలిసి పోయాయి. దీంతో రెండు ముఠాల మధ్య నాలుగు రోజులు యుద్ధం జరిగింది. ఇందులో నలుగురు సామాన్య ఖైదీలకు సీరియస్‌గా గాయాలయ్యాయి. బయటి నుండి 200 మంది పోలీస్ ఫోర్స్ వచ్చినా కంట్రోల్ కాకపోవడంతో ఐదవ రోజు రెండు ముఠాల నాయకులనూ మరి కొందరినీ వేరు వేరు జైళ్లకు ట్రాన్స్‌ఫర్ చేసిన తర్వాత అంతా సద్దుమణిగింది.

ఈ జైలు మాఫియాలకు ఖైదీల నుండి ఏయే పద్ధతులలో డబ్బులు వసూలు చేయాలో బాగా తెలుసు. అందుకొరకు ఖైదీలకు చెందాల్సిన సౌకర్యాలన్నిటినీ చెందకుండా చేస్తారు. ఖైదీలకు చద్దర్లు, బ్లాంకెట్స్, బట్టలు సంవత్సరానికి ఒకసారి ఇవ్వాలి. కానీ వీటిని బయటికి అమ్ముకుంటారు. తినే నూనె, శరీరానికి రాసుకునే నూనె, సబ్బులు, సోడా, పామాయిల్, ఆసిడ్స్, పేస్ట్ – ఇలా ఎన్నో మొత్తం అమ్ముకొని పంచుకు తింటారు. తిండి విషయంలో డాబా సిస్టం మూలంగా ఇతర ఖైదీలకు తిండి సక్రమంగా ఇవ్వరు. అందరికి తిండి సరిగా ఇస్తే వారి డాబా సిస్టం నడవడం కష్టం కాబట్టి, ఇది కూడా ఒక కారణం. డాబా సిస్టంలో తినలేని వారి కడుపుకోత చూడాలి. వీరికి జైళ్లలో పాయిలీ ఖానా ఇస్తరు. పాయాలీ ఖానా అంటే ఒక రకంగా థర్డ్ క్లాస్. దాన్ని జంతువులు కూడా ముక్కుతో చూడవు. అంత ఘోరంగా ఉంటుంది. ఆ కూరలో నీళ్లు, కారం, ఉప్పు తప్ప ఏమీ ఉండదు. ఇలాంటి పాయిలీ ఖానా తినేవారి సంఖ్య నలభై శాతం ఉంటుంది.

డాబాలలో తినేవారి సంఖ్య 25 నుండి 30 శాతం వరకు ఉంటుంది. ఇక 30 నుండి 35 శాతం వారు డాబాల స్థాయి డబ్బు చెల్లించే శక్తి వీరిలో ఉండదు. కాకపోతే అంతో ఇంతో కలిగి ఉంటారు. కాబట్టి వీరిలో కొందరు రెండు పూటలకు గాను రొట్టెలు కొనుక్కొని కడుపు నింపుకోవాలని చూస్తారు. నెలకి రెండు వందలు ఇచ్చి రొట్టెలు కొంటారు. వీటిపైకి ఇంటి నుండి ఏదో ఒకరకమైన పచ్చడిని తెప్పించుకుంటారు. మరి కొందరు ఒక కూర మాత్రమే రోజుకు రెండు సార్లలకు 150 నుండి 200 ఇచ్చి కొనుక్కుంటారు. మరికొందరు రొట్టె, కూర లేకపోయినా 500 నుండి 1000 రూపాయల వరకు ఇచ్చి మంచి జాగా కొంటారు. వీరి చివరి చిన్న సెక్షన్ కొందరు కలిసి గ్రూప్‌గా ఏర్పడి సిపాయిలకు 20, 30 రూపాయలు ఇచ్చి ఇంటి నుండి మంచి

నూనె తెప్పించుకొని రహస్యంగా కూరలు వండుకొని తింటారు. పాయిలీ ఖానా తినే 40 శాతం ఖైదీలు ఏమీ ఇచ్చుకోలేని పరిస్థితి. వీరికి ఇంటి నుండి ఎలాంటి సహాయం అందదు.

జైలు అధికారులు కడుపు నిండా తిండి ఇవ్వరు. బయటకు పోవడానికి బెయిల్ కూడా దొరకదు. సంవత్సరాల తరబడి కడుపు నిండా తిండి దొరకక ఏ దిక్కులేని ఈ సెక్షన్ నుండి నేడు ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ జైళ్లలో ఆత్మహత్యలు చేసుకొని చనిపోతున్నారు. లేదా మానసికంగా సమతుల్యత దెబ్బతిని పిచ్చి వాళ్లవుతున్నారు. ఆత్మహత్యలు చేసుకోవడం, పిచ్చివాళ్లుగా మారడం అనేది ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర జైళ్లల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. అంతే కాకుండా జైల్లో రకరకాల రోగాలతో సరైన ట్రీట్‌మెంట్, మందులు లేక ఎందరో చనిపోతారు. ఈ విధంగా చనిపోయే వారి గురించి వారికి మానసికంగా సరిగా లేకనే చనిపోయారని కట్టు కథలు చెప్పి అధికారులు చేతులు దులుపుకుంటారు.

ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ జైళ్లలో ఖైదీల సంఖ్య జైల్లో ఉండాల్సిన దాని కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. దుర్గ్, జగ్దల్‌పూర్ జైల్లో అతి దారుణం. దుర్గ్ జైలు 2007 నాటికి జిల్లా జైలుగా ఉండేది. దానికి అనుగుణంగానే నిర్మాణం చేసారు. ఇప్పుడు అది సెంట్రల్ జైలు. అక్కడి ఒక బ్యారక్‌లో ఇరవై మంది ఖైదీలుండేవారు. ఇప్పుడు ఇరవై మంది జాగాలో డెబ్భై మందిని నింపుతున్నారు. ఈ పరిస్థితికి తోడుగా జైలు అధికార్ల జులుం మూలంగా ఖైదీలను రోజు 18, 19 గంటలు బ్యారక్‌లలో బంధించి ఉంచుతారు. గంటల తరబడి లాకప్ చేయడంతో ఖైదీలు మానసికంగా కుంగిపోతారు. పొద్దంతా బ్యారక్‌లలో బాయిలర్ కోళ్లలాగ ఉడికి పోతారు. బ్యారక్‌లలో జాగా సరిపడక పొద్దంతా సతమతం అవుతారు. గంటల తరబడి ఒకే జాగలో ఉండడంతో మనిషిలో సహన శక్తి పూర్తిగా నశించి, అసహనం పెరిగిపోయి పక్కన ఉన్న ఖైదీలతో చిన్న చిన్న కారణాలతో ఒకరిపై ఒకరు విరుచుకుపడి ఎడతెగని జగడాలకు, కొట్లాటలకు దిగుతారు.

ఛత్తీస్‌ఘడ్ జైళ్ల అధికారుల పని విధానం, వారి ఆలోచనలు చూసినవారికి తెలంగాణ లోని దొరలు గుర్తుకు వస్తారు. వీళ్లు జైలుకు కొన్ని నియమాలుంటాయని గానీ, ఖైదీలకు కొన్ని హక్కులుంటాయని గానీ గుర్తించరు. తాము అనుకున్న విధంగానే నడిపిస్తూ ఉంటారు. రాజనంద్‌గావ్‌లో జిల్లా జైలు సుపరింటెండెంట్ ఆ జైల్లో ఖైదీలకు చదువుకోవడానికి పేపర్ ఎప్పుడూ ఇవ్వడు. ఛత్తీస్‌ఘడ్ జైలు నియమం ప్రకారంగా యాభై మంది ఖైదీలకు ఒక పత్రిక ఇవ్వాలి. పేపర్ ఎందుకు ఇవ్వరని చర్చించినందుకు నాలుగు రోజులు ఆ జైల్లో ఉండాల్సిన ఖైదీని ఒకటే రోజులో తిరిగి తను ఉన్న జైలుకు వాపసు పంపించాడు. అదే విధంగా దుర్గ్ సెంట్రల్ జైలులో పేపర్ రాత్రి 8 గంటలకు ఇస్తారు. ఇలా రాత్రి ఇస్తే ఎలా చదవాలని సూపరింటెండెంట్‌ను అడిగితే ఈ జైల్లో ఇలానే ఇస్తారని జవాబు ఇచ్చాడు. ఆ తర్వాత తెలిసిన విషయం ఏంటంటే, జైలుకు రావాల్సిన పేపర్లు సూపరింటెండెంట్ కుటుంబం దినం అంతా చదువుకొని రాత్రికి ఖైదీలకు ఇస్తారని. అతను బదిలీ అయి మరొక అధికారి వచ్చాక పేపర్ దినంలో ఇవ్వాలని అనేక సార్లు అడగగా రాత్రి ఇచ్చే పేపర్‌ను సాయంత్రం 4 గంటలకు ఇచ్చారు. ఇందులో ఇతని ప్రత్యేకత కూడా చూయించుకున్నాడు. అది ఏంటంటే పేపర్‌లో నక్సలైట్‌ల సమాచారం ఉండకూడదనీ, అంతే కాకుండా హోం మంత్రి చిదంబరం లాంటి వాళ్లు నక్సలైట్లకు వ్యతిరేకంగా మాట్లాడిన విషయాలను కూడా కత్తిరించి ఇచ్చేవారు. ఒకొకసారి పేపర్ అస్థిపంజరం లాగ కనపడేది. చదవాలని అనుకునే వారికి నిరాశ కలిగేది.

ఇదే కాదు కోర్టుకు పోయి వచ్చే క్రమంలో ఇండియా టుడే లాంటి పత్రికలు కొనుక్కొని తీసుకున్నా లోనికి రానివ్వరు. బయట బస్టాండ్‌లలో గానీ రైల్వే స్టేషన్‌లలో దొరికే మామూలు పత్రికలను కూడా రానివ్వరు. ఇక తెలుగు పత్రికలను చూస్తే చిర్రెత్తిపోతారు. తెలుగు వాళ్లంటే కూడా అంతే. బిలాస్‌పూర్ జైల్లో పై అధికారుల అనుమతితో కొన్ని తెలుగు పుస్తకాలు (హైదరాబాద్ బుక్ ట్రస్ట్ కూడా) అప్పుడు కొన్ని ఇప్పుడు కొన్ని తెప్పించుకుంటే, ఆ జైలు బ్రేక్ అయిన తర్వాత మొత్తం పుస్తకాలను అందులో డైరీతో పాటుగా కొన్ని హిందీ పుస్తకాలు మొత్తం తీసుకపోయి కాలబెట్టారు. ఇట్లా రాస్తూ పోతే అధికారుల అనాగరిక చర్యలు చాలా ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితిలో ఛత్తీస్‌ఘడ్‌లో ఉన్న నాలుగు సెంట్రల్ జైళ్లు ఉండగా అందులో మూడు జైళ్లలో మాత్రమే మావోయిస్టు కేసుల వారిని నింపేశారు. అంబికపూర్ జైల్లో 70, రాయపూర్ జైల్లో 70 వరకు, జగ్దల్‌పూర్‌లో వందల సంఖ్యలో ఉండే వారు. మిగతా బిలాస్‌పూర్ జైల్లో అప్పుడు లేరు. కాకపోతే 2007 రాయ్‌పూర్ జైలు నుండి ఇద్దరిని, 2008 మధ్యలో అంబికాపూర్ జైలు నుండి 18 మంది మావోయిస్టు కేసుల వారిని ట్రాన్స్‌ఫర్ చేసి పంపారు. 2006 నాటికి దుర్గ్ జిల్లా జైలు ఉండే కాబట్టి ఇక్కడ ఎవ్వరిని పెట్టలేదు. జహానాబాద్ జైలు బ్రేక్ అయిన తర్వాత మావోయిస్టు కేసుల వారిని ఎవ్వరిని కూడా ఉప జిల్లా జైల్లో పెట్టకూడదనే నిర్ణయం తీసుకున్నారు. కాబట్టి ఛత్తీస్‌ఘడ్‌లో ప్రధానంగా మూడు సెంట్రల్ జైళ్లలోనే పెట్టారు. ఆ తర్వాత 2007 నుండి దుర్గ్ సెంట్రల్ జైలు అయ్యాక ఇక్కడ కూడా పెట్టడం చేస్తున్నారు. రాయ్‌పూర్ జైల్లో 70 మందిని 20 సెల్స్‌లో ఒక్కొక్క సెల్స్ ముగ్గురు నుండి ఐదుగురి వరకు పెట్టారు. అయితే మిగతా జైల్లో సెల్స్ లేవు కాబట్టి అక్కడ అందరిని బ్యారక్‌లలో పెట్టారు.

రాయ్‌పూర్ జైల్లో తిండి సమస్యలతో పాటుగా అనేక సమస్యలుండేవి. ఒకే బ్యారక్‌లో ఉండే (నక్సల్ కేసులవారు) వారు ఒక దగ్గర కూర్చోని మాట్లాడరాదు. వేరు వేరు బ్యారక్‌లలో ఉండేవారు కలుసుకోవడమనేది అంతే. కోర్టులకు ఎప్పుడు తేదీలుండేవో చెప్పేవారు కాదు. కోర్టులకు క్రమంగా తీసుకపోవపోవడం, కుటుంబం నుండి గానీ, ఇతర బంధువులు, స్నేహితులు కలవడానికి వచ్చినా మిలాఖత్‌లు ఇవ్వకపోవడం, ఇంటర్నెట్ మిలాఖత్‌లు నెలక ఒకసారి ఇచ్చేవారు, అది కూడా 10, 15 నిమిషాలకు మించకపోయేది. ఉత్తరాలు ఎక్కడికి రాసినా పంపకపోయేది. ఆదివాసి కామ్రేడ్స్ తంబాకు, బీడీ లేకుండా ఉండలేరు. కొందామంటే చేతిలో పైసలుండవు. కోర్టు వద్దకు ఇంటి వాళ్లను కలుసుకొని కొన్ని సామాండ్లు, డబ్బులు తెప్పించుకుందామంటే కోర్టుకు పోయేరోజు వీరికి తెలిసింది. ఏదోరకంగా ఇంటివాళ్లకు తెలిసి

కోర్టు కాడికి వస్తే పోలీసులు మాట్లాడనివ్వరు. ఇది ఒక పెద్ద సమస్య. కోర్టుకు పోయిన వారికి కోర్టులో న్యాయాధికారితో మాట్లాడి ఇంటి వాళ్లతో మాట్లాడవచ్చు అనేది తెలవక పోవడంతో కోర్టు వద్దకి వచ్చిన కుటుంబ సభ్యులు మాట్లాడకుండానే తిరిగి ఇంటికి వెళ్లిపోయేవారు. ఒకరు ఇద్దరు పోలీసులకు డబ్బులు ఇస్తే ఐదు పది నిమిషాలు మాత్రమే మాట్లాడనిచ్చేవారు. సెల్స్‌లలో గంటల తరబడి లాకప్ చేసి ఉంచడం మూలంగా అటా, పాటా, చదువు మచ్చుకు కానరావు. రోజులో కొద్ది సమయం మాత్రమే కూల్లాగా ఉంచేవారు. ఆ సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగిన సిపాయిలు లేదా అధికారుల నుండి తిట్లు, బెదిరింపులు ఎదుర్కోవలసి వచ్చేది. ఏ చిన్న సమస్య చెప్పుకున్నా అధికారులు పట్టించుకునే వారు కాదు. పైగా బెదిరింపులు కూడా చేసేవారు. ఇవ్వన్ని బాధలతో పాటుగా రోజుల తరబడి తిండి సరిగా దొరకక అల్లాడి పోయేవారు.

ఈ విధమైన అనేక సమస్యల నుండి బతుకు బాధాకరం అయిన ఆదివాసి ఖైదీలు కలిసికట్టుగా పోరాడకుండా బతుకే లేదనుకున్నారు. 2006 జూలై నుండి కొన్ని డిమాండ్స్ రూపొందించుకొని ఆ డిమాండ్స్ సాధన కొరకు కొన్ని పోరాట పద్ధతులు ఎంచుకున్నారు.

మొత్తం ఎనిమిది డిమాండ్స్‌తో పోరాటాన్ని ప్రారంభించారు : 1) ప్రతి ఒక్కరికి సరిపోయే ఆహారం, కూరలు ఇవ్వాలి. 2) కిచిడి (బాసి) బదులు రొట్టె, కూర, మంచి సరయిన చాయ్. 3) సెల్స్ నుండి తీసి బ్యారక్‌లలో పెట్టాలి. 4) రోజు గంటల తరబడి లాకప్ చేయరాదు. 5) రోజుకు రెండు పేపర్లు ఇవ్వాలి. 6) ఆడుకోవడానికి ఆట వస్తువులు ఇవ్వాలి. 7) రెగ్యులర్‌గా కోర్టుకు తీసుకపోవాలి. 8) ఇంటర్నల్ ములాఖత్ 15 రోజులకొకసారి ఇవ్వాలి.

ఈ డిమాండ్స్ సాధన కొరకు వారి చైతన్యానికి అనుగుణంగా పోరాట పద్ధతులు ఎంచుకున్నారు. మొదట, పరేడ్ రోజున అధికారుల ముందు అందరు నిలబడి ఎనిమిది డిమాండ్స్‌ను డిమాండ్ చేయడం. రెండవది, పరేడ్ రోజున అధికారుల పరేడ్‌ను బహిష్కరించి నిరసనను తెలియచేయడం. మూడవది, లాకప్ కాకుండా ఉండి నిరసనను తెలియ జేయడం. వీటికి తోడుగా అన్నాన్నీ, టిఫిన్‌నూ, చాయ్‌నూ మంచిగా లేదని వాపస్ పంపడం.

అలాగే కోర్టులో న్యాయాధికారికి చెప్పడం, రాసి ఇవ్వడం, మీడియాకు రాయడం, మానవ హక్కుల అధికార్లకు రాయడం, హక్కుల సంఘం వారు లోనకు వస్తే సమస్యలు వివరించడం (ఎలాంటి మానవ హక్కుల వాళ్లను గానీ మరే ఇతర అధికార్లనూ సెల్స్‌లోనికి రానివ్వరు.

అనుకున్న విధంగా అధికారుల ముందు డిమాండ్స్ పెట్టడం జరిగింది. దీంతో అధికారులు బెంబేలెత్తిపోయారు. దీంతో ఒకరోజు అధికారుల మీటింగ్ జరుపుకొని ఈ డిమాండ్స్ ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదనీ సభ్యులను బెదిరించడం, ఇక్కడి నుండి ట్రాన్స్‌ఫర్ చేసి ఇతర జైళ్లకు పంపుతామని, ఈ విధంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే మరిన్ని కొత్త కేసులు వస్తాయనీ, సభ్యుల మధ్య చీలికలు తీసుక రావడానికి అనేక ప్రయత్నాలు చేసారు. కొందరిని అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నం చేసారు. పోరాటాన్ని విచ్ఛిన్నం చేయడానికి అన్ని తీరుల దండోపాయాలను ఉపయోగించారు. కొందరు ఆందోళనకు గురయ్యారు. చాలా మంది సభ్యులు వారి బెదిరింపులను లెక్కచేయకుండా నెలరోజుల పాటు అనుకున్న, అన్ని పోరాట పద్ధతులను అనుసరించారు.

ఇదే సమయంలో బయట కొంత ప్రచారం కూడ జరిగింది. అదే రోజుల్లో అంబికాపూర్ జైల్లో 70 మంది నక్సలైట్ ఖైదీల నాయకత్వంలో మిగతా జైళ్లలో ఉన్న ఖైదీలందరు దాదాపు వెయ్యి మంది వరకు ఏకమై నాలుగు రోజులు నిరాహారదీక్షలు నిర్వహించారు. వీరికి మద్దతుగా బయట నుండి కుటుంబ సభ్యులు, సామాజిక కార్యకర్తలు జైలు గేటు ముందు ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడి జైలు అధికారులు ఖైదీల డిమాండ్స్ ఒప్పుకోక తప్పలేదు. ఈ ఆందోళన ప్రభావం రాయ్‌పూర్ జైలు అధికారులపైనా పనిచేసింది. రాయ్‌పూర్ జైలు అధికారులు కూడా ఎనిమిది డిమాండ్స్‌లలో ఏడింటిని ఒప్పుకున్నారు. బయట బ్యారక్‌లలో పెట్టలేమని, సెల్స్‌లోనే ఉంచి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. తరువాత సెల్స్‌ను సరిదిద్ది ఫాన్స్ కూడా పెట్టించారు.

జైల్లో జరిగిన పోరాటాలు, సాధించిన విజయాలు జైల్లో ఉన్న ఇతర ఖైదీలపై చాలా ప్రభావం వేసాయి. అయితే జైలు అధికారులు మాత్రం ఖైదీలు సాధించిన విజయాలను ఎక్కువ రోజులు నడవనివ్వద్దనుకున్నారు.

ఛత్తీస్‌ఘడ్‌లో మానవ హక్కులు, పౌరహక్కులను అడిగేవారు గానీ, ఇతర ప్రజా సంఘాలు గానీ చాల బలహీనంగా ఉన్నాయి. మీడియాను, పత్రికలను బిజెపి ప్రభుత్వం పూర్తిగా అణచిపెట్టింది. దీంతో జైళ్ల గురించి అడిగేవారు కనపడరు. జైలుకు మానవహక్కుల వాళ్లుగానీ, న్యాయాధికార్లు గానీ చాల తక్కువగా వస్తారు. చాలాసార్లు గేట్లో అధికారులను కలిసి అక్కడి నుండే వెనుదిరిగి వెళ్లిపోతారు. ఒకసారి రాయ్‌పూర్ జైల్లోకి వచ్చిన సందర్భంగా చాలా విషయాలు వారి దృష్టికి తీసుకపోవడం జరిగింది. అప్పుడు చాలానే ప్రచారం జరిగింది. అదే మానవహక్కుల వాళ్లు దుర్గ్‌కు వచ్చిన సందర్భంగా 60, 70 మంది వారి ముందు నిలబడి చాలా విషయాలు వివరించారు. కానీ అందులో ఒక్క విషయాన్ని కూడా బయట ప్రకటించలేదు. పైగా దుర్గ్ జైలు చాలా బాగా ఉంది అంటూ ప్రకటన చేసారు.

దంతెవాడ జైలు బ్రేక్ జరిగిన తర్వాత అక్కడి ప్రభుత్వం జైళ్లలో సంస్కరణలు తీసుకరావాలని హడావుడిగా 30 కోట్లు విడుదల చేసింది. నిజంగానే జైళ్లు బాగుపడతాయని ఖైదీలు ఆశించారు. సంస్కరణల పేరుతో జైళ్ల నుండి ఖైదీలు పారిపోతున్నారని, పెద్ద పెద్ద టవర్స్ నిర్మాణం చేసి వాటిపైన సురక్ష గార్డులను నిర్మించి ఖైదీలను రక్షిస్తారట. జైల్లో కెమెరాలు పెట్టి ఖైదీలు ఏం చేస్తున్నారో వాటి నుండి చూస్తూ ఉంటారు. ఇవి కూడా వారి రక్షణకేనట. వీడియో కెమెరాలు, సూపర్ ఫ్లడ్‌లైట్‌లు, మరికొన్ని జైలు గోడలు ఎత్తులు పెంచారు. ఖైదీలు గోడలు దూకి పోతున్నారని. మరికొన్ని జైళ్లలో గోడలపై కరెంట్ తీగలు అమర్చారు. ఖైదీల కొరకు మాత్రం చేసింది ఏమీలేదు.

(రచయిత ఛత్తీస్‌ఘడ్ జైళ్లలోనూ, ఇతర రాష్ట్రాల జైళ్లలోనూ చాల సంవత్సరాలు గడిపిన రాజకీయ ఖైదీ) ❖

లాభాలే ధ్యేయంగా ఉన్న పెట్టుబడిదారీ సమాజం మార్కెట్‌ను విస్తరించే క్రమంలో ప్రజలనూ, ప్రకృతినీ దోపిడీ చేస్తోందనీ, పర్యావరణ వినాశనానికి కారణమవుతోందనీ అంటున్నారు **పి. వరలక్ష్మి**

పర్యావరణ సంక్షోభానికి కారకులెవరు?

కోపెన్‌హాగెన్‌లో మార్కెట్ ప్రయోజనాలకు పర్యావరణాన్ని బలిపెట్టాక, ఎప్పటి నుండో భారత పార్లమెంట్‌లో న్యూక్లియర్ బిల్లు పొంచి ఉన్నాక, భోపాల్ దురాగతంపై పాతికేళ్లుగా నడుస్తున్న అమానవీయ వ్యవహారానికి క్లైమాక్స్‌గా జూన్ 7న వెలువడిన తీర్పు ఆశ్చర్యపరచదు గాని రోజురోజుకూ చులకనవుతున్న ప్రజల ప్రాణాల విలువ బాధపెడుతుంది. పెట్టుబడి ముదిరితే సామ్రాజ్యవాదమూ, యుద్ధమూ దాని అనివార్య అంతర్గత లక్షణాలవుతాయని 20వ శతాబ్దంలోనూ, 21వ శతాబ్ది మొదట్లోనూ ఎన్నోసార్లు నిరూపితమైంది. ఇప్పటి సోషలిస్టులకు వీటితో పాటు పర్యావరణ సంక్షోభం జోడించి చెప్పవలసి వస్తోంది.

పారిశ్రామిక పూర్వయుగం నుండి ఇప్పటికి వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయనీ, మన భూగోళం సంక్షోభం దిశగా పోతోందనీ శాస్త్రవేత్తలు ఎప్పటి నుండో హెచ్చరిస్తున్నా ముప్పై ఏళ్ల వరకు దీనికంత ప్రాముఖ్యత లేదు. ఉష్ణోగ్రతల్లో విపరీత మార్పులు, గతి తప్పుతున్న రుతువులు, పెరిగిపోతున్న కరువులు, వరదలు, భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఇప్పుడు ఆందోళన పెడుతున్నాయి. రెండు డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువ వేడెక్కితే (పారిశ్రామిక పూర్వకాలం నుండి) ప్రకృతి సహజ క్రియలు విచ్ఛిన్నమవుతాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. భూతాపంతో ఇప్పటికే ధృవ ప్రాంతాల మంచు గణనీయంగా కరిగిపోతోందని, తీర ప్రాంతాలను, దీవులను ముంచెత్తబోతోందని గణాంకాలు చెబుతున్నాయి. (ఇప్పటికే సముద్ర మట్టం 7 మీటర్లు వరకు పెరిగింది.) అతివృష్టి, అనావృష్టి వల్ల ప్రపంచ వ్యాప్తంగా పంట దిగుబడులు పడిపోతున్నాయి. కోట్లాది జనం నీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుఎచ్ఓ) అంచనా ప్రకారం ఏడాదికి ఒక లక్షా యాభైవేల మంది వాతావరణ మార్పుల వల్ల సంభవించే విపత్తులకు చనిపోతున్నారు.

మనం పీల్చే గాలిలో, తాగేనీటిలో, తినే ఆహారంలో ఎన్నో కాలుష్య కారక విషపదార్థాలు చేరి ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం వేస్తున్నాయి. కాని అంతకన్నా తీవ్రమైన పర్యావరణ సంక్షోభానికి దోహదం చేసేవి CO_2 (బొగ్గు పులుసు వాయువు), మిథేన్ వంటి హరిత గృహవాయువులు. సూర్యరశ్మి భూమిపై పడి ప్రతిఫలనం చెందేటప్పుడు ఈ హరిత గృహ వాయువులు దానిలోని ఇన్ఫ్రారెడ్ కిరణాలను అడ్డుకొని భూ ఉపరితలంపై వాటిని పట్టి ఉంచుతాయి. దాని వల్ల భూమి వేడెక్కుతుంది. అయితే ఇది జరగకపోతే భూమి 18 డిగ్రీల సెల్సియస్ చల్లగా ఉంటుంది. కాని హరిత గృహవాయువులు ఎక్కువైతే భూమి అంతకంతకూ వేడెక్కుతుంది. హరిత గృహవాయువుల్లో ప్రధానమైన CO_2 శాతం అంతకంతకూ పెరుగుతోందని, ఆ పెరుగుదల ప్రతి ఇరవై సంవత్సరాలకు పది శాతం వరకు ఉంటోందని అధ్యయనాలు తెలుపుతున్నాయి. అడవుల విధ్వంసం, బొగ్గు, సహజ వాయువు, పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం వాతావరణంలోకి ఎక్కువ మొత్తంలో CO_2 విడుదలవడానికి ముఖ్య కారణాలు. పారిశ్రామిక విప్లవం తర్వాత CO_2 30శాతం, మిథేన్ రెండు రెట్లు పెరిగాయి. ఈ పెరుగుదలలో సింహభాగం అమెరికా వాటానే. ప్రపంచంలో 4 శాతం జనాభా గల అమెరికా నాలుగో వంతు (1/4) CO_2ని విడుదల చేస్తోంది. బ్రిటన్ ఎనిమిదో వంతు (1/8) CO_2ని విడుదల చేస్తోంది. ఎవరి వాటా ఎంత అని లెక్కిస్తూ పోతే జీవన విధానమూ, పెట్టుబడిదారీ అభివృద్ధి ప్రకారంగానే లెక్కలు తేలుతాయి. ఇదెంత సరిగ్గా సరిపోతోందో అంతే సరిగ్గా కాలుష్యంతో అధిక వాటా ఇంధన వినియోగం నుండి వచ్చే వాయువులదైతే, అంతర్జాతీయ పెట్టుబడిలో అధిక వాటా ఇంధన వనరులదిగా ఉంది. కార్లు, పెట్రోలియం పరిశ్రమలది మొత్తం ప్రపంచ పెట్టుబడిలో మూడింట రెండో వంతు (2/3). ఇవి ఒక దేశ అభివృద్ధి నమూనాను, జీవన విధానాన్ని ఎట్లా నిర్దేశిస్తాయో ఒక చిన్న ఉదాహరణ. 1940లో అమెరికా రవాణా కాంట్రాక్ట్ తీసుకున్న జనరల్ మోటర్స్ (స్టాండర్డ్ ఆయిల్, ఫైర్‌స్టోన్ కంపెనీలతో కలిసి) 45 నగరాల్లో రైల్వే లైన్లను, బస్సు, ట్రామ్ సౌకర్యాలను ధ్వంసం చేసింది. ప్రజల్ని సొంత వాహనాలు కొనుగోలు చేసేలా చేసి మోటారు వాహనాల, పెట్రోలియం ఇంధనాల మార్కెట్‌ను పెంచుకునే ధ్వంస రచన అది. 1974లో దీనిపై చర్చ జరిపిన అమెరికా సెనేట్, జనరల్ మోటర్స్‌కు ఐదు వేల డాలర్ల జరిమానా విధించింది.

భారతదేశంలో పరిశ్రమల కోసమే, మార్కెట్ల కోసమే చేస్తున్న అభివృద్ధి రచన మరింత విస్తృతార్థంలో రోజురోజుకీ స్పష్టమవుతూనే ఉంది. అది సెజ్‌లు (ప్రత్యేక ఆర్థిక మండలాలు), ఎం.ఒ.యు.ల (పరస్పర వాణిజ్య అంగీకార ఒప్పందాలు) కింద విస్తారమైన పంటపొలాలూ, అడవులూ, సముద్రాలూ అన్నిటినీ బడా కంపెనీల అధీనం చేస్తోంది.

లాభాల మార్కెట్టును విస్తరించడమే ఏకైక లక్ష్యమైన పెట్టుబడికి ప్రజలను, ప్రకృతిని చివరకంటా దోపిడీ చేయడంలోనే మనుగడ. శ్రమదోపిడీ అదనపు విలువ లెక్కకందుతుందేమో గాని ప్రకృతి వనరుల దోపిడీ ఏ బాలెన్స్ షీట్‌కు అందుతుంది? ఏ నియంత్రణ లేని అసహజ, అపరిమిత పెట్టుబడి అంతకంతకూ రెట్టింపవుతూ పోయే క్రమంలో

అంతే మొత్తంలో ప్రకృతి వనరులు నాశనమవడంతోపాటు ప్రమాదకర వ్యర్థాలు పర్యావరణంలోకి విడుదలవుతాయి. అవి మరింతగా ప్రకృతిని నశింపజేస్తాయి. ఇక్కడ మళ్లీ ప్రజల సంపదనూ, ఆరోగ్యాన్నీ కొల్లగొడతాయి. హైదరాబాద్ పటాన్‌చెరు పరిసర పంట భూములనూ, ప్రజల ఆరోగ్యాన్నీ నాశనం చేసిన ఫార్మా కంపెనీలు ఒక చిన్న ఉదాహరణ. అలాంటివి దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్నాయి.

ప్రపంచ పరిశ్రమ, దాని ఉత్పత్తులు ప్రతి 25 సంవత్సరాలకు రెట్టింపవుతోందని ఒక అంచనా. అంటే వంద సంవత్సరాలకది 16 రెట్లు, రెండు వందల సంవత్సరాలకు 250 రెట్లు పెరుగుతుంది. ఇంత మితిమీరిన ఉత్పత్తి, వ్యవస్థలో ఎట్లా అంతర్గత సంక్షోభానికి హేతువవుతుందో అదే విధంగా అది పర్యావరణ సంక్షోభానికీ దారి తీస్తుంది. ప్రకృతి వైపరీత్యాలులేని సరుకుల ఉత్పత్తి ఇప్పటికే సాధ్యమవడం లేదు. పెట్టుబడి తన గోతిని తనే తవ్వుకునే మాటేమో గాని తాను నివసిస్తున్న భూమిని మాత్రం మొత్తంగా వినాశనం వైపు తీసుకుపోతోంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పెరిగిన ఆయుధ పోటీ దాదాపు అన్ని దేశాలను చాతనైనంత విధ్వంసక పదార్థాన్ని అణ్వాయుధాల రూపంలో నిలువ చేసుకునేలా చేసింది. 1980ల నాటికే ప్రపంచం మొత్తాన్నీ యాభై సార్లు పేల్చివేయగల ఆయుధ సంపత్తి తయారైపోయింది. (వాటిని తయారు చేసే క్రమంలో విడుదలయ్యే అణుధార్మిక వ్యర్థాలు అదనం.) మార్కెట్ కోసమే ఎంత అసంబద్ధమైన సరుకులనైనా తయారుచేసి జనంలో కృత్రిమ అవసరాల్ని సృష్టించే వినియోగ సంస్కృతిని పెంచి పోషించే పెట్టుబడే పర్యావరణం గురించి మాట్లాడేటప్పుడు ఆధునిక మానవుని జీవన శైలిని ఎత్తి చూపుతుంది. పెరుగుతున్న అవసరాలంటూ ఇంకా ఇంకా ప్రకృతిని కొల్లగొడుతుంది. మన అకడమిక్ పర్యావరణ శాస్త్రం అంతటికీ 'మనిషి'ని బాధ్యునిగా చూపుతుంది. అందమైన ప్రకృతి మానవ ప్రమేయం వల్ల వికృతిగా మారుతోందని, మనిషి స్వార్థం, దురాశే దీనికి మూలమని తేల్చి చెపుతుంది. మన ప్రచార సాధనాలు ప్రపంచ పర్యావరణ దినం నాడు గ్లోబల్ వార్మింగ్ మీద గంభీరమైన వార్తా కథనాలు వినిపించి భూతాపాన్ని తగ్గించడానికి మీ వంతు తోడ్పడండంటూ ఒక గంటపాటు విద్యుద్దీపాలు ఆర్పేసి, కొవ్వొత్తులు వెలిగించమని చెప్తాయి. లేదా వారితోపాటు పది కిలోమీటర్లు పరిగెత్తమంటాయి.

ప్రత్యామ్నాయ శక్తి వనరులను వినియోగంలోకి తేవడం అంటే పెట్టుబడికి సామ్యవాదం అన్నంత భయం. ప్రభుత్వాలు పైకెన్ని మాట్లాడినా ఆచరణలో ఇంధన పరిశ్రమకు నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటాయి. క్యోటో వాతావరణ సదస్సులో ఇది నిరూపితమైంది. కోపెన్‌హాగెన్‌కు వచ్చే సరికి మాట మాత్రంగానైనా అటువంటి హామీలకు, ఒప్పందాలకు అగ్రదేశాధి నేతలు, వారికి తాబేదార్లైన ఇండియా లాంటి దేశాల ప్రతినిధులు సిద్ధపడలేదు. నిజానికి పర్యావరణ సమస్యలు కిక్కిరిసిన నగరాలున్న భారతదేశానికి పెద్ద సవాలు. రెండు దశాబ్దాలలో ఆర్థిక వృద్ధిరేటు రెండున్నర రెట్లు పెరిగిందని చెప్పుకుంటున్న మన దేశంలో పరిశ్రమల కాలుష్యం ఎనిమిది రెట్లు, వాహన కాలుష్యం నాలుగు రెట్లు పెరిగింది. కాని కాలుష్య నియంత్రణకు చేపట్టిన చర్యలు చెప్పుకోదగ్గవేమీ లేవు. ఇప్పుడు హరిత గృహ వాయువుల విషయంలో అత్యంత కలుషిత దేశాలలో భారతదేశం ఐదవది. భారతదేశ నగరాలు విడుదల చేసే వ్యర్థాలు 80 శాతం వరకు నదుల్లోకి చేరుతున్నాయంటే కనీస పారిశుద్ధ్యంలో మన దేశం ఎంత అధ్వాన్నంగా ఉందో అర్థమవుతోంది. మన దేశంలో యుద్ధాల్లో కంటే ఎక్కువ జనం కలుషిత నీటి వల్ల చనిపోతున్నారని ఇటీవలి సర్వేలు చెప్తున్నాయి. వీటికి తోడు రసాయన ఎరువులు, పురుగు మందులపై ఎటువంటి నియంత్రణ లేకపోవడం వల్ల మన ఆహారంలోనూ, నీటిలోనూ నిరాటంకంగా చేరిపోయి మామూలుగానే అట్టడుగు స్థాయిలో ఉన్న దేశ ప్రజల ఆరోగ్యం మరింతగా దిగజారి రోగగ్రస్తం అయిపోతోంది. నగరం మధ్యన న్యూక్లియర్ కాంప్లెక్స్‌లు, పారిశ్రామిక కేంద్రాలు బహుశా భారతదేశంలోనే ఉంటాయేమో. భోపాల్ గ్యాసు ప్రమాదానికి కారణమైన యూనియన్ కార్బైడ్ కర్మాగారాల వంటివి ఇప్పుడు ఎక్కడ పడితే అక్కడ దేశవ్యాప్తంగా ఉన్నాయి.

ఉత్పత్తిని, ఆర్థిక వృద్ధి రేటును పెంచగల శాస్త్ర సాంకేతిక విజ్ఞానం కాలుష్యాన్ని అరికట్టలేకకాదు. కర్బన ఉద్గారాల్ని తగ్గించే పరికరాలు అందుబాటులో ఉన్నా పరిశ్రమలు ఆ అదనపు ఖర్చును భరించేందుకు సిద్ధంగా ఉండవు. కాలుష్య రహిత ప్రత్యామ్నాయ శక్తి వనరులను మార్కెట్ శక్తులు ఎదగనివ్వవు. ఎందుకంటే సూర్యరశ్మి, గాలి వంటివి పెట్రోల్ లాగా సరుకు కాలేవు కాబట్టి. సూర్యరశ్మిని గ్రహించడానికి ఫొటో వొల్టాయిక్ సెల్‌ని అవసరమైన చోట ఒకసారి ఏర్పాటు చేస్తే అంతటితో అయిపోతుంది. గాలి మరలు కూడా అట్లాంటివే. ఇప్పటికవి ఉత్పత్తి చేసే విద్యుత్తు చాలా తక్కువ శాతం ఉన్నా పోను పోను సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. పెట్రోల్ రవాణా కోసం ఇంధన దేశాల్ని లొంగదీసుకొని కొన్ని వేల కిలోమీటర్ల పొడవు పైపు లైన్లు వేసుకుని సముద్రాల్ని, వాతావరణాన్ని కలుషితం చేసే అసంబద్ధ పరిశ్రమలు నిజానికి అవసరం లేదు. ప్రణాళికాబద్ధంగా మన అవసరాల్ని నిర్దేశించుకుంటే అంత ఇంధనం, విద్యుత్తు అవసరం లేదు. ఈ విధ్వంసక ఉత్పత్తి విధానాన్ని సరిచేయకపోతే వినాశనం పొంచి ఉంది. కాని పర్యావరణాన్ని పరిరక్షించే విధానాలు ఏవైనా సామ్రాజ్యవాద మార్కెట్లో మనగలగలేవు.

పెట్టుబడి వ్యతిరేక, వర్గదృష్టి లేని పర్యావరణ వాదానికి లెక్కలేనన్ని పరిమితులుంటాయి. దానికి పర్యావరణం, ప్రజారోగ్యం, ప్రజాధనంతో ముడిపడిన దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్టి ఉన్నప్పటికీ, అది కోపెన్‌హాగెన్ వంటి చోట్ల వీగిపోతుంది. లేదా 'దీర్ఘకాలిక కార్యాచరణ'గా బలహీన పడుతుంది. ఆచరణలో పర్యావరణ వాదం ఆదర్శంగానే మిగిలిపోతుంది. ఉదాహరణకు సేంద్రియ వ్యవసాయం అట్లాంటి ఒక ఆదర్శం. ఇప్పటి భౌగోళిక పరిస్థితుల్లో అధిక శాతం రైతులకది సాధ్యం కాదు. పెట్టుబడి దాని మార్కెట్ చట్రంలో సకల ఉత్పత్తి విధానాలను బిగించి వేస్తుంది. ఇక్కడ మనిషికి, ప్రకృతికి ఉండాల్సిన సజీవ సంబంధం తెగిపోతుంది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల్లో సామాజిక సంపద నుండి వ్యక్తిగత ఆస్తి వేరుపడిపోవడంతో పాటు మనిషికి, ప్రకృతికి ఉండాల్సిన సజీవ సంబంధం ప్రకృతి వనరుల మీద యాజమాన్యమై పోతుంది.

ఉత్పత్తి విధానంలో మార్పు కోసం ఉత్పత్తి సంబంధాల్లో మార్పుతో పాటు ప్రకృతికి మనిషికి మధ్య ఘర్షణను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. అయితే 20వ శతాబ్ది సోషలిస్టు ప్రయోగాల్లో ముఖ్యంగా సోవియట్ యూనియన్‌లో పారిశ్రామిక ప్రగతి అప్పటి పెట్టుబడిదారీ దేశాల కంటే భిన్నంగా ఉన్నా ప్రకృతి వనరుల మీద 'యాజమాన్యం' రాజ్యం వహించిందనిపిస్తుంది. అప్పటి రాజకీయావసరాల్లో పర్యావరణం అప్రధానమై పోయిందనుకునే దాని కంటే ఇప్పటిలా అదంత గంభీరమైన ప్రశ్నల్ని లేవనెత్తలేదు.

అభివృద్ధి పేరుతో కోస్తా తీరం వెంబడి వస్తున్న థర్మల్, ఇతర ప్రాజెక్టుల వల్ల సముద్ర జలాలు కలుషితమయి జీవరాశుల మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని అంటున్నారు **జె.వి. రత్నం**

ఎవరి అభివృద్ధి కోసం కోస్తా విధ్వంసం?

భారత కోస్తా తీరం వెంబడి అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం చూస్తుంటే ముందు తరం కాదు ఈ తరం ఏమవుతుందో నన్న ఆందోళన చెందవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశాలు, ప్రధానంగా అమెరికా వంటి దేశాలు సోకాల్డ్ అభివృద్ధి చేసిన చేటు ఏమిటో గుర్తించాయి. భవిష్యత్ తరాలకు కలిగే కష్టనష్టాలపై స్పష్టమైన అంచనాకు వచ్చి నివారణోపాయాలను చేపడుతున్నాయి. కాలుష్య కారకాలైన అణు విద్యుత్కేంద్రాలను, రసాయన కాలుష్యం కలిగించే పరిశ్రమలను ఏర్పాటు చేయడం లేదు. అమెరికాలోని త్రీమైల్ ఐలండ్‌లో అణువిద్యుత్తు కర్మాగారంలో 30ఏళ్ల కిందట ప్రమాదం జరిగినప్పటి నుంచి ఇంతవరకూ మరొకటి ఏర్పాటు చెయ్యలేదు. థర్మల్ పవర్ ప్లాంట్లను సైతం పక్కన పెట్టి సూర్యరశ్మి, గాలి ఆధారిత విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు సైతం కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలను మూసివేస్తున్నాయి. ఆయా దేశాలు తమ ప్రజల శ్రేయస్సు కోసం, జీవావరణ పరిరక్షణ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఇటువంటి తరుణంలో విషతుల్యమైన రసాయనాలను విడుదల చేస్తూ, కాలుష్య వాయువులను, భారీ లోహాలను ఎగజిమ్మే థర్మల్ పవర్ ప్లాంట్లు కోస్తా తీరంలోని తొమ్మిది జిల్లాల్లో నెలకొల్పడాన్ని కోస్తా వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ప్లాంట్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపై ప్రభుత్వం పోలీసులు, తుపాకులతో సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తున్నది తప్ప వాస్తవ పరిస్థితులను ఆలోచించడం లేదు. రాష్ట్రంలో అత్యధిక శాతం ఆహార ఉత్పత్తులు లభించే కోస్తా ప్రాంత జిల్లాల్లో థర్మల్, అణువిద్యుత్తు కేంద్రాలు, రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేస్తే కలిగే నష్టం ఊహించనలవికాదు. కోస్తా ప్రాంతంలో భారలోహాలను, రసాయనపూరిత వాతావరణాన్ని స్వాగతించడానికి ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రగతిశీలురు, పర్యావరణ వేత్తలు మొదలుకుని సామాన్య ప్రజలు, మహిళలు, విద్యార్థులు ఏ ఒక్కరూ సిద్ధంగా లేరు. శ్రీకాకుళం జిల్లా డొంకూరు నుంచి నెల్లూరు జిల్లా తడ వరకూ అందుకే ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారు.

భారత తీరం 8112 కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి పేరుతో వస్తున్న 'ఇండియన్ ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్' తెచ్చే ముప్పు చెప్పనలవి కాదు. అంతేకాదు చేతులు కాలాక ఆకులు పట్టుకునే అవకాశం ఉందేమో కాని, ఈ థర్మల్ విధ్వంసం సృష్టించిన తర్వాత తరతరాలు ఆ కాలుష్యం వల్ల జీన్స్ మారిపోయి అంగవైకల్యంతోను, శారీరక శ్రమ చేయగలిగే సామర్థ్యం లేకుండా శక్తి హీనులుగాను పుట్టడం జరుగుతుంది. బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ల చుట్టుపక్కల భూముల్లో యాష్ (కాలిన బొగ్గు ధూళి) పేరుకుపోయి పంటల దిగుబడి తగ్గిపోతున్నట్టు పర్యావరణ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. పవర్‌ప్లాంట్ల చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారికి క్యాన్సర్ సహా చర్మ సంబంధమైన, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని ప్రపంచ వ్యాప్తంగా రుజువయ్యింది. నరాల బలహీనత, బుద్ధిమాంద్యం, గర్భస్థ శిశు మరణాలు, బాల్యదశలోనే శారీరక మానసిక వైకల్యం వంటివి దాపురిస్తున్నాయి. పవర్ ప్లాంట్ల నుంచి విడుదలయ్యే ధూళిలో క్రోమియమ్, మెర్క్యురీ తదితర లోహాలు ఉన్నందువల్ల మానవాళికి కలిగే అనర్థాలు అనేకం. పవర్ ప్లాంట్లను చల్లబరిచేందుకు వినియోగించే సముద్ర, నదీ జలాలు వేడెక్కిపోయి. మత్స్య సంపద సమూలంగా అంతరించిపోతోంది. నదుల్లోకి, సముద్రంలోకి వచ్చి చేరే ముడి బొగ్గు పొడి, బొగ్గుల బూడిద, వాటిలోని పాదరసం, లెడ్, తదితరమైన భారలోహాలు మత్స్య సంపదను హరించి వేస్తున్నాయి. ఆ జలాల్లో వేటాడి తెచ్చిన చేపలను తిన్నవారికి సైతం రకరకాలైన దీర్ఘకాలిక రోగాలు సంక్రమిస్తున్నాయి. అంతేకాక కాలుష్యమైన సముద్రజలాలతోనే ఉప్పు తయారు చెయ్యడం వల్ల తీరానికి దూరంగా జీవనం సాగిస్తున్న వారి శరీరాల్లోనికి సైతం ఉప్పు ద్వారా విషతుల్య రసాయనాలు, హెవీ మెటల్స్ వచ్చి చేరుతున్నాయి.

భూ ఉపరితలం వేడెక్కుతున్న నేపథ్యంలో మంచుకొండలు కరిగిపోతున్నాయి. సముద్రాల నీటిమట్టం పెరుగుతోంది. తీరం కోతకు గురై తీరప్రాంత ప్రజలకు నివాసం కరువవుతోంది. నివాస యోగ్యమైన లంకలు, దీవులు అంతర్ధానమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ అంశాన్ని

అయితే మనం ఆక్రమణదారులుగా వ్యవహరించినప్పుడల్లా ప్రకృతి మనల్ని హెచ్చరిస్తుంది. మునుపటి కంటే ఇప్పుడు శాస్త్ర సాంకేతికాభివృద్ధి వాతావరణ మార్పుల్ని ముందే ఊహించగలుగుతోంది. ఏమైనా మానవ శ్రమకు మూలం, ప్రయోగాలకు కేంద్రం ప్రకృతేనన్నది మర్చిపోకూడదు. ఎంగెల్స్ అన్నట్లు మనం రక్తమాంసాలతో, బుద్ధితో ప్రకృతి జీవులం. ప్రకృతి ఒడిలో నివసిస్తున్నాం. ప్రకృతిపై మన పట్టు అంతా మిగతా జీవులన్నింటి కంటే మెరుగ్గా ప్రకృతి సూత్రాలను మనం అర్థం చేసుకోవడంలో వాటిని సరిగ్గా అన్వయించుకోవడంలో ఉంది.

(రచయిత మైక్రో బయాలజీ లెక్చరర్)

వీ

పరిగణనలోనికి తీసుకుని పలు దీవుల్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మలేషియా ప్రభుత్వం సముద్రంలోనే కేబినెట్ సమావేశం నిర్వహించింది. విశ్వ వ్యాప్తంగా అనేక దేశాలు బొగ్గు ఆధారిత విద్యుత్కేంద్రాలకు ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నాయి. కాలుష్యంలేని గాలి, నీరు, జల విద్యుత్తు, బయోమాస్, టైడల్ (సముద్ర కెరటాల ఆధారంగా) విద్యుత్తు ఉత్పాదనకు ఏర్పాట్లు చేస్తున్నాయి. చాలా దేశాల్లో ఇప్పటికే ఉత్పత్తి జరుగుతోంది, డెన్మార్క్‌లోని కోపెన్‌హగెన్‌లో జరిగిన సమావేశాల్లో ప్రధాని మన్మోహన్‌సింగ్, పర్యావరణ శాఖ మంత్రి జైరాం రమేష్‌లు సైతం 2005 సంవత్సరం నాటి స్థాయికి కార్బన్‌డయాక్సైడ్ (కర్బన ఉద్గారాలను) తగ్గిస్తామంటే అందుకు విరుద్ధంగా ఎందుకు జరుగుతోందో అధికారులే సంజాయిషీ చెప్పాలి.

అంతర్జాతీయంగా చిత్తడి నేలలు (వెట్ ల్యాండ్స్) పరిరక్షించాలని రామ్‌సార్ ఒప్పందం పేర్కొంటుంది. అంతేకాదు భారత చిత్తడి నేలల విధానం (ఇండియన్ వెట్‌ల్యాండ్స్ పాలసీ)లో సైతం చిత్తడి నేలల్ని కాపాడాలని ఉంది. అయితే అందుకు విరుద్ధంగా సోంపేట, సంత బొమ్మాళిల్లో పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోంది. సముద్రతీరాన, నదీతీరాన ఉన్న తంపర, బీలా భూముల (వెట్ ల్యాండ్స్) కు హాని కలిగించరాదని విశ్వవ్యాప్తంగా కృషి జరుగుతోంది. అక్కడి జీవావరణం ఎంతో విలువైనదని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. ఇటువంటి తరుణంలో శ్రీకాకుళం జిల్లాలోని తంపర భూముల్లో పవర్‌ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం ఒక సారి వెట్ ల్యాండ్ అని, కాదు బంజరని ఇలా తమకు ఇష్టం వచ్చినట్లుగా ధృవపత్రాలు మంజూరు చేయడం విచారకరం.

అంతరిస్తున్న పక్షి, జంతు జాతులను, ఇతర జీవరాశిని గుర్తించి, వాటి పరిరక్షణకు అన్ని దేశాలు కృషి చేస్తున్నాయి. ఇందుకుగాను ఐయుసిఎన్ రూపొందించిన రెడ్‌బుక్ డాటాలో పేర్కొన్న సుమారు 120 జాతులకు చెందిన పెలికాన్‌లు, పెయింటెడ్ స్టార్క్ తదితర జాతుల పక్షులు ఏటా శ్రీకాకుళం జిల్లాకు వచ్చి గుడ్లు పెట్టి, పొదిగి, అవి పిల్లలయ్యాక, రెక్కలు వచ్చి ఎగరగలిగే శక్తి వచ్చాక రష్యా, తదితర సుదూర ప్రాంతాల్లోని తమ నెలవులకు వెళ్లిపోతుంటాయి. వాటిని మనం దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆత్మీయుల్లా భావించి, రక్షించు కుంటున్నాం. ఇప్పుడా సైబీరియా పక్షులకు తీరని నష్టం వాటిల్లనుంది. వాటి ఆహార కేంద్రంలో థర్మల్ విద్యుత్కేంద్రాలను ఏర్పాటు చేయడం ఏ మేరకు సమర్థనీయమో ఆలోచించండి.

కృష్ణా జిల్లాలో ఇప్పటికే థర్మల్ పవర్ ప్లాంట్ కుంపటి రగిలించిన ప్రభుత్వం మరో పక్క 182 మెగా వాట్ల ఐజిసిసి విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనుంది. అయితే పర్యావరణ ప్రభావ అంచనా నివేదికను పరిశీలిస్తే శుభ్రమైన బొగ్గు (క్లీన్ కోల్) విధానంలో కర్బన ఉద్గారాలను తగ్గించి భూ ఉపరితలం వేడెక్కడాన్ని నివారించవచ్చని ఈ పరిశ్రమ ఏర్పాటు చేసే వారు, వారికి దన్నుగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారం మోసపూరితం. బొగ్గును గని నుండి తవ్వి తీయడం మొదలు ఇంధనంగా వాడడం వరకూ ప్రతి స్థాయిలోనూ తీవ్రమైన కాలుష్యం వస్తుంది. అందుకే దీనిని క్రాడిల్ టు గ్రేవ్ విషం అంటారు. తాత్కాలిక అవసరాల కోసం, దీర్ఘ కాలిక నష్టాలను గుర్తించకుండా వినాశనాన్ని కొని తెచ్చుకోవడం భావ్యమా? ఈ ప్లాంట్ చిన్నదిగా ఉన్నప్పటికీ ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న 1760 మెగా వాట్లతో కలిసి చుట్టు పక్కల ప్రాంతాలకు తీవ్రమైన హాని కలిగిస్తుంది.

కార్బన్ మోనిటరింగ్ ఫర్ యాక్షన్ సంస్థ సేకరించి పొందు పరిచిన సమాచారం మేరకు విటిపిఎస్ నుంచి సంవత్సరానికి కోటి టన్నుల మేర కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయి. ఇవి రానున్న దశాబ్దంలో కోటీ నలభై లక్షలకు పెరగనున్నాయి. అలాగే మన దేశంలో బొగ్గుతో విద్యుతుత్పత్తి ద్వారా సంవత్సరానికి అరవై మూడు కోట్ల ఎనభై లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. ఇవి రానున్న పదేళ్ళలో నూట ఎనభై ఐదు కోట్లకు పెరుగుతాయి. ఈ లెక్క ప్రకారం కోపెన్‌హగెన్‌లో భారత దేశం 20 నుంచి 25 శాతం కర్బన ఉద్గారాలను తగ్గిస్తామని చెప్పిన మాట ఉత్తమాటేనని తేటతెల్లమవుతుంది. పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పేర్కొన్నట్లు బొగ్గు వినియోగం రోజుకి 2265 టన్నులు. అయితే ఈ బొగ్గులో ఏ భార లోహాలు, మూలకాలున్నాయో వివరించలేదు. గంధకం ఎంత ఉన్నదీ చెప్పలేదు. కాని గంధకం ఆక్సైడ్ పరిమాణం కేవలం 225 పార్ట్స్ పెర్ మిలియన్ అని పేర్కొన్నారు. ఇది ఏ ప్రాతిపదికన చెప్పారో వివరించలేదు. వాస్తవానికి మన దేశంలో బొగ్గు లో 0.6 నుంచి 0.8 శాతం వరకూ గంధకం ఉంటుంది. అంటే రోజుకు ఈ విద్యుత్తు కేంద్రంలో 2265 టన్నుల వంతున బొగ్గు వినియోగిస్తే రోజుకి సుమారు 27.18 టన్నుల గంధకం వాతావరణంలోనికి విడుదలవుతుంది. దీనికి తోడు గతంలో ఉన్న 1760 మెగా వాట్ల విద్యుత్తు కర్మాగారం నుంచి వచ్చే గంధకం ఆక్సైడ్ కలిపితే అది మరింత తీవ్రంగా ఉంటుంది. స్క్రబ్బర్స్ ఉపయోగించి గంధకం ఆక్సైడ్ పరిమితిని 225 పిపిఎమ్‌లకు తగ్గిస్తామని పేర్కొన్నారు. కాని ఈ వాయువును తొలగించే ప్రక్రియ గురించి వివరించలేదు. అంటే ఇది వాస్తవ సమాచారమా అన్నది ప్రశ్నార్థకమే.

బొగ్గులో పాదరసం, సీసం, ఆర్సెనిక్, యురేనియం, సిలీనియం తదితర విష మూలకాలుంటాయి. బొగ్గును మండించినా, వాయువుగా మార్చినా అవి పర్యావరణంలోనికి విడుదలవుతాయి. వాటి గురించి ఎందుకు ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడంలేదు? టన్నుల కొద్దీ బొగ్గును వినియోగించడం ద్వారా వెలువడే పాదరసం చేసే నష్టాన్ని ఎందుకు అంచనా వేయడంలేదు? ఆ సమాచారాన్ని ఎందుకు దాస్తున్నారు? వాటి వివరాలు ఎందుకు పొందుపరచలేదు? ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు, పశువులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇంతవరకూ ప్రజల ఆరోగ్యంపై ఎందుకు ఇన్నేళ్లుగా సర్వే నిర్వహించలేదు? వ్యర్థ జలాల విషయంలో ఐజిసిసి విద్యుత్ కేంద్రాలు సాంప్రదాయ బొగ్గుతో విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు భిన్నంగా రసాయన కర్మాగారాలకు దగ్గరగా ఉంటాయి. ఇందులో నీటి వినియోగం తక్కువగా ఉన్నా, కాలుష్యం అత్యధికంగా ఉంటుంది. గాస్ శుభ్రపరిచే విధానంలో సజల గంధకికామ్లం, గాస్‌లోని అమ్మోనియా, ఇతర కాలుష్య కారకాలని రసాయన ప్రక్రియల ద్వారా తొలగించిన తర్వాత ఆ వచ్చే వ్యర్థాలను ఏమి చేస్తారో వివరించలేదు. రోజుకి ఎంత గంధకికామ్లాన్ని తిరస్కరిస్తారు? అది ఏమి చేస్తారో వివరించాలి. అన్ని విధాల మానవాళికి, జీవావరణానికి హాని కలిగించే ఈ ప్రమాదకరమైన విద్యుత్తు కేంద్రాన్ని కృష్ణా జిల్లా ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

ప్రత్యేక ఆంధ్ర కోసం పోరాడిన పొట్టి శ్రీరాములు సాక్షిగా నెల్లూరు జిల్లా ప్రజలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. వెయ్యి మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తయ్యే చోటే భరించరాని వేడి, భారలోహాలు, ఫ్లైయాష్‌ల వల్ల కలిగే నష్టం భరించరానిదిగా ఉంది. అటువంటిది నెల్లూరు జిల్లాలో

ఒకే ప్రాంతంలో ఎనిమిది థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి 12,260 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం అనుమతులిస్తోంది. దీని వల్ల జరిగే నష్టం ఊహించనలవికానిది. సుమారు 4.3 కోట్ల మిలియన్ టన్నుల బొగ్గు ప్రతి ఏటా ఇక్కడ మండిస్తారు. దీని వల్ల ఉష్ణోగ్రతలు వర్ణనాతీతంగా పెరిగి మానవాళి జీవించడం కష్టమవుతుంది. వేలాది కిలోల పాదరసం, సీసం ఇతర భార లోహాలు విడుదలవుతాయి. వీటన్నింటి వల్లా కలిగే నష్టాలను అంచనా వేయకుండా థర్మల్ పవర్‌తోనే అభివృద్ధంటే ఎలా? పర్యావరణ విధ్వంసాన్ని, జనావళికి జరిగే నష్టాన్ని, వందల ఏళ్లపాటు జనావళిపై భారలోహాలు చూపించే ప్రభావాన్ని, గాలి, నీరు, భూమి, రసాయన వ్యర్థాలు, భారలోహాల ప్రభావానికి గురవ్వడం వల్ల కలిగే నష్టాన్ని లెక్కించకుండా ఇదంతా అభివృద్ధని పాలకులు ఎలా నిర్వచిస్తున్నారు? శ్రీకాకుళం జిల్లా సోంపేటలో నిర్మించ తలపెట్టిన 2640 మెగావాట్ల పవర్ ప్లాంట్ నుంచే ఏడాదికి సుమారు ఏడు వేల కిలోల పాదరసం విడుదలవుతుందని ఇఐఎ నివేదికలో పొందు పరిచారు. ఇటువంటి పరిస్థితిలో నెల్లూరులో వచ్చే ఎనిమిది పవర్ ప్లాంట్ల నుంచి విడుదలయ్యే పాదరసం ఎన్ని టన్నులవుతుంది, దాని ప్రభావం ఏస్థాయిలో ఉంటుందో ప్రతి ఒక్కరూ ఆలోచించవలసిన అవసరం ఉంది.

విశాఖపట్నం జిల్లా పరవాడలోని థర్మల్ పవర్ ప్లాంట్ వెనుక భాగంలో ఉన్న పిట్టవానిపాలెం గ్రామంలో ఒక నెల రోజులు జీవనం సాగించగలరా? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అక్కడ భూగర్భ జలాలు సమూలంగా కలుషితమయ్యాయి. ప్లాంట్ నుంచి విడుదలయ్యే భారలోహాలన్నీ భూగర్భ జలాలను కలుషితం చేశాయి. ఒక్క గ్లాసు నీరు తాగినా ఆరోగ్యం దెబ్బతింటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఈ ప్రాంతంలో పండే పంటలపైన సైతం భారలోహాల ప్రభావం పడింది. పవర్ ప్లాంట్ నుంచి విడుదలయ్యే యాష్ వల్ల ఈ గ్రామంలో జీవిస్తున్న ప్రజల శరీరాలపై మచ్చలు, కురుపులు, ఇతర చర్మ వ్యాధులు ప్రబలాయి. చాలా మంది ఊపిరితిత్తుల వ్యాధులతో, కొంతమంది పిల్లలు బుద్ధి మాంద్యంతో, మరికొందరు పిల్లలు నరాల బలహీనతతోనూ బాధపడుతున్నారు. కోస్తా తీరంలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చెయ్యతలపెట్టిన యాజమాన్యాలు, అనుమతులిచ్చే అధికారులు పిట్టవానిపాలెంలో లభించే నీటినే వినియోగిస్తూ, అక్కడ పండే పంటనే ఆహారంగా తీసుకుంటూ, అక్కడి గాలినే పీల్చుతూ జీవించిన తర్వాత మరో కొత్త ప్లాంట్ ఏర్పాటు చెయ్యవచ్చో లేదో తేల్చుకోవలసిన అవసరం ఉంది.

14 లక్షల కుటుంబాల మత్స్యకారులు జీవించేదెలా?

పాలకులు అభివృద్ధి పేరుతో సాగిస్తున్న విధ్వంసంలో ఆంధ్ర కోస్తా తీరంలోని 972 కిలోమీటర్ల తీరంలో సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న 14 లక్షల కుటుంబాల మత్స్యకారులు, వారు వేట సాగించి తీసుకు వచ్చే మత్స్య సంపదను రవాణా చేసే ఇతర కార్మిక వర్గం బలైపోతున్నారు. ఇప్పటికే విశాఖ మహా నగరంలోని పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్య రసాయనాలు, భారలోహాలు బంగాళాఖాతం లోని మత్స్య సంపదకు పెనుముప్పుగా మారాయి. దానికి తోడు కృష్ణా జిల్లా కొండపల్లిలోని ఇండస్ట్రియల్ పార్క్, శ్రీకాకుళం జిల్లాలోని పైడి భీమవరం, రణస్థలం, చిలకపాలెంలలో ఏర్పాటు చేసిన రసాయన, క్రిమిసంహారక పరిశ్రమలు, తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఏర్పాటు చేసిన ఎరువులు, ఇతర పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల జరిగిన నష్టం చెప్పనలవికాదు. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. తాగు నీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి చుట్టు పక్కల గ్రామాల్లో ఏర్పడింది. ఇక్కడి పంట భూములు చవుడుబారాయి. ప్రజల ఆరోగ్యాలు దెబ్బతిన్నాయి. ఈ ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే కలుషితమైన జలాలు విభిన్న మార్గాల ద్వారా సముద్రంలో కలియడం వల్ల మత్స్యసంపదకు నష్టం కలుగుతోందని శాస్త్రవేత్తలు ఆరోపిస్తున్నారు. ఆంధ్రకోస్తాలో మత్స్య సంపద విదేశాలకు ఎగుమతి చెయ్యడం ద్వారా మత్స్యకారులు సంవత్సరానికి సుమారు మూడు వేల కోట్ల రూపాయలు విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తున్నారు. అంతకు నాలుగైదు రెట్ల మత్స్య సంపదను దేశంలోని విభిన్న ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇటువంటి మత్స్యకారుల జీవితాలతో పాలకులు చెలగాటం ఆడటం భావ్యమా? ఈ అంశాలను పరిగణనలోనికి తీసుకోకుండా అధిక సంఖ్యలో కోస్తా తీరంలో థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి చూస్తుంటే పాలకులు ఎవరి 'అభివృద్ధి' కోసం 'కృషి' చేస్తున్నదీ విశదమవుతుంది.

కోస్తాలో రైతులకు , రైతు కూలీలకు, దళితులకు, చేతివృత్తుల వారికి ఉపయోగపడే విధంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పవలసిన అవసరం ఉంది. పాడిపరిశ్రమకు పెద్దపీట వేసి పంజాబ్ తరహాలో పశువుల పేడ ఆధారంగా విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చెయ్యడం ద్వారా పాల ఉత్పత్తిని, సేంద్రియ ఎరువు ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంటుంది. ఈ విధానం రైతులకు, పర్యావరణానికి చాలా వరకూ లాభం చేకూర్చుతుంది. మత్స్యకారుల సంక్షేమం కోసం సముద్రం లోనికి రసాయనాల కాలుష్యం, భారలోహాలు వెళ్ళకుండా చర్యలు చేపట్టాలి.

విశ్వానికే థర్మల్ విద్యుత్తు ప్రమాదకరం

కోస్తాలో థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే ఆ నష్టం తమకేమీ ఉండదనుకుని దేశంలో ఇతర ప్రాంత ప్రజలు అభిప్రాయ పడితే అది పొరపాటే. ఈ ప్లాంట్ల వల్ల కోస్తా ప్రాంతానికే కాదు ప్రపంచానికే పెను ప్రమాదం ఏర్పడుతుంది. విశ్వ వ్యాప్తంగా సెకన్‌కు వెయ్యి మెట్రిక్ టన్నుల వంతున కార్బన్‌డయాక్సైడ్ విడుదలవుతుంది. ఈ లెక్క ప్రకారం 2016 డిసెంబర్ నాటికి 400 టన్నుల పార్ట్స్ పెర్ మిలియన్‌కు చేరుకుంటుందని, ఫలితంగా భూ ఉపరితలం వేడెక్కి జీవరాశికి పెనుముప్పు ఏర్పడుతుందని న్యూ ఎకనమిక్స్ ఫౌండేషన్ సంస్థకు చెందిన ప్రతినిధులు ఒక టెక్నికల్ నోట్ విడుదల చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కోస్తా తీరంలో అధిక సంఖ్యలో బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటూ పోతే కార్బన్‌డైఆక్సైడ్ విడుదలలు మరింతగా పెరిగిపోయి 2016 డిసెంబర్‌కు ముందే ప్రమాదపు అంచులకు చేరుకునే ప్రమాదం ఉంది. అంతేకాక తీరంలో వచ్చే ఈ ప్లాంట్ల నుంచి విడుదలయ్యే భారలోహాలన్నీ సముద్రంలోనికి వచ్చి చేరడం, ఆ నీటితో తయారయ్యే ఉప్పును ఆహారంగా తీసుకోవడం వల్ల సైతం మానవాళి ఆరోగ్యం సమూలంగా దెబ్బ తింటుంది. అంతేకాక సముద్ర జలాల్లో జీవించే మత్స్య సంపద శరీరంలోనికి పాదరసం, లెడ్ ఇతర భారలోహాలు వచ్చి చేరి, వాటిని ఆహారంగా తీసుకున్న వారి ఆరోగ్యం సమూలంగా దెబ్బతింటుంది.

(రచయిత పాత్రికేయులు) వీ

పెట్టుబడిదారీ లాభాపేక్షతో సముద్ర జలాలను, జీవావరణాన్ని, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న అగ్రరాజ్యాలే అసలైన నేరస్తులంటున్నారు **పి.వి. రమణ**

గల్ఫ్ ఆఫ్ మెక్సికో దోషులెవరు?

అమెరికా సముద్ర ప్రాంతమైన గల్ఫ్ ఆఫ్ మెక్సికో తీరంలో 25 అడుగుల భూమి పొరల్లో నుండి ఆయిల్ తియ్యటానికి పనిచేస్తున్న 'డీప్ వాటర్ హొరిజన్' పేలిపోయి దానితోపాటు, యంత్రసామాగ్రి, పైపులతో సహా ఐదు వేల అడుగుల సముద్రపు లోతులో పడిపోయాయి. ఈ సంఘటన ఏప్రిల్ 20న జరిగింది. మల్టీనేషనల్ కంపెనీ బ్రిటిష్ పెట్రోలియం కు చెందిన ఈ ఆపరేషన్ జరిగే సమయంలో 176 మంది పనిలో ఉండగా, ప్రమాదం కారణంగా 11 మంది చనిపోయారు. 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన వారి శవాలు ఇంతవరకు దొరకలేదు. పేలుడు కారణంగా బావి నుండి ఆయిల్ లీకవుతూ సముద్ర జలాలలో కలిసిపోతోంది.

ఇటువంటి ప్రమాదాలు నిరంతరం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతూనే ఉన్నాయి. మల్టీనేషనల్ కంపెనీల రక్తదాహానికి వేలాది మంది బలవుతూనే ఉన్నారు. అది భోపాల్ కావచ్చు, నైజర్ డెల్టా కావచ్చు. కాని విశేషమేమంటే ఈసారి, ప్రపంచ దేశాల తలరాతలు రాసే మొనగాళ్లకు మొనగాడు, ఎలాంటి పనులైనా అతి సునాయాసంగా చేసేయగల సూపర్‌మాన్, నిరంతరం శత్రువుల్ని నిర్మూలించే రాంబో, సూపర్‌కాప్, అంకుల్ శామ్‌కి కష్టమొచ్చింది.

2100 కిలోమీటర్ల వరకు విస్తరించిన గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్ర తీర ప్రాంతంలో లూసియానా, మిసిసిపి, అలబామా, ఫ్లోరిడా రాష్ట్రాలు వరుసగా ఉన్నాయి. లూసియానాకు దక్షిణంగా 80 కిలోమీటర్ల దూరాన సముద్రంలో జరిగిన ఈ ప్రమాదం కారణంగా లీకవుతున్న ఆయిల్ రోజుకు ఇరవై వేల నుండి ఎనభై వేల బ్యారెళ్ల వరకు ఉంటుందని ఒక అంచనా. దీని వలన సముద్రంలో ఆయిల్ ఏప్రిల్ 26 నాటికి 80 మైళ్ల వరకు, ఏప్రిల్ 28 నాటికి 100 మైళ్ల వరకు, మే 5 నాటికి 5180 చదరపు కిలోమీటర్ల వరకు వ్యాపించింది. కేవలం లూసియానాకే కాకుండా ఫ్లోరిడా వరకు ఈ ఆయిల్ ప్రమాదం ఉందని అమెరికన్లు భయాందోళనలు చెందుతున్నారు.

అమెరికా ఆయిల్ ఉత్పత్తిలో మూడవ వంతు గల్ఫ్ ఆఫ్ మెక్సికో నుండే లభిస్తుంది. ఆయిల్ లీకేజీని అరికట్టేందుకు ఐదు వేల అడుగుల లోతులో 'టాప్ కిల్' ఆపరేషన్ కొనసాగించి విజయవంతమైందని ప్రకటించిన మూడు రోజుల తర్వాత ఘోరంగా విఫలమైంది. తిరిగి రిలీఫ్ వెల్స్ ఆపరేషన్ ప్రారంభించారు. ఇది పూర్తవటానికి కనీసం రెండు నెలల కాలం పట్టవచ్చని అంచనా. ఈ పద్ధతి కూడా పనిచేయక పోవచ్చని, 1980లో దక్షిణ మెక్సికోలో జరిగిన బ్లోఅవుట్‌ను దాదాపు మూడు నెలల వరకు మూయలేక పోయారని కొంతమంది నిపుణులు గుర్తు చేస్తున్నారు.

అమెరికా ప్రభుత్వం గల్ఫ్ సముద్రంలో 18 వేల అడుగుల లోతు వరకే డ్రిల్లింగ్ చేయడానికి అనుమతినిస్తుంది. కాని ప్రయోగంలో భాగంగా ఈ ఆపరేషన్ 22 నుండి 25 వేల అడుగుల లోతు వరకు వెళ్లడం వల్లే ఈ ప్రమాదం జరిగింది.

ఇటువంటి ప్రమాదాలు జరగకుండా ఆపడానికి రక్షణ కోసం 40 అడుగుల హైడ్రాలిక్ యంత్ర పరికరాలను వాడాల్సి ఉంది. ఏదైనా లీక్ జరిగి పేలిపోయే ప్రమాదం ఉన్నప్పుడు ఆ పరికరం వెంటనే ఆయిల్ బావిని మూసేస్తుంది. ఇదే కాకుండా అదనంగా రక్షణ కోసం ప్రమాదం జరిగే ముందు హెచ్చరిక చేసే స్విచ్ ఉండాలి. కాని ఈ రక్షణ పరికరాలేవీ ఏర్పాటు చేయబడలేదు. ఈ ప్రమాదానికి బాధ్యులైన బిపి కంపెనీయే నార్వే, బ్రెజిల్‌లో ఆపరేషన్‌లను కొనసాగిస్తుంది. ఆ దేశాల వారు ఈ రక్షణ సదుపాయాలన్నీ అమలు జరిగేటట్లు బాధ్యత తీసుకొన్నారు. కాని అమెరికాలో వాటి అవసరం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది.

'ఎన్నో రకాలుగా ఈ ప్రమాదాన్ని నివారించడానికి అవకాశాలు ఉన్నా కేవలం కంపెనీ పూర్తి నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ ప్రమాదం జరిగింద'ని రోడ్ యూనివర్సిటీకి చెందిన ఓషన్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ మాల్కోమ్ స్పాల్డింగ్ అన్నారు.

క్రితం సంవత్సరం అమెరికన్ ప్రభుత్వం ప్రతిపాదించిన నిర్దిష్టమైన వాతావరణ అనుకూల రక్షణ విధానాలను, తరచు చెయ్యాల్సిన పర్యవేక్షణ ఇన్‌స్పెక్షన్‌లను బి.పి. కంపెనీ వ్యతిరేకించింది.

మే 11న సెనేటర్స్, ఈ ప్రమాదంపై విచారణ జరిపారు. దాంతో బి.పి. కంపెనీ సి.ఇ.ఒ. టామర్ మాక్ 'మేం డ్రిల్లింగ్ చెయ్యడానికి రిగ్‌ను ట్రాన్స్ ఓషన్ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చాం. ఆ ఆపరేషన్‌కు సంబంధించిన బాధ్యత అంతా వారిదే' అన్నాడు. దీనికి ట్రాన్స్ ఓషన్ అధికారి స్టీవెన్ న్యూ మెన్ 'బి.పి. కంపెనీ చెప్పిన విధంగానే మేం డ్రిల్లింగ్ చేసాం. కాబట్టి తప్పేమైనా ఉంటే అది ఆ కంపెనీదే. డ్రిల్లింగ్ ప్లాన్ వాళ్లే గీసారు. వాళ్ల ఇంజనీర్లే అజమాయిషీ చేసారు' అని చెప్పాడు. డ్రిల్లింగ్ తర్వాత సిమెంటింగ్ పనిని నిర్వహించిన హాలిబర్టన్ కంపెనీ ప్రతినిధి కూడా బి.పి. కంపెనీ ఇచ్చిన నమూనా ప్రకారమే పని చేసామని,

తమ తప్పేమీ లేదని చెప్పారు. ఇలా ఒకరిమీద మరొకరు నెపం నెట్టేయాలనే ప్రయత్నాల తర్వాత, విచారణ చివరలో మూడు కంపెనీలూ 'ఇలాంటి ప్రమాదాలు జరిగితే ఏం చేయాలో, ఎదుర్కోవడానికి అవసరమైన పరిశోధనలు ఏమీ చెయ్యలేదని' ఒప్పుకున్నాయి.

ఎనర్జీ అండ్ కామర్స్ కమిటీ విచారణ ముందు ప్రపంచ ఆయిల్ కంపెనీలు షెవ్రాన్, కొనాకొ ఫిలిప్స్, ఎక్సాన్ మొబైల్ షెల్ అధిపతులు 'మాకు కూడా ఇలాంటి ప్రమాదాలు ఎదుర్కొనే సామర్థ్యం లేద'ని ఒప్పుకున్నారు. కాని బి.పి. కంపెనీ అసమర్థ ప్రయోగాన్ని తీవ్రంగా విమర్శించారు. దీంతో అతి ప్రమాదకరమైన ప్రయోగాలతో, ఏ మాత్రం భీతి లేకుండా మనుషుల ప్రాణాలతో చెలగాటమాడే వారి దుర్మార్గ నిర్లక్ష్య వైఖరి స్పష్టమవుతుంది.

'వాటర్ కీపర్ అలయన్స్' ప్రెసిడెంట్ జూనియర్ రాబర్ట్ ఎఫ్ కెనడీ ఈ సందర్భంగా మాట్లాడుతూ '2001లో ఆనాటి వైస్ ప్రెసిడెంట్ డిక్‌షెనీ, ఆయిల్ కంపెనీల అధిపతులతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రభుత్వపరంగా ఆయిల్ కంపెనీల వ్యవహారాలు పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన మినరల్స్ మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఎం.ఎం.ఎస్.)లో తనకు అనుకూలమైన వారందరితో నింపేసాడు. అదే సంస్థ 2005లో హెచ్చరిక చేసే రక్షణ పరికరాలు అవసరం లేదని, ఎందుకంటే అవి చాలా ఖరీదు కాబట్టి, వాటి అవసరాన్ని తిరస్కరించారు. కాని ఆ స్విచ్ ఖరీదు కేవలం 5 లక్షల డాలర్లు మాత్రమే. ఈ రోజు ఖర్చు పెడుతున్న లక్షల కోట్ల డాలర్లలో అది ఎంత స్వల్పమో చెప్పనక్కర్లేదు' అన్నారు.

2005లో మల్టీనేషనల్ కంపెనీలకు అనుకూలంగా అమెరికన్ ప్రభుత్వం కూడా దీన్నే బలపరుస్తూ, 'ఇప్పటికే ఉన్న రక్షణ పరికరాలు చాలని, అదనపు సాధనాలు అవసరం లేదని' చెప్పింది. దీంతో కంపెనీల నిర్లక్ష్యమే కాకుండా, ఈ పాపంలో అమెరికన్ ప్రభుత్వ పాత్ర కూడా మనకు తెలుస్తుంది.

తను చేసిన ఘోరమైన తప్పిదాన్ని తేలిక చెయ్యడానికి బి.పి. కంపెనీ యాజమాన్యం రేడియో, టివిల్లో ప్రచారం కోసం ఒక ప్రకటన ఇచ్చింది. దీనిలో కంపెనీ ప్రతినిధి 'మేం వెంటనే ఆయిల్ లీకవుతున్న కన్నాన్ని మూసేస్తాం. ఏం చేయాలో అన్నీ చేస్తాం. మళ్లీ ఇటువంటిది జరగకుండా చేస్తాం' అంటూ మాట్లాడుతూ ఉంటే, బాక్‌గ్రౌండ్‌లో అతని వెనకాల లీకేజి మూసివేత పనిలో నిమగ్నమైన వేలాదిమంది జనం, బోట్లు, విమానాలు (హాలీవుడ్ సినిమాలాగా) కనపడుతుంటాయి. చివరగా మంచి నీటి నుండి తీసిన తెల్లటి ఆరోగ్యకరమైన పెలికాన్ పక్షి ఫొటోలో కనపడుతుంది.

ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని అదుపు చేయడానికి తీసిన ఈ వాణిజ్య ప్రకటన బెడిసికొట్టింది. ఎందుకంటే అప్పటికే ఆయిల్ బురదలో నుంచి పైకి తీసిన పెలికాన్ వికృత రూపం వారి దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారంలోకి వచ్చి ఉంటే దాన్ని తెల్లగా చూపించడంతో ప్రజల నుండి మరింత తీవ్రమైన నిరసన ఎదురవడంతో కంపెనీ వెంటనే క్షమాపణలు చెప్పి ఆ ప్రకటనను వెనక్కి తీసుకుంది. సమస్యల్ని నిజాయితీతో ఎదుర్కోవడం కాకుండా తప్పుడు ప్రచారాల ద్వారా ప్రజల్ని మోసం చెయ్యాలనే వారి నైజం బయటపడింది.

గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో ఆయిల్ లీకు వల్ల సముద్ర జీవరాసులకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడింది. అమెరికా మొత్తం చేపల వ్యాపారంలో 40 శాతం వాటా లూసియానా గల్ఫ్ కోస్ట్‌దే. ఈ ప్రాంతపు వ్యాపారం ద్వారా సంవత్సరానికి వచ్చే 2.5 బిలియన్ డాలర్ల ఆదాయం ఆగిపోయింది. చేపల వేటను నిషేధించడం వల్ల దాని మీదే బతుకుతున్న మత్స్యకారులు జీవనాధారం కోల్పోయారు. చేపలు, ఇతర సముద్ర ఆహార జీవులతో పాటు డాల్ఫిన్స్, పెలికాన్ పక్షులు, హెర్మిట్ క్రాబ్స్ ఆయిల్ బురద కాలుష్యంతో నశించిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అంతే కాదు ఇది పొదిగే సీజన్ కాబట్టి ఆ ప్రాంతపు తాబేళ్ల జాతి మొత్తం నశించి పోయే ప్రమాదం ఏర్పడింది.

సముద్ర నీటిలో కలిసిపోతున్న ఆయిల్‌ను విడగొట్టి పట్టుకోవడానికి 31 లక్షల లీటర్లు 'క్లోరోక్సిట్' అనే ప్రమాదకరమైన రసాయనాన్ని వాడారు. వాతావరణ రక్షణ ఏజెన్సీ (ఇ.పి.ఎ.) దీనిపై వ్యాఖ్యానిస్తూ 'దీని వల్ల వాతావరణంలో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోయి, ఆ ప్రాంతపు సూక్ష్మ జీవజాలమంతా అంతరించిపోయే ప్రమాదం ఉంద'ని హెచ్చరించడం జరిగింది.

ఈ ప్రమాదంపై అత్యంత తీవ్రంగా స్పందిస్తున్నట్లు కనపడుతున్న ఒబామా గత డిసెంబర్‌లో అమెరికా తీర ప్రాంతాలలో మరిన్ని ఆయిల్ డ్రిల్లింగ్ ఆపరేషన్లను ఏర్పాటు చేయాలని ప్రకటించాడు.

మొదట్లో ఈ ప్రమాదాన్ని పట్టించుకోని ఒబామా ప్రజల ఆగ్రహాన్ని గమనించి అకస్మాత్తుగా బి.పి. కంపెనీ గొంతు మీద బూటుతో నొక్కి పెడతానని హెచ్చరించాడు. ఎక్కడ తన్నాలో అక్కడ తంతానన్నాడు. ఈ సంఘటన మన వాతావరణం మీద సెప్టెంబర్ 11 లాంటి దాడి అన్నాడు. ఇక మీద విదేశీ ఆయిల్ మీద ఆధారపడడం తగ్గించుకోవడమే కాకుండా అసలు ఆయిల్ వాడకం అవసరాన్నే తగ్గించుకోవాలన్నాడు. కాని ఇంతవరకు చనిపోయిన కార్మికుల గురించి ఎక్కడా మాట్లాడినట్లు లేదు.

ఒబామా బ్రిటిష్ పెట్రోలియం కంపెనీని విమర్శించే సరికి బ్రిటిష్ దేశంలో తీవ్రమైన నిరసనలు వెల్లువెత్తాయి. ఆ దేశపు వ్యాపార వర్గాలు ఒబామా వ్యక్తిగతమైన, పక్షపాతంతో కూడిన విమర్శలు చేస్తున్నాడని, అమెరికన్ కంపెనీలు ఇతర దేశాల్లో సాగిస్తోన్న మారణహోమాల్ని గురించి మాట్లాడకుండా కేవలం బ్రిటిష్ కంపెనీని విమర్శించడం అమెరికా ద్వంద్వ నీతిని తెలియచేస్తోందని దుయ్యబట్టారు. భోపాల్‌లో, ఆఫ్రికా దేశాల్లో అనేక ప్రమాదాలకు కారణమైన కంపెనీల సంగతేమిటి అని ప్రశ్నిస్తున్నారు.

వేలాది మంది బ్రిటన్ పత్రికలకు ఉత్తరాలు రాస్తున్నారు. 'అమెరికా వారు బి.పి. కంపెనీనే విమర్శిస్తున్నారు గాని రిగ్ ఓనరైన ట్రాన్స్ ఓషన్‌ను గాని, సీలింగ్ పనిచేసిన హాలిబర్టన్‌ను గాని, ఆపరేషన్ మొత్తాన్ని పర్య వేక్షించాల్సిన అమెరికన్ అధికార వ్యవస్థల నిర్లక్ష్యాన్ని నిలదీయరెందుక'ని వారి ఉత్తరాల సారాంశం.

లండన్ మేయర్ బోరిస్ జాన్సన్ 'నెపం ఎవరి మీదో తోసేసే పద్ధతి వెంటనే ఆపాలి. లేకపోతే ఇది ఒక జాతి సమస్యగా మారిపోయే ప్రమాదముంద'ని హెచ్చరించాడు.

బి.పి. కంపెనీ చేత నష్టపరిహార నిధికి 20 బిలియన్ డాలర్లను జమ చేయడానికి ఒబామా ఒప్పించిన తర్వాత, బ్రిటన్ ప్రధానమంత్రి డేవిడ్ కామరూన్ రేడియోలో మాట్లాడుతూ 'బి.పి. కంపెనీ వారు ఇవ్వాల్సింది తప్పక ఇస్తారు. కాని పరిమితి లేకుండా ఇంకా ఎంత కావాలని ఒత్తిడి చేస్తారోనని వారు భయపడుతున్నారం'టూ వారి తరఫున మాట్లాడాడు. కాని బి.పి. కంపెనీలోనే తమ పెన్షన్ ఫండ్స్‌ను

పెట్టుబడులుగా పెట్టి ఆ కంపెనీ దివాళా తీస్తే తమ బతుకులేమవుతాయో మోనని ఆందోళన చెందుతున్న బ్రిటన్ కార్మికులకు ఎటువంటి హామీ ఇవ్వలేదు.

ప్రపంచ యుద్ధ నేరస్తులైన అమెరికా, బ్రిటన్‌లు ఒకరి పై మరొకరు ఎన్ని విమర్శలు గుప్పించినా, అదంతా లాలూచీ కుస్తీలాంటిదని, అంతిమంగా రెండు దేశాల నాయకులు ప్రజల్ని వంచించడంలో సిద్ధ హస్తులని గ్రహించాల్సి ఉంది.

భోపాల్ దుర్ఘటన పై అన్యాయమైన కోర్టు తీర్పు తర్వాత అనేక హక్కుల సంఘాలు, కార్యకర్తలు తీవ్రంగా స్పందించి తమ నిరసనను తెలిపారు. అమెరికాలో బి.పి. కంపెనీపై ఒబామా హూంకరింపులు చూసి, హర్ష్‌మందర్, వందనాశివ, రోహిణి హిన్స్‌మాన్, వందనా ప్రసాద్, షబ్నమ్ హష్మి, వినోద్ రైనా, జావెద్ అఖ్తర్ లాంటి ప్రముఖులు ఒబామాకు ఉత్తరం రాశారు. 'మీరు బి.పి. కంపెనీ పట్ల చూపిస్తున్న దృఢమైన వైఖరి, పర్యావరణ కాలుష్యాన్ని సృష్టిస్తోన్న కంపెనీల జవాబుదారీ తనాన్ని కోరడం ప్రపంచమంతా నేర్చుకోవాల్సి ఉంది. మీరు ఆ కంపెనీ పట్ల ఎలాంటి జవాబుదారీతనాన్ని కోరుతున్నారో అదే స్ఫూర్తితో భోపాల్ దారుణానికి కారకులైన నేరస్తుల్ని శిక్షించేందుకు అవకాశం కల్పించాల'ని విజ్ఞప్తి చేశారు. ఇది గొర్రె కసాయిని నమ్మినట్లుగా ఉంది. ఒబామా ఎంత సేపూ నష్ట పరిహారం గురించి మాట్లాడుతున్నాడే గాని ప్రమాదానికి కారణమైన నేరస్తుల్ని శిక్షించడం గురించి మాట్లాడడం లేదని, పైగా మనుష్యుల సాంకేతిక పరిజ్ఞానానికి పరిమితులున్నాయని ఇప్పుడు తెలిసిన తర్వాత అనడం, బహుళజాతి కంపెనీలను నేరస్తులుగా ముద్ర వేయకుండా వాటిని కాపాడడానికని గుర్తించాల్సి ఉంది.

బ్రిటిష్ పెట్రోలియంతో పాటు ఇతర మల్టీనేషనల్ ఆయిల్ కంపెనీలైన, షెల్, షెవ్రాన్, ఆక్సిడెంటలీ, కొనాకోపిలిప్స్, ఎక్సాన్ మొబైల్‌లు ప్రపంచ వ్యాప్తంగా అనేకదేశాల్లో సృష్టించిన ఆయిల్ లీకేజీలు, ప్రమాదాల కారణంగా ఆయా దేశాల ప్రజల ప్రాణ నష్టానికి, వాతావరణ కాలుష్యానికి కారణ భూతులవుతున్నారు. నైజర్ డెల్టా, కొలంబియా, ఈక్వెడార్, పెరూ, అమెజాన్‌లలో వీరు సృష్టించిన విధ్వంసం ఇంతా అంతా కాదు. ఈ ఆయిల్ లీకేజీ వల్ల అంగోలా, చాడ్, గాబన్, ఉగాండా, సూడాన్ దేశాల్లో నదులు, బావులు అన్నీ ఎండిపోయి నీటికి కరువు ఏర్పడి ఆ దేశాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నైజీరియా ప్రభుత్వ లెక్కల ప్రకారం 1970 నుండి 2000 వరకు 9 వేల ఆయిల్ లీకేజీ సంఘటనలు జరిగాయి. ప్రస్తుతం దాదాపు రెండు వేల సంఘటనలు జరిగాయి. మెక్సికో గల్ఫ్‌లో జరిగిన ప్రమాదానికి గుండెలు బాదుకుంటున్న వారు ఆ ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించారా?

ఈ సందర్భంగా మల్టీనేషనల్ ఆయిల్ కంపెనీ షెల్‌కు వ్యతిరేకంగా పోరాడినందుకే నైజీరియాలో గొప్ప ప్రజానాయకుడు కెన్‌సారోవివా, అతని సహచరులు ఉరి తీసిన సంగతి గుర్తు వస్తుంది. ఆనాడు గ్రీన్ పీస్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రచురించిన నివేదికలో 'షెల్ కంపెనీ తన కార్యక్రమాలను నైజర్ డెల్టాలో ప్రారంభించిన నాటి నుండే ఆ చుట్టుపక్కల ప్రజలందర్నీ అపాయంలోకి నెట్టింది. చమురు వెలికితీతకు ఈ సంస్థ ఉపయోగించే పద్ధతులు, వాడే యంత్రాలూ, అన్ని కాలదోషం పట్టినవే. సరైన స్థితిలో లేనివే. వీటిని ప్రపంచంలో ఏ ఇతర ప్రాంతాలలో వాడినా చట్టవ్యతిరేక చర్యలుగా పనిగణిస్తార'ని పేర్కొంది. దీన్ని బట్టి 15 సంవత్సరాల క్రితం ప్రజల జీవితాలతో చెలగాటమాడిన షెల్ కంపెనీ వారసత్వాన్ని నేడు బి.పి. కంపెనీ కొనసాగించిందన్న విషయం అర్థం అవుతోంది.

గల్ఫ్ ఆఫ్ మెక్సికో ప్రమాదం తర్వాత అమెరికన్ అజేయత అనే కల్పన బద్దలయింది. హాలివుడ్ సినిమాల్లో చూపించే అమెరికన్ హీరోయిజం ఎంత పెద్ద అబద్ధమో నేడు ప్రపంచం ముందు రుజువైంది. మన పురాణ కథల్లో అందరి నెత్తి మీద చెయ్యేసి అంతం చేసే భస్మాసురుడు చివరకు తన నెత్తి మీద తనే చెయ్యేసి నాశనం అయినట్లు అమెరికా తాను చేసిన తప్పుడు పనులకు ఫలితం అనుభవించక తప్పదు.

ఈ సందర్భంగా తన ఉరితీతకు రెండు నెలల ముందు కెన్‌సారోవివా నైజీరియా కోర్టులో సమర్పించిన ప్రకటనను గుర్తు చేసుకొందాం. 'మనందరం చరిత్ర ముందు నిల్చున్నాం. నేనూ, నా సహచరులు మాత్రమే విచారణలో ఉన్నారనుకోవచ్చు. షెల్ కంపెనీ ఇక్కడ విచారణలో ఉంది. ఆ కంపెనీయే ఈ రహస్య విచారణ తతంగం నడిపిస్తోంది. దానికి శాస్తి జరిగే రోజు తప్పక వస్తుంది. ఇప్పుడు నేర్చుకొన్న గుణపాఠాలు అప్పుడు పనికి వస్తాయి. ఈ కంపెనీ మన డెల్టాపై ప్రకటించిన పర్యావరణ యుద్ధాన్ని, ప్రజలు ఇప్పుడు కాక పోయినా, తర్వాతైనా ప్రశ్నిస్తారు. ఈ యుద్ధ నేరాలకు కారణభూతులైన వారు శిక్షింపబడతారు. నైజీరియా దేశమే ఈనాడు విచారణ బోనులో ఉంది. అంటే ఈనాటి పాలకులు, వారిని బలపరిచే వారందరు బోనులో ఉన్నట్లే'.

గల్ఫ్ ఆఫ్ మెక్సికో ప్రమాదానికి కారకులుగా కేవలం బి.పి. కంపెనీనే కాకుండా, అలాంటి కంపెనీలకు వత్తాసునిస్తున్న అమెరికా, బ్రిటన్ నాయకులని కూడా నేరస్తులుగా బోనులో నిలబెట్టాలి. మాకు న్యాయమైన నష్టపరిహారమొక్కటే కాదు. మా జీవితాల్ని నాశనం చేసిన ఆండర్సన్‌ను పట్టుకొని ఉరితీయాలని ఉద్యమిస్తున్న భోపాల్ ప్రజల స్ఫూర్తితో ప్రజాపోరాటాల ద్వారానే సామ్రాజ్యవాద బహుళజాతి జాతి కంపెనీల దుర్మార్గాన్ని ఓడించగలం.

(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు) వీ

వీక్షణం పత్రికను వెబ్ పేజీల్లో కూడా చూడవచ్చు!

www.veekshanam.wordpress.com

మీ అభిప్రాయాలను, సూచనలను ఎప్పటికప్పుడు మాకు తెలియజేయండి!

తెలుగు సమాజం తన గురించి తాను చేసుకుంటున్న అన్వేషణలో మీరూ పాలుపంచుకోండి!

Email : veekshanam2003@gmail.com

ఇటీవల విస్తరిస్తున్న పర్యావరణ చైతన్యపు ప్రాధాన్యతను గుర్తిస్తూనే, ఆ అవగాహనలో భాగం కావలసిన మౌలిక అంశాలను లేవనెత్తుతున్నారు **రణధీర్ సింగ్**

మన కాలపు పర్యావరణ సంక్షోభం

ప్రజలలో పర్యావరణ సంక్షోభం గురించి అవగాహన ఇటీవలి దశాబ్దాలలో విస్తృతంగా పెరుగుతోంది. మరీ ముఖ్యంగా 1972 తర్వాత ఈ చైతన్యం పెరుగుతూ వస్తోంది. కార్పొరేట్ సంస్థల నాయకులూ, పరిశోధకులూ, ప్రభుత్వాధికారులూ ఏర్పర్చుకున్న క్లబ్ ఆఫ్ రోమ్ అనే సంస్థ 1972లో 'ది లిమిట్స్ ఆఫ్ గ్రోత్' అనే పుస్తకం ప్రచురించింది. అసలు మన భూగోళపు మౌలిక మనుగడే ప్రమాదంలో పడిందని ఆ పుస్తకం హెచ్చరించింది. ఆ తర్వాత ఈ సంక్షోభం గురించి ఆందోళన లెక్కలేనన్ని పుస్తకాలకూ, అసంఖ్యాకమైన సమాచారానికీ దారితీసింది. భూగోళపు పర్యావరణం ఎంత పెద్దఎత్తున ధ్వంసం అయిపోతున్నదో సమాచారం వెలువడింది. పెద్దఎత్తున శాస్త్రీయ విశ్లేషణలు, తాత్విక ఆలోచనలు వెలువడ్డాయి.

ప్రపంచవ్యాప్తంగా ఒకరకమైన 'హరితమోజు' మొదలైంది. పర్యావరణం మీద కమిషన్‌లూ, సదస్సులూ, ధరిత్రి కోసమూ, నీటి కోసమూ, ఓజోన్ పొర కోసమూ, అడవుల కోసమూ, వగైరా వగైరా దినాలు, ఆ రోజులలో మంత్రులూ, రాజకీయవేత్తలూ, అధికారులూ జాతీయంగానూ, అంతర్జాతీయంగానూ తమ వత్తిడిలో నుంచి కాసింత సమయం మిగిల్చుకొని మొక్కలు నాటడమూ, అట్లాంటిక్ సముద్రాన్నీ, పసిఫిక్ సముద్రాన్నీ దాటి ప్రయాణాలు చేయడమూ, వారితో అడుగులు కలుపుతూనో, వ్యతిరేకిస్తూనో స్వచ్ఛంద సంస్థలు బయలుదేరడమూ, ఓజోన్ పొర చిరిగిపోవడం గురించి, భూగోళ ఉష్ణోగ్రత పెరిగిపోవడం గురించి, గ్రీన్‌హౌస్ పరిణామాల గురించి, ఉష్ణమండల అరణ్యాలు తరిగిపోవడం గురించి వగైరా చర్చలూ, మొత్తం మీద పర్యావరణం గురించి అంతులేని తతంగం మొదలయింది. ఈ వ్యవహారంలో ప్రతి ఒక్కరూ 'నీకంటే నేనే ఎక్కువ హరితం' అని ప్రకటించడం మొదలైంది. ఇక ప్రభుత్వాలయితే పర్యావరణం పట్ల తమ శ్రద్ధ గురించి ఎప్పటికప్పుడు ప్రకటనలు జారీచేస్తూనే ఉంటాయి. అంతర్జాతీయ సంస్థలు ఈ ఉదాత్త ఆశయానికి సేవ చేయడమే తమ లక్ష్యమని ప్రకటిస్తుంటాయి. చివరికి గోర్బచేవ్ కూడా ఈ వ్యవహారంలోకి దిగాడు. జెనీవా కేంద్రంగా పనిచేసే గ్రీన్‌క్రాస్ ఇంటర్నేషనల్ సంస్థ తరఫున కొత్త శతాబ్దం 'పర్యావరణ శతాబ్దంగా మారబోతుందని' ఆయన ప్రవచనాలు చేస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు ఈ పోటీలో ఎంత మాత్రం వెనుకబడలేదు. ఇవాళ మీకు ఎక్కడ చూసినా పర్యావరణాన్ని రక్షించండి అనో, కాలుష్యానికి ముగింపు పలకండి అనో, భూగోళం మీది గాలినీ, నీళ్లనూ విషపూరితం చేయకండి అనో ప్రకటనలు వినబడని సమయమూ, స్థలమూ లేదు.

రానున్న మహా ఉత్పాతం ఎంత పెద్దదో తీవ్రమైన హెచ్చరికలు వస్తున్నాయి. ఆ ఉత్పాతాన్ని తప్పించడానికి ఏమేమి చేయవచ్చునో సలహాలకు అంతులేదు. దురభిప్రాయాలను, అత్యాశను, సోమరితనాన్ని ఒదులుకోవాలని సలహాలు వినబడుతున్నాయి. మానవ జాతికి ఇటువంటి సమస్యలు సుదీర్ఘకాలంగా వస్తూనే ఉన్నాయనీ, కనుక ఏమీ తొందరలేదనీ భావించే సౌకర్యవంతమైన అభిప్రాయాలు ఒదులుకొమ్మని చెబుతున్నారు. జీవ వైవిధ్యాన్ని గౌరవంతో పరిగణించమని చెబుతున్నారు. సహజ పదార్థాలను, తిరిగి వినియోగించగల పదార్థాలను వాడమని ప్రోత్సహిస్తున్నారు. ఇంధనాన్ని, శక్తి వనరులను ఆదా చేయమంటున్నారు. వృథాను తగ్గించమంటున్నారు. బొగ్గు, పెట్రోలియం వంటి ఖనిజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి, సౌరశక్తీ, వాయుశక్తీ వంటి పునరుత్పాదక శక్తి వనరులను ఉపయోగించమంటున్నారు. మొక్కలు నాటమనీ, పానీయాల డబ్బాలు, సీసాలు పారేయకుండా ఉండమనీ చెబుతున్నారు. నగరాల నమూనాను మార్చమనీ, రవాణా సౌకర్యాలు మార్చమనీ చెబుతున్నారు. ఆటోమొబైల్‌ల వాడకం తగ్గించి, ప్రధాన రవాణా సాధనంగా సైకిల్ వాడమని చెబుతున్నారు. ఉత్పత్తి విషయంలోనూ, వినియోగం విషయంలోనూ వ్యక్తిగత నిగ్రహం పాటించమని కోరుతున్నారు. మన ఆకాశాన్ని రక్షించండి, ఓజోన్‌ను ఆదరించండి వగైరా వగైరా చెబుతున్నారు. 'సాంప్రదాయిక జ్ఞానాన్ని ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కలగలిపి వాడితేనే ఈ చికాకు నుంచి బయట పడగలం' అనే సలహాలు ఇస్తున్నారు.

'పర్యావరణ అర్థశాస్త్రం' అనే కొత్త అధ్యయన శాఖే పుట్టుకొచ్చింది. సరుకుల ధరలలో పర్యావరణ వ్యయాన్ని కూడా కలపాలని చెప్పే 'పర్యావరణ ధరల విధానం' అనేది ప్రచారం చేస్తున్నారు. ఎక్సాన్ ఆయిల్ కంపెనీ నార్వే శాఖకు చెందిన రిటైరయిన ఉపాధ్యక్షుడు ఓస్టిన్ డాహ్లె ఇంకా ముందుకు వెళ్లి ఒక గొప్ప ప్రవచనం చేశాడు : 'ఆర్థిక సత్యాన్ని చెప్పకుండా ధరలను అడ్డుకున్నందువల్ల సోషలిజం కుప్పకూలి పోయింది. ఇప్పుడు పర్యావరణ సత్యాన్ని చెప్పకుండా ధరలను అడ్డుకుంటే పెట్టుబడిదారీ విధానం కుప్పకూలిపోవచ్చు.'

ఇక అమెరికా ఉపాధ్యక్షుడు అల్‌గోరే వంటి పెద్ద మనిషి వచ్చి 'నాగరికతా నిర్వహణకు కీలక సూత్రం', 'పర్యావరణాన్ని పరిరక్షించడమే' అని, అది 'ప్రస్తుత ప్రపంచ నాగరికతా తర్కానికి వ్యతిరేకంగా పోవడమే'నని అంటున్నాడు. ఇంకా కొందరు మేధావులు చాలా వివరాలతో, 'మన ప్రస్తుత సంక్షోభానికి తగిన నైతిక ధర్మాన్ని కనిపెట్టాలంటే సంపూర్ణంగా కొత్తదైన ఒక పర్యావరణ జ్ఞాన సిద్ధాంతం కావాలని' కూడా వాదిస్తున్నారు.

కొంచెం సమగ్రమైన చర్యలను ప్రతిపాదించిన బ్రంట్ల్యాండ్ కమిషన్ 1987లో చేసిన టోక్యో ప్రకటన ఇటువంటి సూచనలన్నిటికీ మచ్చుతునక లాంటిది. ఈ ప్రకటన 'ప్రపంచంలోని అన్ని జాతులనూ ఉమ్మడిగానూ, విడివిడిగానూ' ఉద్దేశించినది. సుస్థిర అభివృద్ధిని 'ఆయా దేశాల లక్ష్యాలలో సుస్థిర అభివృద్ధిని భాగం చేసుకోవాలనీ, వారి చర్యలకు మార్గదర్శక సూత్రాలుగా కొన్ని అంశాలు ఉండాలనీ' అది సూచించింది. ఆ మార్గదర్శక సూత్రాల జాబితాలో: 1) ఎప్పటికప్పుడు వృద్ధి పునరుద్ధరణ జరుగుతుండాలి. 2) వృద్ధి ప్రమాణాలను మారుస్తూ ఉండాలి. 3) వనరుల పునాదిని పరిరక్షించాలి, పెంచాలి. 4) జనాభాను సుస్థిర స్థాయికి తగినట్టుగా ఉంచాలి. 5) సాంకేతిక పరిజ్ఞానాన్ని పునః సమీక్షిస్తూ ప్రమాదాలను అదుపులో ఉంచాలి. 6) నిర్ణయాలు తీసుకోవడంలో పర్యావరణాన్నీ, ఆర్థిక దృక్పథాన్నీ సమ్మిళితం చేయాలి. 7) అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలను సంస్కరించాలి. 8) అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాలి.

ఇలా సంబంధిత పర్యావరణవేత్తల నుంచీ, నిపుణులు రాసిన పుస్తకాల నుంచీ, నివేదికల నుంచీ, కమిషన్ల నుంచీ, సమావేశాల నుంచీ, శిఖరాగ్ర సదస్సుల నుంచీ గత మూడు దశాబ్దాలలో అంతులేని ప్రవాహంగా ఇటువంటి సలహాలూ, సూచనలూ, సూత్రాలూ ఎన్నో వచ్చాయి. కాని, అతి ఎక్కువగా అవన్నీ కేవలం గంభీర ప్రవచనాలుగానో, పవిత్ర కోర్కెలుగానో మిగిలిపోయాయి. పర్యావరణానికి సంబంధించిన ఒప్పందాలూ, కమిషన్లూ అంతకంతకూ ఎక్కువవుతున్న కొద్దీ, వాటికి ప్రపంచ బ్యాంక్ అధీనంలోని గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీ (జిఇఎఫ్) వంటి సంస్థల నుంచి నిధులు అంతకంతకూ ఎక్కువగా అందుతున్న కొద్దీ కింద క్షేత్రంలో పని అతి తక్కువగా జరుగుతోంది. సంపన్నమైన పాశ్చాత్య దేశాలలో పర్యావరణం అనేది అందరికీ కనబడే ఒక పెద్ద సమస్య గనుక, దానికి అన్ని చోట్లా సాధికారత ఉంది గనుక, ఐక్యరాజ్య సమితి సంస్థలూ, వితరణ సంస్థలూ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలూ అపారమైన ధనాన్ని విడుదల చేస్తున్నాయి. నిజానికి ఈ సంస్థల దగ్గర ఎంత సంపద పోగుపడి ఉన్నదంటే, అది ఎట్లా వాడాలో వాళ్లకు తెలియదు.

ఇక తామేమీ వెనుకబడలేదన్నట్టు మూడో ప్రపంచ దేశాలలోని అత్యధిక దేశాల ప్రభుత్వాలూ, మంత్రివర్గాలూ కూడా ముమ్మరంగా నిధులు విడుదల చేస్తున్నాయి. కాని, ఫలితాలు మాత్రం ఎక్కడ చూసినా రేఖా మాత్రంగానే ఉన్నాయి. పర్యావరణ సమస్యల గురించి అవగాహన దాదాపు విశ్వవ్యాప్తంగా ఉండగా, సూచిస్తున్న పరిష్కారాలు మాత్రం పైపైన ఉన్నాయి. ఈ రంగంలో పనిచేస్తున్న చాలా మంది కేవలం అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకోవడం ద్వారా, ప్రకటనలు చేయడం ద్వారా, పర్యావరణానికి అనువైన సరుకులను పునరుత్పత్తి చేయడం ద్వారా, వినియోగించడం ద్వారా, స్వీయ నియంత్రణను, నిగ్రహాన్ని అమలు చేయడం ద్వారా మాత్రమే ప్రస్తుత పర్యావరణ సంక్షోభానికి మౌలిక పరిష్కారం దొరుకుతుందని వాదిస్తున్నారు. ఆచరిస్తున్నారు. మరో మాటల్లో చెప్పాలంటే ఇవ్వాళ మనందరమూ ఎదుర్కోవాల్సిన, అధిగమించాల్సిన ఏకైక ప్రధాన సమస్య పర్యావరణం లేవనెత్తుతున్న ప్రశ్నలకు మన ఆర్థిక శాంతి ద్వారా పరిష్కారం కనిపెట్టాలని, 'జీవితం ఏ ఆకుపచ్చ – నీలం పొర మీద ఆధారపడి ఉన్నదో ఆ పొరను ధ్వంసం చేయని రీతిలో మన నిత్య జీవితావసరాలు సంపాదించుకోవడమే' ఏకైక పరిష్కారమని అంటున్నారు. ఇందుకు సంబంధించిన హెచ్చరికలు రోజురోజుకూ మరింత పెద్దగా, మరింత స్పష్టంగా వినబడుతున్నాయి. కాని, అంతకు సమానంగా తెలుసుకోవలసిందేమంటే ఇప్పటి వరకు అర్థవంతమైన చర్య ఏదీ జరగలేదు.

1992లో ఐక్యరాజ్య సమితి రియో డి జెనీరోలో పర్యావరణం, అభివృద్ధి మీద అంతర్జాతీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. 'రియో ధరిత్రీ సదస్సు' పేరిట జరిగిన సుప్రసిద్ధమైన ఆ సమావేశం ఎజెండా 21 అనే కార్యక్రమ ప్రణాళికను విడుదల చేసింది. అది ఇప్పటికీ అమల్లోకి రాలేదు. ఆ తర్వాత పది సంవత్సరాలకు జరిగిన జొహానెస్బర్గ్ శిఖరాగ్ర సమావేశం వెనక్కి నడిచిందే తప్ప ముందుకు నడవలేదు. 'రియో + పది = జొహానెస్బర్గ్ = 0' అని ఒక ప్రముఖ భారతీయ వార్తా పత్రిక సంపాదకీయంలో వ్యాఖ్యానించినది అక్షరాలా నిజం. ప్రభుత్వాలు జాతీయ పర్యావరణ పరిరక్షణా సంస్థలను ఏర్పాటు చేస్తున్న కొద్దీ పర్యావరణ విధ్వంసం పెరిగిపోతున్నదని వరల్డ్ వాచ్ ఇన్స్టిట్యూట్కు చెందిన లెస్టర్ బ్రౌన్ వ్యాఖ్యానించాడు. శాస్త్రవేత్త కార్ల్ సాగన్ ఎప్పుడో అడిగిన లోతైన ప్రశ్న ఇవాళ్టికీ అడగవలసే ఉంది : 'మానవ జాతి కోసం ఎవరు మాట్లాడతారు? భూగోళం కోసం ఎవరు మాట్లాడతారు?'

ప్రస్తుత పర్యావరణ సంక్షోభానికి ప్రధానంగా బాధ్యత వహించ వలసింది ఉత్తరార్ధ గోళానికి చెందిన సంపన్న దేశాలలో అమలవుతున్న ఆర్థికాభివృద్ధి వ్యూహమేననే అవగాహన విస్తృతంగానే పెరుగుతోంది. ఇటీవలి దశాబ్దాలలో విపరీతంగా పెరిగిపోయిన వస్తు వినియోగ సంస్కృతి ఈ సంక్షోభాన్ని మరింత పెంచింది. ఊగించే సంగీత సాధనాలు, ఫాస్ట్ ఫుడ్స్, కోకాకోలాలతో ఈ వస్తు వినియోగ సంస్కృతి ఒక కొత్త సమాంతర తాత్కాలిక సమాజాన్ని సృష్టించింది. ఈ తాత్కాలికం ఎంత తాత్కాలికం అంటే యవ్వనం ఉన్నంత వరకే అది ఉంటుంది. ఈ సమాజం ఆఫ్రికన్ చరిత్రకారుడు జోసెఫ్ కిజర్బో చెప్పినట్టు 'హోమో కోకాకోలన్స్' అనే నరజాతిని సృష్టించింది. (జీవపరిణామ చరిత్రలో అనేక మార్పులు చేర్పుల తర్వాత కొన్ని లక్షల ఏళ్ల కింద ఇవాళ్టికీ కొనసాగుతున్న మానవ జాతి రూపొందిందనీ, దాన్ని హోమో సెపియన్ అని పిలవాలని ఆంథ్రోపాలజీ చెబుతుంది. ఇప్పుడు హోమో సెపియన్ల దశ దాటి హోమో కోకాకోలన్లు భూమి మీదికి వచ్చారని ఈ వ్యాఖ్య అర్థం.) ఈ హోమో కోకాకోలన్ల జీవిత విధానాన్నే ప్రధానంగా 'అమెరికన్ జీవన విధానం' అని పిలుస్తున్నారు.

ఉత్తరాది సమాజాల సంపద, వాటి వస్తు వినియోగ సంస్కృతి, అమెరికన్ జీవన విధానం వీటి పట్ల ప్రపంచానికి అసూయ ఉంది. ఆరాధన ఉంది. ప్రతి చోటా అవి కావాలనే కోరిక కూడా ఉంది. ఈ కోరిక దక్షిణాదికి చెందిన పేద దేశాలలో తక్కువ ఏమీ లేదు. అయితే ఈ కోరికతో పాటే ఒక ఎరుక కూడా వ్యాపిస్తోంది. ఉత్తరార్ధ గోళంలో అమలువుతున్న ఉత్పత్తి, వినియోగ పద్ధతి దక్షిణాదికి ఎగుమతి కావడం మాట అలా ఉంచండి. ఉత్తరాదిన కూడా నిర్వహించడం అసాధ్యమై పోతున్నది. తమ తమ దేశాలలో ప్రస్తుతం కొనసాగుతున్న వినియోగ పద్ధతి ఎంత అశాశ్వతమైనదో గుర్తించమని ఆయా దేశాలకు వరల్డ్ వాచ్ ఇన్స్టిట్యూట్ పదే పదే విజ్ఞప్తి చేస్తున్నది. కాని, తన వినియోగపు వాంఛలో ఉత్తరాది దేశాలు ఒక ఆత్మహత్యా కాంక్షతో ముందుకు సాగుతున్నాయి. విమర్శకులు చెప్పినట్టు అది తనను తాను ఉరి వేసుకోవడానికి అవసరమైన తాడు కొనుక్కోవడానికి ఉత్సాహ పడుతున్నది. చైనా వంటి ఇతర దేశాలు కూడా ఈ వస్తు వినియోగ సంస్కృతిలో ప్రవేశిస్తే ఏం జరుగుతుందో ఊహించమని ఇతరులు

హెచ్చరిస్తున్నారు. అదే జరిగితే ఇవాళ ఉత్తర అమెరికాలో కొనసాగుతున్న వినియోగ స్థాయికి ప్రపంచ జనాభా చేరితే ఈ భూగోళానికి మూడు భూగోళాల వనరులు అవసరమవుతాయి.

ఉత్తరార్ధగోళం ఎటువంటి ఆర్థికాభివృద్ధి విధానాన్ని అమలు చేస్తున్నదో, అది ఎంత ప్రమాదకరమైనదో చూస్తే అటువంటి విధానం ప్రపంచమంతా అవలంబిస్తే ఒక్క క్షణంలో భూగోళం కుప్పకూలి పోతుంది. ఇవాల్టికివాళ చెప్పాలంటే అమెరికా జనాభా ప్రపంచ జనాభాలో 5 శాతం కన్న తక్కువ. కాని, ప్రపంచం మొత్తం మీద లభ్యమవుతున్న శక్తి వనరులలో 25 శాతాన్ని అమెరికా జనాభా వినియోగిస్తోంది. మిగిలిన 95 శాతం ప్రపంచ ప్రజానీకం కూడా అవే వినియోగ పద్ధతులను ఆచరించడం మొదలుపెడితే, వారిలో ఒక్కొక్కరూ ఆ మిగిలిన 75 శాతం వనరులలోనే తమ తమ 25 శాతాలు లాక్కోవడానికి ప్రయత్నిస్తే ఏం జరుగుతుంది?

అందువల్ల ప్రపంచంలోని ధనిక దేశాలు తమ వినియోగాలను, తమ పద్ధతులను మార్చుకొని, తగ్గించుకొని పేద దేశాల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి సహకరించకపోతే ప్రస్తుత ధోరణులు అర్థవంతంగా తలకిందులు కావనేది స్పష్టమే. కాని, ధనిక దేశాలలో స్వీయ నిగ్రహానికి ఏ ఒక్క ప్రయత్నం జరగడం లేదు. పైగా ఆర్థికాభివృద్ధి మార్గంలో ప్రపంచాన్ని కలుషితం చేయకండి అని ఆ దేశాలే పేద దేశాలకు సలహాలిస్తున్నాయి. శిఖరాగ్ర సమావేశాలలోనూ, ఇతర చోట్లా ఒప్పందాలు జరిగినప్పుడు ప్రపంచ ఆర్థిక అస్తవ్యస్తతకు బాధ్యులైన ధనిక దేశాలే ఆ బాధ్యత తీసుకోవాలని, ప్రపంచాన్ని కాలుష్య రహితం చేయడంలో పేద దేశాలకు ఆర్థికంగానూ, ఇతరత్రానూ సహకరించాలని, మరింత సుస్థిర అభివృద్ధి విధానం వైపు మళ్లాలని సూచనలు వస్తున్నాయి. కాని, ధనిక దేశాలు ఈ సూచనలన్నిటినీ దాదాపుగా తిరస్కరిస్తున్నాయి. ఒకవేళ ఏదైనా వాగ్దానం చేసినా ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం లేదు. అందుకు బదులుగా పేద దేశాల మీద ప్రపంచీకరణ విధానాలను, ఆర్థిక సరళీకృత విధానాలను రుద్దుతూ ఆయా దేశాలు తమ తమ అడవులనూ, మత్స్య సంపదలనూ, సహజ వనరులనూ లూటీ చేసి ఎగుమతి ఆదాయాలు పెంచుకోవడానికి పోటీ పడేలా చేస్తున్నాయి. విదేశీ మదుపుదార్లను ఆకర్షించడంలో పర్యావరణ ప్రమాణాలు అంతకంతకూ తగ్గించేలా చేస్తున్నాయి. తద్వారా ఆర్థికాభివృద్ధిలో అస్థిరమైన పద్ధతులను అన్ని దేశాలలోను పునరుత్పత్తి చేస్తున్నాయి. అర్థం లేని వస్తు వినియోగ సంస్కృతిలో హోమో కోకాకోలన్‌లతో తమకు సమాంతర సమాజాలను సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాయి.

ఈ పెరుగుతున్న పర్యావరణ సంక్షోభానికి ప్రధాన స్రవంతి ప్రతిస్పందనలో మొత్తంగా అసమగ్రత ఉంది. దూరదృష్టి లేకపోవడం ఉంది. రాజకీయాలు ఉన్నాయి. ఈ ప్రతిస్పందనలలోని మూడు ప్రత్యేక అంశాల గురించి మాత్రం ఇక్కడ చర్చించ దలిచాను. అవి 1) జనాభా పెరుగుదల, 2) పర్యావరణ స్వచ్ఛంద సంస్థలు, 3) 'సుస్థిర అభివృద్ధి' భావన.

ప్రస్తుత పర్యావరణ సంక్షోభానికి మూలకారణం జనాభా పెరుగుదలే అని చాలా తరచుగా వినబడుతుంటుంది. ఇందులో ఇమిడి ఉన్నదమేంటే దక్షిణార్ధ గోళంలో జనాభా పెరుగుదల ఎక్కువై పోతున్నదని. అసలు దక్షిణార్ధ గోళంలో అంతులేని పేదరికం ఉండడానికి కారణం కూడా జనాభా పెరుగుదలేనని మరొక సూచన కూడా ఉంది. 'భరించగలిగిన శక్తి' అనే మాల్థూస్ అనుయాయుల చట్రాన్ని పట్టుకొని మన పరిమిత సహజ వనరులను మించి జనాభా పెరుగుతున్నదనీ, అందువల్ల పర్యావరణ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం జనాభా పెరుగుదలను అరికట్టడమేననీ వాదిస్తూ ఉంటారు. ప్రపంచ జనాభా సాలీనా 9 కోట్ల 20 లక్షలు పెరుగుతున్నది. అందులో 8 కోట్ల 80 లక్షలు అభివృద్ధి చెందుతున్న దేశాలు అనబడే వాటిలోనే జరుగుతున్నది. అందువల్ల ఈ జనాభా సమస్య ప్రస్తుత పరిస్థితిలో ముఖ్యమైన అంశమే. ఈ పెరుగుదల రేటును తగ్గించడానికి, ముఖ్యంగా దక్షిణాదిలో తగ్గించడానికి హేతుబద్ధమైన జనాభా స్థిరీకరణ విధానాలు చేపట్టవలసిన ఆవశ్యకతను ఎవరూ కాదనలేరు. కానీ, చాలా నిశితమైన పరిశోధన ద్వారా స్పష్టంగా తేలిన విషయమేమంటే విపరీతమైన జనాభా పెరుగుదలకూ, పర్యావరణ సంక్షోభానికీ సంబంధమేమీ లేదు. ఒకదాని వల్ల మరొకటి జరగడం లేదని పరిశోధనలు నిస్సందేహంగా తేల్చాయి. ఇంతకు ముందే చెప్పినట్టు ఈ పరిస్థితిలో జనాభా ఒక ముఖ్యమైన అంశమే, కాని, శాస్త్రవేత్త బారీ కామనర్ వాదించినట్టు పర్యావరణ నాణ్యత అనే దాన్ని నిర్ణయించేది ప్రధానంగా జనాభా పెరుగుదల కాదు. దాన్ని నిర్ణయించేది ఆ కాలపు ఉత్పత్తి సాంకేతిక పరిజ్ఞానాల స్వభావమే.

ఇక్కడ గుర్తించవలసిన ముఖ్యమైన వాస్తవం ఏమంటే, ఇవాళ అమలులో ఉన్న ఉత్పత్తి విధానం దాని లాభాల వేటలో భాగంగా తన సహజ వనరుల వినియోగ పద్ధతి గానీ, తన ఉత్పత్తి సాంకేతిక పరిజ్ఞానాలు గానీ పర్యావరణానికి ఎటువంటి నష్టం కలగజేస్తాయో ఎంత మాత్రం పట్టించుకోదు. జనాభా మీదికి దృష్టి మళ్లించడం, ఇంకా ప్రత్యేకంగా చెప్పాలంటే దక్షిణాదిలో జనాభా పెరుగుదల మీద దృష్టి పెట్టడం ఆ ఉత్పత్తి విధానంలో ఉన్న పర్యావరణ విధ్వంసక లక్షణం మీది నుంచి దృష్టి మళ్లించడానికే. ఉత్తరాదిన కొనసాగుతున్న ఉత్పత్తి విధానం పర్యావరణ రీత్యా చూసినప్పుడు అయోగ్యమైనదని గుర్తించకుండా ఉండడానికే జనాభా గురించి మాట్లాడుతున్నారు.

ఇది అలా ఉంచి, మరొక విషయాన్ని సరిగా అర్థం చేసుకోవలసి ఉంది. జీవావరణాన్ని నిరంతరం ధ్వంసం చేసే కారణాలలో ఒకటిగా జనాభాను చూసినప్పుడు, పర్యావరణ పరిరక్షణ చర్యలలో జనాభా నియంత్రణ ఒకటిగా ఉన్నప్పుడు జనాభా పెరుగుదలకూ, పేదరికానికీ ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవలసి ఉంది. పేదరికం వల్లనే జనాభా పెరుగుదల ఎక్కువవుతుందనీ, జనాభా పెరుగుదల వల్ల పేదరికం రాదనీ ఇప్పటికే నిర్ధారణ అయిన సత్యం. ఇప్పటికే మార్క్సిస్టులు పదే పదే చూపినట్టుగా సమాజాలలో పేదరికాన్ని ఉత్పత్తి చేయడమూ, పునరుత్పత్తి చేయడమూ పెట్టుబడిదారీ విధానంలో వ్యవస్థాత్మకమైన ఒక ముఖ్యమైన అంశం. నిజానికి అదే పెట్టుబడిదారీ విధానపు మౌలిక వైరుధ్యం. ఇది ఒక సమాజం లోపల మాత్రమే కాదు, ప్రపంచ స్థాయిలో కూడా జరుగుతోంది. అందువల్లనే ఇవాళ మానవ జాతిలో అత్యధిక భాగం పేదరికానికి గురి అయి ఉంది. ఈ అవగాహనకు పరిణామాలేమిటో స్పష్టమే. పర్యావరణ సంక్షోభానికి గల చారిత్రక పెట్టుబడిదారీ మూలాలను వివరంగా చర్చిస్తూ బారీ కామనర్ ఏమన్నాడంటే : 'పూర్తిగా సొంతదైన నా నిర్ధారణ శాస్త్రీయమైనది కాదు, రాజకీయమైనది. అదేమంటే, ధనిక దేశాలు పేద దేశాలను దోపిడీ చేస్తున్న ఫలితంగానే ప్రపంచ జనాభా సంక్షోభం తలెత్తింది. దాన్ని పరిష్కరించాలంటే ఆ పేద దేశాల నుంచి ఈ ధనిక దేశాలు లూటీ చేసిన దాన్నంతా వెనక్కి తిరిగి ఇవ్వాలి. అలా ఇస్తే ఆ ప్రజలకు తమ సంతానోత్పత్తి శక్తిని తామే స్వచ్ఛందంగా తగ్గించుకునే కారణమూ, అందుకు తగిన వనరులూ అందుతాయి. ప్రపంచ జనాభా సంక్షోభపు మూలకారణం పేదరికం అయితే, ఆ సంక్షోభాన్ని నివారించడానికి పేదరికాన్ని అంతం చేయడం

తప్పు మరొక దారి లేదు. పేదరికానికి కారణం ప్రపంచ సంపద భయంకరమైన అసమ పంపిణీకి గురి కావడమే అయితే, ఆ పేదరికాన్ని అంతం చేయాలంటే, జనాభా సంక్షోభాన్ని పరిష్కరించాలంటే ఆ సంపదను దేశాల మధ్య, దేశంలోని ప్రజల మధ్య పునఃపంపిణీ చేయడం తప్ప మరొక మార్గం లేదు.'

పేదరికం, జనాభా, పర్యావరణ సంక్షోభం అనే సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం కనిపెట్టదలచిన వారెవరైనా ఈ కీలక సత్యాన్ని విస్మరించడానికి వీలు లేదు.

సామాజిక కార్యాచరణలోని అనేక ఇతర రంగాలలో లాగానే ఇటీవలి కాలంలో స్వచ్ఛంద పర్యావరణ కార్యాచరణలో కూడా ఆకర్షణీయమైన పెరుగుదల ఉంది. ఈ స్వచ్ఛంద కార్యాచరణకు సాధారణంగా ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, చివరికి బహుళజాతి సంస్థలు కూడా మద్దతు ఇస్తున్నాయి. ఈ ప్రభుత్వేతర సంస్థల తామరతంపర పెరుగుదలలో మూడో ప్రపంచం కూడా భాగం పంచుకుంది. చాలా ప్రభుత్వేతర సంస్థలకు ప్రభుత్వ సహాయం, విపరీతమైన విదేశీ నిధులు అందుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ బృందాల సంఖ్యా, ప్రభుత్వేతర సంస్థల సంఖ్యా పెరిగిన కొద్దీ, వాటిలో యువజనులు ఉత్సాహంగా పాల్గొంటున్న కొద్దీ ఈ పర్యావరణ కార్యాచరణలో ఒక మౌలిక, విప్లవ ఉద్యమ శక్తి కూడా ఉందని కొంతమంది భావించారు. కాని, ఈ శక్తి ఒకవేళ ఉన్నప్పటికీ ఇంతవరకు ఆచరణ రూపమైతే ధరించలేదు. ఈ పర్యావరణ కార్యకర్తలలో రాజకీయాల గురించీ, ఆర్థిక వ్యవహారాల గురించీ విశాల అంశాల పట్ల అవగాహన సాధారణంగా లోపిస్తుంది. చాలా సానుభూతితో చూసినప్పుడు కూడా ఈ బృందాల, సంస్థల కార్యక్రమాలు అతి ఎక్కువగా స్థానిక సమస్యలకే పరిమితమయ్యాయి. వాటికి జాతీయ స్థాయిలో నిజమైన ప్రభావం ఏమీ లేకుండా పోయింది. ఇక విమర్శతో చూడాలంటే పర్యావరణ కార్యాచరణ అనేది ఒక సరదాగా, ఖాళీ సమయాలలో చేసే పనిగా మారిపోయింది. 'ఉద్యమం' అనే పేరుతో పిలవబడిన ఈ ప్రయత్నంలో పాల్గొన్న అనేకమంది యువ కార్యకర్తలు చిట్టచివరికి ఏదో ఒక ప్రభుత్వేతర సంస్థలో సులభమైన ఉద్యోగం సంపాదించుకొని, సులభతరమైన జీవితం గడపడానికి అలవాటు పడ్డారు. లెక్కలేనన్ని ఎన్.జి.ఒ.లను ప్రభుత్వం తన ఆశ్రయంలోకి తీసుకుంది. లేదా, వాటిని అడ్డుకొని ఏ పనీ చేయలేని స్థితిని కల్పించింది. లేదా, మన మార్కెట్ సమాజాల ప్రధాన వ్యాపార నీతి కింద ఈ సంస్థలు పనికి రాకుండా పోయాయి. ఈ సంస్థలలోకి అంతకంతకూ ఎక్కువ మంది ఆకర్షించబడిన కొద్దీ ఎన్నో సంస్థలు పెత్తందారీ సంస్థలుగా, పైకి పోవాలనుకునే సంస్థలుగా దిగజారిపోయాయి. దక్షిణార్ధగోళంలోని ఎన్నో ఎన్.జి.ఒ.లు, వాటికి నిధులు అందించే ఉత్తరార్ధ గోళపు పర్యావరణ ఎన్.జి.ఒ.లకు అంటుమొక్కలుగా మారిపోయాయి.

విదేశీ అయినా, స్వదేశీ అయినా నిధులే ఎన్.జి.ఒ.లకు ప్రధాన సమస్య. నిధుల కోసం ఇతరుల మీద ఆధారపడవలసి రావడం ఆ సంస్థల స్వావలంబన ప్రయత్నాలను దెబ్బతీస్తుంది. నిధులు ఇచ్చే సంస్థ ప్రత్యేక ప్రయోజనాలను పరిరక్షించే ప్రయత్నమే జరుగుతుంది. నిధులిచ్చే దాతలు ఏమనుకుంటారో అనే ఆలోచన వల్లనే ఒక ఎన్.జి.ఒ. తాను గానీ, తనతో పనిచేసే వారు గానీ పర్యావరణ సమస్యలను విశాల రాజకీయార్థిక దృక్పథం నుంచి చూడకుండా అడ్డుకుంటుంది. బ్రెజిల్‌లోని రియో డి జెనిరోలో 1992లో జరిగిన ధరిత్రి సదస్సు పర్యావరణ ఉద్యమం మొత్తంలోకి ఒక ముఖ్యమైన సంఘటన. నిజానికి దాన్ని ఉద్యమ సమావేశాలలో, ఆ మాటకొస్తే అన్ని సమావేశాలలోనూ అంతిమమైనదిగా కొందరు అభివర్ణించారు. ఆ సమావేశమే ఈ ఉద్యమం ఎంతగా 'విదేశీ నిధుల' మీద మాత్రమే కాదు, బడా వ్యాపార గృహాల మీద ఆధారపడిందో చూపింది. ఆ ఆధారపడడం దాని లక్ష్యాలను ఎలా మొద్దుబార్చిందో చూపింది. ఆ సమావేశానికి హాజరయిన చాలా ఎన్.జి.ఒ.లను 'మేకతోలు కప్పుకున్న తోడేళ్లు'గా అభివర్ణించారు. అక్కడ ఖనిజాల తవ్వకం, వ్యవసాయ రసాయనాలు, ఔషధాలు, చమురు, విద్యుదుత్పత్తి, అటవీ సంపద వంటి పారిశ్రామిక వ్యాపార రంగాలలో పనిచేసి కుంభకోణాలలో పేరుమోసిన కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే వ్యాపార ఎన్.జి.ఒ.లు ఆకుపచ్చ రంగు తొడుక్కొని పాల్గొన్నాయి. ఇది చెబుతున్నామంటే పర్యావరణ ఉద్యమంలో స్వతంత్రమైన, క్రియాశీలమైన ఎన్.జి.ఒ.ల ఉనికికీ, పాత్రకూ ఉన్న ప్రాధాన్యతను తగ్గించడానికి కాదు. కాని, ఇక్కడ కూడా 1992 ధరిత్రి సదస్సు తర్వాత అమెరికా క్రియాశీల ఎన్.జి.ఒ.లను అడ్డుకోవడానికి, లేదా కొనివేయడానికి ఒక పథకం ప్రకారం ప్రయత్నిస్తూ వచ్చిందని బెన్నిస్ వంటి పరిశోధకులు సోదాహరణంగా రుజువు చేశారు. ఈ ప్రయత్నంలో క్రియాశీల ఎన్.జి.ఒ.ల సాధికారికమైన రాజకీయ డిమాండ్‌లను పక్కదారి పట్టించి వాటి స్థానంలో తమ సొంత కార్పొరేట్ సామ్రాజ్యవాద కోరికలను నెరవేర్చుకోవడానికి అమెరికా ప్రయత్నించింది. చాలాసార్లు విజయం సాధించింది కూడా.

అందువల్ల ఇటువంటి సంస్థలలో మంచి సంస్థల కృషిని గౌరవిస్తూనే చెప్పవలసిందేమంటే కొందరు అనుకుంటున్నట్టుగా ఎన్.జి.ఒ.ల స్వచ్ఛంద కార్యాచరణలో, స్థానిక ప్రయత్నాలలో పర్యావరణ సంక్షోభానికి సమాధానాలను వెతకడం పొరపాటు. నిధుల వనరులు, స్వార్థ ప్రయోజన శక్తుల కుటిల యత్నాలకు లొంగిపోయే అవకాశం, ఈ ప్రయత్నాల పరిధి, పరిమితి, ఇంత వరకు సాధించిన విజయాల జాబితా అన్నిటినీ గమనంలోకి తీసుకుంటే, అలాగే మౌలిక రాజకీయార్థిక సమస్యలు ఉన్నచోట స్థానిక ప్రయత్నాలకు ఉండే పరిమితిని గమనంలోకి తీసుకుంటే, మొత్తం మీద పర్యావరణం విషయంలో ప్రస్తుత ధోరణులను తారుమారు చేయడానికి గానీ, పర్యావరణాన్ని పరిరక్షించడానికి గానీ ఎన్.జి.ఒ.లు విజయం సాధించగలవనే ఆశ పొందలేం. పర్యావరణ సంక్షోభం పట్ల ఎన్.జి.ఒ.లకు ఉండే 'కాల్పనిక దృక్పథం' వల్ల మౌలిక సమస్యలను ఎదుర్కోకుండా ఉండే సులభమైన మార్గం దొరికింది. అంతే, నిజానికి అది ఒక పలాయనం మాత్రమే. నిజానికి ఈ పలాయనం 'భూగోళం గురించి ఆలోచించండి. స్థానికంగా ఆచరించండి' (థింక్ గ్లోబల్లీ, ఆక్ట్ లోకల్లీ) అనే సొగసైన నినాదంలో అక్షరాలా వ్యక్తీకరణ పొందింది కూడా.

పర్యావరణ సంక్షోభపు తీవ్రత మరిన్ని ఆలోచనలకు కూడా దారితీసింది. వస్తు వినియోగ సంస్కృతి మితిమీరిపోవడం పట్ల శక్తిమంతమైన ఖండనలు వచ్చాయి. తక్షణం జరగవలసింది 'పర్యావరణ విప్లవం' లేదా 'మొదటి భూగోళ విప్లవం', 'అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను సంపూర్ణంగా పునర్నిర్మించడం' వంటి అతిశయోక్తి ప్రకటనలు కూడా వచ్చాయి. భూగోళాన్ని విధ్వంసం నుంచి కాపాడడానికి 'ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించాలని, మానవ పునరుత్పత్తి ప్రవర్తనను గుణాత్మకంగా మార్చాలని, మానవ విలువలను, జీవన విధానాలను మార్చాలని' ప్రభుత్వాలకూ, విధాన నిర్మాతలకూ, కార్పొరేట్ ప్రణాళికా వేత్తలకూ, చివరికి వ్యక్తులకూ కూడా పిలుపులిస్తున్నారు. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే, ప్రస్తుత పర్యావరణ సంక్షోభపు మూల కారణాలను

'శాస్త్రవిజ్ఞానం, ఉత్పత్తి సాంకేతిక పరిజ్ఞానం సాధించిన అసాధారణ విజయాలలో' చూస్తున్నారు. వాటి వల్లనే మన భూగోళం నివాస యోగ్యం కాకుండా పోతున్నదని అంటున్నారు. ఆర్థిక వృద్ధి లేదా, ఆర్థికాభివృద్ధి వ్యూహం అనివార్యంగా పర్యావరణ డిమాండ్‌లకు సవాలు విసురుతుందనీ, అందువల్లనే మనం పర్యావరణ సంక్షోభపు అంచులకు చేరామనీ అంటున్నారు. ప్రస్తుత వృద్ధి ధోరణులు ఎక్కువ కాలం కొనసాగించడం సాధ్యం కాదనీ, అందువల్ల సుస్థిరమైన వృద్ధి లేదా, అభివృద్ధి వ్యూహం వైపు మళ్లాలనీ అంటున్నారు.

1990ల తొలి రోజుల నుంచి పర్యావరణం మీద జాతీయ విధానాలలోనూ, అంతర్జాతీయ పర్యావరణ ఆలోచనలలోనూ 'సుస్థిర అభివృద్ధి' అనే మాట చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. 1987లో బ్రండ్ట్‌ల్యాండ్ నివేదిక ఈ మాటను రాజకీయ పర్యావరణ చర్చలోకి ప్రవేశపెట్టింది. ప్రపంచ బ్యాంక్ నుంచి గ్రీన్ పీస్ దాకా ప్రతి ఒక్కరు అప్పటి నుంచి ఈ మాట వాడుతున్నారు. భూగోళపు జీవావరణాన్ని కాపాడే, కొనసాగించే సుస్థిర అభివృద్ధి లక్ష్యం గురించి ప్రతి ఒక్కరు తమ పెదాల మీది నుంచి మాట్లాడుతున్నారు. దాని అర్థం ఎవరికీ తెలియనప్పటికీ మొత్తం మీద ఈ భావన అందరికీ అంటుకుంది. ఇది ఆర్థికాభివృద్ధి పట్ల ఒక దృక్పథమా అనుకుందామంటే దానిలో నిర్దిష్టంగా నిర్వచించిన ఆచరణ ప్రణాళిక ఏమీ లేదు. సరైన నిర్వచనం లేకుండా అస్పష్టంగా ఉండడం వల్లనే బహుశా ఇది అందరికీ వారి వారి దృక్పథాలకూ, వ్యాఖ్యానాలకూ అనువుగా ఉంది. బహుశా ఆ అస్పష్టతే దాని ఐంద్రజాలిక విస్తృతికి, విపరీతమైన ఆదరణకు కారణం అయి ఉంటుంది. సుస్థిర అభివృద్ధి అనే మాట వేరు వేరు మనుషులకు వేరు వేరుగా అర్థమవుతున్నదని చూపుతూ బ్రిటిష్ పర్యావరణవేత్త రాడ్‌క్లిఫ్ ఒక మాట అన్నారు : 'దాని అస్పష్టతే దాని బలం'.

ఆ భావన అస్పష్టత అలా ఉంచి, ఆ భావనను వాడుతున్న నేపథ్యం గానీ, ఒక అవసరమైన ఆకాంక్షగా దాని సాధారణ దిశ గానీ బలంగా సూచించేదేమంటే అది ప్రధానంగా ఒక పర్యావరణ కార్యక్రమం. ఈ అర్థంలో అంటే, దాని అర్థవంతమైన అర్థంలో సుస్థిర అభివృద్ధి అనేది ఒక విశాల అవగాహనను సూచిస్తుంది. దారిద్ర్యాన్ని నిర్మూలించడానికి, మానవులందరికీ గౌరవప్రదమైన జీవనాన్ని అందించడానికి మాత్రమే కాక సహజ వ్యవస్థలను ధ్వంసం చేయకుండానే మానవ అవసరాలను తీర్చే విధంగా అభివృద్ధి ఉండాలనే ఆలోచన సుస్థిర అభివృద్ధి అనే భావన వెనక ఉంది. ఈ అభివృద్ధి మానవ భవిష్యత్తులోకి అనంతకాలం సాగాలనే ఆలోచన ఉంది. ఈ మధ్యలో వనరులు తరిగిపోతాయనో, పర్యావరణం దెబ్బతింటుందనో, మానవ జనాభా మితిమీరిపోతుందనో, ఆర్థిక రాజకీయ నిర్బంధం పెరుగుతుందనో ఆటంకాలేవీ రాకూడదని ఈ భావన చెబుతుంది. అంటే, ఒక మాటలో చెప్పాలంటే భవిష్యత్తు తరాల అవసరాలను తాకట్టు పెట్టకుండానే ప్రస్తుత తరాల తక్షణ సమస్యలను తీర్చడం గురించి సుస్థిర అభివృద్ధి ఆలోచిస్తుంది. నిజం చెప్పాలంటే హేతుబద్ధమైన, మానవీయమైన ఆర్థికాభివృద్ధి ఇదే. ఇవాళ ప్రపంచంలో (బహుశా క్యూబాలో సాగుతున్న ప్రయోగాత్మకమైన ప్రయత్నాలు మినహా) ఏ ఒక్క చోట కూడా ఎన్ని మాటలు చెప్పినప్పటికీ ఇటువంటి సుస్థిర అభివృద్ధి జరగడం లేదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఒకవైపు సుస్థిరాభివృద్ధి గురించి మాట్లాడుతుండగానే ఆధునిక ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పర్యావరణాన్ని శిథిలం చేసేస్తోంది.

ఏ దేశాలలో అయితే ఎక్కువ కాలం సాగడానికి వీలు లేని అభివృద్ధి వ్యూహం అమలవుతున్నదో ఆ దేశాల నుంచే సుస్థిర అభివృద్ధి అనే భావన తలెత్తి ప్రచారం కావడం ఆశ్చర్యకరం. అంటే, ఆ దేశాలలో సాగుతున్న అభివృద్ధి వ్యూహం గురించి అర్థం చేసుకోకుండా సుస్థిర అభివృద్ధి గురించి ఎటువంటి చర్య అయినా తీసుకోలేమనేది స్పష్టమే. ఆ దేశాల అభివృద్ధి వ్యూహమే మొత్తం భూగోళపు సహజ వనరుల మీద ఇప్పటికిప్పుడు దోపిడీ చేసే డిమాండ్ చేస్తోంది. పరిస్థితి ఇలా ఉండగా, సుస్థిర అభివృద్ధి మీద జరుగుతున్న చర్చలో ఆయా దేశాల అభివృద్ధి వ్యూహాల గురించి అర్థం చేసుకునే ప్రయత్నమే లేదు. అసలు అర్థం చేసుకునే శక్తి కూడా లేదు. 'సుదీర్ఘకాలపు ఫలితాల గురించి, తరాల మధ్య బాధ్యతల గురించి, ఉమ్మడి పర్యావరణ వనరుల గురించి సరైన పద్ధతిలో మార్కెట్ వ్యవహరించజాలద'ని అవగాహన ఉన్నప్పటికీ అందువల్లనే మార్కెట్‌కు క్రమశిక్షణ నేర్పడం, అదుపులో పెట్టడం ప్రభుత్వ బాధ్యతలనే ఆలోచన ఉన్నప్పటికీ వాస్తవంగా జరుగుతున్న దేమంటే, ఇవాళ సాగుతున్న పెట్టుబడిదారీ అభివృద్ధి వ్యూహం కింద మార్కెట్టే ప్రభుత్వాన్ని శాసిస్తోంది. ప్రభుత్వానికి మార్కెట్ మీద అదుపే లేదు. అంటే, ఇవాళ ఏది పరిష్కారంగా చూపెడుతున్నారో, అదే సమస్య. ఒకవేళ ఇందుకు మరొక కొత్త రుజువు కావాలని ఎవరైనా కోరినట్లైతే రియో ధరిత్రి సదస్సులోనూ ఆ తర్వాత జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సమావేశాలలోనూ మార్కెటే, అంటే ప్రాబల్యం వహిస్తున్న ఆర్థిక ప్రయోజనాలే ప్రభుత్వాధినేతల విధాన ప్రకటనల పైన, గంభీర ప్రవచనాలపైన పైచేయి సాధించాయి. ప్రభుత్వాధినేతలేమో పర్యావరణం, అభివృద్ధి సమస్యలను భూగోళ స్థాయిలో పరిగణించాలనీ, ప్రపంచ దేశాలన్నీ సంఘీభావంతో వాటిని పరిష్కరించాలనీ చెబుతుంటే, ఆ మాటలు ఆచరణలోకి రానే లేదు. తీవ్రమైన పరిణామాలుంటాయనే హెచ్చరికలు ఎంతగా వినిపించినప్పటికీ, ఆ పరిణామాలను అడ్డుకోవడానికి అవసరమైన రాజకీయ సంకల్పం మాత్రం ఎక్కడా కనబడడం లేదు. సుస్థిర అభివృద్ధి వైపు అర్థవంతమైన ముందడుగు వేసి సమస్యలను పరిష్కరించే సాహసాన్ని ఏ ఒక్క ప్రభుత్వమూ ప్రదర్శించలేదు.

భూగోళం భవిష్యత్తుకు ఏ అభివృద్ధి వ్యూహం ప్రమాదం కలిగిస్తున్నదని తాను గుర్తిస్తోందో ఆ అభివృద్ధి వ్యూహానికి ఒక పేరు ఉందని ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న పర్యావరణ చైతన్యం గ్రహించడం లేదు. ఆ అభివృద్ధి వ్యూహం పేరు పెట్టుబడిదారీ విధానం. ఆ ఉత్పత్తి వ్యవస్థలో అంతర్గతమైన ఆవశ్యకతలు తప్పనిసరిగా పర్యావరణాన్ని ధ్వంసం చేస్తాయి. అందువల్ల ఆ ఆవశ్యకతలను దెబ్బ తీయకుండా సుస్థిర అభివృద్ధి గురించి మాట్లాడడం అర్థం లేదు. ఆ ఆవశ్యకతలను దెబ్బతీయడం అంటే కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడం. ఆ పునర్నిర్మాణంలో ఉత్పత్తి నిర్ణయాలు ఉత్పత్తి కన్నా ముందరి అవసరాల మీద ఆధారపడతాయి గానీ, ఉత్పత్తి నిర్ణయాల మీద ఆధారపడి అవసరాలు పెరగవు.

(రచయిత 1930ల నుంచి భారత కమ్యూనిస్టు ఉద్యమంతో కలిసి నడుస్తూ తొలి రెండు దశాబ్దాలు కార్యకర్తగానూ, ఆ తర్వాత రాజనీతి శాస్త్ర అధ్యాపకుడిగానూ పని చేశారు. 'మార్క్సిజం, సోషలిజం, ఇండియన్ పాలిటిక్స్ : ఏ వ్యూ ఫ్రం ది లెఫ్ట్', 'క్రైసిస్ ఆఫ్ సోషలిజం – నోట్స్ ఇన్ డిఫెన్స్ ఆఫ్ ఎ కమిట్‌మెంట్', 'ఆఫ్ మార్క్సిజం అండ్ ఇండియన్ పాలిటిక్స్', 'ఫైవ్ లెక్చర్స్ ఇన్ మార్క్సిస్ట్ మోడ్' వంటి అనేక ఆలోచనా స్ఫోరకమైన రాసిన పుస్తకాలు రణధీర్ సింగ్ 2009లో ప్రచురించిన 'కంటెంపరరీ ఎకలాజికల్ క్రైసిస్ – ఎ మార్క్సిస్ట్ వ్యూ'లో రెండు అధ్యాయాల అనువాదం)

దట్టమైన అడవులతో, ఎన్నో రకాల జీవజాతులతో ఉండే ఆదిలాబాద్‌లో నేడు అడవి మచ్చుకైనా కనబడడం లేదనీ, అడవి విధ్వంసం మానవ హననమే అనీ అంటున్నారు **బి. వేణుగోపాల్**

అంతరించిపోతున్న అడవి

గత దశాబ్ద కాలంగా ప్రకృతి విధ్వంసం మునుపెన్నడూ లేని విధంగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఆదిలాబాద్ జిల్లాకు అడవుల జిల్లాగా పేరు ఉంది. భౌగోళికంగా మైదానాల కంటే కూడ అడవులు విస్తారంగా ఉన్నాయి. లోయలు, వంకలు సహజసిద్ధంగా ఏర్పడి ఉన్నాయి. సాధారణంగా దక్కన్ పీఠభూమి ఇలాగే ఉంటుంది. విస్తారంగా ఉన్న అడవులు గత కొంతకాలంగా దెబ్బతింటున్నాయి. ప్రకృతి విలయాల కంటే మానవ ప్రమేయం మూలంగా అడవులు నశించిపోతున్నాయి.

గత ఎన్.డి.ఎ. ప్రభుత్వం ప్రకటించిన స్వర్ణ చతుర్భుజి రోడ్డు మూలంగా ఆదిలాబాద్ అడవి విపరీతంగా ధ్వంసం అయింది. ఉన్న రోడ్డును వెడల్పు చేయవలసింది పోయి, కొత్తగా రోడ్డు వేయడం వల్ల అడవి, ప్రకృతి సిద్ధమైన వాగులు, వంకలు ధ్వంసం అయినాయి. పెద్ద పెద్ద గుట్టలు కలిగిన అడవిని తవ్వేసి మట్టిని రోడ్డుకు ఉపయోగిస్తున్నారు. అసలు గుట్ట ఉన్న ఆనవాలు కూడా కనిపించడం లేదు. సకల చరాచర జీవకోటికి ఉపయోగపడే అడవి మనుగడ ప్రశ్నార్థకమైంది. అరుదైన వృక్షాలు, జంతువులు, పక్షులు అంతరించే పరిస్థితి ఏర్పడుతోంది. దేశంలో ప్రముఖ నిర్మాణ సంస్థయిన సోమా కంపెనీ ఈ స్వర్ణ చతుర్భుజి రోడ్డు నిర్మాణం చేపడుతోంది. ఇక్కడి ప్రాంత వాసుల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా రోడ్డు నిర్మాణం జరుగుతోంది. అడవిపోతున్న సందర్భం ఒకవైపు నెలకొనగా ఇంకోవైపు పల్లెలో జీవం పోతున్న సందర్భం, రోడ్డు నిర్మాణం విపరీతమైన ఎత్తులో చేయడం వల్ల రోడ్డు వెంట ఉన్న ఊర్లు కిందికి అవడంతో 'ఊరి కళ' దెబ్బతింటోంది. వర్షం పడితే ఆ నీళ్లన్నీ ఊర్లకు పొంగి వస్తాయి. ఆదిలాబాద్‌లో సరాసరి వర్షపాతం 1051 మిల్లీమీటర్లు. ఇది రాష్ట్ర సరాసరి వర్షపాతం కంటే 155 మిల్లీమీటర్లు ఎక్కువ. కనుక ఎత్తుగా నిర్మించిన రోడ్డు విపరీతమైన వానల వల్ల వరద ప్రవాహానికి కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు.

దట్టమైన అడవులు కలిగిన ఆదిలాబాద్ జిల్లా నేడు ఎడారిని తలపిస్తోంది. ఈ దారిగుండా ప్రసిద్ధ యాత్రికుడు ఏనుగుల వీరాస్వామి బయలుదేరినపుడు విపరీతమైన అడవి ఉండేదని చెప్పాడు. 'మేకలగండి అనే ప్రసిద్ధమైన ఘాటు ఇక్కడ దాటవలసినది. ఈ ఘాటులోని అడవి బల్లెము దూరని పాటి దట్టమని చెప్పవచ్చును. వ్యాఘ్ర భయం విస్తారం. పులి అడుగులు చూచుచు మేము నడిచాం. బహుజాగ్రత్తగా బాటసార్లు ఇక్కడ నడుచుచున్నారు. ఒకరిని ఒకరు విడిచి నడిచే ప్రవేశం కాదు. తుపాకులు అక్కడక్కడ కాల్చుచూ వచ్చినాం'. అటువంటి అడవి నేడు చూద్దామన్నా ఎక్కడా కనిపించదు.

అడవుల మనుగడ ప్రశ్నార్థకమైన నేటి సందర్భంలో ప్రభుత్వాల వైఖరిలో మార్పేమీ రాలేదు. జాతీయ అటవీ విధానం ప్రకారం రాష్ట్రం మొత్తం విస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉండాలి. ఆ ప్రమాణాలు ప్రభుత్వాలు పాటించడం లేదు. ప్రభుత్వాల గణాంకాల ప్రకారమే రాష్ట్రంలో కేవలం 16 శాతం మాత్రం అనగా, 63,800 చదరపు కిలోమీటర్ల పరిధిలో అటవీ విస్తీర్ణం ఉంది. ఇందులో ఇప్పటికే 129 చదరపు కిలోమీటర్ల పరిధిలో అడవులు సర్వనాశనమైనట్లు ఫారెస్ట్ శాఖ నివేదికలే వెల్లడిస్తున్నాయి. అత్యంత విలువైన అటవీ సంపద కేవలం పది శాతం మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

భూగర్భ జలాలపై నాసా ఇప్పటికే ఇచ్చిన నివేదిక పర్యావరణ వేత్తలను కలవరపరుస్తోంది. గత 30 ఏళ్ల కాలంలో భూగర్భ జలాలు పది మీటర్ల మేర పడిపోయాయని అంచనా వేసింది. ఏటా ఒక అడుగు జలమట్టం తగ్గుతూ పోతోంది. అడవులు నశించడం వల్ల వర్షపాతం తగ్గుతూ వస్తోంది. భవిష్యత్తులో పరిస్థితి ఇలాగే ఉంటే భారతదేశం ఎడారిగా మారే ప్రమాదం ఉంది.

ఇటీవల వృక్షాల నరికివేతలపై హైకోర్టు తీవ్రంగా ప్రతిస్పందించింది. వృక్షాల నరికివేత '2002 వాల్టా చట్టా'నికే విరుద్ధమని పేర్కొన్నారు. ఒక వృక్షం నరికివేత వల్ల లక్షల విలువైన నత్రజని, భూసారం, స్వచ్ఛమైన గాలి, పళ్లు, పూలు కోల్పోతామని పేర్కొంది. చెట్లను మరోచోట నాటుతున్న సందర్భంలో కోట్ల విలువైన అడవిని ధ్వంసం చేస్తున్నారు. దాదాపు 500 హెక్టార్ల అడవి నాశమైంది. అటవీ శాఖ నిర్లక్ష్య వైఖరే దీనికి కారణం. వాస్తవానికి ఆదిలాబాద్‌లో టేకు లాంటి విలువైన కలప ఎప్పుడో స్మగ్లర్‌ల పాలైంది. రోడ్డుకిరువైపుల టేకు చెట్లను పెంచి ఇంకా ఎంతో అడవి ఉన్నదని భ్రమింప చేసిన అటవీ శాఖ, లోపలికి వెళితే చిన్న చిన్న చెట్లు, పొదలు మాత్రమే కనబడతాయి. ఇన్నేళ్ల నుంచి అడవుల సంరక్షణ ఏమైనట్టు?

సంయుక్త అటవీ విధానంలో భాగంగా 'వన సంరక్షణ సమితు'లు ఏర్పాటు చేశారు. ఏ ఒక్క సమితి కూడా వనాలను సంరక్షించిన దాఖలాలైతే లేవు. వందల వేల కోట్ల రూపాయల ప్రపంచ బ్యాంకుల నిధులుపయోగించి అడవులని సంరక్షిస్తామని ప్రజలను మోసం చేశారు. అడవులు నాశనమైన తర్వాత 'అటవీ హక్కు 2006' అంటూ ఆదివాసుల్ని మభ్య పెడుతున్నారు. 2004-08 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో 58 కోట్ల 92 లక్షల మొక్కలు పంపిణీ చేశామని ప్రభుత్వాలు చెపుతున్నా ఎక్కడా ఒక ఎకరం సస్యశ్యామలం అవలేదు. ఉన్న అడవినే కాపాడలేని ప్రభుత్వాలు 'సామాజిక అడవుల'ను పెంచుతామని మోసపుచ్చు

తున్నాయి. అటవీ వృక్షాలను పెంచకుండా బయో ఇంధనాల కోసం వేరే వృక్షాలను పెంచడం ద్వారా వైవిధ్యం దెబ్బతింటోంది.

భౌగోళికంగా ఆదిలాబాద్ 45 శాతం అనగా 16,000 చదరపు కిలోమీటర్ల మేర అడవి విస్తరించి ఉన్నదని ఫారెస్ట్ శాఖ చెబుతోంది. పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల అడవి చాలావరకు నశించిపోయింది. గడిచిన రెండు దశాబ్దాలలో ఏడు లక్షల హెక్టార్లలో రెండు లక్షల హెక్టార్ల అడవి నశించిపోయిందని జిల్లా ఫారెస్ట్ అధికారిక లెక్కలే చెపుతున్నాయి. ఆదివాసుల ఆవాసంగా ఉన్న ఆదిలాబాద్ గోండ్వానా రాజ్యంలో ఒక భాగం. మొగల్ సామ్రాజ్య విస్తరణలో గోండు రాజులు తమ రాజ్యాన్ని కోల్పోవలసి వచ్చింది (క్రీ.శ. 1592). గోండు రాజులకు మక్తాలను కేటాయించి వారిని ముఖాసీలుగా నియమించుకున్నారు. ఈ సందర్భంలో వారి ప్రజా జీవనానికి ఏ మాత్రం ఆటంకం కలగలేదు. వారి ప్రత్యేక సంస్కృతి అలాగే కొనసాగించే అవకాశం కలిగింది. ఎప్పుడైతే నిజాం రాజు హిందూ ఫ్యూడల్ వ్యవస్థపై ఆధారపడి పరిపాలన చేసాడో (దేశ్‌ముఖ్, దేశ్‌పాండే) అపుడే ఆదివాసులకి, అడవికి రక్షణ కరువైంది. యథేచ్ఛగా ఆదివాసేతర ప్రజల వలస నిరాటంకంగా కొనసాగింది. భూముల కోసం అడవులను కొట్టనారంభించారు. ఆదివాసుల మనుగడ కష్టమైంది. తమ భూములకు పన్నులు కట్టడం కష్టమైన తరుణంలో వారు ఇంకా లోతట్టు ప్రాంతాలకు వలస వెళ్లవలసి వచ్చింది. మైదాన ప్రాంత వాసుల వలసతో అడవి, ఆదివాసీ బతుకులు ఆగమైనాయి. నాగరిక ప్రజల అవసరాలు అంతా ఇంతా కావు. వారి సుఖ జీవితానికి రోడ్లు, రైల్వేలైన్లు వేశారు. ఈ సౌకర్యాలను కల్పించడానికి అడ్డువచ్చిన అడవిని నరికివేశారు. ఇతర ప్రాంత అవసరాల నిమిత్తం కలపను సులువుగా తరలించారు.

గిరిజనులు సాధారణంగా పోడు వ్యవసాయం చేస్తారు. వాస్తవానికి 'పోడు' వల్ల అడవికి నష్టం వాటిల్లలేదని చెప్పవచ్చు. క్రీ.పూ. ఎనిమిది వేల సంవత్సరాల క్రితమే పోడు అలవాటు ఉండెనని అహ్మద్ హసన్ తన 'భారతీయ గిరిజనులు' పుస్తకంలో పేర్కొన్నాడు. ఒక ఆదివాసి కుటుంబానికి అవసరమయ్యే భూమి చాలా తక్కువ. ఆదివాసులు అటవీ ఉత్పత్తులపై ఆధారపడి (ఇప్ప పువ్వు, ఇతర ఫలాలు, గడ్డలు) జీవిస్తారు. పోడు వల్ల నష్టం జరిగేది ఎంత? వారి అవసరాలు చాలా చిన్నవి. అడవికి నష్టం అసలే జరగదని చెప్పవచ్చు. మైదాన ప్రాంత వలస ఏర్పడినపుడే అడవికి నష్టం వాటిల్లింది. ఆధునిక సౌకర్యాల కొరకు అడవిపై విపరీతంగా ఆధారపడ్డారు. ప్రస్తుతం కూడా ఖనిజ వనరుల కోసం ఆదివాసులను, అడవిని చిన్నాభిన్నం చేస్తున్నారు. (బాక్సైట్ కోసం అరకు, మాంగనీస్ కోసం ఆదిలాబాద్ అడవిని ధ్వంసం చేస్తున్నారు.)

మైదాన ప్రాంత వలసలతోపాటు, ఫారెస్ట్ అధికారుల దోపిడీతో ఆదివాసుల మనుగడ కష్టమైంది. ఫారెస్ట్ చట్టాల వల్ల కొమ్మ కొడితే నేరమైంది. ఇప్పపూవు, బంక కోసం పన్నులు విధించి, వారు సాగు చేస్తున్న భూములను లాక్కోవడంతో ఆదిలాబాద్ ఆదివాసులు కొమురం భీం నాయకత్వంలో అటవీహక్కు కోసం, స్వయం పాలన కోసం తిరుగుబాటు చేశారు. ముఖ్యంగా అటవీ చట్టాలతో ఆదివాసులు విసిగిపోయారు. తరతరాలుగా జీవిస్తున్న ఆదివాసులను అడవి నుండి దూరం చేస్తున్న ప్రభుత్వాలతో నిరంతరం పోరాటం చేస్తున్నారు. శేరిదార్, చౌకీదార్, అమీన్ మొదలగు అటవీ అధికారుల నిర్బంధం వల్ల ఆదివాసులు చిత్రహింసలకు గురయ్యారు. ప్లాంటేషన్ పేరుతో పిచ్చి తుమ్మలు పెడుతుంది. కాని గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యదు. అడవి ప్రభుత్వాల అధీనంలోకి రావడంతో ఉన్నవాళ్లకు వరంగా మారింది. నిజాం రాజుకు ఆదిలాబాద్ అడవి ఖజానాను నింపే కల్పవల్లి. 1867 వరకు రెవెన్యూ అధీనంలో ఉన్న అడవులకు 1894లో అభయారణ్య హోదా దక్కింది. 1914లో సర్వే ఆఫ్ ఇండియా వారు విస్తృత స్థాయి సర్వే జరిపారు. తప్పుడు సర్వే కారణంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు ఏది అడవి, ఏది రెవెన్యూ భూమి అని నిత్యం గొడవలే. రెవెన్యూ శాఖ ఇరవై శాతమే అడవి అంటే, ఫారెస్ట్ శాఖ వారు నలభై శాతం అంటారు.

అభివృద్ధి చర్యలలో భాగంగా ఆదిలాబాద్‌లో పరిశ్రమలు రావడంతో, మైదాన ప్రాంత వలస అధికమైంది. పరిశ్రమల కోసం అడవులను నరికి వేశారు. సింగరేణి గనులు ఏర్పడడం, దాంట్లో ఆదివాసులకు పని దొరకలేదు. వారు ఇంకా లోతట్టు ప్రాంతాలకు వలస వెళ్లారు. కాగితపు పరిశ్రమ ఏర్పడడంతో టాటాలకు అడవిని గుత్తకు ఇచ్చినట్లయింది. లక్షలాది ఎకరాల అడవి ధ్వంసమైంది.

ఆదిలాబాద్ అడవి ఉన్న వాళ్లకు సిరులు నింపింది. దొరలు, జమీందారులు అటవీ భూములు కొన్ని వేల ఎకరాలు ఆక్రమించుకున్నారు. వాటిని ప్రభుత్వాలు లెక్కలోకి తీసుకోలేదు. హెమన్‌డార్ఫ్ గిరిజనులకు తన శాయశక్తులా కృషి చేసినప్పటికీ ఆయన అటవీ భూమి పంచడం (నరికిన అటవీ కలప రాజమండ్రిలో అమ్మి వచ్చిన పైకాన్ని నిజాం రాజుకు ముట్టజెప్పాడు) వలన ఆక్రమించుకున్న వేల ఎకరాల భూములు దొరల చేతిలో ఇంకా భద్రమైనాయి. ఆక్రమణదారులపై హెమన్‌డార్ఫ్ ఎటువంటి చర్యకు పూనుకోలేదు.

ఇప్పటికీ అటవీ కలప స్మగ్లింగ్‌కు గురవుతోంది. జిల్లాలో ఏదో ఒక చోట ప్రతిరోజు ఫారెస్ట్ వారు కలప స్మగ్లింగ్ బండ్లు పట్టుకున్నారనే వార్తలు వస్తున్నాయి. మరి పట్టుకోని బండ్లు ఎన్నో? జిల్లాలో రాజకీయ నాయకులు ఎదగడానికి కలప మాఫియా బాగా పనిచేస్తోంది. అలాగే కెరిమెరి ప్రాంతం దట్టమైన అడవులు నాశనమైనాయి. కొన్ని పంట భూములైనాయి. సిరిచెల్మ, సిరికొండ ప్రాంతాలలో దట్టమైన అడవి ఉండేది. ఇపుడు పెద్ద వృక్షాలు లేనే లేవు. ఇచ్చోడ, కేశవపట్నంలోని ముల్తానీలు కట్టె స్మగ్లింగ్ చేయడంలో ఆరితేరినవారు. అడ్డు వచ్చినవారిపై దాడి చేస్తారు. ప్రత్యేకమైన ఈ తెగను మొఘల్ సైన్యం అంటారు. ఈ స్మగ్లర్‌లను ఉపయోగించుకొని ఉన్నతవర్గాలు లాభపడుతున్నాయి. గోండులు వీరిచ్చే కూలీకి చెట్లను నరుకుతున్నారు. మొత్తంగా వీరి బతుకులు ఏమీ మారడం లేదు. అడవి మాత్రం తరిగిపోతూనే ఉంది. ఇపుడు టేకు లాంటి పెద్ద వృక్షాలు అరుదైనాయి. ఇద్దరు ముగ్గురు కలిసి చేతులతో అందుకుంటే గాని అందని వృక్షాలు ఇపుడు అరుదు. మాంగనీస్ గనులు ఏజెన్సీ ఏరియాలో నిరాటంకంగా పర్యావరణానికి హాని కలిగించే విధంగా తవ్వకం జరుగుతున్నది. ఓపెన్ కాస్ట్ గనుల వల్ల అడవుల మనుగడ కష్టమైంది.

అడవులు కాపాడే చట్టాలున్నప్పటికీ అడవులను కాపాడక పోవడం విషాదకరం. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, నేల, నీడ అందివ్వక పోతే చరిత్ర మనల్ని క్షమించదు. అడవిని ధ్వంసం చేయడమంటే మానవ హననం గావించడమే.

(రచయిత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి) వీ

పోలీసులే భక్షకులుగా మారినప్పుడు, అండగా ఉండాల్సిన చట్టాలూ, న్యాయస్థానాలూ భరోసా ఇవ్వనప్పుడు ప్రజలే సమస్యను పరిష్కరించుకోవాల్సిన సమయం వచ్చిందని అంటున్నారు **డా. జి. లచ్చయ్య**

పోలీసులా? కీచకులా?

కీచకుల్ని కీచకులుగా గుర్తించడానికి పోలీసు యంత్రాంగానికి, చట్టానికి దశాబ్దాలు పడుతుందంటే ఆశ్చర్యం వేయవచ్చు. కాని ఇది వాస్తవం. అందునా ఆ కీచకులు పోలీసు బాసులే అయినప్పుడు న్యాయ వ్యవస్థ నాలుగు పాదాలపై కాదు కదా, ఏక పాదంపై కూడా నడవలేదు. ఈ మధ్యన జరుగుతున్న సంఘటనలు, వెలుగులోకి వస్తున్న కొన్ని ఘటనలు దీన్నే రుజువు చేస్తున్నాయి.

వాకపల్లి – భల్లుగూడ

రెండున్నర సంవత్సరాల క్రితం విశాఖ జిల్లా వాకపల్లి గిరిజన మహిళల గోదు గోదుగానే మిగిలిపోయింది. మన ప్రజాస్వామ్యంలో అలాంటి ఘటనలు పునరావృతం కాకపోతే ఆశ్చర్యపోవాలే గాని, జరిగితే కాదు. అదే జిల్లాలో అలాంటి సంఘటనే గత జనవరి మాసంలో జరిగింది. అవే పోలీసు కథనాలు. అదే దమననీతి. ముంచంగిపుట్టు మండలంలోని భల్లుగూడ గ్రామంలో 22 జనవరి 2010న పాత కథల ప్రకారమే పోలీసులు నక్సలైట్ల కోసమని కూంబింగ్ చేసారు. షరా మామూలే! నలుగురు గిరిజన స్త్రీలు అత్యాచారానికి గురయ్యారు. ఈ సంఘటన బాహ్య ప్రపంచానికి తెలిసింది. ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు పోలీసుల్ని తప్పు పట్టాయి. పోలీసులు గిరిజన మహిళల్ని తప్పుపట్టారు. పోలీసులపై నిందమోపడానికే అత్యాచార కథనాలు చెబుతున్నారని వారి వాదన. ఎస్.పి. విచారణకు ఆదేశించారు. నాలుగు రోజుల తర్వాత గాని మహిళలకు వైద్య పరీక్షలకు అవకాశం రాలేదు. అదే కింగ్‌జార్జి ఆసుపత్రి. అదే డాక్టర్లు. అదే కథ. ఈ కథలన్నీ తెలిసిన గిరిజనులు వైద్య పరీక్షలకు తిరస్కరించారు. ఒక మహిళ ఒప్పుకుంది. పోలీసుల ఒత్తిళ్లకే ఆ మహిళలు తమపై అత్యాచారం జరగలేదని తర్వాత అంటున్నారని ప్రజా సంఘాల వాదన. ఏది ఏమైనా గత అనుభవాలను చూసినప్పుడు, వాకపల్లి సంఘటన అనుభవాలతో ఆ గిరిజన మహిళలు న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోయి సిగ్గు పోగొట్టుకోవడం ఎందుకని, అంతా తమ విధి రాతని ఆ విధంగా మాట్లాడి ఉండవచ్చు. వాస్తవం అందరికీ తెలిసిందే. మన పోలీసుల చరిత్ర తెలిసిన వారు ఇంతకన్నా భిన్నంగా ఏమీ ఊహించకపోవచ్చు. వాకపల్లి సంఘటన లాగానే భల్లుగూడ సంఘటన తిరిగి విశాఖ మన్యానికి చేరుకుంటుంది.

కాశ్మీర్ – షోపియన్ ఘటన

గత ఆరు నెలలుగా ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటన ఇది. పోలీసుల, డాక్టర్ల, న్యాయస్థానాల విభిన్న పాత్రలు మన మహిళలకు ఇస్తున్న గౌరవానికి ఈ సంఘటన అద్దం పడుతుంది. 29 మే 2009న నీలోఫర్ జాన్ (22), ఆసియా (17) అనే ఇద్దరు ముస్లిం మహిళలు అత్యాచారానికి గురై చంపబడ్డారు. సాయుధ దళాలే ఈ దారుణానికి పాల్పడ్డాయని అందరితోపాటు ఒమర్ అబ్దుల్లా కూడా గుర్తించి, ప్రజల డిమాండ్ మేరకు న్యాయ విచారణకు ఆదేశించారు. పోస్టుమార్టం రిపోర్టులో తప్పును చూపించారని సంబంధిత డాక్టర్లపై, పోలీసులు సరిగా దర్యాప్తు చేయలేదని, జమ్ము కాశ్మీర్ హైకోర్టు జస్టిస్ జైన్ ఈ కేసు పై వ్యాఖ్యానించారు. కొంతమంది పోలీసు ఉన్నతాధికార్లు, డాక్టర్లు సస్పెండ్ అయ్యారు. సిబిఐ కేసు విచారణ చేపట్టింది. అసలు అత్యాచారమే జరగలేదని చార్జ్‌షీట్ దాఖలైంది. ఈ సంఘటనపై చలించిన షోపియన్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ తిరిగి ఈ కేసుపై పిటిషన్ వేయడంతో ఈ సంఘటన అనేక మలుపులు తిరిగింది. అత్యాచారం జరిగిన రాత్రి తర్వాత, తెల్లవారుజామున ముసుగులో ఉన్న సాయుధులు ఓ కాలువ పక్కన ఈ ఇద్దరు మహిళలను పడేస్తున్నప్పుడు మహిళల అరుపులు విన్నామని, చూసామని ముందుగా సాక్ష్యం ఇచ్చిన గులాం మోహియొద్దీన్ లోన్, అబ్దుల్ రషీద్‌లు తర్వాత స్థానిక లాయర్ల ప్రోద్బలంతో ఆ విధంగా చెప్పామని సిబిఐ వారికి తెలపడంలోని ఆంతర్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఈ దేశంలో పోలీసులకు, సాయుధ దళాలకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వడం కత్తిమీద సాము లాంటిదని లక్షల ఉదాహరణలు చూపవచ్చు. అందుకే విధిలేక ఈ ఇద్దరు సాక్షులు ఆ విధంగా మాట్లాడి ఉంటారనడంలో ఆశ్చర్యమేమీ లేదు.

నేరస్తులను గుర్తించిన సంఘటనలోనే శిక్షలు పడకపోవడం, పడినా, చిన్న నేరాలు చేసిన వారికి పడిన శిక్షలు పడుతున్న ఈ వ్యవస్థలో సాయుధ దళాలను నేరస్తులుగా గుర్తించడం, గుర్తించినా వారికి శిక్షలు పడతాయనే నమ్మకం ఎవరికి లేదు. అది వాకపల్లి కావచ్చు, భల్లుగూడ కావచ్చు లేదా షోపియన్ కావచ్చు.

రుచికా గిర్‌హోత్ర

డిసెంబర్ 2009 చివరి వారంలో జాతీయ దినపత్రికలు చదివే వారికి చండీఘడ్‌కు సంబంధించిన ఈ సంఘటన కథనాలు దిగ్భ్రాంతిని కలిగించవచ్చు. మన చట్టాలు, ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు విచారణలు ఎంత న్యాయంగా పని చేస్తున్నాయో ఈ కేసు ద్వారా తెలుస్తుంది. అందునా సిబిఐ విచారణకు ఆదేశించాలని చాలా సందర్భాలలో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తూ ఉంటాయి. కాని ఈ అత్యున్నత సంస్థ కూడా ఎవరి పక్షాన పని చేస్తుందో, మైనర్ బాలికపై

అత్యాచారం చేసి, ఆత్మహత్యకు పురికొలిపి, ఆధారాలను మటుమాయం చేసి, కుటుంబ సభ్యుల్ని బెదిరించి, అన్నను దొంగతనం కేసులో ఇరికించి, చిత్రహింసలకు గురిచేసి, ఎఫ్.ఐ.ఆర్. కూడా నమోదు కాకుండా చూసిన ఓ నరహంతక పోలీసు బాసుకు వేసిన శిక్షకు జాతి మొత్తం (పాపం కేంద్ర హోంమంత్రి చిదంబరంతో సహా) తలదించుకోవాల్సి వచ్చింది.

దాదాపుగా డిసెంబర్ 2009 చివరి వారం నుంచి జనవరి 2010 రెండోవారం దాకా జాతీయ పత్రికల కథనాలు ఈ సంఘటనను కళ్లకు కట్టినట్టు చూపాయి. ఈ సంఘటన కేంద్ర హోం శాఖను, న్యాయశాఖను కదిలించగలిగింది. ప్రస్తుతం అమలులో ఉన్న క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు కొన్ని చేర్పుల్ని, మార్పుల్ని చేయాలనే ఆలోచనకు దారితీసింది. అలాగే పోలీసులు విధిగా అన్ని కేసులకు సంబంధించి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయాలని, లేకుంటే సంబంధిత పోలీసు అధికారులపై చట్టపరమైన చర్యలు, అవసరమైతే జైలు శిక్ష విధిస్తామని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు తాఖీదులను కూడా కేంద్రం జారి చేసింది. అయితే అమలు చేసే చిత్తశుద్ధి లేని వ్యవస్థలో చట్టాలు ఎన్ని ఉన్నా ప్రయోజనం లేదు. ఇవన్నీ అనుభవం నేర్పిన గుణపాఠాలే.

ఇక అసలు సంఘటనను చూద్దాం. చండీఘడ్‌కు చెందిన రుచికా గిర్‌హోత్ర (14) చండీఘడ్‌లోని సేక్రెడ్ హార్ట్ కాన్వెంట్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్నది. ఈ అమ్మాయి స్నేహితురాలు ఆరాధన. వీరిద్దరు టెన్నిస్ క్రీడాకారిణులు. టెన్నిస్ గురించి, భవిష్యత్ గురించి అనేక కలలు కన్నారు. వీరి కుటుంబాలు కూడా మంచి స్నేహ సంబంధాన్ని కలిగి ఉన్నాయి. రుచికాకు తల్లి లేదు. తండ్రి సుభాష్ చంద్ర, అన్న అశు గిర్‌హోత్రాలు. ఆరాధనకు తల్లి మధు, తండ్రి ఆనంద్ ప్రకాశ్ ఉన్నారు.

ఈ ఇద్దరు ప్రాణస్నేహితుల కలల్ని కల్లోలం చేసాడు స్వయంగా హర్యానా డిజిపి రాథోర్. కామంతో కళ్లు కప్పిన ఈ మానవ మృగం 12 ఆగస్ట్ 1990న 14 సంవత్సరాల అందమైన రుచికాను పంచకూలా పట్టణంలో అత్యాచారం చేసాడు. ఈ దారుణ సంఘటనను పంచకూలా జిల్లా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్.గా నమోదు చేసుకోవాలని రుచికా కుటుంబ సభ్యులు కోరిన నాటి నుంచి వారికి కష్టాలు ప్రారంభ మయ్యాయి. ఈ సంఘటన బయటికి పొక్కడంతో, రుచికాను ఏప్రిల్ 2009 నుంచి సెప్టెంబర్ 2009 వరకు పాఠశాలకు ఫీజులు చెల్లించ లేదన్న నెపంతో పాఠశాల యాజమాన్యం నిర్దాక్షిణ్యంగా పేరు తొలగించింది. ఒకవైపు జీవితం సర్వనాశనం కావడం, మరోవైపు పాఠశాల నుంచి పేరు తొలగించడం, తాను కలలు కన్న టెన్నిస్‌కు దూరం కావడంతో రుచికా కృంగిపోయింది. ఈ సంఘటనలను తట్టుకొనే వయస్సు కూడా లేదు. ఈ సంఘటనతో ప్రాణ స్నేహితురాలు ఆరాధన కూడా కృంగిపోయింది. తాను క్రీడకు దూరమైంది. మొత్తం కుటుంబం రుచికా కుటుంబానికి అండగా నిలిచింది. ప్రజాసంఘాలు కదిలాయి. విధిలేని పరిస్థితిలో ఎఫ్.ఐ.ఆర్. నమోదు జరిగింది. ప్రాసిక్యూషన్ బలహీనమైన రిపోర్ట్‌ను తయారు చేసింది. రుచికా పక్షాన పంకజ్ భరద్వాజ్ వాదించాడు. తన మెడకు ఉరితాడు ఎక్కడ పడుతుందోనని భావించిన పోలీస్ బాస్ అన్ని రకాల అవకాశాలను, పలుకుబడులను ఉపయోగించు కున్నాడు. స్వయంగా భార్య ఆభా లాయరు కావడంతో ఆ మానవ మృగం పక్షాన ఆమెనే వాదించింది.

ఈ కేసును ఎలాగైనా వీగిపోయేటట్లు చేయాలని భావించిన రాథోర్ తన పోలీసు దర్పాన్ని ప్రదర్శించాడు. ఈ కేసు నడుస్తున్న క్రమంలోనే 23 అక్టోబర్ 1993న రుచికా అన్న అశును కారు దొంగతనం కేసుపై అరెస్ట్ చేసాడు. థర్డ్ డిగ్రీ పద్ధతిలో చిత్రహింసలకు గురి చేసాడు. స్వయంగా చిత్రహింసలను పర్యవేక్షించడం, దాహం వేస్తే మూత్రాన్ని తాగించడం చేసాడు. రుచికా కేసును విరమించు కోవాలని ఒత్తిడి తెచ్చాడు. ఒప్పుకోక పోవడంతో అర్ధనగ్నంగా రుచికా కుటుంబం ఉండే వీధిలో ఊరేగించాడు. రుచికా కుటుంబ సభ్యుల్ని బయటకు పిలిపించి ఆ దృశ్యాన్ని చూడాలని బెదిరించాడు. పాపం రుచికా ఆ దృశ్యాన్ని చూడలేక ఇంట్లో కుమిలిపోయి ఏడ్చింది. తన మూలంగా తన కుటుంబానికి జరుగుతున్న అన్యాయాన్ని, ఇబ్బందుల్ని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించే వయస్సు కాదు. తండ్రి సుభాష్‌తో కేసు విరమించుకోవాలని స్వయంగా రాథోర్ ఒక గుడిలో మంతనాలు జరిపాడు. ఈ బాధల్ని భరించలేని రుచికా 29 డిసెంబర్ 1993న విషం తాగి ఆత్మహత్య చేసుకుంది.

ఈ సంఘటనతో కేసుపై ఒత్తిడి పెరిగింది. అయినా డిజిపి బాసుగారు తన దర్జాను అలాగే వెలగబెట్టారు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా ఆయన సేవలకు మెచ్చి ఆయన్ని పతకంతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని ఇచ్చింది. స్వయంగా రుచికా కేసును పర్యవేక్షించిన సిబిఐ జాయింట్ డైరెక్టర్ ఆర్.ఎం. సింగ్‌కు లంచం ఇవ్వచూపాడు. 20 సంవత్సరాల తర్వాత రాథోర్‌కు పడిన స్వల్ప శిక్షకు స్పందించి స్వయంగా ఈ విషయాన్ని 29 డిసెంబర్ 2009న పత్రికా ప్రకటనలో సింగ్ చెప్పడం గమనార్హం. తనకు సమన్లు జారీ చేస్తే (ప్రస్తుతం ఈ కేసును ఆయన చూడడం లేదు) ఎక్కడైనా ఈ విషయాన్ని వెల్లడిస్తానని ఆయన అన్నారు.

రుచికా ఆత్మహత్యను కూడా రాథోర్, ఆయన భార్య వక్రీకరించి తప్పుడు కథనాలను సృష్టించి వాదించారు. రుచికా తండ్రి భార్య చనిపోవడంతో వీణ అనే మరో స్త్రీని పెళ్లి చేసుకున్నాడని, సవతి తల్లి బాధల్ని భరించలేక రుచికా ఆత్మహత్య చేసుకుందని వాదించగా, రుచికా పక్షాన వాదిస్తున్న పంకజ్ రెండో పెళ్లి చేసుకున్నట్లు ఆధారాలు చూపాలని కోరడంతో, రాథోర్ భార్య వాదనలు వీగిపోయాయి. ఈ విధంగా మొత్తం పంచకూలా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని తన గుప్పిట్లో పెట్టుకొని, రాజకీయ పలుకుబడితో గత రెండు దశాబ్దాలుగా చట్టానికి సవాలుగా నిలిచిన ఈ కేసు ప్రజల ఒత్తిడి మేరకు, సిబిఐ ట్రయల్ కోర్టుకు అప్పగించారు. ఈ కోర్టు కూడా ఓ ప్రత్యేక అధికారిని ఈ కేసు పరిశీలనకు నియమించినా, బలహీనమైన చార్జిషీట్ ప్రవేశపెట్టారు. దీన్ని బట్టి న్యాయం ఎంత న్యాయంగా పనిచేస్తుందో ఆలోచించవచ్చు.

21 డిసెంబర్ 2009న పంచకూలా ట్రయల్ కోర్టు 67 సంవత్సరాల ముసలి మృగానికి ఆరు నెలల సాధారణ జైలుశిక్షను, వెయ్యి రూపాయల జరిమానాను విధిస్తూ తీర్పు చెప్పింది. ఇంత దారుణమైన కేసును, ప్రాసిక్యూషన్ గాని, సిబిఐ గాని సెక్షన్ 306 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద నమోదు చేయకపోవడం గమనార్హం. ఇదే కాకుండా, మైనర్ బాలికపై అత్యాచారం, ఆత్మహత్యకు పురికొల్పడం, అన్నను తప్పుడు కేసు కింద అరెస్ట్ చేసి చిత్రహింసలు పెట్టి మానసికంగా హింసించడం, తండ్రికి డబ్బులివ్వజూపి మభ్య పెట్టడం, అధికారులకు లంచమివ్వ చూపడం, రికార్డుల్ని తారుమారు చేసి, దొంగ సంతకాలు సృష్టించడం తదితర ఆరోపణలపై ఒక్కటంటే ఒకటి చార్జిషీట్ దాఖలు కాకపోవడం ఆశ్చర్యమని చండీఘడ్, హర్యానా న్యాయ నిపుణులు, ప్రజాస్వామ్య వాదులు వ్యాఖ్యానించడం గమనించాలి.

స్నేహితురాలి ఆత్మహత్యతో మానసికంగా దెబ్బతిన్న ఆరాధన, నాటి నుంచి టెన్నిస్‌కు దూరం కావడం, ముందు పెళ్లి చేసుకోవద్దని నిర్ణయించుకోవడం, కుటుంబ సభ్యుల ప్రోద్బలంతో పెళ్లి చేసుకొని ఆస్ట్రేలియాకు వెళ్లడం జరిగింది. నిందితుడికి వేసిన శిక్షను తెలుసుకున్న ఆమె, రుచికా 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఇండియాకు వచ్చింది. ఈ తీర్పుకు ఆమె, ఆమె కుటుంబ సభ్యులు అసంతృప్తిని వ్యక్తపరిచారు. ప్రపంచ మానవ హక్కుల మండలి (డబ్ల్యు.ఎచ్.ఆర్.సి.) లాంటి స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రదర్శనలు చేసింది. హర్యానా, చండీఘడ్‌లలో నిరసనలు జరిగాయి. దీంతో హర్యానా ముఖ్యమంత్రి భూపేంద్రసింగ్ హూడా, హర్యానా అడ్వకేట్ జనరల్ హవాసింగ్ లాంటి వాళ్లు కూడా నిందితుడికి వేసిన శిక్ష అతి స్వల్పమని, తిరిగి ఐపిసి సెక్షన్ 306 సెక్షన్ కింద కేసులు వేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు.

రుచికా గిర్‌హోత్ర కుటుంబ సభ్యులతో పాటు, ఆమె కౌన్సిలర్ పంకజ్ భరద్వాజ్, ఆరాధన తండ్రి ఆనంద్ ప్రకాశ్, తల్లి మధు తదితరులు 30 డిసెంబర్ 2009న ఢిల్లీలో పి. చిదంబరంను కలవడం, ఆయన కూడా రాథోర్‌కు పడిన శిక్ష పట్ల అసంతృప్తిని వెలిబుచ్చడం జరిగింది. ఈ విధంగా నలువైపుల నుంచి వచ్చిన సానుభూతితో తిరిగి రెండు కొత్త కేసులను తండ్రి, అన్నయ్య కలిసి వేశారు. పైన చెప్పినట్లు అత్యాచారం కేసుతో సహా, ఆత్మహత్యకు పురికొల్పాడని, అక్రమ అరెస్టులు, చిత్రహింసలకు పాల్పడ్డాడని, డాక్యుమెంట్లను తారుమారు చేసాడనే తదితర ఆరోపణలతో పంచకూలా సెషన్ కోర్టులో 28 డిసెంబర్ 2009న సెక్షన్ 357, 358, 467 సి.ఆర్.పి.సి. కింద కేసులు వేసారు.

నిజానికి ఈ సెక్షన్ల కింద బెయిల్ కూడా మంజూరు కాదు. కాని ముందస్తు బెయిల్ మంజూరును ముందుగా తిరస్కరించిన పంచకూలా జిల్లా డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ కోర్టు 1 జనవరి 2010న కొన్ని షరతులతో కూడిన బెయిల్‌ను 7 జనవరి 2010 వరకు మంజూరు చేసింది. ఇంత స్వల్ప శిక్షను కూడా తప్పించుకోవాలనే ప్రయత్నానికి ఇప్పటికి సిబిఐ సహకరించింది. పైగా 2007లో సమర్పించిన చార్జిషీట్‌లో రుచికా బరువు తగ్గడానికి అధికంగా మందులు వాడడంతో మరణించిందని, అందులో ఎవరి ప్రమేయం లేదని కూడా తెలపిందంటే, ప్రాసిక్యూషన్, సిబిఐ, ట్రయల్ కోర్టులు మొత్తంగా పోలీస్, న్యాయ వ్యవస్థలు ఎంత దారుణంగా వ్యవహరించాయో అర్థమవుతోంది.

మరో ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే 7 జనవరి 2010తో ముందస్తు బెయిల్ ఉత్తర్వులు ముగిసిన వెంటనే, తిరిగి జిల్లా సెషన్ కోర్టులో మరో బెయిల్ పిటిషన్‌ను ఆభా రాథోర్ వేయగా కోర్టు తిరస్కరించడంతో, తిరిగి 8 జనవరి 2010న పంజాబ్, హర్యానా హైకోర్టును ఆశ్రయించింది. రాథోర్ పై పెరుగుతున్న ఒత్తిడికి జడిసి హైకోర్టు కూడా బెయిల్‌ను తిరస్కరించింది. వయస్సు మీదపడి బి.పి., షుగర్ వ్యాధులతో బాధపడుతున్న రాథోర్ నిరపరాధి అని ఆయన ఇప్పటికీ వాదించడం గమనార్హం.

రుచికా కేసు సందర్భంగా ఆమె చదివిన చండీఘడ్ సేక్రెడ్ హార్ట్ కాన్వెంట్ స్కూల్ వ్యవహారం బయటపడింది. ఫీజు కట్టలేదన్న నెపంతో గత ఇరవై సంవత్సరాల ఆ స్కూలు చరిత్రలో ఏ ఒక్క విద్యార్థిని కూడా ఇంత వరకు పాఠశాల నుంచి తొలగించినట్లు ఆధారాలు లేవు. స్వయంగా రాథోర్ తన బిడ్డ ప్రియాంజలి (అదే పాఠశాల విద్యార్థిని)కి కూడా ఫీజు చెల్లించలేదు. అలాంటప్పుడు ఒక్క రుచికానే ఎందుకు తొలగించారనే ఆరోపణపై చండీఘడ్ ప్రభుత్వం నియమించిన పాఠశాల అధికారి సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ (ఎస్.డి.ఎం.) ప్రేమ్‌పురి పాఠశాల వ్యవహారంపై విచారణ జరపగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన ఆరాధన తండ్రి ఆనంద్ ప్రకాశ్‌ను కలవగా, కేవలం రాథోర్ ఒత్తిడిపైనే రుచికాను పాఠశాల నుంచి తొలగించారని చెప్పారు. ఈ కేసు వ్యవహారంతో తమ పాఠశాల ఆరోపణలకు గురవుతుందని భావించిన చండీఘడ్, సిమ్లా డయాసిస్ ఫాదర్ థామస్‌తో విచారణ చేయించింది. ఫాదర్ థామస్ కూడా ఫీజు కట్టనందుకే రుచికాను తొలగించడం జరిగిందని ప్రకటించాడు. ఈ వ్యవహారం తన మెడకెక్కడ చుట్టుకుంటుందోనని భయపడిన ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ సెబాస్టియన్ చండీఘడ్ కేంద్ర ప్రభుత్వం 2005లో విద్యారంగానికి అందించిన విశిష్ట సేవలకు గాను ఇచ్చిన ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని, తీసుకున్న డబ్బును 11 జనవరి 2010న తిరిగి ప్రభుత్వానికి వాపసు ఇవ్వడం గమనార్హం.

రుచికా గిర్‌హోత్రా సంఘటనతో కదిలిన కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌కు కొన్ని సవరణలు చేయాలని 31 డిసెంబర్ 2009న ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ముఖ్యంగా 372 కోడ్‌లోని సెక్షన్‌లు 5, 6, 21(బి)లు తప్ప మిగిలిన వాటికి సవరణలు జరిపి కొత్తగా 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (అమెండ్‌మెంట్) యాక్ట్ 2008'గా మార్పు చేస్తూ, ఈ సవరించిన కొత్త యాక్ట్ సవరించిన తేదీ నుంచే అమలులోకి వస్తుందని తెలిపింది. ఇదే సందర్భంగా కేంద్ర న్యాయ శాఖ కూడా కదిలింది. అన్ని రకాల కేసుల్ని ఎఫ్.ఐ.ఆర్.గా పోలీసులు విధిగా నమోదు చేయాలని వీరప్ప మొయిలీ సూచించడంతో, హోం శాఖ అన్ని రాష్ట్రాలకు నోటీసుల్ని పంపింది. అలాగే అత్యాచారం కేసుల్లో బాధితులు సంవత్సరాల తరబడి న్యాయం కోసం ఎదిరుచూడడం సరియైంది కాదనీ, ఈ కాలమంతా నిందితులు శిక్ష పడకుండా ఉంటున్నారనీ భావించిన కేంద్ర న్యాయశాఖ సెక్సువల్ అఫెన్సెస్ (స్పెషల్ కోర్ట్) బిల్లు 2010 ని రూపొందించి, హోంశాఖకు పంపడం కూడా జరిగింది. అయితే ఇవన్నీ కంటి తుడుపు చర్యలే. రాజకీయ నాయకులు, పోలీసులు, న్యాయ వ్యవస్థ భుజం, భుజం కలిపి పనిచేస్తున్నప్పుడు సామాన్యులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదు. గతంలోనే ఇలాంటి సందర్భాలలో కేసుల్ని ఏ విధంగా నడపాలి, నిందితునికి బెయిల్ ఏ సందర్భంగా ఇవ్వాలనే చట్టాలు, సూచనలు చాలా ఉన్నా అవేవి అమలుకు నోచుకోవడం లేదు.

ముందస్తు బెయిల్‌కు సంబంధించి ముప్పై సంవత్సరాల క్రితమే 9 ఏప్రిల్ 1980లో కొన్ని నిబంధనలను సుప్రీం కోర్టు రూపొందించింది. గుర్‌బక్ష్‌సింగ్ సిబ్బియాకు పంజాబ్ ప్రభుత్వానికి మధ్యన నడిచిన కేసు సందర్భంగా నాటి సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయాధీశులతో ఓ కమిటీ వేసింది. ఈ కమిటీలో నాడు ప్రసిద్ధ న్యాయాధీశులైన వై.వి. చంద్రచూడ్, పి.ఎన్. భగవతి, ఎన్.ఎల్. ఉంట్‌వాలియా, ఆర్.ఎస్. పాఠక్, ఒ. చిన్నప్పరెడ్డిలు ఉన్నారు. సాధారణ బెయిల్ మంజూరు చేసే సెక్షన్ల కన్నా ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసే సెక్షన్ 438 సిఆర్‌పిసి బలంగా ఉందని, అయినా కోర్టులు కస్టడీలో ఉన్న ముద్దాయి (నిందితుడు) కి ఇష్టం వచ్చినట్లు ముందస్తు బెయిల్ ఇవ్వవద్దని తెలుపుతూ ఈ కమిటీ తొమ్మిది సూచనలను చేసింది. ఈ సూచనలన్నీ గత

సంవత్సరం జూలైలో మహారాష్ట్ర ప్రభుత్వానికి, సావిత్రి అగ్రవాల్‌కు మధ్యన నడుస్తున్న కేసు సందర్భంగా ప్రస్తావించడం జరిగింది. ఈ సూచనల ప్రకారం రాథోర్‌కు ఎట్టి పరిస్థితుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వకూడదు. అయినా రాథోర్‌కు బెయిల్ దొరకడం గమనార్హం. ఇంత స్పష్టమైన చట్టాలు, ఆదేశాలు ఉన్నా రాజకీయ, పోలీసుల పలుకుబడితో పదుల, వందల సంఖ్యలలో నిందితులు రుచికా లాంటి కేసుల నుంచి కూడా తప్పించుకుంటున్నారు.

అత్యాచారానికి గురై ఆత్మహత్య చేసుకున్న తన ప్రాణస్నేహితురాలి మోముపై చిరునవ్వు చూడాలనే ఆరాధన ఆరాటం నిజం కావాలంటే మొద్దు నిద్రలో ఉన్న న్యాయ వ్యవస్థను నిద్రలేపడానికి ప్రజాబలం కావాల్సిందే. రుచికా కేసు ఇంకా ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూద్దాం.

రుచికా గిర్‌హోత్రా కేసు మలుపులు తిరుగుతున్న సందర్భంలోనే ఇలాంటి మరో రెండు కేసులు వెలుగు చూసాయి. మహిళా బాధితులు, వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు రావడం, ప్రజల, ఎన్.జి.ఒ.ల సహకారంతో వాటిని ప్రచార సాధనాలకు వెల్లడించడం జరిగింది. ఇందులో ఒకటి గిరిజన కానిస్టేబుల్ భార్య కేసు కాగా, మరొకటి దళిత అమ్మాయి కేసు.

గిరిజన మహిళపై డిఐజి అత్యాచారం

పదమూడు సంవత్సరాల క్రితం రాజస్థాన్ క్యాడర్‌కు చెందిన డిఐజి మధుకర్ టాండన్ దావుసా జిల్లా బండికూయి గ్రామానికి చెందిన ఓ కానిస్టేబుల్ భార్య అయిన గిరిజన మహిళను ఎత్తుకెళ్లి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలోని తన స్వంత ఇంట్లో 21 జనవరి 1997న అత్యాచారం చేశాడు. తర్వాత ఆయనను జైపూర్‌లోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేసారు. ఈనాటి దాకా ఆయన అరెస్ట్ కాకుండా ఉన్నాడంటే మన చట్టాలు ఎలా పని చేస్తున్నాయో తెలుస్తోంది. రుచికా కేసు సందర్భంగా ఈ కేసు పై కూడా మీడియా ఒత్తిడి పెరగడంతో రాజస్థాన్ ప్రభుత్వం 30 డిసెంబర్ 2009న ఆయనను వెదికి పట్టుకొని అరెస్ట్ చేయాలని ప్రత్యేక పోలీస్ విభాగానికి ఆదేశాలనిచ్చింది.

పత్రికల్లో వచ్చిన కథనాలను చూసిన తర్వాత గాని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు ఈ సంఘటన గుర్తుకు రాలేదు. తప్పించుకుంటూ తిరుగుతున్న మరో పోలీస్ మృగాన్ని వెంటనే అరెస్ట్ చేసి ట్రయల్ కోర్టుకు సహకరించాలని స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్.ఒ.జి.) పోలీసులకు ఆదేశాలిస్తూ, బాధితురాలికి వెంటనే న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అయితే ఈ కేసుకు సంబంధించిన గత పదమూడు సంవత్సరాల వివరాలను చూస్తే సమీప కాలంలో బాధితురాలికి న్యాయం జరుగుతుందని గాని, నిందితుడికి తగిన శిక్ష పడుతుందని గాని నమ్మకం లేదు.

నిజానికి మధుకర్ టాండన్ పోలీసు రికార్డుల ప్రకారం అరెస్ట్ కావాల్సిన అత్యవసర నేరస్తుడు. ఆయనను అరెస్ట్ చేయడానికి గత పదమూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అటు ముఖ్యమంత్రి, ఇటు హోంశాఖ మంత్రి శాంతి దరివాల్ చెపుతూ ఉన్నారు. అత్యాచారం చేసిన వెంటనే ఆయనపై ఎఫ్.ఐ.ఆర్. నమోదు కావడం, 1997లో చార్జిషీట్‌ను తయారు చేయడం జరిగాయని, వెంటనే ఆయనను సస్పెండ్ చేయడం జరిగిందని, తర్వాత 2003లో సర్వీస్ నుంచి తొలగించడం జరిగిందని రాజస్థాన్ డిజిపి బైర్వా తెలిపారు.

ఈ కేసును పరిశీలిస్తున్న దావుసా జిల్లా మెజిస్ట్రియట్ కోర్టు మధుకర్ టాండన్‌కు చెందిన జైపూర్, నోయిడా ఆస్తుల్ని జప్తు చేయాలని 2002లో ఆదేశించినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, పైగా ఈ ఆదేశాలకు ముందే జైపూర్‌లోని తన ఆస్తుల్ని అమ్ముకోవడం జరిగిందని, నోయిడాలోని తన ఇంటిని 2005లో ఇతరులకు అమ్మినట్లుగా డాక్యుమెంట్లు చూపాడని తెలిసింది. అత్యాచారంతోపాటు, మానభంగం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయకుండా సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తున్నారని నిరసిస్తూ దావుసా జిల్లా ఎం.పి. కిరోరిలాల్ మీనా బాధితురాలి కుటుంబ సభ్యులతో సహా డిసెంబర్ 29న ముఖ్యమంత్రి ఇంటిముందు ధర్నా చేయడం, తెల్లవారి జైపూర్‌కు 57 కిలోమీటర్ల దూరంలోని ఆగ్రా రహదారిపై రాస్తారోకో చేయగా, ఎం.పి. మీనాను అరెస్ట్ చేసి అజ్మీర్ జైలుకు పంపించారు. ఈ రెండు నిరసన కార్యక్రమాల్లోనూ బాధితురాలి భర్త కయాలి రామ్ మీనా కూడా పాల్గొన్నాడు. నిందితుడు తనకు డబ్బు ఆశ చూపాడని, ఒప్పుకోక పోవడంతో పోలీసుల చేత కొట్టించాడని ఆయన రిపోర్టర్ల ముందు వాపోయాడు. బిజెపి ప్రభుత్వ హయాంలో సంఘటన జరగగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వమే టాండన్‌ను పదవి నుంచి తప్పించిందని, కావాలని ఎం.పి. మీనా ఉద్యమం చేపట్టాడని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అయితే అరెస్ట్ చేయబడిన ఎం.పి.ని ఆ తర్వాత విడుదల చేసామని ప్రభుత్వం చెబుతుండగా, జైపూర్‌లోని తన ఇంటికి రాలేదని ఆయన భార్య తెలిపారు. మొత్తానికి రుచికా కేసు సందర్భంగా వెలుగులోకి వచ్చిన ఈ కేసు కూడా ఆ కేసులాగానే అనేక మలుపులు తిరగడం, పోలీసు దమననీతికి, ఆశ్రిత పక్షపాతానికి నిదర్శనం.

(ఇంకా ఉంది)

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు)

వచ్చే సంచికలలో...

- ❖ **ఫోకస్ - ఆగస్ట్ 2010 : వ్యవసాయ రంగం - నేటి స్థితి**
- ❖ **ఫోకస్ - సెప్టెంబర్ 2010 : ఎక్సైజ్ విధానానికి ప్రత్యామ్నాయం లేదా?**
- ❖ **సమకాలీన సమాజంలో హింస - హెన్రీ బెర్న్‌స్టీన్, కాలిన్ లీస్, లియో పానిచ్**
- ❖ **తెలంగాణ తోనే ఆదివాసులకు న్యాయం - ఎం. అరుణ్‌కుమార్**

చమురు, సహజవాయువు నిక్షేపాలు ఉన్న పాపానికి ఒక చిన్నారి దేశం సామ్రాజ్యవాద కుట్రలకు ఎలా బలి అవుతున్నదో వివరిస్తున్నారు కె. నరేంద్రమోహన్

సహజ సంపదే శాపమైన ఈస్ట్ టిమోర్

ఈస్ట్ టిమోర్ అనే చిన్న దేశం ఉన్నదని గూడా మనలో చాలా మందికి తెలియక పోవచ్చు. 21 వ శతాబ్దంలో ఏర్పడిన మొట్టమొదటి స్వతంత్ర దేశం అది. పుడుతూనే తన 'భూమిని' బలవంతులకు ధారాదత్తం చేసి ఆసియాలో రెండవ అతి పేద దేశంగా మిగిలినది టిమోర్ లేస్టే లేక ఈస్ట్ టిమోర్. సహజ వనరులు, ముఖ్యంగా పెట్రోల్, ఉండడం మూడవ ప్రపంచ దేశాలకు ఒక శాపంగా ఎలా మారుతుందో ఈస్ట్ టిమోర్ విషయంలో స్పష్టంగా కనబడుతుంది.

టిమోర్ సమాజంపై అమెరికా, ఆస్ట్రేలియా ప్రభుత్వాల మద్దతుతో ఇండోనేషియాను పాలించిన సుహార్తో సైనిక నియంతృత్వం జరిపిన ఆక్రమణ, మారణకాండ, దోపిడీ, దాని వెనుకనున్న అమెరికా అధ్యక్షుడు జెరాల్డ్ ఫోర్డ్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ హెన్రీ కిస్సింజర్, ఆస్ట్రేలియా ప్రధాని గౌ విట్లం హస్తాలు, వారు సాగించిన కుతంత్రాల గురించి విపులంగా రాస్తే ఒక పెద్ద పుస్తకమే అవుతుంది. ప్రస్తుతానికి ఈ పేద దేశాన్ని మెడలు వంచి పెట్రోల్, సహజ వాయు వనరులను అమెరికా, ఆస్ట్రేలియా కార్పొరేట్ సంస్థలు ఎలా స్వాహా చేస్తున్నాయో వివరించే ప్రయత్నం చేస్తాను. ఇందుకు అవసరమైన రేఖామాత్రపు చరిత్రను, అంతర్జాతీయ చట్టాలను కూడా చూద్దాం.

టిమోర్ లేస్టే అని పిలువబడే ఈస్ట్ టిమోర్ (తూర్పు టిమోర్) ద్వీపం ఆస్ట్రేలియాకు ఉత్తర భాగాన సుమారు 600 కిలోమీటర్ల దూరాన ఉంది. 16వ శతాబ్దం నుండి పోర్చుగల్ వలస పాలనలో ఉండి, పోర్చుగీస్ సామ్రాజ్యంలో గంధపుచెక్క, కాఫీ వ్యాపార కేంద్రంగా కొనసాగింది. అదే సమయంలో టిమోర్ ద్వీపపు పడమటి భాగం నెదర్లాండ్స్ వలసగా కొనసాగింది. డచ్ సామ్రాజ్యం కూలిపోయిన తరువాత, దాని పాలనలో ఉన్న తూర్పు ఆసియా భూభాగం చాలావరకు జావా కేంద్రంగా ఇండోనేషియాలో భాగంగా మారడంతో పడమటి టిమోర్ ఇండోనేషియా పాలనలోకి వచ్చింది.

1965లో అమెరికా సహకారంతో ఇండోనేషియా మొదటి అధ్యక్షుడు సుకర్నో ప్రభుత్వాన్ని కూలదోసి జనరల్ సుహార్తో సైనిక ప్రభుత్వాన్ని ఏర్పరిచాడు. ఈ క్రమంలో సుహార్తో దాదాపు ఐదు లక్షల మందిని హత్య చేయించాడు. సుకర్నో అనుసరించిన జాతీయ విధానాలను తిరస్కరించిన సుహార్తో అమెరికా, యూరప్ దేశాల గుత్త కార్పొరేట్ సంస్థలకు తలుపులు తెరిచి తాను ప్రపంచ ధనికుల స్థాయికి ఎదిగాడు.

ఆసియాలోని స్వాతంత్ర్యోద్యమాల ప్రభావం ఈస్ట్ టిమోర్ మీద పడి అక్కడా జాతీయ ఉద్యమం తలెత్తింది. ఈ నేపథ్యంలో పోర్చుగల్‌లోని నియంతృత్వానికి వ్యతిరేకంగా తలెత్తిన తిరుగుబాటుతో 1974లో మార్సెలో కేటనో ప్రభుత్వం పడిపోయింది. సంక్షోభంలో ఉన్న తదుపరి ప్రభుత్వం ఈస్ట్ టిమోర్‌ను విస్మరించి దాదాపు స్వతంత్ర దేశంగా వదలివేసింది.

అదే సమయంలో, సుహార్తో ప్రభుత్వం ఈస్ట్ టిమోర్‌లో తనకు అనుకూలమైన అపోదేటి అనే ఒక చిన్న సంస్థను పెంచి పోషించింది. టిమోర్ ప్రజలలో బాగా మద్దతు ఉన ఫ్రేట్లిన్ సంస్థ సంపూర్ణ స్వాతంత్ర్యం కోరుకోగా, అపోదేటి ఇండోనేషియాలో విలీనం కోరుకుంది.

పోర్చుగల్ విస్మరణతో ఫ్రేట్లిన్ 28 నవంబర్ 1975న ఏకపక్షంగా ఈస్ట్ టిమోర్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించింది. వెంటనే సుహార్తో ప్రభుత్వం అపోదేటికి మద్దతుగా రహస్య సైనిక చర్యలు చేపట్టింది. ఈ కవ్వింపు చర్యల వల్ల ఈస్ట్‌టిమోర్‌లో కొంత సాయుధ ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణ సాకుగా చూపి సుహార్తో ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు జెరాల్డ్ ఫోర్డ్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ హెన్రీ కిస్సింజర్‌తో జకార్తాలో రహస్య మంతనాలు జరిపిన మరునాడే (డిసెంబర్ 7, 1975న), ఈస్ట్ టిమోర్ పై సైనిక దురాక్రమణ జరిపింది.

సుహార్తో, ఫోర్డ్, కిస్సింజర్, ఆస్ట్రేలియా ప్రధాని, లేబర్ పార్టీ చరిత్రలో అత్యంత ప్రగతివాదిగా పేరున్న గౌ విట్లం మధ్య జరిగిన రహస్య చర్చల ఆధారాలు కొంతకాలం క్రితం బయటపడ్డాయి. బయటి ప్రపంచానికి ప్రజాస్వామ్యం, మానవహక్కుల గురించి గంభీరంగా ప్రబోధించే అమెరికా నాయకులు రహస్య సమాలోచనల్లో ఎలా వ్యవహరిస్తారో ఈ పత్రాలు బయట పెట్టాయి :

'సుహార్తో : ..యు.డి.టి. (యు.డి.టి. – ఫ్రేట్లిన్ ఘర్షణ) తరువాత ఇండోనేషియాకు ఒక తప్పని పరిస్థితి ఎదురైంది. ఇప్పుడు ముఖ్యమైన సమస్య ఏమిటంటే శాంతి భద్రతలు కాపాడటమేగాక, భవిష్యత్తులో ప్రాంతీయ, ఇండోనేషియా భద్రతలు రక్షించడం. మేము ఈ విషయాల గురించి తర్జన భర్జనలో ఉన్నాం. ఒకవేళ మేము తక్షణంగా తీవ్రమైన చర్యలుగాని తీసుకోవలిసి వస్తే మీరు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం.

ఫోర్డ్: 'మేము అర్థం చేసుకోగలం. ఈ విషయంలో ఒత్తిడి తీసుకురాము. మీ సమస్యలను, ఉద్దేశాలను మేము అర్థం చేసుకున్నాం.

కిస్సింజర్: అమెరికా ఆయుధాలు వాడితే సమస్యలు తలెత్తవచ్చని మీరు గుర్తిస్తారనుకుంటాను.

కిస్సింజర్: విషయాన్నీ ఎలా చిత్రిస్తామన్నదే సమస్య. ఆత్మ రక్షణగానా, విదేశీ చర్యగానా? ముఖ్యమైన విషయం ఏమిటంటే మీరు

ఏమిచేసినా త్వరగా సాధించాలి ... ఒకవేళ మీరు పథకం సిద్ధం చేసుకొనివుంటే, ప్రెసిడెంట్ గారు తిరిగి వెళ్ళే వరకు విషయం బయటికి పొక్కకుండా చూస్తాం. దీర్ఘకాలిక గెరిల్లా యుద్ధం జరుగుతుందని భావిస్తున్నారా?' (అమెరికా స్టేట్ డిపార్టుమెంట్‌కు జకార్తా రాయబార కార్యాలయం నుండి డిసెంబర్ 6న వెళ్లిన సంభాషణ కాపీ. జెరాల్డ్ ఫోర్డ్ లైబ్రరీలోని నేషనల్ సెక్యూరిటీ ఆర్కైవ్స్ డిక్లాసిఫైడ్ ఫొటోకాపీ).

ఈస్ట్‌టిమోర్ నుండి ఇండోనేషియా వైదొలగాలన్న ఐక్యరాజ్య సమితి తీర్మానానికి మద్దతుగా ఇండోనేషియాపై ఆర్థిక ఆంక్షలు విధించకుండా భద్రతా మండలిలో అమెరికా తన వీటో అధికారాన్ని ఉపయోగించడమే కాకుండా ఇండోనేషియాకు మిలిటరీ సహాయం రెట్టింపు చేసింది.

1999లో సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ సుహార్తో–విట్లంల మధ్య 1974 సెప్టెంబర్ 6న జరిగిన సమావేశం తాలూకు లీక్ చేయబడ్డ రికార్డు ప్రచురించింది. ఆ సమావేశంలో విట్లం టిమోర్ ఇండోనేషియాలో కలవాలనే తన అభిప్రాయం అని, అలాగే ఆ కలయిక ప్రజల అభీష్టం మేరకే జరిగిందని ఆస్ట్రేలియా ప్రజలు భావిస్తారని సుహార్తోకు తెలియజేసాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో ఈస్ట్ టిమోర్ ప్రజలు తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా ఆస్ట్రేలియా సైనికులను కాపాడటం వల్ల ఆ దేశం పట్ల ఆస్ట్రేలియాలో సానుభూతి ఉంది

అలాగే 1975 ఆగస్ట్ నెలలో జకార్తా లోని ఆస్ట్రేలియా రాయబారి రిచర్డ్ వుల్కాట్ ఆస్ట్రేలియా ప్రభుత్వానికి పంపిన ఒక రహస్య టెలిగ్రాంలో ఇలా రాసాడు: 'టిమోర్ పరిస్థితుల నుండి మనం వీలయినంత దూరంగా ఉండాలి. ఇండోనేషియా జోక్యం చేసుకుంటే, ఆస్ట్రేలియాలో దాని ప్రభావం వీలయినంత తక్కువగా ఉండేటట్లు చూసి రహస్యంగా ఇండోనేషియా సమస్యల పట్ల సానుభూతి చూపాలి. నేను చెబుతున్నది సూత్రబద్ధ వైఖరి కాదని తెలుసు కాని జాతీయ ప్రయోజనాలు, విదేశీ విధానం ఇలాగే ఉంటాయి.' (ఇంటిలిజెన్స్ వార్స్: బిహైండ్ ది లాన్స్ కాలిన్స్ అఫ్ఫేర్, రేడియో నేషనల్, 30 మే, 2004.)

అమెరికా, ఆస్ట్రేలియా నాయకులు సుహార్తో 'సమస్యలను అర్థం' చేసుకోవడం వల్ల జరిగిన దురాక్రమణలో కనీసం 20,000 మంది చనిపోగా, 1976 –1999 నడుమ కనీసం లక్ష మంది చనిపోయారు. ఇలా ఒక చిన్న పేద దేశంలోని ప్రజలు హింసలకూ, అత్యాచారాలకూ, ఆకలికీ, రోగాలకూ గురైతే, సుహార్తో కుటుంబం, అమెరికా, ఆస్ట్రేలియాలకు చెందిన పెట్రోలియం సంస్థలు కోట్లాది డాలర్ల లాభాలు గడించాయి. ఇది ఒక వంతైతే, మరొకవైపు ఆస్ట్రేలియా ప్రభుత్వం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి టిమోర్‌కు చెందవలసిన సముద్ర భాగాన్ని, అందులోని పెట్రోలియం సహజ వాయువుల ఆదాయాన్ని కొల్లగొట్టింది.

1974కు పూర్వం పోర్చుగల్ టిమోర్ తీరంలో పెట్రోలియం అన్వేషణకు ఓషియానిక్ ఎక్స్‌ప్లొరేషన్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇండోనేషియా దురాక్రమణ తరువాత ఈస్ట్ టిమోర్‌ను తన 27వ రాష్ట్రంగా ప్రకటించినప్పటికీ ఐక్యరాజ్యసమితి దానిని పోర్చుగల్‌కు చెందిన ప్రాంతంగానే గుర్తించింది. కొన్ని సంవత్సరాల వరకు అమెరికా, ఆస్ట్రేలియా కూడా ఇండోనేషియా ఆక్రమణను బహిరంగంగా గుర్తించలేదు. కాని 1989లో ఇండోనేషియాతో ఆస్ట్రేలియాలోని లేబర్ పార్టీ ప్రభుత్వం కుదుర్చుకున్న టిమోర్ గ్యాప్ (ఖాళీ ప్రాంతం) ఒప్పందంతో ఈ నాటకం కూడా ముగిసింది.

ఇక్కడ మళ్లీ కొంచెం చరిత్రలోకి తొంగిచూడాలి. ఇండోనేషియా, ఆస్ట్రేలియాల నడుమ 1972లో సముద్ర ప్రాంత సరిహద్దు ఒప్పందం కుదిరింది. అప్పటికి ఈస్ట్ టిమోర్ పోర్చుగల్ ఆధీనంలో ఉండటం వల్ల ఆ ప్రాంత సరిహద్దు రేఖలో ఖాళీ (గ్యాప్) ఏర్పడింది.

ఈ ప్రాంతంలోనే సుమారుగా 2000 కోట్ల బ్యారెల్‌ల పెట్రోలియం, 20 లక్ష కోట్ల ఘనపుటడుగుల సహజ వాయు నిక్షేపాలు ఉండడం అసలు విషయం. 1974కు ముందు పోర్చుగల్ ఈ వనరుల అన్వేషణను ఓషియానిక్ ఎక్స్‌ప్లొరేషన్ కార్పొరేషన్ సంస్థకు అప్పగించింది. ఆక్రమణ తరువాత ఇండొనేషియా ఈ కాంట్రాక్టును ఆస్ట్రేలియాకు చెందిన వుడ్ సైడ్ పెట్రోలియం, అమెరికాకు చెందిన కోనోకో ఫిలిప్స్ నిర్వహణలో పలు కార్పొరేట్ సంస్థలకు (కన్సార్టియం) ఒప్పగించింది. ఈ అన్వేషణలో లభించనున్న పెట్రోలియం, సహజ వాయువుల పై పన్నుల పంపకానికై ఈ ఒప్పందం కుదిరింది. వివరాల జోలికి వెళ్ళకుండా సారాంశంలో ఇండోనేషియా – ఆస్ట్రేలియాల నడుమ కుదిరిన ఖండ హద్దు (కాంటినెంటల్ షెల్ఫ్) ఒప్పందం వంటిదే ఈస్ట్ టిమోర్ విషయంలోనూ కుదిరింది.

ఇక్కడ కొంత అంతర్జాతీయ సరిహద్దుల చట్టాల గురించి చర్చించాలి. సులువుగా చెప్పాలంటే సముద్ర తీరంలో గుర్తించిన ప్రదేశం నుండి సముద్రంలో 200 మైళ్ల ప్రాంతాన్ని ఆ దేశ ప్రాంతంగా గుర్తిస్తారు. ఒక వేళ రెండు దేశాల సముద్ర ప్రాంతాలు దగ్గర దగ్గరగా ఉంటే వాటి మధ్యన రేఖ (మీడియన్ లైన్ ప్రిన్సిపల్) ను సరిహద్దుగా గుర్తిస్తారు. అంతర్జాతీయంగా ఈ సూత్రానికి మద్దతుగా చాలా కోర్టు నిర్ణయాలు (కేస్ లా) ఉన్నాయి. కాని ఈ సూత్రానికి విరుద్ధంగా 1989లో ఆస్ట్రేలియా – ఇండోనేషియాల నడుమ ఈస్ట్ టిమోర్ ఆస్తుల పంపకం జరిగింది.

ఈ ఒప్పందం ఫలితంగా ఆస్ట్రేలియా ఇండోనేషియాలు పన్నులు పంచుకున్నాయి. అంటే మధ్యమ రేఖ సూత్రం ఆధారంగా సరిహద్దు గుర్తిస్తే ఈస్ట్‌టిమోర్‌కు చెందవలసిన చమురు సహజవాయువుల బావులు ఆస్ట్రేలియా వాటాలోకి వెళ్లాయి. ఇండోనేషియా ప్రపంచ కోర్టు అధికారాన్ని గుర్తించినందువల్ల ఈ ఒప్పందం చలామణీ అయింది.

1998లో జరిగిన ప్రజాందోళన వల్ల సుహార్తో సైనిక పాలన ముగిసింది. దరిమిలా ఆగస్ట్ 1999లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జనాభిప్రాయ సేకరణ (రిఫరెండం) జరిగి మే 2002లో ఈస్ట్ టిమోర్ స్వతంత్ర రాజ్యంగా అవతరించింది. స్వాతంత్ర్యం కోరుకున్నందుకు కానుకగా ఇండోనేషియా సైన్యం వేలాది మందిని చంపి, రోడ్లు, భవనాలతో సహా ఆస్తులు ధ్వంసం చేసింది. అందుకు సరిగ్గా రెండు నెలల ముందు, అంటే మార్చ్ 2002లో ఆస్ట్రేలియా, సముద్ర సరిహద్దుల గుర్తింపు విషయంలో అంతర్జాతీయ సముద్ర ట్రిబ్యునల్ (ఇంటర్నేషనల్ ట్రిబ్యునల్ ఫర్ ది లా ఆఫ్ ది సీ) పరిధి నుండి వైదొలిగింది.

ఐక్యరాజ్యసమితి గుర్తింపు ప్రకారం స్వతంత్ర టిమోర్ ఇండోనేషియా రాజ్యానికి కొనసాగింపు (సక్సెసర్ స్టేట్) కాకపోవడంవల్ల ఇండోనేషియా కుదుర్చుకున్న ఒప్పందాలు దానికి వర్తించవు. ఆస్ట్రేలియా – ఈస్ట్ టిమోర్‌ల మధ్య తిరిగి సరిహద్దు ఒప్పందం అవసరమైంది. ఆస్ట్రేలియా వాదన ప్రకారం ఆస్ట్రేలియా సముద్ర భాగం ఈస్ట్ టిమోర్

నూతన పారిశ్రామిక విధానాలతో పాలకులు ప్రభుత్వరంగ పరిశ్రమలను బలహీనపరిచి, వాటిని మూసివేయడంతో ఉపాధి కోల్పోయిన కార్మికుల జీవనస్థితిగతులను వివరిస్తున్నారు **డా. ఎం. విద్యాసాగర్ రెడ్డి, డా. మహ్మద్ మస్లియుద్దిన్**

నూతన పారిశ్రామిక విధానం - ఆజంజాహి మిల్లు

ఏ దేశాభివృద్ధియైనా ఆ దేశ పారిశ్రామిక అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. పారిశ్రామిక అభివృద్ధి అనేది ఆ దేశ పారిశ్రామిక విధానంపై ఆధారపడి ఉంటుంది. అందుకోసం విధాన నిర్ణేతల దృష్టి అంతా పారిశ్రామిక విధానంపై, ముఖ్యంగా భారీ పరిశ్రమలపైననే కేంద్రీకృతమై ఉంటుంది.

మన దేశంలో 20వ శతాబ్దం మొదటిలోనే పారిశ్రామిక విధానం ప్రాముఖ్యత గుర్తించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన 'ద ప్లాన్డ్ ఎకానమీ ఆఫ్ ఇండియా' అనే గ్రంథం ద్వారా దీని ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పారిశ్రామికాభివృద్ధి భావన సమగ్రమైనది. ఇది అనేక విధానాలను, సిద్ధాంతాలను, నిబంధనలను కలిగి, బాధ్యత గల పారిశ్రామిక నిర్వహణపై నియంత్రణను కలిగి ఉంటుంది.

1991 జూన్‌లో ప్రకటితమైన పారిశ్రామిక విధానం ప్రకారం వనరుల పంపిణీని మార్కెట్ నిర్ణయిస్తుంది. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా మార్పును ఆహ్వానించే పరిశ్రమలు మాత్రమే పోటీకి నిలబడగలుగుతాయి. అంతర్జాతీయంగా ఏ మార్పు జరిగినా దాని ప్రభావం పరిశ్రమలపై తప్పక పడుతుంది. శాస్త్ర, సాంకేతిక, నూతన ఒరవడులను, కొంగొత్త నైపుణ్య కౌశలాలను అలవర్చుకున్న పరిశ్రమలే పోటీని తట్టుకొనగలవు.

నూతన పారిశ్రామిక విధానాల అమలులో భాగంగా నష్టాల్లో నడుస్తున్న పరిశ్రమలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద పదవీ విరమణ (వాలంటరీ రిటైర్మెంట్), బంగారు కరచాలనం (గోల్డెన్ షేక్ హ్యాండ్) అనే పేరుతో కార్మికులను, ఉద్యోగులను ఉద్యోగాల నుండి తొలగించడం జరుగుతోంది.

సంక్లిష్టమైన ఆర్థిక సంస్కరణలతో భారత పారిశ్రామిక రంగం అనూహ్యమైన వినూత్న మార్పులకు లోనవుతోంది. ప్రభుత్వ సహాయంతో నడిచే పరిశ్రమలు కూడా అంతర్జాతీయ పోటీని తట్టుకోవాల్సి వస్తోంది. నేటి పోటీ ప్రపంచంలో ఇలాంటి పరిశ్రమలు తెల్లని ఏనుగుల వలె అయిష్టంగానే పోటీకి దిగాయి. పరిశ్రమ ఏదైనా అది మార్కెట్‌లో తన వాటా కోసం కొండంత ఆరాటం పడాల్సిన అవసరం ఏర్పడింది.

ప్రపంచమే చిన్న కుగ్రామంగా పరిగణిస్తున్న ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయంగా పోటీకి దీటుగా వ్యవస్థాపరమైన సర్దుబాట్లు చేపట్టాల్సి వచ్చింది. ఈ సర్దుబాటులో భాగంగా అవసరానికి మించి అదనంగా ఉన్న కార్మికులను స్వచ్ఛంద పదవీ విరమణ పథకం ద్వారా తొలగించడం జరుగుతోంది. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటరీ రిటైర్మెంట్ స్కీం ప్రభావం తెలంగాణ ప్రాంతంలోని ఆజంజాహి మిల్లుపై కూడా పడింది.

అప్పటి హైదరాబాద్ ప్రభుత్వ ప్రధానమంత్రి సర్ అక్బర్ హైదరీ ఆజంజాహి మిల్లును 1931లో తెలంగాణ ప్రాంతమైన వరంగల్‌లో

చేరువలో ఉన్న టిమోర్ ట్రెంచ్ వరకు విస్తరిస్తుంది. కాని మధ్యమ రేఖ సూత్రం వర్తిస్తుందని ఈస్ట్ టిమోర్ వాదించింది. సముద్ర ట్రిబ్యునల్లో ఈస్ట్ టిమోర్ వాదనే నెగ్గుతుంది. చట్టం పని చేయనప్పుడు మిగిలింది బలప్రయోగం మాత్రమే.

త్వరగా ఒప్పందం కుదరకపోతే విదేశీ రుణాలు నిలిచిపోతాయని ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ డౌనర్ (లిబరల్ పార్టీ) బెదిరింపుతో ఈస్ట్ టిమోర్ తలవంచక తప్పలేదు. అప్పటికి ఐరాస అధికారి పీటర్ గాల్‌బ్రేత్ సహకారం వల్ల బాయు-ఉడాన్ అనే బావిలో పన్నులు 90 శాతం టిమోర్‌కు దక్కాయి. 2006 దాకా సాగిన ఈ వివాదంలో చివరికి సిమ్యటస్ అనే సర్దుబాటు ఒప్పందం కుదిరింది. కాని విస్తారంగా నిల్వలు ఉన్న లమినరియా, ఎలంగ్ -కకటువా, గ్రేటర్ సన్రైజ్ బావుల విషయంలో ఒప్పందం యథాతథం గానే మిగిలింది.

అంతర్జాతీయ న్యాయం ప్రకారం మధ్యమ రేఖలో సరిహద్దు గుర్తిస్తే ఈ మూడు కూడా టిమోర్‌కే చెందుతాయని న్యాయవేత్తల విశ్వాసం. కాని న్యాయస్థానంలో సవాలు చేసే అవకాశం ఈస్ట్ టిమోర్‌కు మిగలలేదు. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి ఈ ఒప్పందాన్ని 'జాతీయ ప్రయోజనాల దృష్ట్యా' తన అత్యవసర అధికారాలు ఉపయోగించి పార్లమెంట్ ఆమోదం పొందకముందే, అమలు పరిచాడు. అంటే ఒక స్వతంత్ర దేశం ఈ ఒప్పందం అమలులో ఉండే 50 ఏళ్లు ఒక గుర్తించబడిన సముద్ర ప్రాంతం లేకుండా మిగిలింది. 50 ఏళ్ల తరువాత ఆ బావుల్లో ఏం మిగులుతుందో మరి. అంటే వనరులే కాక, వాటివల్ల పొందగలిగే పరిశ్రమలు, ఉపాధి, షిప్పింగ్ ఆదాయం కూడా టిమోర్‌కు దక్కవు.

గణాంకాలలోకి వెళితే ఇంకొక పెద్ద కథే అవుతుందని వాటి వివరాలు తెలియజేయడంలేదు. సామ్రాజ్యవాదం వల్ల మూడవ ప్రపంచ దేశాల స్వాతంత్ర్యం ఎలా నామమాత్రంగా మిగులుతున్నదో తెలుసు కోవడానికి ఇది ఒక ఉదాహరణ.

(రచయిత పాత్రికేయులు, ఆస్ట్రేలియాలో సామాజిక కార్యకర్త) వీ

ఏర్పాటు చేశారు. కాటన్ టెక్స్‌టైల్, డిజైన్‌ను అతి తక్కువ ధరకు సామాన్య మానవుడికి అందించాలనే లక్ష్యంతో ఆజంజాహి మిల్లును ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు 36,136 స్పిండిల్స్, 726 మగ్గాలు ఉండేవి. మొట్టమొదట కాటన్ మిల్ భారతదేశంలో 1818లో నెలకొల్పబడింది. ఈ పరిశ్రమ ఉపాధిని కల్పించడంలో వ్యవసాయ రంగం తర్వాత రెండవ స్థానాన్ని ఆక్రమించింది. దాదాపు 33.17 మిలియన్ ప్రజలకు ప్రత్యక్ష ఉపాధిని, 54.85 మిలియన్ ప్రజలకు పరోక్ష ఉపాధిని కల్పించింది.

ఆజంజాహి మిల్స్ ద్వారా రసాయనిక, రంగుల దారాలు, పత్తి, బెడ్ షీట్స్, పొడుగుబట్ట, దోమ తెరలు, నాప్‌కిన్‌లు, ధోవతులు, సూటింగ్స్, టేబుల్ బట్టలు మొదలైనవి ఉత్పత్తి చేశారు. జిన్నింగ్, ప్రెస్సింగ్, బ్లీచింగ్, డైయింగ్, ఫినిషింగ్, ప్రింటింగ్ పనులకు అనేక పరికరాలను ఉపయోగించారు. మిల్ నుండి ఉత్పత్తి అయిన బట్ట ఆస్ట్రేలియా, సౌదీది అరేబియా, నేపాల్, ఆఫ్రికా లాంటి వివిధ దేశాలకు కూడా ఎగుమతి అయ్యేది. మిల్ నుండి ఉత్పత్తి అయిన 20 శాతం బట్టను విదేశాలకు ఎగుమతి చేసేవారు.

1966 నుండే మిల్ అనేక నష్టాలను చవిచూసింది. మూలిగే నక్క మీద తాటికాయ పడిన చందంగా నూతన పారిశ్రామిక విధాన ప్రభావం వల్ల మిల్లు 1991 తర్వాత పూర్తిగా మూసివేత దశకు చేరుకుంది. 1993, 1998, 2003లలో ఎక్కువగా కార్మికులు స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా బలవంతంగా తొలగింపబడ్డారు. 1966 నుండి మిల్లు అనేక నష్టాలను ఏ విధంగా ఎదుర్కొన్నదో పట్టిక ద్వారా గమనించవచ్చు.

సంవత్సరం	నష్టం (కోట్ల రు.ల.లో)
1966-67	14.96
1967-68	26.34
1968-69	49.98
1969-70	48.12
1970-71	56.21

సమర్థవంతమైన నిర్వహణ నైపుణ్యం కలిగిన ఉద్యోగి వ్యవస్థ లేకపోవడం, స్వచ్ఛంద ధరల నియంత్రణ వల్ల బట్ట ధరను తగ్గించడం, కార్మికుల కరువు భత్యం పెరగడం వల్ల దాన్ని చెల్లించడం మిల్లుకు భారంగా పరిణమించింది. సెలవులను ఎక్కువగా ప్రకటించడం, సమర్థవంతమైన సేల్స్ వ్యవస్థ లేకపోవడం, పని నైపుణ్యం గల కార్మికులు లభ్యం కాకపోవడం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మికులు మారకపోవడం, కంప్యూటర్ టెక్నాలజీ పరిజ్ఞానం లేకపోవడం, నియామకం ముందుగాని, తర్వాత గాని శిక్షణ లేకపోవడం, విద్యుత్, నీటి సౌకర్యాల లేమి, పత్తి, డై, రసాయనిక యంత్ర పనిముట్ల ధరలు పెరగడం, సరియైన పెట్టుబడి లేకపోవడం, ఆధునిక యంత్రాలను ఉపయోగించే విధానం తెలియకపోవడం, ఉత్పత్తి, మార్కెటింగ్‌లలో అనుభవం లేకపోవడం నష్టాలకు గల కారణాలుగా కనిపిస్తున్నాయి.

అక్షరాస్యత పరంగా చూస్తే 53 శాతం నియత విద్య లేనివారు, 35 శాతం మెట్రిక్యులేషన్ కంటే కింది స్థాయి, 9 శాతం మంది మెట్రిక్యులేషన్ కంటే పై స్థాయి, మూడు శాతం మంది డిప్లొమా లేదా డిగ్రీ చేసిన వారున్నారు.

85 శాతం మంది కార్మికులు పెంకుటిళ్లలో, 3 శాతం ఆర్.సి.సి. గృహాల్లో, 4 శాతం మంది గుడిసెల్లో, 8 శాతం మంది కిరాయి ఇండ్లల్లో నివసిస్తున్నారు. 70 శాతం కార్మికులకు అప్పులున్నాయి. 63 శాతం కార్మికులు వాళ్ల పిల్లల పెళ్లిళ్లకు అప్పులు తెచ్చినవారున్నారు. ఇందులో 49శాతం మంది 20-30 సంవత్సరాల ఉద్యోగ సర్వీస్ చేశారు. కేవలం 18 శాతం మాత్రమే 30-40 సంవత్సరాల సర్వీస్ చేశారు. మిగతా 33 శాతం కేవలం 10-20 సంవత్సరాల సర్వీస్ మాత్రమే చేశారు.

చివరి జీతంగా 41 శాతం కార్మికులు రు.1500-3000 మధ్యలో, 33 శాతం మంది రు. 1000-1500 మధ్యలో, 18 శాతం మంది కార్మికులు ఐదువందల రూపాయల లోపు తీసుకున్నారు.

వాలంటరీ రిటైర్మెంట్ పథకం తీసుకునేటప్పుడు కార్మికుల వయస్సును పరిగణనలోకి తీసుకున్నట్లయితే అత్యధికంగా 48 శాతం మంది కార్మికులు 35-45 సంవత్సరాల మధ్యలో ఉన్నారు. 28 శాతం మంది 45-55 సంవత్సరాల మధ్యలో ఉన్నారు. అత్యల్పంగా 24 శాతం మంది 25-35 సంవత్సరాల మధ్యలో ఉన్నారు.

ఉపాధి కోల్పోయి, పస్తులుండలేక, పంటలు పండక, వర్షాలు లేక, చేతికి వచ్చిన చేను అతివృష్టి వల్ల నష్టాల పాలై, ఉన్న ఉద్యోగాలు పోయి దిక్కుతోచని కార్మిక, కర్షక వర్గాలెందరో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అన్నదాతగా పేరెన్నికగన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆకలి చావులు కోకొల్లలు.

నష్టాల బాటలో నడుస్తున్న కర్మాగారాలను ప్రభుత్వం దత్తత తీసుకొని ఒక సీనియర్ ఐ.ఎ.ఎస్. అధికారిని నియమించి నిబద్ధత, నైపుణ్యం, నైతికత, సమర్థులైన ఉద్యోగిస్వామ్య వ్యవస్థను నియమించి నిరాశకు, నిర్లక్ష్యానికి తావులేకుండా చేసినట్లయితే కర్మాగారాలను మూసివేత నుండి కాపాడవచ్చు.

ప్రభుత్వ రంగాల్లో అవినీతికి హద్దులు లేవు. అవినీతిని అరికట్టి నట్లయితే ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి మార్గాలను చూపించవచ్చు. దీని ద్వారా తీవ్రవాద సమస్య కూడా తొలగిపోతుంది. సమాజంలో శాంతి నెలకొంటుంది.

ప్రధానంగా రాజకీయాలకు అతీతంగా కర్మాగారాలు పనిచేయాలి. ముందు ప్రజల సంక్షేమానికై ప్రజా ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉంది. ప్రజల మనుగడకై పాటుపడే ప్రభుత్వాలే ప్రజా ప్రభుత్వాలు కాగలవు. ఏ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించినా అది పేద కార్మికుడి తలుపు తట్టాలి. అసలైన అన్నార్తుల ఆకలి తీరాలి. ఆ రోజే నిజమైన స్వాతంత్ర్యం భారతదేశానికి వచ్చినట్లు అవుతుంది.

(రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్, రిసెర్చ్ స్కాలర్) వీ

వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల పాలవుతున్న రైతులను ఆదుకోవడానికి పాడి అభివృద్ధిని ఒక మార్గంగా చూడాలంటున్నారు **లింగబత్తిని మల్లయ్య, వంగ రజిత**

ఆర్థిక సామర్థ్యాన్ని పెంచే పాడి పరిశ్రమ

మన దేశంలో గత కొన్ని సంవత్సరాలుగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న విషయం అందరికీ తెలిసిందే. వ్యవసాయం గిట్టుబాటు కాక, అప్పుల బాధలు తట్టుకోలేక, నష్టాల్లో ఉన్నారు కాబట్టి, అప్పు తీర్చలేక, ప్రాణం కన్న పరువే ముఖ్యమనే భావనతో ప్రాణత్యాగం చేసే దుర్భర పరిస్థితి గురించి అనేక పత్రికలు అనేక కథనాలు ప్రచురించాయి. ఈ దశలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబానికి పరిహారం చెల్లించడం, వారికి అప్పుల నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు వారి కుటుంబాల జీవనం కొరకు ఉపాధి కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకోసం చాలా పథకాలను అమలు జరుపుతున్నారు. అటువంటి అనేక పథకాలలో పాడి పశువులను అందించడం. ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి ఒక గేదెను, లేదా ఒక ఆవును ఇవ్వాలన్నది ఆ పథకంలో ప్రధాన అంశం. పల్లెల్లో ఉండే రైతు కుటుంబంలోని వారికి వ్యవసాయ, పాడి, వ్యవసాయానికి అనుబంధంగా ఉండే పనుల్లో తప్ప ఇతర పనులు చేయడంలో సామర్థ్యం ఉండదు. కాబట్టి వారికి నచ్చిన, వచ్చిన పని చేసుకుంటూ జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ పాడి పశువుల పంపిణీ పథకాన్ని అమలు చేయడం మొదలుపెట్టారు.

పాడి గేదెను కానీ, ఆవును గానీ ఉచితంగా ఇవ్వడం వల్ల ఆ పశువును జాగ్రత్తగా కాపాడుకోవడంలో సమస్యలు ఎదురవుతాయనో, లేక వాళ్ల పెట్టుబడి కొంత వాళ్ల వ్యాపారంలో ఉంటే మంచిదనే కారణంతో గేదెనుగానీ, ఆవును గానీ కొనడానికి అయ్యే ఖర్చులో సగం సబ్సిడీ రూపంలో ఇచ్చి మరో సగం బ్యాంకు రుణం రూపంలో ఇవ్వాలని నిర్ణయించారు. ఒక గేదెకానీ, ఆవుకానీ ఇచ్చినంత మాత్రాన కుటుంబ పోషణకు కావలిసిన ఆదాయం లభిస్తుందా? ఒక పశువు నిరంతరం పాలు ఇవ్వదు కదా. ఆ పశువు పాలు ఇవ్వడం ఆపివేసినప్పుడు ఆ కుటుంబ పరిస్థితి ఏమిటి? అప్పుడు అప్పు ఎలా తీరుస్తారు? తదితర అనేక అనుమానాలు కలుగుతుండడం సహజమే. అయితే ఈ విషయంలో రెండు గేదెలు గాని రెండు ఆవులు గాని ప్రభుత్వం ఇప్పిస్తే బాగుంటుందని చాలా మంది రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

ఒక గేదె, లేక ఆవుతో కుటుంబానికి నెలకి కనీసం మూడు వేల రూపాయల నికర ఆదాయం వస్తుందని నిపుణులు అంచనా వేశారు. ఆ అంచనాలు సరైనవని కొంతమంది, కాదని కొంతమంది వాదించడం జరుగుతోంది. ఆ వివాదం జోలికి పోకుండా ఆ అంచనా సరైనదే అని నమ్మినా ఏడాది పొడవునా అప్పు తీరే వరకు ఆ పశువు పాలు ఇవ్వదు కాబట్టి ఆరు మాసాల అనంతరం మరో పశువును ఇవ్వాలని నిర్ణయించారు. పశువును ఇచ్చినంత మాత్రాన సరిపోదు. దాని పోషణకు అయ్యే ఖర్చులో కూడా కొంత ప్రభుత్వం చేరిస్తే పాడి లాభ దాయకంగా ఉంటుందనే ఉద్దేశంతో వాటి దాణాకు అయ్యే ఖర్చులో సగం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇవ్వాలని నిర్ణయించింది.

తొలుత కేవలం ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకే ఈ పథకాన్ని పరిమితం చేయాలనుకున్నా తరువాత దాన్ని అప్పుల ఊబిలో కూరుకుపోయి సతమతమవుతున్న సన్నకారు రైతులకు కూడా వర్తింపజేశారు. ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రజాస్వామ్య బద్ధంగా పారదర్శకంగా జరగాలనే లక్ష్యంతో లబ్ధిదారుల ఎంపికను గ్రామ సభల్లో అమలు చేయడానికి 155 కోట్ల రూపాయలకు పైగా నిధులు విడుదల చేశారు. ఒక్కో పశువు కొనుగోలుకి గరిష్టంగా పదిహేను వేల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం భరించాలని, మిగతా పదిహేను వేల రూపాయలు బ్యాంకుల నుంచి రుణాల రూపంలో ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, ఆ రుణాన్ని తక్కువ వడ్డీతో సులభ వాయిదాలలో వసూలు, కొనుగోలుకి ఇచ్చే సబ్సిడీ పశువు ఇచ్చే పాలు ఆధారంగా నిర్ణయించాలని, రైతులు పశువులను కొనుగోలు చేయడంలో ప్రభుత్వ పశు సంవర్ధక శాఖకు చెందిన పశు వైద్యులు ప్రధాన భూమిక పోషించాలని, పథకం అమలుకు విడుదల చేసిన మార్గదర్శక సూత్రాలలో ప్రభుత్వం నిర్దేశించింది. ఈ పథకం కింద పశువులను కొనుగోలు చేయడానికి టెండర్ ప్రక్రియ ద్వారా ముందస్తుగా అమ్మకం దారులను ఎంపిక చేసి రేటు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నది.

పశువు ధరను అది ఇచ్చే పాలు ఆధారంగా నిర్ణయిస్తారు కాబట్టి, అది ఎక్కువ పాలు ఇస్తుందని చెప్పి, అధిక ధరకు దానిని రైతుకు అమ్మేసి తీరా రైతు దానిని ఇంటికి తీసుకపోయిన తరువాత అది అన్ని పాలు ఇవ్వకపోతే రైతు నష్టపోతాడు. కాబట్టి రేటు విషయంలో కాంట్రాక్ట్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు. అమ్మేటప్పుడు సూచించిన దాని కంటే వాస్తవంగా పశువులు తక్కువ పాలు ఇస్తే ఈ మేరకు అమ్మకం దారుడు దాని ధరను సరిచేసి డబ్బు తిరిగి ఇచ్చేయాలి. అంతేకాదు, ఒకవేళ ముందుగా సూచించిన దానికంటే 25 శాతం

తక్కువ పాలు ఇచ్చినట్లయితే పశువు ధరను పూర్తిగా తిరిగి ఇచ్చేయాలని కాంట్రాక్ట్ ఒప్పందాలలో పొందు పరిచారు. ఇలా నిబంధనలు, పథక రూపకల్పనలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ దేశంలో పాడి వృద్ధి చెందేట్టుగా, తద్వారా రైతుకు మేలు జరిగేట్టుగా చూడడానికి తగినన్ని జాగ్రత్తలను మార్గదర్శకాలలో పొందుపరిచారు. అయితే మన రాష్ట్రంలో ఈ పథకం అమలు జరుగుతున్న తీరును పరిశీలిస్తే ఆశించిన ఫలితాలు అందడం లేదేమోననే అనుమానం కలుగుతుంది. సంవత్సర కాలంలో దాదాపు లక్షకు పైగా పశువులను కొనుగోలు చేసి రైతులకు పంచినట్టు, వాటి దాణాకు కూడా సబ్సిడీ రూపంలో డబ్బు ఖర్చు చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ రికార్డులు తెలియజేస్తున్నాయి.

పశువులను మన రాష్ట్రంలో కాక హర్యానా, తమిళనాడు తదితర రాష్ట్రేతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకున్నట్లు చెపుతున్నా చూపించి వాటి రవాణాకు కూడా కోట్లాది రూపాయలు వెచ్చించినట్లు పశు సంవర్ధక శాఖ వద్ద ఆ వివరాలు కూడా లేవు. లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభ చేసినట్టు చూపడానికి పశు సంవర్ధక శాఖ వద్ద ఎటువంటి సాక్ష్యాలు లేవు. అసలు ఈ పథకం కింద ఎంతమంది పశువులు కావాలని దరఖాస్తు చేస్తున్నారు, అందులో ఎంతమందికి పశువులను సబ్సిడీపై అందించారు, వారిని ఏ ఆధారంగా ఎంపిక చేశారు, మిగిలిన దరఖాస్తుదారుల పరిస్థితి ఏమిటి? దరఖాస్తుదారులకు తమ దరఖాస్తుపై ఎటువంటి చర్య తీసుకోబడుతున్నదో సమాచారం అందించే వ్యవస్థ ఉన్నదా? వంటి ప్రశ్నలకు వేటికి పశు సంవర్ధక శాఖ వద్ద ఎటువంటి సమాధానాలు లేవు.

నిబంధనల ప్రకారం గ్రామ సభ లబ్ధిదారులను ఎంపిక చేసిన అనంతరం ప్రభుత్వ అధికారులు పశువు కొనుగోలుకి సబ్సిడీ మంజూరు చేసి, బ్యాంక్ నుంచి రుణం ఏర్పాటు చేసిన తరువాత లబ్ధిదారుడితో పాటు, పశు సంవర్ధక శాఖ వైద్యులు, బ్యాంక్ నుంచి నిర్దేశిత అధికారి పశువులను కొనుగోలు చేయడానికి పశువుల ఎంపిక ప్రక్రియలో భాగస్వాములు కావాలి. అయితే శాస్త్రీయంగా పశువుల ఎంపిక జరిగిన దాఖలాలే లేవు. బ్యాంక్ అధికారులు పశువుల కొనుగోలు ప్రక్రియలో భాగస్వాములు కాలేదు.

అప్పు ఇచ్చేవారు పశువుల కొనుగోలులో భాగస్వామి అవ్వకపోతే పెద్ద నష్టం లేదని సర్దుకుపోవచ్చు. చిత్రమేమిటంటే పశువులను పోషించి, దాని ఆధారంగా జీవించవలసిన దరఖాస్తుదారులు కూడా పశువుల కొనుగోలులో భాగస్వాములు కాలేదు. అప్పు తీర్చాల్సిన వారు, అప్పు ఇచ్చిన వారు ఉభయులు పశువు కొనుగోలు చేయడానికి వెళ్లకుండా పశు సంవర్ధక శాఖ అధికారులే పశువులను ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసి రైతులకి పంచినట్టు రికార్డులు తెలియజేస్తున్నాయి.

దరఖాస్తుదారుల సమక్షంలో కాకుండా పాడిగేదెను, ఆవును పరోక్షంలో ఎందుకు కొన్నారంటే, పశువును హర్యానా వంటి సుదూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం జరుగుతోంది కాబట్టి, ఇన్ని వేల మంది అంతదూరం వచ్చే అవకాశం లేదు కాబట్టి, పశుసంవర్ధక శాఖ వైద్యులే అక్కడికి వెళ్లి వాటిని కొనుగోలు చేసి గూడ్స్ రైలు ద్వారా మన ప్రాంతానికి రవాణా చేయించి, ఇక్కడ వాటిని లబ్ధిదారులకి వితరణం చేయడం జరిగిందని చెబుతున్నారు. పశువుని దూడతో సహా కొనుగోలు చేసినా రవాణాలో అనేక కారణాల వల్ల లబ్ధిదారులకు ఆ పశువుని పంపిణీ చేసే లోపే దూడలు చనిపోయాయని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల వివరాలు కూడా సేకరించకుండానే పశు సంవర్ధక శాఖ ఈ పథకాన్ని అమలు చేసిందంటే పథకం పట్ల ఆ శాఖకు ఉన్న చిత్తశుద్ధి అర్థం చేసుకోవచ్చు. లక్షలకు పైగా పశువుల కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు ఖర్చు లెక్క చూపిన పశు సంవర్ధక శాఖ వద్ద అందుకు తగిన బిల్లులు కూడా లేవు. పశువుల రవాణాకు సంబంధించిన 'వే' బిల్లులు కూడా ఆ శాఖ వద్ద లేవంటే పథకం ఎంత సక్రమంగా అమలు జరిగిందో, జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా వివరిస్తూ పోతే ఈనాటి అవినీతిమయ ప్రపంచంలో ఇలాగాక ఎలా జరుగుతుంది అని ఎదురు ప్రశ్న వేయవచ్చు.

ప్రభుత్వం పశువుల కొనుగోలుకి, దాణాకి సబ్సిడీ, రుణం అందిస్తోంది. కాబట్టి ఇప్పటికైనా ప్రతి గ్రామంలో కొన్ని పశువులను పంపిణీ చేసి ఆ పశువుల ద్వారా వాటిని సాకే కుటుంబాలకు తగిన ఆదాయం వచ్చేట్టుగా ఏర్పాటు చేయడంతో పాటు ఆ గ్రామంలో సేంద్రియ వ్యవసాయాన్ని, ప్రత్యామ్నాయ ఇంధన వాడకాన్ని ప్రోత్సహించడానికి ఉపక్రమించవచ్చు గదా? ప్రస్తుతం ఈ పథకం అమలు చేయడంలో అవినీతి అవకతవకలు చోటు చేసుకుంటున్నా యనడంలో అతిశయోక్తి లేదు.

(రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థులు)

శ్రమ చేసే వారు ఒక వర్గంగా, ఆ శ్రమవల్ల ఉత్పత్తయ్యే సంపద మీద ఆధిపత్యం పొందినవారు మరో వర్గంగా మారిన క్రమాన్ని వివరిస్తున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

ఆదిమ సమాజాల్లో వర్గ విభజన

తొలిమానవులు ఆటవికదశలో పెంపొందించుకున్న తాత్విక భావనలు ఈనాటి మతాలుగా రూపొందడానికి అనేక పరిణామాలు దోహదంచేశాయి. వాటిలో ముఖ్యమైనది వర్గాల ఏర్పాటు. వర్గాలనేవి ఉండవనీ, అవేవో వామపక్షాలు సృష్టించినవేననే అభిప్రాయం కలిగిన వారున్నారు. మనుషుల చైతన్యం సమాజ స్వరూపాన్నిబట్టి ఎలా మారుతూవచ్చిందో తెలుసుకుంటే దీని సంగతి కొంత తెలుస్తుంది.



ఆఫ్రికా బుష్మన్ జాతి

జీవపరిణామ క్రమంలో మనుషులను పనిముట్లు తయారు చేసుకోవడం నేర్చినటువంటి జంతువులుగా అనుకోవచ్చు. రెండుకాళ్ళ నడకా, చేతుల వాడకమూ ఇందుకు పనికొచ్చాయి. మొదటినుంచీ ఏ ప్రాణికైనా ఆహారసంపాదనే ముఖ్యమైనది. పనిముట్లూ, భూమీ, నీరూ తదితర వనరులూ ఆహారోత్పత్తికి అవసరమైనటువంటి సాధనాలు. వీటన్నిటితోనూ ఒకేరకమైన సంబంధాలు కలిగినవారంతా ఒకే వర్గానికి చెందినవారవుతారు. పనిముట్ల సహాయంతో భూమిని సాగుచేసి, దానికి నీరుపెట్టి పంటలను పండించే శ్రామికులందరూ ఒక వర్గమయితే, భూమికి స్వంతదారులుగా ఆహారోత్పత్తికి శరీరశ్రమ ఏమీ చెయ్యకుండా పంటను మాత్రం స్వంతం చేసుకునే భూస్వాములు మరొక వర్గానికి చెందుతారు. సమాజం గురించీ, జీవితం వగైరాలను గురించీ ఈ వర్గాలకు వేరువేరు దృక్పథాలు ఉంటాయి. మతాల గురించిన ధోరణికూడా అందులోని భాగమే.

మానవసమాజాలు ఏర్పడిన తొలిదశల్లో వర్గవిభజన లేనటువంటి ఒకరకమైన ఆదిమ కమ్యూనిజంవంటిది ఉండేది. మానవులంతా 'సహజం'గా స్వార్థపరులనీ, ఎవరి బాగు వారు చూసుకోవడం స్వాభావికమనీ ఈనాటి మనస్తత్వనిపుణులు మనకు చెపుతారు. మనం గుర్తుంచుకో వలసినదేమిటంటే పదిలక్షల సంవత్సరాల మానవజాతి చరిత్రలో స్వంత ఆస్తి ప్రాతిపదికగా ఇటువంటి ధోరణి కలిగిన వర్గసమాజం ఏర్పాటు మొదలై పదివేల ఏళ్ళుకూడా కాలేదు. ఎందుకంటే తొలి మానవులకు తిండీ, బట్టలూ మొదలైన ప్రాథమిక అవసరాలన్నీ డబ్బుద్వారా లభిస్తాయని చెపితే వారికది అర్థంఅయి ఉండేదికాదు. మానవుల చరిత్రలో 99 శాతం వర్గరహిత సమాజమే ప్రవర్ధిల్లింది.



అండమాన్ తెగలు

దీనర్థం తొలిమానవులందరూ ఆదర్శభావాలు కలిగి ఉండేవారని కాదు. అప్పటి సామాజిక సంబంధాలన్నీ వేరుగా ఉండేవి. ఈ రోజుల్లో స్వార్థబుద్ధి ఎంత సహజమనిపిస్తుందో ఆ రోజుల్లో నిస్వార్థంగా ఉండడమే స్వాభావికం అనిపించేది. సమాజంలో మనిషికి ఎటువంటి ఉనికి ఉంటుందో దాన్నిబట్టే మనుషుల చైతన్యం రూపొందుతుంది. ఆఫ్రికాలోని

కలహారి ఎడారివంటి ప్రాంతాల్లో వేట, ఏరుకుతినడం వగైరాలమీద ఆధారపడి జీవించే ఆదిమతెగల్లో ఇప్పటికీ అటువంటి నిస్వార్థవైఖరి కనిపిస్తుంది. ఆ ప్రజల్లో కనబడే శ్రమవిభజన స్త్రీపురుషుల్లోనే ఉంటుంది. వారిలో చిన్నపిల్లలతో సతమతం అయే స్త్రీలు ఆహారం ఏరుకుంటే మగవారు వేటకు వెళతారు. అటువంటి తెగలు వేటకూడా సామూహికం గానే చేస్తారుకనక అడవులూ, భూములూ స్వంత ఆస్తిగా ఎవరూ పరిగణించరు. అప్పట్లో వ్యక్తిగత ఆస్తి అంటే పనిముట్లే. వాటిని అప్పుడప్పుడూ శవాలతోబాటు పాతిపెట్టేవారు. నీటిగుర్రం వంటి పెద్ద జంతువును కొట్టినప్పుడు అది కుళ్ళిపోయేలోపల ఏ ఒక్కడూ దాన్ని పూర్తిగా తినలేడు కనక అది అందరికీ ఆహారమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఒక సముదాయానికి ఎక్కువగానూ, మరొక సముదాయానికి తక్కువగానూ ఆహారం లభ్యమవుతుంది కనక ఉన్నదాన్ని అందరూ సమానంగా పంచుకోవడమే మంచిదనుకునేవారు. తన కాలంలో జర్మనీలోని ఆదిమతెగల్లో ఇటువంటి వైఖరి కనిపిస్తుందని క్రీ.శ. మొదటి శతాబ్దపు చరిత్రకారుడైన టాసిటస్ గుర్తించాడు.

ఆదిమ ప్రజల జీవితం ఎలా ఉండేదో మనం ఊహించవచ్చు. వర్గ విభేదాలూ, వైషమ్యాలూ లేని ఆ యుగంలో అధికారవ్యవస్థ ఏదీ అవసరమయేదే కాదు. అనుభవజ్ఞులైన పెద్దవారు తెగలకు నాయకత్వం వహించడం అనేది అధికారానికైకాక ఒక బాధ్యతగా అనుకునేవారు. జనాభా పెరిగి ప్రజలు కొత్త ప్రాంతాలకు వెళుతున్నకొద్దీ పరిణామాలు తప్పనిసరి అయాయి. ఏరుకుతినే బదులు వ్యవసాయమూ, వేటకు బదులు జంతువులను మచ్చిక చెయ్యడమూ మొదలయాయి. మేలురకం గింజలను ఎంపికచేసి పంటలు పండించడమూ, జంతువుల్లో మేలు జాతులను మందలుగా పెంచడమూ, వాటిని పొలం సాగుకు ఉపయోగించడమూ పెనుమార్పులు కలిగించాయి. మొదటి సారిగా అదనపు ఆహారనిలవలు సమకూరసాగాయి. వ్యవసాయం చేపట్టిన తెగల్లో కూడా భూముల పంపకం న్యాయంగా జరిగేదనీ, సమాజంలో స్త్రీలకు గౌరవం ఉండేదనీ టాసిటస్ రాశాడు.

వ్యవసాయం వేటవంటిది కాదు. దానికి సామూహికప్రయత్నం అవసరంలేదు. ఎవరైనా కాస్త ఎక్కువ కష్టపడ్డా, నేల సారవంతమైనా ఎక్కువ పంట పండుతుంది. పురాతన తెగల సంప్రదాయాలు కొన్ని శతాబ్దాలపాటు కొనసాగినప్పటికీ వ్యవసాయం మొదలయాక మహిళల పాత్ర క్రమంగా తగ్గసాగింది. మరొకవంక అదనపు ఆహారనిలవలను ఇతరులు దోచుకునే అవకాశం కూడా పెరిగింది. వాటిని కాపాడేందుకు ఆయుధాలూ, పోరాడేవారూ తయారయారు. ప్రాంతాన్నిబట్టి యూదుల వంటి కొన్ని తెగలు జంతువుల పెంపకంమీదా, కొత్తగా దొరుకుతున్న ముడిలోహాల మీదా ఎక్కువ శ్రద్ధ పెట్టారు. పశువులను సొమ్ములుగా వ్యవహరించడం పశ్చిమాసియాలోకూడా ఉండేదట. వీటిని ఆహారానికై మారకం చేసుకోవడం మొదలయింది. లోహాలను ఆయుధాలకేకాక డబ్బుగా కూడా వాడుకోసాగారు. వ్యవసాయంద్వారా మిగులుఆహారం పొందిన ప్రజలు కుండలతయారీ వంటి ఇతర నైపుణ్యం నేర్చుకోసాగారు. వివిధ వృత్తులు మొదలయాయి. ఇవన్నీ వ్యక్తులకూ, సమాజానికీ మధ్య



ఒరిస్సా ఆదివాసీలు

నుండే సంబంధాలను ప్రభావితం చెయ్యసాగాయి. ప్రజల తాత్విక దృక్పథం కూడా మారసాగింది.

చరిత్రలో వర్గవిభజన వివిధ ప్రదేశాల్లో వివిధపద్ధతుల్లో జరిగినట్టుగా తెలుస్తోంది. ఏరుకు తిని, వేటాడి పొట్టపోసుకునే దశకు భిన్నంగా వ్యవసాయం చేపట్టిన సమాజాల్లో మొదటిసారిగా అదనపు ఆహారనిలవలు పోగుపడసాగాయి. మనుషుల మనుగడకు ఈ అదనపు నిలవలు ఎలా దోహద పడతాయో తెలిశాక వీటికోసం పోటీ మొదలైంది. వీటిని బలప్రయోగం ద్వారా సంపాదించుకున్న తెగలది పైచెయ్యి అయింది. ఆయుధాలతోనూ, దాడులతోనూ దోపిడీలు చేసి ఆహారపు నిలవలనూ, పశుసంపదనూ దోచుకోగలిగినవారు పెత్తనం సంపాదించు కోగలిగారు. టాసిటస్ పరిశీలనలు జరిపే నాటికి తెగలలో స్త్రీల ప్రాముఖ్యత తగ్గిపోయింది. ఆయుధాలు చేపట్టి యుద్ధాలు చేసేవారుండే వారు. అందరికన్నా బాగా పోరాడగలిగినవాడు నాయకుడు కావడం, అటువంటి వ్యక్తే భవిష్యత్తులో రాజు కావడం జరిగింది. తొలి సమాజాల్లో లాగా మాతృస్వామ్య వైఖరి తగ్గి మగసంతతి ప్రాధాన్యత పెరిగింది. ఎందుకంటే తెగకు చెందినవారు తమ భూములను కొడుకులకే ఇవ్వగోరేవారు. కొన్ని పాతపద్ధతులు కొనసాగాయి. సామూహిక వ్యవహారాల్లో తీర్పు చెప్పడానికి పెద్దలతో కూడిన సమితులుండేవి. కొన్ని తెగల్లో సామూహిక సంక్షేమం కోసమని కులపెద్దలుగానూ, గణాచార్లూ, పూజార్లుగానూ నాయకత్వం చేపట్టినవారు క్రమంగా శరీర శ్రమకు దూరమై, తినికూర్చోగలిగిన స్థాయికి చేరుకున్నారు.

స్థానిక పరిస్థితులను బట్టి తెగల్లోనూ, ఒకే తెగలోని వ్యక్తులలోనూ అసమానతలు తలెత్తసాగాయి. బలప్రయోగంద్వారా ఇతర తెగల ఆహార, పశుసంపదలను కొల్లగొట్టడం మొదలయింది. మొదట్లో ఇది సామూహిక పద్ధతుల్లో జరిగినా క్రమంగా వ్యక్తిగత సాహసాలూ, శౌర్య పరాక్రమాలూ లెక్కలోకి రాసాగాయి. వీటన్నిటికీ అనుగుణంగా వర్గసమాజం రూపొంద సాగింది.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త) వీ

వీక్షణం పత్రికను ప్రతి నెల 29-30 తేదీల్లో పోస్టు చేస్తాం. పత్రిక 7వ తేదీలోగా అందకపోతే మాకు తెలియపర్చండి. చందా రెన్యువల్ చేసుకున్న వారికే పత్రికను పంపించడం జరుగుతుంది.

మంగళూరులో విమాన ప్రమాదం

కర్ణాటకలోని మంగళూరు విమానాశ్రయంలో మే 22న ఉదయం 6.30 గంటలకు ఘోర ప్రమాదం సంభవించింది. దుబాయ్ నుంచి మంగళూరు వస్తున్న ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం రన్‌వేపై దిగుతూ ప్రమాదానికి గురైంది. విమానంలో మొత్తం 160 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలట్లతో సహా ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఇందులో 159 మంది మరణించారు. కొండ శిఖరంపై ఉన్న మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం అంచుల్లో లోయలు ఉండే టేబుల్‌టాప్ రన్‌వేపై దిగాల్సిన చోటుకన్నా రెండువేల అడుగుల దూరంలో ముందుకు వెళ్లి దిగడంతో లోయలో పడడంతో ఈ ప్రమాదం సంభవించింది.

భోపాల్ దోషులకు సాధారణ శిక్ష

ప్రపంచ పారిశ్రామిక చరిత్రలో అతి భయానకమైన భోపాల్ గ్యాస్ దుర్ఘటన కేసులో 26 ఏళ్ల తర్వాత భోపాల్ జిల్లా సెషన్స్ కోర్టు 7 జూన్ 2010న ఏడుగురిని దోషులుగా ప్రకటించింది. 1984 డిసెంబర్ 3న జరిగిన ఈ దుర్ఘటనకు బాధ్యులుగా యు.సి.ఐ.ఎల్. నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కేశుబ్ మహీంద్రా (85), ఎం.డి. విజయ్ గోఖలే, వైస్ ప్రెసిడెంట్ కిషోర్ కందార్, వర్క్స్ మేనేజర్ జె.ఎన్. ముకుంద్, ప్రొడక్షన్ మేనేజర్ ఎస్.పి. చౌదరి, ప్లాంట్ సూపరింటెండెంట్ కె.వి.శెట్టి, ప్రొడక్షన్ అసిస్టెంట్ ఎస్.ఐ. ఖురేషీలను దోషులగా ప్రకటిస్తూ సెషన్స్ కోర్టు వారికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రధాన నిందితుడైన యునియన్ కార్బైడ్ కార్పొరేషన్ చైర్మన్ వారెన్ అండర్సన్‌కు ఎలాంటి శిక్షా పడలేదు. దుర్ఘటనకు బాధ్యులైన వారిపై ఇంత ఆలస్యంగా, ఇంత స్వల్ప శిక్ష విధించడం పట్ల దేశవ్యాప్తంగా సామాన్య ప్రజానీకం, పౌరహక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు తీవ్రంగా విమర్శించాయి.

లాల్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

బెంగాల్‌లోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా రంజా అడవుల్లో జూన్ 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్ మరణించారు. చనిపోయిన వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారని మిడ్నాపూర్ ఎస్పీ మనోజ్ వర్మ తెలిపారు. రంజా అడవిలో నక్సల్స్ ఉన్నట్టు సమాచారం అందడంతో సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్, కోబ్రా, రాష్ట్ర పోలీసులతో కూడిన బలగాలు వెళ్లి ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయని కలెక్టర్ నిగమ్ తెలిపారు.

బి.సి. కమిషన్ అధిపతిగా ఎం.ఎన్.రావు

జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ ఎం. నారాయణరావు జూన్ 7న పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో ఆయన మే 31న నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలో 1936లో జన్మించిన నారాయణ రావు 1986లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా, 1997 నవంబర్ నుంచి 1998 ఏప్రిల్ వరకు హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. జాతీయ బిసి కమిషన్ 1993 లో ఏర్పాటయింది. కమిషన్‌లో చైర్మన్‌తోపాటు ముగ్గురు సభ్యులు, ఒక సభ్య కార్యదర్శి ఉంటారు. ప్రస్తుత కమిషన్‌లో సుబ్బా సోము, రాం అవధేష్ సింగ్, అబ్దుల్ అలీ అజీజ్ సభ్యులుగా ఉన్నారు. కమిషన్ సభ్య కార్యదర్శిగా చిత్రో చోప్రా ఉన్నారు.

జార్ఖండ్‌లో రాష్ట్రపతి పాలన

జార్ఖండ్‌లో మే 24, 2010న బిజెపి, జెడి (యు) మద్దతు ఉపసంహరించడంతో ఐదు నెలల జెఎంఎం ప్రభుత్వం మైనారిటీలో పడింది. దీంతో ముఖ్యమంత్రి పదవికి జె.ఎం.ఎం. అధినేత శిబు సోరేన్ మే 30న రాజీనామా చేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు మూడు ప్రధాన పార్టీలూ ముందుకు రాకపోవడంతో కేంద్రం జార్ఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించింది. జార్ఖండ్‌లో రాష్ట్రపతి పాలన విధించడం ఏడాదిన్నర కాలంలో ఇది రెండోసారి.

ఎన్.ఎచ్.ఆర్.సి. కొత్త చైర్మన్

జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్.ఎచ్.ఆర్.సి.) చైర్మన్‌గా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్ నియమితులయ్యారు. ఆయన ఎన్.ఎచ్.ఆర్.సి.కి 6వ చైర్మన్. 12 మే 2010న ఆయన భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. ఆయన చైర్మన్ పదవిలో ఐదేళ్లు ఉంటారు.

బెంగాల్‌లో తృణమూల్ విజయం

పశ్చిమ బెంగాల్‌లో మునిసిపాలిటీలు, కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. జూన్ 2న ప్రకటించిన ఫలితాల్లో 16 జిల్లాలో 81 మునిసిపాలిటీలకు జరిగిన ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ 36, అధికార లెఫ్ట్ ఫ్రంట్ 18, కాంగ్రెస్ 6, ఇంకా 17 స్థానాలను తృణమూల్, కాంగ్రెస్ సర్దుబాటు ద్వారా గెలుచుకున్నాయి. కోల్‌కతా మునిసిపల్ కార్పొరేషన్ (కెఎంసి)లో 141 వార్డులకు జరిగిన ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ 95 సీట్లు, లెఫ్ట్ ఫ్రంట్ 33 సీట్లు, కాంగ్రెస్ 10 సీట్లు, బిజెపి 3 సీట్లు గెలుచుకున్నాయి.

సిపిఐ జాతీయ సమితి తీర్మానాలు

హైదరాబాద్‌లోని ముఖ్దూం భవన్‌లో జూన్ 12 నుండి 14 వరకు మూడు రోజులపాటు సిపిఐ జాతీయ సమితి సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో వివిధ అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. యూరపియన్ యూనియన్, ఇజ్రాయిల్‌లతో కుదుర్చుకోనున్న స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలని; ఆహార భద్రత కల్పించాలని; ధరలను నియంత్రించాలని; శ్రీలంక తమిళ పౌరుల సమస్యలను పరిష్కరించాలని; భూసంస్కరణలు అమలు చేయాలని; సెజ్‌లు, పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలని; విదేశీ విశ్వవిద్యాలయాల ప్రవేశాన్ని అడ్డుకోవాలని; మణిపూర్‌లో హైవేల దిగ్బంధం సమస్యను తక్షణమే పరిష్కరించాలని; ఈశాన్య రాష్ట్రాల భౌగోళిక సమగ్రతను పరిరక్షించాలని; భోపాల్ తీర్పు అసంతృప్తికరమని తీర్మానాలు చేశారు.

గూర్ఖా నాయకుడి హత్య

అఖిల భారత గూర్ఖా లీగ్ (ఎబిజిఎల్) అధ్యక్షుడు, మదన్ తమంగ్ మే 21న కత్తిపోట్లతో తీవ్ర గాయాలై డార్జిలింగ్ ఆస్పత్రిలో మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. తమాంగ్ హత్య వెనుక గూర్ఖా జనముక్తి మోర్చా నేత దినేష్ గురుంగ్ హస్తముందని ఐజి కె.ఎల్. తమతా తెలిపారు. ఈ హత్యతో సంబంధముందనే అనుమానంతో 45 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీ

అఫ్ఘనిస్తాన్‌లో అపార ఖనిజ సంపద

అఫ్ఘనిస్తాన్ భూముల్లో అపార ఖనిజ సంపదలు ఉన్నాయని అధ్యయనాలు బయట పెట్టాయి. వీటి విలువ రు. 46 లక్షల కోట్లు ఉండవచ్చని అంచనా. ఇనుము, రాగి, కోబాల్ట్, బంగారం, లిథియం వంటి ఖనిజాలు అపారంగా ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ అమెరికా రక్షణ శాఖ పెంటగాన్‌కు సమర్పించిన నివేదికలో తెలిపింది. ఈ సంపదను ఉపయోగించుకోగలిగితే అఫ్ఘాన్ భవిష్యత్తులో ప్రపంచంలోనే అతిపెద్ద మైనింగ్ కేంద్రంగా మారుతుందని అఫ్ఘానిస్తాన్ అధికారులు తెలిపారు.

సహాయక నౌకలపై ఇజ్రాయెల్ దాడి

గాజా ప్రజలకు సహాయ సామగ్రి తీసుకువెళ్తున్న నౌకలపై ఇజ్రాయెల్ సాయుధ బలగాలు మే 31న దాడి చేశాయి. గాజాకు 65 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. పలు దేశాలకు చెందిన 700 మంది కార్యకర్తలు, 10వేల టన్నుల సహాయ సామగ్రితో వెళుతున్న ఆరు నౌకలపై కమెండోలు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో 20 మందికి పైగా కార్యకర్తలు మరణించారు. నౌకల్లో ఓ నోబెల్ బహుమతి గ్రహీత, ఐరోపా చట్ట సభ సభ్యులు, రచయితలు, పాత్రికేయులు ఉన్నారు. ఈ దాడిని టర్కీ, స్పెయిన్, గ్రీస్, డెన్మార్క్ స్వీడెన్ దేశాలు ఖండించాయి.

జపాన్ నూతన ప్రధాని

జపాన్ నూతన ప్రధానమంత్రిగా డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ జపాన్ (డి.పి.జె.) సహ వ్యవస్థాపకుడు, మాజీ ఆర్థిక మంత్రి నవోతో కాన్ జూన్ 4న ఎన్నికయ్యారు. అంతకు ముందు జూన్ 2న ప్రధానమంత్రి యుకియో హతొయామా తన పదవికి రాజీనామా చేశారు. జపాన్ దక్షిణ ద్వీపమైన ఒకనోవా నుంచి అమెరికా సైనిక బేస్ క్యాంప్‌ను తరలిస్తామనే వాగ్దానాన్ని నెరవేర్చడంలో విఫలమవడంతో హతొయామా జనాకర్షణ కోల్పోయారు. దీంతో గత సెప్టెంబర్‌లోనే లిబరల్ డెమోక్రాట్లపై భారీ ఆధిక్యంతో అధికారంలోకి వచ్చిన హతొయామా తొమ్మిది నెలలు పూర్తికాక ముందే పదవి నుంచి వైదొలుగుతున్నట్టు పార్లమెంట్ సమావేశంలో డి.పి.జె. శాసనకర్తల సమక్షంలో హతొయామా ప్రకటించారు.

అమెరికా తీరంలో చమురు లీకేజి

గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో ఏప్రిల్ 22న సముద్రంలో మునిగిపోయిన ఆయిల్ రిగ్ నుంచి లీక్ అవుతున్న చమురు శాస్త్రవేత్తల అంచనాల కంటే రెండింతలు ఎక్కువగా లీక్ అవుతోంది. రోజుకు దాదాపు నలభై వేల బ్యారెళ్ల (1.7 మిలియన్ గ్యాలన్‌ల) చమురు సముద్రంలో కలుస్తోంది. దీనివల్ల సముద్ర జలాలు తీవ్రంగా కలుషితం అవుతున్నాయి. మత్స్య సంపదకు భారీ నష్టం వాటిల్లింది. ఫ్లోరిడా, అలబామా, మిస్సిస్సిప్పీ దేశాల మత్స్యకారులు జీవనాధారం కోల్పోయారు.

శ్రీలంకలో జనగణన

శ్రీలంక మూడు దశాబ్దాల తర్వాత జనగణన మొదలెట్టబోతోంది. 2011లో ఈ జనాభా గణన చేయబోతోంది. శ్రీలంకలో ఆఖరు సారి 1981లో జనగణన చేశారు. దాదాపు రెండు కోట్ల జనాభా ఉన్నట్లు అంచనా. సరైన గణాంకాలు లేక, అంతర్గత యుద్ధం వల్ల మూడు దశాబ్దాలుగా జనగణన జరగలేదు.

ఇరాన్ పై ఆంక్షలు

ఇరాన్ జరుపుతున్న అణు కార్యక్రమాలను ఖండిస్తూ ఐక్యరాజ్య సమితి ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షల ప్రకారం ఇరాన్ భారీ ఆయుధాల కొనుగోలు చేయడాన్ని నిషేధించింది. ఇరాన్ నుండి దిగుమతి అయ్యే అన్ని వస్తువులను తనిఖీ చేస్తారు. అణు ప్రయోగాలపై, అణు కార్యక్రమానికి నిధులు అందజేసే బ్యాంకులను నిషేధిస్తారు. సహకరించే అధికారుల, వ్యక్తుల ఆస్తులను స్తంభింపజేస్తారు. భద్రతా మండలిలో 15 మంది సభ్యులలో 12 మంది నిషేధానికి అనుకూలంగా ఓటు వేశారు. ఇద్దరు వ్యతిరేకంగా ఓటు వేశారు. లెబనాన్ ఓటింగ్‌కి గైర్హాజరైంది.

కిర్గిజిస్తాన్‌లో అల్లర్లు

సోవియట్ యూనియన్ నుంచి విడిపోయి రిపబ్లిక్‌గా మారిన కిర్గిజిస్తాన్‌లో అవినీతి పెరిగి, సామాన్య ప్రజా జీవన వ్యయం భారీగా పెరిగిపోవడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కిర్గిజిస్తాన్ అధ్యక్షుడు కుర్మన్‌బెక్ బకియెవ్ పై రెండు నెలల క్రితం తిరుగుబాటు మొదలైంది. దేశంలో ఎమర్జెన్సీ విధించినా బకియెవ్ ప్రభుత్వం కుప్పకూలి పోయింది. దాంతో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో కిర్గిజ్, ఉజ్బెక్ తెగల మధ్య అల్లర్లు చెలరేగాయి. ఓష్, జలాలాబాద్‌లో తీవ్రంగా అల్లర్లు జరిగాయి. నగరాలలో ప్రజా జీవనం అస్తవ్యస్తమై పోయింది. ఈ తెగల మధ్య పోరాటంలో దాదాపు రెండు వేలకు పైగా ప్రజలు మరణించి ఉండవచ్చని అంచనా. సుమారు లక్షమంది ఉజ్బెక్‌లు ఉజ్బెకిస్తాన్‌కు పోవడానికి సరిహద్దు వద్దకు చేరుకున్నారు. రెండు తెగల మధ్య సయోధ్య కుదరడంతో ప్రశాంత వాతావరణం నెలకొని ప్రజలు తిరిగి తమ నివాసాలకు చేరుకుంటున్నారు.

లాహోర్‌లో దాడులు

పాకిస్తాన్‌లోని లాహోర్‌లో మే 28న జరిగిన దాడులలో దాదాపు 80 మందికి పైగా చనిపోయారు. వంద మందికి పైగా గాయపడ్డారు. ప్రార్థనా స్థలంలోకి దూసుకువచ్చి విచ్చలవిడిగా కాల్పులు, పేలుళ్లు జరిపి దుండగులు ఈ దారుణానికి పాల్పడ్డారు. గార్హిసాహు, మోడల్ టౌన్ ప్రాంతాల్లోని ఈ మసీదులపై పది మంది తీవ్రవాదులు భారీ మందు గుండు సామాగ్రి, అధునాతన తుపాకులతో ప్రవేశించి దాడి జరిపారు. దాడి జరిగిన సమయంలో దాదాపు 1500 మంది మసీదులో ఉన్నారు.

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుదుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చుయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 మే 2010 నుండి 20 జూన్ 2010 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 2081)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**	**(20)**	**(21)**	**(22)**
ఆదిలాబాద్	1	4	1	18	22	8	4	2	2	2	1	2	2	4	59	32	–	–	–	2	14
హైదరాబాద్	–	–	–	10	8	–	–	–	1	7	6	6	3	–	40	31	–	–	–	17	–
కరీంనగర్	1	7	1	22	35	11	30	–	7	8	4	3	2	1	32	30	–	–	–	5	107
ఖమ్మం	–	–	–	16	11	1	4	1	–	5	2	6	–	6	26	16	–	–	–	–	64
మెదక్	–	3	–	6	13	1	11	3	–	2	4	5	–	5	47	14	–	–	–	–	6
నిజామాబాద్	–	–	–	7	10	5	7	–	–	–	1	2	–	3	35	16	–	–	–	–	14
రంగారెడ్డి	వివరాలు అందలేదు																				
వరంగల్	–	1	–	1	3	–	2	1	–	2	–	–	–	4	17	7	–	–	–	–	29
అనంతపురం	–	4	–	15	11	8	11	–	7	6	2	3	4	9	30	12	–	–	–	–	–
చిత్తూరు	–	–	–	8	9	8	–	11	4	5	6	13	13	–	41	–	–	–	–	–	17
కడప	వివరాలు అందలేదు																				
కర్నూలు	–	7	1	3	8	4	8	2	4	3	1	8	6	3	49	26	–	–	–	–	4
తూర్పు గోదావరి	–	1	–	23	13	4	3	1	1	5	3	6	–	8	59	30	–	–	–	3	23
గుంటూరు	–	1	–	7	5	–	1	1	2	1	4	5	2	7	47	13	–	–	–	2	13
కృష్ణా	–	1	–	6	8	3	2	4	2	3	3	5	4	5	19	4	–	–	–	–	4
నెల్లూరు	–	–	–	7	3	–	9	–	–	–	–	–	–	8	32	13	–	1	–	–	22
పశ్చిమ గోదావరి	వివరాలు అందలేదు																				
శ్రీకాకుళం	–	–	1	9	7	5	9	11	–	–	9	6	–	7	19	11	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	–	4	4	1	3	–	10	4	–	1	4	2	17	14	–	–	–	–	1
విజయనగరం	వివరాలు అందలేదు																				
మొత్తం	**2**	**29**	**4**	**162**	**170**	**65**	**104**	**37**	**40**	**53**	**46**	**71**	**40**	**72**	**569**	**269**	**–**	**1**	**–**	**29**	**318**

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – సుమలత; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహిమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; నెల్లూరు – కె. సుబ్బనాచారి; పశ్చిమ గోదావరి – టి. హేమలత; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. అరుణ; విజయనగరం – డి. సుధాకర్

జాతీయ బాలల హక్కుల పరిశోధన ఫెలోషిప్‌లు 2010-11

భారతదేశంలో బాల్యం అందరికీ ఒకటే కాదు. నిజానికి అనేక రకాల బాల్యాలు సహజీవనం చేస్తాయి. సామాజిక, ఆర్థిక హోదా, శారీరక, మానసిక సామర్థ్యాలు, ప్రాంతం బాల్యం మీద ప్రభావం వేస్తాయి. బాలలు కూడా సర్వసత్తాక అధికారం కలిగిన, సమానమైన సభ్యులని గౌరవించడం తొలి అడుగు. ఆ దిశలో వారిని కేవలం రాజ్యం లేదా సాంఘిక సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే కాక భాగస్వాములుగా గుర్తించి వారి సముచిత ప్రయోజనాలేమిటో వారి మాటల్లోనే అర్థం చేసుకోవడం కూడా సాగాలి.

బాలలకు న్యాయం అనే రాజ్యాంగ చట్రం లోపల ఉత్తమ ప్రయోజనం ప్రాతిపదికన బాలల హక్కులకు ఉన్న విభిన్న కోణాలను అన్వేషించే పరిశోధనకు చైల్డ్ రైట్స్ అండ్ యూ (సిఆర్‌వై) దరఖాస్తులను కోరుతున్నది.

బాల్యాలను నిర్ణయించడంలో సంస్కృతీ, చట్టాలూ, నైతిక సూత్రాలూ, విధానాలూ పరస్పరం సంబంధంలో ఉండేటప్పుడు ఏ సాధారణ, సంక్లిష్ట సత్యాలు వెల్లడవుతాయో అన్వేషిండం, కనిపెట్టడం, ఆ పనిని నియత పద్ధతిలోనూ, అనియత పద్ధతిలోనూ సాగించడం గురించి కొత్త భావనలను సిఆర్‌వై ఆశిస్తున్నది.

కేంద్రీకరించదగిన విషయాలు

వారి జీవితానుభవాలను, దృక్పథాన్ని బట్టి ఈ ఇతివృత్తాలను విస్తరించడానికి, వ్యాఖ్యానించడానికి మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నాం.

- బాల్యపు అనుభవంలో, వ్యక్తీకరణలో, కథలనూ, జానపద గీతాలనూ, కవితలనూ సామాజిక సంపర్కానికి చిహ్నాలుగా వాడుకోవడంలో సృజనాత్మకత, ఊహా శక్తి.
- బాలలకు తోటి బాలలతో, రాజ్యంతో, సమూహంతో, కుటుంబంతో ఉండే సంబంధాల అన్వేషణ.
- ఇల్లు, బడి, పని, ఆటస్థలం, పాలనావ్యవస్థలు వంటి నిర్ణయాధికార వేదికలలో బాలల పాత్రను అంగీకరించడం గురించి, తిరస్కరించడం గురించి ఆధారాలు.
- బాలలు అనుభవించే లేదా గమనించే జాతితత్వం, అసమానత, ఘర్షణల ఆధారాలు, సంబంధాలు
- ఉత్తమ ప్రయోజన ప్రాతిపదిక ఒక విలువనా, ఒక రాజ్యాంగ హక్కా, ఒక వ్యాఖ్యాన సహితమైన సంస్కరణ ప్రయత్నమా, లేక చట్టబద్ధ పాలనా?

ఫెలోషిప్‌కు వర్తించే సూత్రాలు

అర్హత : దరఖాస్తుదారులు భారతదేశంలో నివసిస్తున్న భారతీయులై ఉండాలి. పద్దెనిమిదేళ్లకు పై బడి ఉండాలి. గతంలో ఈ ఫెలోషిప్ పొందినవారు అనర్హులు. ఫీజులు వసూలు చేయని ప్రభుత్వ పాఠశాలలో చదివిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. (ఇప్పటికే సాగిన అధ్యయనాల ప్రకారం, గ్రామాలలోనూ, పట్టణ మురికివాడలలోనూ, రెండు వేల అనాదృత వర్గాలలో సిఆర్‌వై పనిచేసిన అనుభవం ప్రకారం తేలినదేమంటే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రధానంగా దళితులు, ఆదివాసులు, స్త్రీలే యజమానులుగా ఉన్న లేదా భూమిలేని కుటుంబాలలోని బాలబాలికలే.)

ఫెలోషిప్ పొందగల అభ్యర్థులు సిఆర్‌వై పాటించే విలువలకు కట్టుబడి ఉంటారని ఆశిస్తున్నాం. ఆ విలువలు :

- *మానవ గౌరవం పట్ల విశ్వాసం • సమానత్వం • న్యాయం • నిజాయితీ*

భాష: అభ్యర్థులు ఇంగ్లిష్‌తో సహా ఏ భారతీయ భాషలోనైనా పనిచేయవచ్చు. ఏ భాషలో పనిచేయదలచుకున్నారో స్పష్టంగా సూచించండి. దరఖాస్తు పరిశీలన ఇంగ్లిష్‌లోనూ, మీరు పనిచేయదలచుకున్న భాషలోనూ జరుగుతుంది. అందువల్ల మీ ప్రతిపాదనను, మీ జీవిత విశేషాలను (కరికులమ్ విటే), గతంలో చేసిన పనిని ఇంగ్లిష్ అనువాదంలో జతచేయండి.

సిఆర్‌వై నుంచి మీకు అందేది: మొత్తం మీద పది ఫెలోషిప్‌లు ఇవ్వడం జరుగుతుంది. అవి ఒక్కొక్కటి రు. 50,000 నుంచి రు. 1,00,000 వరకు ఉంటాయి. ఈ నగదు సహాయ భృతి మాత్రమే. అభ్యర్థులు తమ ప్రాథమిక వృత్తి ఉద్యోగాలలో కొనసాగవచ్చు. రు. ఒక లక్ష కన్న ఎక్కువ ప్రతిపాదనలు పరిశీలనకు స్వీకరించడం జరగదు.

తప్పనిసరి ఉండవలసినవి:

1. ఒక మూడు పేజీల ప్రతిపాదన. అది మీరు పరిశోధించదలచుకున్న అంశాన్ని, ఒక చట్రంలోపల మీ పరిశోధనా ప్రశ్నల వివరాలను, ప్రతిపాదిస్తున్న సంవిధానాన్ని, పరిశోధనా కాలక్రమాన్ని, సంబంధిత సాహిత్య జాబితాను, లేదా ఈ అంశం మీద ఇప్పటికే సాగిన అధ్యయనాలను, ఒక వివరమైన ఆర్థిక అంచనాను (బడ్జెట్) కలిగి ఉండాలి.

2. రెండు పేజీల జీవిత విశేషాలు (సివి)

3. సంబంధిత విషయం మీద మీరిప్పటికే రాసి ఉన్న, ప్రచురితమైన లేదా ప్రచురితం కాని పత్రం లేదా వ్యాసం లేదా ఏదైనా సమాచారం.

ఒక సంవత్సరం కన్న ఎక్కువ వ్యవధి పట్టే ప్రతిపాదనలు పరిశీలించబడవు.

ఎంపికైన అభ్యర్థులు తమ పరిశోధనా ప్రణాళికలను ఇతరులతో పంచుకోవడానికీ, సామూహిక అనుభవం నుంచి గ్రహించడానికీ మే 2011 ప్రాంతంలో ఒక ప్రాథమిక వర్క్‌షాప్‌లో పాల్గొనవలసి ఉంటుంది. అలాగే అర్ధవార్షిక సంభాషణా సమావేశంలో పాల్గొనవలసి ఉంటుంది. ఈ రెండు సమావేశాలకూ అవసరమైన ప్రయాణ, వసతి, భోజన ఖర్చులను సిఆర్‌వై భరిస్తుంది. కొందరు అభ్యర్థులకు వారి అభిప్రాయాలను, భవిష్యత్తు ప్రణాళికలను సిఆర్‌వై మదింపు బృందపు సభ్యులతో చర్చించడానికి అవకాశం ఉంటుంది.

ప్రచారం

పరిశోధనా ఫలితాలను వివిధ భాషలలోకి అనువదించి, వేరువేరు వేదికల ద్వారా కార్యకర్తలకు, విద్యావేత్తలకు, అభివృద్ధి వ్యవహారాల నిపుణులకు, ఆసక్తిగల సాధారణ ప్రజానీకానికి అందుబాటులో ఉంచడం జరుగుతుంది. తద్వారా బాలల హక్కుల గురించిన చర్చాసరళిని ప్రభావితం చేయడానికి, ఉత్తమ ప్రయోజన ప్రాతిపదికన ప్రచారం చేయడానికి ప్రయత్నం జరుగుతుంది.

యాజమాన్యం

తుది పరిశోధనా నివేదిక మీద, వస్తువు మీద రచయితలుగా అభ్యర్థుల హక్కును గౌరవిస్తూనే ఈ క్రమంలో సేకరించిన సమస్త సమాచారాన్ని పరిశీలనలను వీలైనంత ఎక్కువ మందికి బహిరంగంగా, ఉచితంగా అందుబాటులో ఉంచడం జరుగుతుంది. అభ్యర్థులు తమ పరిశోధనా కృషిలోని పరిశీలనలను ప్రచురించుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే ఆ పని జాతీయ బాలల హక్కుల పరిశోధనా ఫెలోషిప్, సిఆర్‌వై సౌజన్యంతో అని ప్రకటించాలి.

ఒకవేళ మీ ప్రతిపాదన మరేదైనా విద్యా సంస్థకు సమర్పించిన దరఖాస్తులో భాగమయినట్టయితే అది ఈ ఫెలోషిప్‌కు అనర్హమవుతుంది. అలాగే అభ్యర్థి ఇక్కడ ప్రతిపాదిస్తున్న పరిశోధన సాగించడానికి ఇదివరకే నిధులు పొందుతున్నట్టయితే ఈ ఫెలోషిప్‌కు అనర్హమవుతుంది. ఫెలోషిప్ పరిశోధన సాగుతున్న క్రమంలో అభ్యర్థి గనుక ఈ పరిశోధనా పరిధిని విస్తరించాలని, మరింత లోతుగా జరపాలని భావిస్తే ఆ విషయం గురించి, అదనపు నిధుల అవసరం గురించి మొట్టమొదట సిఆర్‌వై కి తెలియజేయాలి. అలాగే మరేవరైనా దాతలను ఆ నిధుల కోసం అడుగుతున్నట్టయితే వారికి ఇక్కడ ప్రధాన కృషి సిఆర్‌వై సహాయంతో జరుగుతున్నదని చెప్పవలసి ఉంటుంది.

దరఖాస్తుల దాఖలకు చివరి గడువు సెప్టెంబర్ 4, 2010

మీ దరఖాస్తును research@crymail.org కి ఈమెయిల్ చేయండి.
మీకు ఇంటర్నెట్ అందుబాటులో లేనట్టయితే మీ దరఖాస్తును పోస్ట్ ద్వారా


CRY - Child Rights and You, Documentation Centre,
189 A, Anand Estate, Sane Guruji Marg,
Mumbai - 400 011

ఫెలోషిప్‌కు ఎంపికైన పరిశోధకుల పేర్లను సిఆర్‌వై వెబ్‌సైట్ మీద 2011 ఏప్రిల్ లోపు ప్రకటించడం జరుగుతుంది.

CHILD RIGHTS AND YOU
www.cry.org

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 108 - July 2010

• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 29/06/2010 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao